# నందమూరి తారక రామారావు

# చారిత్రక ప్రసంగాలు

CELEBRATING 100 BIRTH ANNIVERSARY

NTR Literature, Souvenir & Website Committee
Hyderabad

ప్రచురణ
Jayaprada Foundation
Hyderabad

Nandamuri Taraka Ramarao

# CHARITRIKA PRASANGALU

© **Jayapradha Foundation**, Hyderabad.

Edited by:
**Vikram Poola**

First Edition:
**2nd April-2023**

Copies : **5,000**

Price : **Rs. 450 / $25**

Published by :

Jayaprada Foundation

3A, Akshara Grand,
Spaces & More Business Park,
Gachibowli, Hyderabad -500032.
Ph : +91-96180 90983, 9885587666,
e-mail : support@jayapradafoundation.org,
ntrc1923@gmail.com

Cover Page :
**Srinivas K**

Layout :
**Goutam K Boppana**

D.T.P. :
**Ismail Baig**

Printer at :
**Caxton Offiset Pvt. Ltd,**
11-5-413, Hari Nagar, Red Hills,
Lakdikapul, Hyderabad -500004. (TS)
Ph : 040-2339 5969

Copies Availabile at : All book stores

---

*Disclaimer :-* All rights reserved for Jayapradha Foundation, Hyderabad. This book or parts thereof may not be reproduced in any form, stored in any retrieval system, or transmitted in any form by any means- electronic, Print, Web Channels, recording, or otherwise- without prior written permission of the Writer.

# స్మృత్యంజలి



నందమూరి తారక రామారావు తల్లిదండ్రులు


## నందమూరి లక్ష్మయ్య, వెంకట రామమ్మ

# పుణ్యదంపతులు



నందమూరి తారక రామారావు, శ్రీమతి బసవతారకం

దంపతుల దివ్యస్మృతికి...



# ఎన్టీఆర్ స్ఫూర్తి ముందుకు నడిపిస్తోంది

నందమూరి తారకరామారావు గారి శతజయంతి సందర్భంగా **'ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ'** శాసనసభలో, వివిధ వేదికలపై ఎన్టీఆర్ చేసిన ప్రసంగాలను సంకలనం చేసి రెండు గ్రంథాలుగా వెలువరించడం, అదేవిధంగా ఆయనతో సాన్నిహిత్యం కలిగిన సినీ రాజకీయ ప్రముఖుల వ్యాసాలతో ఓ సావనీర్‌ను, ఆయన సమగ్ర జీవితానికి అద్దంపట్టే ఓ వెబ్‌సైట్‌ను తీసుకురావడం అభినందనీయం.

ఎన్.టి. రామారావు గారు అసెంబ్లీలో, విభిన్న వేదికలపై నుంచి చేసిన ప్రసంగాలు ఎప్పటికీ సజీవంగా చరిత్రలో నిలిచిపోతాయి. **'సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు'** అని, **'పేదవాడికి పట్టెడన్నం పెట్టడమే తన విధానం'** అని రాజకీయాలకు అంతకు ముందెన్నడూ ఎవరూ చెప్పని తనదైన నిర్వచనం ఇచ్చిన నాయకుడు ప్రపంచంలో ఎన్.టి. రామారావు గారు ఒక్కరే. గంగా ప్రవాహంలా సాగిపోయే ఎన్.టి. రామారావు గారి ఉపన్యాసాలలో ఆయన అద్భుతమైన తెలుగుభాషా కౌశల్యంతోపాటు, సమాజాన్ని సమూలంగా మార్చాలన్న తపన, నిబద్ధత ప్రతిపదంలో ప్రతిధ్వనిస్తాయి.

ఎన్.టి. రామారావు గారి జీవితం అసాధారణమైనది, వైవిధ్యమైనది. ఊహకు అందని విలక్షణత ఆయన సొంతం. ఒక రంగంలో అత్యున్నత శిఖరం అధిరోహించి వేరొక రంగంలో ప్రవేశించి అక్కడ కూడా మహోన్నత స్థాయికి చేరడం భారతదేశ చరిత్రలో ఒక ఎన్.టి. రామారావు గారికే సాధ్యమైంది. క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం, సమయపాలన, ఆత్మీయత, అభిమానం, నిర్భయత్వం, సాహసం.. వీటన్నింటి కలబోత ఎన్టీఆర్. ఆయన గురించి ఎంత చెప్పుకున్నా తరగదు. నిత చైతన్య స్రవంతిగా సాగిన ఆయన జీవితంలో అనేక కోణాలు, పార్శ్వాలు ఉన్నాయి. సినీరంగంలో ఆయన సాధించిన విజయాలు అసామాన్యం. రాజకీయ రంగంలో ఆయనొక సంచలనం. నిరంతరం పేదలు, బలహీన

వర్గాలు, మహిళల గురించి ఆలోచించిన మానవతావాది, సంస్కరణాభిలాషి ఎన్టీఆర్. కనుకనే, రాజకీయ పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి పేదలు, బడుగుబలహీన వర్గాలు, మహిళల కోసం ఎన్నో వినూత్న కార్యక్రమాలు ప్రారంభించి వారి దిశ, దశను మార్చారు. దేశంలోని మిగతా రాజకీయ పార్టీలు సైతం సంక్షేమబాట పట్టాల్సిన అనివార్యతను కల్పించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్. ఆయన స్వయంగా రూపొందించిన తెలుగుదేశం జెండాలోని నాగలి, చక్రం, గుడిశె గుర్తులు, పసుపురంగు చాలు ఆయన లక్ష్యమేమిటో చాటిచెప్పడానికి. రాజ్యాంగం రాష్ట్రాలకు కల్పించిన హక్కుల కోసం కేంద్రంతో ఆయన చేసిన రాజీలేని పోరాటం దేశ రాజకీయాలను మలుపు తిప్పాయి. నేషనల్ ఫ్రంట్ చైర్మన్‌గా దేశంలోని కాంగ్రేసేతర పార్టీలన్నింటిని ఏకతాటిపైకి తెచ్చి శిఖరాగ్ర సమావేశాలు (కాన్‌క్లేవ్) లు నిర్వహించి దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేశారు.

ఎన్టీఆర్ జీవితం నాతోపాటు ప్రతి ఒక్కరికీ గొప్ప ప్రేరణ. ఎన్టీఆర్‌తో కలసి పనిచేయడం నా జీవితంలో గొప్ప అనుభవం. ఆయన స్ఫూర్తి తెలుగుదేశం పార్టీని నిరంతరం ముందుకు నడిపిస్తోంది. ఎన్టీఆర్ ఆశయాల సాధన కోసం కృషి చేయడమే ఆయనకు మనం అందించే గొప్ప నివాళి.

**'ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ'** చేస్తున్న ఈ ప్రయత్నం విజయవంతం కావాలని కోరుకుంటూ సభ్యులందరికీ పేరుపేరునా అభినందనలు తెలియజేస్తున్నాను.

**నారా చంద్రబాబునాయుడు**

# నిత్య స్ఫూర్తి ప్రదాత



సాహసం, సంకల్పం, నైతిక బలం, లక్ష్యశుద్ధి పుష్కలంగా కలిగి ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సమాజంలో ఉన్నత ప్రజాస్వామిక విలువల పునరుద్ధరణే లక్ష్యంగా తన జీవితాన్ని అంకితం చేసిన అరుదైన మహానేత శ్రీ నందమూరి తారక రామారావు. రాష్ట్ర, జాతీయ రాజకీయాలలో శ్రీ ఎన్.టి. రామారావుది ఎన్నటికీ చెరిగిపోని ఓ విశిష్టముద్ర. పేదవాడి కన్నీటిని తుడవడమే తన పార్టీ సిద్ధాంతమని ప్రకటించి 'ఎన్టీఆర్ ఇజం'ను మించిన 'ఇజం' ప్రపంచంలోనే మరొకటి లేదని ఆచరణలో చూపించిన మానవతావాది ఎన్టీఆర్. పార్టీ స్థాపించిన 9 నెలల్లో అధికారంలోకి వచ్చిన శ్రీ ఎన్.టి.రామారావు **'సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు'** అనే సిద్ధాంతం ప్రాతిపదికపై అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల లక్ష్యం ఏమిటన్నది ఆయన అసెంబ్లీ వేదికగా చేసిన ప్రసంగాలు తెలియజేస్తాయి. అధికారం చేపట్టిన తొలినాళ్లల్లో ఎన్టీఆర్‌కు ఎదురయిన అడ్డంకులు, అవరోధాలు.. వాటిని అధిగమించిన తీరు ఆయన ప్రసంగాలలో కనిపిస్తాయి. ఎన్టీఆర్ విశిష్టతను, పాలకుడిగా ఆయన గొప్పతనాన్ని తెలుసుకోవాలంటే ఆయన చారిత్రక, అసెంబ్లీ ప్రసంగాలను తప్పక చదవాలి. ఈ ప్రసంగాల ప్రాసంగికత గతానికే పరిమితం కాదు. అది వర్తమానం, భవిష్యత్తుకూ వర్తించే విషయం. అసెంబ్లీ వెలుపల వివిధ చారిత్రక సందర్భాలలో ఎన్టీఆర్ చేసిన స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలను సంకలనం చేసి 'ఎన్టీఆర్ చారిత్రక ప్రసంగాలు'గా అందిస్తున్నాము.

రాజకీయ రంగ ప్రవేశం చేయకముందు వరకు సినీనటుడిగా శ్రీ నందమూరి తారకరామారావు తెలుగు ప్రజలకు ఆరాధనీయుడు. చాలామందికి భగవత్ స్వరూపుడు. ప్రపంచ సినీచరిత్రలో ఓ శిఖర ప్రాయుడు. ఆయన జీవితంలోని రెండు పార్శ్వాలైన సినీ జీవితం, రాజకీయ జీవితానికి సంబంధించిన అనేక విశేషాలు ఫోటోలు, వ్యాసాలు, పుస్తకాలు, ఆడియోలు, వీడియోల రూపంలో ఉన్నాయి. ఎన్టీఆర్‌పై వచ్చినన్ని పుస్తకాలు తెలుగునాట మరే ఇతర సినీ నటుడు, రాజకీయ నాయకుడి పేరిట రాలేదు.

ఎన్టీఆర్‌తో సన్నిహితంగా మెలిగే అదృష్టం పొందిన వ్యక్తులకు ఆయనకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలుసు. అయితే రాబోయే తరాలవారికి శ్రీ ఎన్.టి. రామారావు గారి సినీ, రాజకీయ జీవితాలకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో ఆ విశేషాలను సేకరించి ఆ మొత్తాన్ని ఎన్టీఆర్ వెబ్‌సైట్ ద్వారా అందరికీ అందుబాటులోకి తెస్తున్నాము. ఈ వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉంటాము. క్లుప్తంగా చెప్పాలంటే ఎన్టీఆర్ సినీ, రాజకీయ, సాంస్కృతిక, సేవా రంగాలకు సంబంధించి ఎవరికి ఏ విశేషం కావాలన్నా ఈ వెబ్‌సైట్‌లో లభ్యం అవుతుంది. పైగా చాలా సులభంగా వెబ్‌సైట్ నుంచి సమాచారాన్ని పొందే వెసులుబాటు కల్పిస్తున్నాం. ఎన్టీఆర్ పేరుతో ఓ పూర్తిస్థాయి వెబ్‌సైట్ తేవడం ఇదే ప్రథమం.

శ్రీ నందమూరి తారకరామారావు గారి అసెంబ్లీ ప్రసంగాలు, చారిత్రక ప్రసంగాలు, ఎన్టీఆర్ వెబ్‌సైట్‌లతోపాటు 'శకపురుషుడు' అనే సావనీర్‌ను కూడా వెలువరిస్తున్నాం. ఇందులో ఎన్టీఆర్‌తో ఆయన సినీ, రాజకీయ రంగాలలో సన్నిహితంగా మెలిగిన సినీ నటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలు, దర్శకులు, పంపిణీదారులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, బంధువులు, సహచర రాజకీయ నాయకులు, జాతీయ నాయకులు, పాత్రికేయులు.. ఇలా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో వ్యాసాలు రాయించాము. ప్రత్యేకంగా వీడియోలు చేయించాము. ఆ వీడియోలను వెబ్‌సైట్‌లో ఉంచుతాము. వాటిని అక్షరీకరించి సావనీర్‌లో అందిస్తున్నాము. ఎన్.టి. రామారావు గారి బహుముఖ వ్యక్తిత్వాన్ని దర్శించిన ఆయా రంగాలలోని ప్రముఖులు తమ అభిప్రాయాలను, స్పందనను వ్యాసాల రూపంలో అందించారు. శ్రీ ఎన్.టి. రామారావు గారు ఓ మహోన్నతమైన వ్యక్తి అని అందరూ ఒప్పుకొంటారు. అయితే, ఆ మహోన్నతమైన వ్యక్తిత్వంలోని విశేషాలు ఏమిటన్నవి సమగ్రంగా ఆవిష్కరింపజేసి భావితరాలకు వాటిని అమూల్యమైన కానుకలుగా అందించడం మా ఉద్దేశం. అందుకు ఎన్టీఆర్ శతజయంతి సంవత్సరాన్ని మించిన గొప్ప సందర్భం మరొకటి ఏముంటుంది?

ఈ బృహత్ కార్యక్రమం ఇలా రూపుదిద్దుకోవడంలో **'ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ & వెబ్‌సైట్ కమిటీ'** సభ్యుల కృషి, పట్టుదల, అంకితభావం ఉన్నాయి. తొలుత ఒకరిద్దరు మిత్రులం ఈ ఆలోచన చేశాము. క్రమంగా మరికొంత మంది మిత్రులను కలుపుకున్నాం. అందరం కలిసి ఓ కమిటీగా ఏర్పడ్డాం. తలా ఒక బాధ్యత స్వీకరించాము. కమిటీలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్ శ్రీ ఎం.ఏ. షరీఫ్, మాజీ రాజ్యసభ సభ్యులు శ్రీ రావుల చంద్రశేఖర రెడ్డి, ఎన్టీఆర్ వెబ్‌సైట్ అండ్ యాప్స్ సిఈవో శ్రీ అట్లూరి అశ్విన్, తెలుగువన్ చానెల్ చైర్మన్ శ్రీ కంఠమనేని రవిశంకర్, సీనియర్ నిర్మాత, పంపిణీదారులు శ్రీ కాట్రగడ్డ

ప్రసాద్ గార్లు వైస్‌చైర్మన్లుగా ఉండగా, పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకులు శ్రీ విక్రమ్ పూల, పాత్రికేయుడు, రచయిత శ్రీ భగీరథలు సెక్రటరీలుగా ఉన్నారు. సేవారంగ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే సోషల్ యాక్టివిస్ట్, సినీ నిర్మాత శ్రీ అట్లూరి నారాయణరావు కన్వీనర్‌గా, ఆల్ ఇండియా ఎన్టీఆర్ ఫాన్స్ అధ్యక్షుడు శ్రీ శ్రీపతి సతీష్, శ్రీ రఘురామ్ కాసరనేని, శ్రీ సతీష్ మండవలు జాయింట్ సెక్రటరీలుగా ఉన్నారు. ట్రెజరర్‌గా ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్రీ కె.వి.ఎస్. మధుసూదనరాజు ఉన్నారు. కమిటీలోని సభ్యులందరికీ ఎన్టీఆర్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుబంధం ఉంది. తీపి జ్ఞాపకాలున్నాయి. ఎన్టీఆర్ శతజయంతిని వినూత్నంగా నిర్వహించి ఆయన స్మృతులను శాశ్వత పర్చాలనే ఆలోచనే అందర్నీ ఈ మహత్‌కార్యానికి పురిగొల్పింది. ఎన్టీఆర్ స్ఫూర్తి అందర్నీ ముందుకు నడిపింది.

ఈ యజ్ఞంలో మాతోపాటు పాల్గొని మాకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన సినీ జర్నలిస్ట్ శ్రీ యు. వినాయకరావు, బాపట్ల విద్యా సంస్థల అధినేత శ్రీ రామ్మోహనరావు, మనసు ఫౌండేషన్ అధినేత శ్రీ మన్నం వెంకటరాయుడు, సాహితీ పరిశోధకులు శ్రీ పారా అశోక్ కుమార్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి శ్రీ సత్యనారాయణ, శ్రీ విజయ భాస్కర్ పోశాలలకు మనఃస్ఫూర్తిగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

ఎన్.టి. రామారావు గారికి ఓఎస్డీగా పనిచేసిన గోటేటి రామచంద్రరావు గారు మాకెంతో ప్రోత్సాహం అందించారు. ఇటీవల ఆయన పరమపదించడం దురదృష్టకరం. ఆయనకు మా నివాళి.

ఈ మహాయజ్ఞంలో పాల్గొనడం మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం. ఈ కార్యక్రమం చేస్తున్నందుకు మమ్మల్ని వెన్నుతట్టి ప్రోత్సహించిన తెలుగుదేశం అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి కమిటీ తరఫున మనఃపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాము.

టి.డి. జనార్దన్
చైర్మన్
ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ & వెబ్‌సైట్ కమిటీ

# ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ & వెబ్‌సైట్ కమిటీ



## టి.డి.జనార్ధన్, చైర్మన్

శ్రీ తొండపు దశరథ జనార్ధన్ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యులు. నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. ఎకనామిక్స్ పూర్తిచేసి, మండల పార్టీ అధ్యక్షునిగా, 9 సం॥ కృష్ణాజిల్లా డిసిసిబి అధ్యక్షులుగా, 9 సం॥ పాటు రాష్ట్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా, 6 సం॥ పాటు అఖిల భారత వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకుల సమాఖ్య చైర్మన్‌గా పని చేసి జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డులు పొందారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులుగా 6 సం॥ ఉన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ రాజకీయ కార్యదర్శిగా, పొలిట్‌బ్యూరో సభ్యులుగా సేవలందిస్తున్నారు.

## ఎమ్.ఏ.షరీఫ్, వైస్ చైర్మన్



న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన శ్రీ ఎం.ఏ. షరీఫ్ ఎన్టీఆర్ పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీలో సభ్యులుగా చేరారు. పార్టీలో వీరు అనేక పదవులు నిర్వహించారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మూడు పర్యాయాలు పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్‌గా ఉన్నప్పుడు పార్లమెంటరీ సంప్రదాయాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కృషి చేసి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు.



## రావుల చంద్రశేఖర రెడ్డి, వైస్ చైర్మన్

న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన శ్రీ రావుల చంద్రశేఖరరెడ్డి ఎన్టీఆర్ పిలుపునందుకొని తెలుగుదేశం పార్టీలో సభ్యులుగా చేరి పార్టీలో పలు కీలకమైన పదవులు నిర్వహించారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం రాజ్యసభ సభ్యులుగా, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థకు చైర్మన్‌గా రెండు పర్యాయాలు పని చేశారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులుగా ఉన్నారు.

## అశ్విన్ అట్లూరి, సి.ఈ.ఓ., ఎన్.టి.ఆర్. వెబ్‌సైట్



శ్రీ అశ్విన్ అట్లూరి 2000 సంవత్సరం నుంచి అమెరికాలో నివసిస్తున్న ప్రవాసాంధ్రుడు. ఎన్.టి.ఆర్. వెబ్ సైట్ సి.ఈ.ఓ. కరోనా సమయంలో అమరావతిలో ఆరోగ్య శిబిరాలని ఏర్పాటు చేసి ఎందరికో సాయం చేశారు. అలాగే ఆ ప్రాంతాల్లో ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబాలకు కూడా సహాయం అందించారు. సంగీత ప్రియుడైన అశ్విన్ ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రస్తుత పరిస్థితులపై పాటలు వ్రాసి ప్రజలను చైతన్య పరుస్తున్నారు.



**కంఠమనేని రవిశంకర్,** వైస్ చైర్మన్

శ్రీ కంఠమనేని రవిశంకర్ తెలుగు వన్ సంస్థ వ్యవస్థాపకులు మరియు మేనేజింగ్ డైరెక్టర్. ఎమ్.బి.ఎ. చదివిన రవిశంకర్ కొంతకాలం పాటు టాటా కన్సల్టెన్సీలో పనిచేసి తరువాత అప్పుడే ప్రారంభమౌతున్న సాఫ్ట్‌వేర్ రంగంలో అడుగుపెట్టారు. తెలుగు ప్రజలకు వినోదంతో పాటు సమాచారాన్ని అందించే లక్ష్యంతో తెలుగు వన్ పోర్టల్‌ను ప్రారంభించారు. తెలుగు వన్ ఫౌండేషన్ ద్వారా ప్రాణాంతక వ్యాధితో బాధపడే రెండు వేల మంది ప్రజలకు శస్త్రచికిత్స చేయించి ప్రాణాలు నిలబెట్టారు.

---



**కాట్రగడ్డ ప్రసాద్,** వైస్ చైర్మన్

శ్రీ కాట్రగడ్డ ప్రసాద్, సినిమా రంగంలో ఐదు దశాబ్దాల అనుభవం వుంది. తెలుగులో 18, తమిళంలో 10, కన్నడంలో 5 చిత్రాలు నిర్మించారు. కృష్ణా జిల్లాలో ఎన్నో తెలుగు సినిమాలను పంపిణీ చేశారు. దక్షిణ భారత చలన చిత్ర వాణిజ్య మండలి గౌరవ కార్యదర్శిగా, గౌరవ అధ్యక్షుడుగా, తెలుగు నిర్మాతల మండలి గౌరవ కార్యదర్శిగా, ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యుడుగా పనిచేశారు.

---



**విక్రమ్ పూల,** కార్యదర్శి

ఎం.ఏ, ఎల్.ఎల్.బి. చేసిన శ్రీ విక్రమ్ పూల వివిధ పత్రికలకు సంపాదకులుగా పనిచేశారు. వందకు పైగా కథలు, వందలాదిగా వ్యాసాలు రాశారు. 1993లో పల్లకి వారపత్రికలో ఎన్టీఆర్ జీవిత చరిత్రపై ధారావాహిక రాశారు. రాజకీయాల నేపథ్యంగా 3 పుస్తకాలు రాశారు. తెలుగుదేశం పక్ష పత్రికకు ఎడిటర్‌గా పని చేశారు. ప్రస్తుతం ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా, పొలిటికల్ ఎనలిస్ట్‌గా పని చేస్తున్నారు.

---



**భగీరథ,** కార్యదర్శి

శ్రీ భగీరథ, సీనియర్ జర్నలిస్ట్, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభలో పనిచేశారు. 16 పుస్తకాలు రచించారు. 25 అవార్డులు వచ్చాయి. నంది, జాతీయ, ఆస్కార్ సినిమా అవార్డుల కమిటీ సభ్యుడుగా పనిచేశారు. 'ప్రియమైన శ్రీవారు', 'సామాన్యుడు', 'స్వాగతం' చిత్రాలకు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్‌గా పనిచేశారు. 2007 నుంచి దక్షిణ భారత చరిత్రపై పరిశోధన చేస్తున్నారు. 2014లో వంగూరి ఫౌండేషన్ ఆహ్వానంపై అమెరికా సందర్శించారు.



**అట్లూరి నారాయణరావు,** కన్వీనర్

శ్రీ అట్లూరి నారాయణ రావు ఎమ్మెస్సీ, ఎమ్.ఫిల్ చేసి అధ్యాపకుడుగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జీర్ణావస్థలో వున్న దేవాలయాలకు సహాయం చేశారు. కరోనా కాలంలో అన్నార్తులకు ఆహారాన్ని అందించారు. శ్రీరామ్ మూవీస్, వైష్ణవీ ఫిలిమ్స్‌పై నాలుగు సినిమాలు నిర్మించారు. 20 సినిమాలకు పైగా పంపిణీ చేశారు. అట్లూరి నారాయణ రావు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు.



**శ్రీపతి సతీష్,** సంయుక్త కార్యదర్శి

అల్ ఇండియా ఎన్.టి.ఆర్. అభిమాన సంఘానికి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి శ్రీపతి రాజేశ్వర రావు, వారి కుమారుడు శ్రీ శ్రీపతి సతీష్ కుమార్ ప్రస్తుతం అల్ ఇండియా ఎన్.టి.ఆర్. అభిమాన సంఘానికి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వున్నారు.



**మండవ సతీష్,** సంయుక్త కార్యదర్శి

శ్రీ మండవ సతీష్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చేసి డిజిటల్ మార్కెటింగ్, బ్యాంకింగ్ మరియు ఆర్థిక రంగాలలో గత రెండు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నారు. వాల్యూ ప్రాప్ మీడియా వర్క్స్ వ్యవస్థాపకులు. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉపాధి మరియు విద్యకు ప్రోత్సాహాన్ని అందించే సంస్థలతో కలిసి పని చేస్తున్నారు.



**కాసరనేని రఘురామ్,** సంయుక్త కార్యదర్శి

శ్రీ కాసరనేని రఘురామ్ ఇంజనీరింగ్ పట్టభద్రులు. ప్రస్తుతం వీరు ఆండ్స్ కన్సల్టింగ్ సంస్థ డిజిటల్ మార్కెటింగ్ విభాగానికి ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. చాలా సంవత్సరాలుగా వ్యాపార రంగాలకు సంబంధించిన సంస్థలకు సలహాదారుగా పనిచేశారు. ప్రస్తుతం జయప్రద ఫౌండేషన్‌కి ఎగ్జిక్యూటివ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.





**కె.వి.ఎస్.మధుసూదన రాజు,** కోశాధికారి

శ్రీ కె.వి.ఎస్. మధుసూదన రాజు, ప్రముఖ ఇంటీరియర్ కంపెనీ ఐకాన్స్ వ్యవస్థాపకులు. సామాజిక కార్యక్రమాలు, లలిత కళల పట్ల ఆసక్తి, అభిరుచి ఉన్న మధుసూధన రాజు వాటికి ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు.

# లోపలి పేజీలలో...


| | |
|---|---|
| 1. ఇది ప్రజా విజయం | 1 |
| 2. మనమంతా ఒక్కటే | 5 |
| 3. దేశ సమగ్రతను పరిరక్షించుకుందాం | 9 |
| 4. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి మన విద్యుక్తధర్మం | 12 |
| 5. ప్రజాహిత కార్యక్రమాలకు అండగా నిలవండి | 16 |
| 6. ఉదాసీనతకు, అలక్ష్యానికి తావివ్వవద్దు | 26 |
| 7. భావిభారత భాగ్యవిధాతలకు శుభాశీస్సులు | 35 |
| 8. నిరంతర క్రీడాకారుడు.. మానవుడు | 39 |
| 9. ప్రజాసేవకు పునరంకితం | 40 |
| 10. ఆడవారు వంటింటి కుందేళ్లు కారు | 45 |
| 11. ప్రజాసేవకే అంకితం ఈ జీవితం | 47 |
| 12. రావాలి మనకు సామ్యవాద సమానత్వం | 53 |
| 13. విద్య-మనిషిలోని వ్యక్తిత్వాన్ని వెలార్చే దీపకళిక | 58 |
| 14. సాటి ప్రాణి సంరక్షణ మన ఆదర్శంకావాలి | 61 |
| 15. అభ్యుదయకర కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి | 64 |
| 16. ఆరుకోట్ల ప్రజానీకానిదీ ఒకే బాట కావాలి | 68 |
| 17. చలనచిత్ర కళాలక్ష్మికి నీరాజనం | 71 |
| 18. మ్యూజియంలు మన సంస్కృతీ నాగరికతలకు ప్రతీకలు | 74 |

| | | |
|---|---|---|
| 19. | స్వాతంత్ర్యానికి సరైన నిర్వచనం | 77 |
| 20. | పోలీసు వ్యవస్థకు సరికొత్త స్వరూపం కల్పించాలి | 82 |
| 21. | పృథ్వీతలం మహనీయుల సుప్రస్థికల సమాధి | 85 |
| 22. | మన విశిష్ట వారసత్వాన్ని ఎక్కడవున్నా మరువరాదు | 89 |
| 23. | పీడిత, తాడిత దీన జనోద్ధారకునికి స్మృత్యాంజలి | 95 |
| 24. | మానవాభ్యుదయానికి మార్గం చూపేదే కళ | 98 |
| 25. | సమ సమానావకాశ సమర్పణమే జాతి పురోగమనకు నివేదనం | 101 |
| 26. | అంగవైకల్యం జీవన యాత్రకు ప్రతి బంధంకం కారాదు | 106 |
| 27. | సర్వతోముఖ సంక్షేమ ప్రగతితో మన రాష్ట్రం శోభించి రాణించాలి | 109 |
| 28. | నీతిని పెంచి జాతిని ఉద్ధరించాలి | 112 |
| 29. | అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలి విజ్ఞాన దీపకళికలను వెలిగించేదే విద్య | 117 |
| 30. | ప్రకృతి వైపరీత్యాలను ధైర్యంతో కలసికట్టుగా ఎదుర్కొందాం | 120 |
| 31. | నా జీవితం జాతికే అంకితం | 123 |
| 32. | అన్నదాతలకు కొండంత అండ కర్షక పరిషత్తు | 136 |
| 33. | పేదరికం నిర్మూలనే పరిశ్రమల లక్ష్యం | 141 |
| 34. | కొమర్రాజు చూపిన మార్గం మనకు ఆదర్శం | 152 |
| 35. | సమాజమే దేవాలయం | 155 |
| 36. | చైతన్యోద్దీపనకు కంకణం కడదాం | 161 |
| 37. | ఆర్థిక ప్రమాణాలను పెంపొందించాలి | 167 |
| 38. | త్యాగమూర్తుల కలలు పండిద్దాం | 173 |
| 39. | చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్ పథకాలు | 183 |








# ఇది ప్రజా విజయం

నా ప్రాణానికి ప్రాణంగా, ఊపిరిలో ఊపిరిగా, కష్టసుఖాలలో నన్నాదుకొంటూ అన్నగా ఆదరిస్తున్న నా తెలుగింటి ఆడపడుచులకు –

ఆవేశంతో, ఉత్సాహంతో ఉరకలు వేస్తూ ఎల్లవేళలా నా వెన్ను కాపుండి, అండదండలు అందించి, నన్ను ముందుకు నడిపిస్తున్న నా తమ్ముళ్లకు –

ప్రజాస్వామ్య పరిరక్షణే ప్రధానాశయంగా, నా విజయమే తమ విజయంగా భావించి అనుక్షణం ఆశీఃపరంపరలతో నా జైత్రయాత్రకు చైతన్యాన్నిచ్చిన పెద్దలకు, రాజకీయ వేత్తలకు, మేధావి వర్గానికి, పత్రికా ప్రపంచానికి –

అపూర్వ రాజకీయ చైతన్యంతో నిజమైన ప్రజాస్వామ్యానికి ప్రతీకలుగా నిలిచి, ఫెడరల్ సిద్ధాంతపరంగా మన పవిత్ర రాజ్యాంగాన్ని పరిరక్షించుకోడానికి నవ చైతన్యంతో రాజకీయ పుటలలో మరొకసారి సువర్ణాక్షరాలతో లిఖించే విధంగా నూతన చరిత్ర సృష్టించి, నిరంకుశ వ్యక్తిగత పరిపాలన సాగదనే సత్యానికి ప్రతిరూపాన్ని సాక్షాత్కరింపచేసి, తెలుగువారి ఆత్మ గౌరవాన్ని, తెలుగుజాతి నిండుదనాన్ని, తెలుగుకీర్తిని, స్ఫూర్తిని ఈ రాష్ట్రంలోనే కాదు, ఈ దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ప్రతిధ్వనింపజేసిన ఆరుకోట్ల అఖిలాంధ్ర ప్రజానీకానికి–

నా కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు, ధన్యవాదాలు, శుభాభినందనలు.

ఇది ప్రజా విజయం.

అశేష ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం సాగించిన మహోజ్వల పోరాటం, సాధించిన ఘన విజయం.

యావద్భారతావని ఒక్క గొంతుతో నినదించి ప్రజాస్వామ్య వ్యవస్థా పరిరక్షణకై సాగించిన మహోద్యమానికి యిది అఖండ విజయం.

వ్యాపారాత్మకంగా సాగుతూ, దగాకోరు పద్ధతులకూ, దోపిడీ విధానానికి అలవాటుపడ్డ యీ రాజకీయ పుణ్యపురుషుల కాలంలో–

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా ప్రభుత్వాన్ని అన్యాయంగా, అక్రమంగా, అధర్మంగా, దారుణంగా, కూలగొట్టిన యీ కలుషిత స్వార్థపూరిత వాతావరణంలో– ఎవరైతే ఆనాడు తెలుగుజాతిపై వుంచిన నమ్మకానికి, విశ్వాసానికి, ద్రోహం చేసి, అధికార వ్యామోహంతో, పదవీ దాహంతో యీ అన్ననే కాదు తెలుగుజాతినే వెన్నుపోటు పొడిచి, తెలుగు వారికే తలవంపులు తెచ్చిన యీ సమయంలో – నీతికి, నిజాయితీకి నిలబడి ఆత్మగౌరవానికి అంకితమయ్యే ధన్యజీవులు యింకా వున్నారని నిరూపించారు. యీనాడు నా సరసన నిలబడ్డ నా అన్నలు, తమ్ముళ్లు, చెల్లెళ్లు – నా సహచర శాసనసభ్యులు.

**ఇదే యీ జన్మకు సాఫల్యతకూర్చే సంబంధం, ఏర్పడ్డ అనుబంధం. వారి త్యాగాలను కొలువలేము. కొండంత దేవుడికి గోరంత పత్రి అన్నట్లు వారిని యీనాడు గౌరవించడమే జాతి తనను తాను గౌరవించుకోవడం అవుతుంది.**

ఆకర్షణలకు, ప్రలోభాలకు, ఆ పేక్షలకు, ఎరలకు, ఆశలకు అతీతులై, ధర్మానికి, సత్యానికి బద్ధులై, కుటుంబాలకు దూరమై ఏకోదరులు పోయినా, కన్నకొడుకు కూలినా చలించకుండా ఆదర్శాన్ని అంటి పెట్టుకొని యీనాటికింకా రాజకీయాలలో నీతిగా బ్రతకవచ్చునని నిరూపించారు, ధన్యజీవులైనారు.

ఆత్మీయతతో ఆత్మబంధువులుగా వారు నాకిచ్చిన గౌరవాన్ని మరువలేను యీ జీవితంలో వయసుకు పిన్నలైనా, పెద్దలైనా వారి నిబ్బరానికి, అచంచల విశ్వాసానికి, ఆత్మస్థైర్యానికి, అమ్ముడుపోని పవిత్రతకు నా జీవిత పర్యంతం వారి సహకారం నేను మరువలేను.

నేను వారి వాడిని,<br>
వారు నా వారు.<br>
ఇదే యీ జన్మకు సాఫల్యతకూర్చే సంబంధం, ఏర్పడ్డ అనుబంధం.<br>
వారి త్యాగాలను కొలువలేము.

కొండంత దేవుడికి గోరంత పత్రి అన్నట్లు వారిని యీనాడు గౌరవించడమే జాతి తనను తాను గౌరవించుకోవడం అవుతుంది.

ఇది ఒక వ్యక్తి సమస్య కాదు. ఒక పార్టీ సమస్య కాదు. రాష్ట్ర సమస్య కూడా కాదు. భారత జాతి సమగ్రతకు, భారత రాజ్యాంగ విధానానికి విరుద్ధంగా వ్యవహరించిన నిరంకుశ నియంతృత్వ పరిపాలనా పద్ధతికి వ్యతిరేకంగా జాతి ఒక్కటై సాగించిన మహాసంగ్రామం యిది.

మరువదు జాతి యీనాటి మహోద్యమం.

మరువుకురారు ఎన్నటికీ యీ మహత్తర పోరాటంలో తమ ప్రాణాలను బలి పెట్టిన అమరజీవులు, త్యాగధనులు. పట్టపగలు నడిబజారులో నిట్టనిలువునా ప్రజాస్వామ్యం హత్య చేయబడుతుంటే అన్యాయాన్ని సహించలేక తమకు తాముగా స్పందించి, ఉద్యమించి, వీర రక్తపుధార వారవోసిన సీమగా తెలుగునాడును పునః ప్రతిష్ఠ చేసిన అ మహనీయమూర్తుల దివ్యస్మృతికి అంజలి ఘటించి అశ్రుతర్పణం చేస్తున్నాను. యీ సభాముఖంగా మరొకసారి.

ఈ చరిత్రాత్మక సమరంలో ఒక ఊరు కాదు, ఒక వాడ కాదు. ఒకనాడు కాదు – దేశమే ఒక్కటై నిలిచింది. చేయీ చేయీ కలిపి నిలబడింది గొంతు కలిపి నినదించింది.

ప్రజాస్వామ్య విధాన పరిరక్షణకై పట్టుబట్టి నడుంకట్టి, ఒక్కమాటగా ఒక్క బాటగా నిలిచి పోరాడిన సోదర ప్రాంతీయ, జాతీయ అఖిలపక్ష నాయక వరేణ్యులకు అఖిలాంధ్రావని తరఫున అర్పిస్తున్నాను. నా కృతజ్ఞతాపూర్వక సుమాంజలి.

మరువలేను అలనాటి కర్ణాటాంధ్ర మహాసామ్రాజ్య ఐక్యతను ఈనాడు సుహృద్భావంతో స్ఫురణకు తెచ్చిన కన్నడ సోదరుల అనురాగం, ఆదరణ.

మన రాష్ట్రంలోనే భద్రత లోపించిన సందర్భంలో మన శాసన సభ్యులకు సుస్వాగతంతో ఆతిథ్యమిచ్చిన సోదరులు, ప్రజానాయకులు శ్రీ రామకృష్ణ హెగ్డే గారి సమాదరణ, వారి సహచరుల సహాయ సహకారాలు మరువలేము మేమెన్నటికీ.

మాటలు లేవు మక్కువతో నిండిపోయిన మా మనోగత భావాన్ని వ్యక్తం చేయడానికి.

కేవలం కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరిస్తున్నాను యీ సభాముఖంగా.

ఒక ప్రత్యేకమైన ఆశయానికి అంకితమై అందరం భుజం భుజం కలిపి సాగించిన యీ సమరం, సాధించిన యీ ఘన విజయం భవిష్యత్ భారత రాజకీయలకు బాట కావాలి. ఆలోచనలకు యిది వెలుగు కావాలి.

**అట్టడుగున మ్రగ్గుతున్న బడుగు వర్గాలవారి అభ్యున్నతికి,**
**అల్ప సంఖ్యాక వర్గాల వారి సంక్షేమానికి,**
**శ్రామిక, కార్మిక, కర్షక వర్గాల వారి సమున్నతికి,**

అన్ని వేళలా మంగళారతులిచ్చి నుదుట తిలకం దిద్ది 'అన్నా విజయీభవ!' అని ఆశీర్వదించిన మన ఆడపడచుల సమాన హక్కుల సాధనకు,

నవనవోద్దీపితమై ఉత్తుంగ తరంగంలా ఎగసి అన్నగా నన్ను గౌరవిస్తున్న యువశక్తిని ప్రభావితంచేసి, ఆదర్శమైన విద్యా విజ్ఞాన సౌకర్యాలతో సమాజ క్షేమానికి అంకితమయ్యే సర్విధానంతో వారికి దోహదం చేసేందుకు, పార్టీ విభేదాలకు, కులమత ప్రాంతీయ వివక్షతకు అతీతంగా సమగ్రసమైక్య రాష్ట్ర పరిరక్షణకు,

**సర్వతోముఖాభివృద్ధికి కృషి సాగించడానికి,**
**పరిశుద్ధమైన పరిపాలన ప్రజలకందించడానికి,**
**రాజకీయ కాలుష్యాన్ని నిర్మూలించడానికి,**
**శాంతిభద్రతలు సుస్థిరంగా నెలకొల్పడానికి,**

సర్వమానవ సమానతకు, సామాజిక సహజీవన సముద్ధరణకు, పునరంకితం అవుతున్నానని యీ ప్రజా విజయోత్సవ సభాముఖంగా మరోసారి ప్రతిజ్ఞ చేస్తున్నాను.

నాకు దక్కిన యీ గౌరము మీది, ఈ ఘన విజయం మీది, మీరే నా బలం.

**జై తెలుగునాడు. జైహింద్!**

**(1984 సెప్టెంబరు 20వ తేదీన హైదరాబాదు లాల్ బహదూర్ స్టేడియంలో జరిగిన విజయోత్సవ సభలో చేసిన ప్రసంగం)**



# మనమంతా ఒక్కటే

**(1984 అక్టోబరు 27వ తేదీన హైదరాబాదులో జరిగిన జాతీయ సమైక్యతా సదస్సులో చేసిన ప్రసంగం)**

ఒక ప్రక్క విజ్ఞానం పెరిగిపోతూ విశ్వాంతరాళాలకు విస్తరిస్తూ వుండగా, మరోప్రక్క మత మౌఢ్యం మానవుని చుట్టూ గళ్లు గీసి, మనిషి మనిషికీ మధ్య ముళ్లదళ్లను నాటి సంకుచిన హింసాత్మక సంఘర్షణల వైపుకు దారి తీస్తూ వుంది, 'అన్నా' అని ఆప్యాయతతో కౌగలించుకొనే సోదరుడే వెన్నుపోటు పొడుస్తూ వుండడం, స్వార్థం కోసం, అర్థంలేని అనర్థదాయకమైన వ్యర్థ కుల మత విభేదాలను అడ్డుపెట్టుకొని రక్త దాహానికి వొడిగట్టడం మనం చూస్తున్నాం. ఇది నిజంగా దురదృష్టకరం.

మతం అంటే ఏమిటి? మనిషిని మనిషిగా చూడనిది మతమా? అని అడుగుతున్నాను. ఒకరి శరీరంలో నెత్తురు, మరొకరి శరీరంలో పాలు వుంటాయా? అందరినీ ప్రకృతి ఒకే విధంగా సృష్టించింది. కూటికి గతి లేని కుచేలుడైనా, కోట్లకు పడగలెత్తిన కుబేరుడైనా, చివరకు కలిసేది ఆ మట్టిలోనే, ఏ మతమైనా ప్రేమ, సౌభ్రాతృత్వాలతో పరస్పరం సహకరించుకొంటూ ముందడుగు వేయమని చెపుతుందే కాని ఒకరి గొంతు ఒకరు నులుముకోమని చెప్పదు.

జీవితంలో సాధించవలసింది ఏమిటి? మన చుట్టూ వున్న అసలు శత్రువులు – దరిద్రం, అజ్ఞానం, అనారోగ్యం, అనైక్యత – వీటిపై సాగించాలి. మనం నిరంతర యుద్ధం: ఆకలికి కులముందా? దరిద్రానికి మతముందా? అజ్ఞానానికి జాతిభేదం వుందా? అనారోగ్యానికి ప్రాంతీయ భేదం వుందా? అట్టడుగున మ్రగ్గుతూ తరతరాలుగా దారిద్ర్యంలో వుంటూ "ఏది మాకు తరుణోపాయం, ఏదీ మాకు సామాజిక న్యాయం" అని అలమటిస్తూ వున్న కోట్లాది అన్నార్తులను, బాధార్తులను, క్షుధార్తులను ఆదుకోడానికి పూనుకోవడమే నిజమైన మతమని నేను నమ్ముతున్నాను.

ఈనాడు కాదు. ఏనాడో ఈ విషయాన్ని స్పష్టం చేశారు మన పెద్దలు. తనకున్న దానిలో ఆకలిగా వున్న వారికి యింత తిండి పెట్టి, మంచినీళ్లు పోసి ఆదుకొన్న సక్తుప్రస్థుని త్యాగశీలం ముందు కోట్లకొలది బంగారు నాణాలు వ్యయం చేసి మహా వైభవంగా అనేక రోజులపాటు నిర్వహించిన ధర్మరాజు రాజసూయ యాగం వెలవెల పోయింది. అంటే నిజంగా మంచి మనసుతో సాటి మానవుని ప్రేమించడంకన్నా గొప్పతనం లేదని స్పష్టమవుతుంది.

మతం అన్నది మనం ఒంటికి పూసుకొన్న బురద. మానవులంతా జన్మత ఒక్కటే. కులం లేదు, మతం లేదు, అందరిలోనూ ఆ దేవుడు వున్నాడు. అట్టి మానవతా వాదానికి, సమతావాదానికి మనమందరం అంకితం కావాలి. ఎక్కడ వున్నాడు దేవుడు? ఏమి చెబుతున్నాడు దేవుడు "ఈ నాలుగు గోడల మధ్యనే కూర్చున్నాను నేను. మరెక్కడా లేను అని" చెబుతున్నాడా? దేవుడు అంటేనే సర్వాంతర్యామి. నీవు చేసే భజనలో, మ్రొక్కే రాతిలో, మెక్కే ప్రసాదంలో మాత్రమే దేవుని చూచుకొంటున్నావు గాని దేవుడనేవాడు నీ ఆత్మలోనే వున్నాడు. నీ చుట్టూ మెసలే ప్రతి వ్యక్తిలోనూ ప్రతి ప్రాణిలోనూ వున్నాడు. "ఆత్మవత్ సర్వభూతేషు యఃపశ్యతి సఃపండితః" నీ వలెనే అందరినీ చూచుకొనటమే, ప్రేమించటమే నిజమైన ఆత్మ దర్శనం.

అందరూ తన బిడ్డలయితే ఆ భగవంతుడు కొంతమందిని పంచభక్ష్య పరమాన్నాలతో తినమని, మరి కొంతమందిని పస్తులుండమని బోధించాడా? లేక కొంతమందిని తనవారనుకొంటూ మిగిలిన వారిని పరులుగా భావిస్తున్నాడా? మన సంకుచిత భావాలను భగవంతునికి అంటగట్టి అత్యున్నతమైన ఆధ్యాత్మికతత్వాన్ని అధోగతికి దిగజార్చడం ఉదాత్తమేనా అని అడుగుతున్నాను. 'అల్లా ఒక్కడే' అని చెప్పాడు మహమ్మద్ ప్రవక్త. "ఏకం సత్ విప్రాబహుధా వదంతి" అన్నది ఉపనిషద్వాణి. మానవులంతా ఒక్కటేనని ఆచరణాత్మకంగా చూపిన మహాగురువు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి.

వేద వాఙ్మయాన్ని పుక్కిటబట్టి పిన్న వయస్సులోనే ఆసేతు హిమాచలానికి ఆదర్శ ఆధ్యాత్మిక ఆచార్యులుగా జగత్ ప్రసిద్ధిగాంచిన జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యుల వారే క్షణకాలం మాయా మోహితులై ఎదురు వచ్చిన ఛండాలుని 'తొలగు, తొలగు' అని ఆదేశించారు. అప్పుడు వచ్చింది. 'తొలగవలసింది ఎవరు? అనిత్యమైన దేహమా, అనశ్వరమైన ఆత్మయా?" అన్న ప్రశ్న. జ్ఞానం సమాధానం యిచ్చింది " చండాలోస్తు సతుర్ద్విజోస్తు గురురిత్యేషా మనీషా మమ" అని, అట్టి మహోన్నతమైన, పవిత్రమైన, సుహృద్భావబంధురమైన సమతావాద సంస్కృతి భారత జాతిది.

ప్రతి ఉదయం మనవారు ఆమంత్రిస్తున్నారు భగవానుని 'త్రైలోక్యం మంగళం కురు–అని 'ఆంధ్రప్రదేశ్ మంగళంకురు, తమిళనాడు మంగళంకురు. మధ్యప్రదేశ్ మంగళంకురు' అని కాదు. 'మానవసేవయే మాధవ సేవ' అని చెప్పిన మానవతా వాదం మనది. విశ్వజనీనమైన, సమతా భావపూరితమైన, నిండుమనసు మనది.

అట్టి మహత్తర సాహితీ సంస్కృతీసంపదకు వారసులం మనం. ఆ మహా సామాజిక సంప్రదాయాలను ఎలా మరువగలం?

కానీయీనాడు జరుగుతున్నదేమిటి?

'నా చిన్ని బొజ్జకు శ్రీ రామరక్ష' అన్న సంకుచిత దృష్టితో మనం సాగిస్తున్నదేమిటి? ఈ ధోరణులకు మనం యికనైనా స్వస్తి చెపుదాం. ఏ మతమైనా, ఏ కులమైనా, ఏ ఇజమైనా అంతా మానవులమే. మనమంతా కలసి పురోగమించాల్సింది సర్వతోముఖాభివృద్ధివైపు, సమానత్వం దిశగా, నడుం కట్టాలి, మనమందరం ఒక్కటిగా, కులమత భేదాలు మరచి, ప్రాంతీయ విభేదాలు ప్రక్కకు నెట్టి మన రాష్ట్రాన్ని, మన దేశాన్ని సస్యశ్యామలంగా, సర్వాంగసుందరంగా, సంక్షేమ సమాజంగా తీర్చిదిద్దుకోవడానికి ముందుకు దూకాలి, మిన్నంటిన కడలి తరంగంలా. సమైక్యంగా సాగాలి, అందరం ఒకే మాట, ఒకే బాటగా, నేల నాలుగు చెరగులా సిరులు పొంగి పొర్లాలని, ప్రజలందరి బ్రతుకు బాటలలో వెలుగు వెన్నెలలు కురవాలని, అన్ని రంగాలలో ఆదర్శంగా మన సమాజాన్ని తీర్చి దిద్దుకోవాలని, చిత్తశుద్ధితో, కర్తవ్యదీక్షతో ముందడుగు వేద్దాం. విరామం ఎరుగని ఆచరణ–వెనకడుగు లేని నిరంతర పురోగమనానికి దారితీస్తుంది.

**ఈ ధోరణులకు మనం యికనైనా స్వస్తి చెపుదాం. ఏ మతమైనా, ఏ కులమైనా, ఏ ఇజమైనా అంతా మానవుమే. మనమంతా కలసి పురోగమించాల్సింది సర్వతోముఖాభివృద్ధివైపు, సమానత్వం దిశగా, నడుం కట్టాలి.**

ఈనాడు మన రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి పట్టిన గ్రహణం తొలగి నూతన కాంతులు వెల్లివిరిస్తున్నాయి. ఒక సరికొత్త చైతన్య సాహస యాత్ర ప్రారంభమయింది. ఈ ఉత్సాహాన్ని, ఈ ఉద్వేగాన్ని, ఈ ఊపును వూతగా తీసుకొని నిరంతర కృషితో ముందుకుసాగి బడుగు బ్రతుకులలో నూతన కాంతులు నింపడానికి మనం పూనుకోవలసి వుంది. సంప్రదాయానికి, ఆధునికతకు మేలు కలయికగా, సుసంపన్నమైన సంస్కృతీ విలువలకు, అభ్యుదయకరమైన దృక్పథాలకు, సమసమాజ భావాలకు చక్కని సమ్మేళనంగా మన జాతిని మనం తీర్చిదిద్దుకొందాం.

కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు ఈ దేశం అంతా ఒక్కటే. ఈ జాతి అంతా ఒక్కటే. మన పెద్దలు రక్తతర్పణం చేసి సాధించిన స్వాతంత్ర్యాన్ని సమగ్రాభివృద్ధితో సఫలం చేసుకొందాం. చేయి చేయి కలిపి పరిశ్రమిద్దాం, పరిక్రమిద్దాం.

అదిగో అమర కవి కంఠం ఆశ్వాసిస్తోంది:

**దేశమనియెడి దొడ్డ వృక్షం**
**ప్రేమలను పూలెత్తవలెనోయ్**
**నరుల చెమటను తడిసి మూలం**
**ధనం పంటలు పండవలెనోయ్**, అని.

అన్ని నదులు సాగర సంగమానికి దారి తీసినట్లు, ఏ రంగు ఆవులైనా తెల్లని పాలనే అందించినట్లు భాషలు వేరయినా, మతాలు వేరయినా, ప్రాంతాలు వేరయినా, అభిప్రాయాలు వేరయినా మనమంతా ఒక్కటే, మన బాట ఒక్కటే అని చెప్పడానికి ఈ సదస్సు దోహదం చేయగలదని ఆశిస్తున్నాను.

**జై తెలుగునాడు. జైహింద్!**



# దేశ సమగ్రతను పరిరక్షించుకుందాం

**(1984 నవంబరు 2వ తేదీన హైదరాబాదు లాల్ బహదుర్ స్టేడియంలో స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీకి నివాళులు అర్పిస్తూ చేసిన ప్రసంగం)**

శోక తప్తులై, దిగ్భ్రాంతులై విషాదఛాయలు ఆవరించగా నిస్తబ్ధులై, నిర్విణ్ణులైవున్న నా వారందరికీ నా అనుతాప ఆవేదనను వ్యక్తంచేస్తున్నాను.

ఆశయ సాధనకు హింసాత్మక విధానం సరైన మార్గం కాదన్నది మన ఆదర్శం, మన సంస్కృతి. బ్రిటీషు సామ్రాజ్యవాద విస్తరణకు ప్రతిగా ఆనాటికి ఈ దేశంలో వున్న అన్ని మతాలవారు, అన్ని ప్రాంతాల వారు సమైక్యంగా భిన్నత్వంలో ఏకత్వ సాధనతో గర్జించారు –

“తెల్లవాడా! మా దేశాన్ని వదిలిపో” అని ఏక కంఠంతో – పూజ్య బాపూజీ నేతృత్వంలో శాంతి అహింసలతో స్వాతంత్ర్యం సముపార్జించుకున్నాం, సామ్రాజ్యవాద సిద్ధాంతాన్ని సముద్ర తీరాలు దాటించి,

అటువంటి పవిత్రమైన మానవతా వాదానికి, సమైక్యతా వాదానికి అంకితమై ప్రగతి సాధనకు పూనుకొన్నాం, ప్రజాస్వామిక పథాన్ని అనుసరించి.

అట్టి ఆదర్శ వ్యవస్థను ఐచ్ఛికంగా వరించిన భారతజాతి అంగీకరించజాలదు–ఈనాటి హింసాత్మక విధానాన్ని సహించదు, స్వార్థపర సంకుచిత దౌర్జన్య వాద దుందుడుకు శక్తులదారుణ అతివాద విధానాలను, వారు చేసిన ఘోర హత్యాకాండను.

శాంతి మార్గాన్ని చాటిన మహాత్ముడేనాడు మత దురహంకారశక్తుల మౌఢ్యానికి, దురాగ్రహానికి, దుర్మార్గానికి బలియైనాడని ఆశిస్తూ ఆవేదన చెందుతున్న మనకు యీనాడు మన ప్రియతమ నాయకురాలు శ్రీమతి ఇందిరాగాంధీ గారి దారుణ హత్య అశనిపాతంలా తగిలింది. నిశ్చేష్టులను చేసింది. ఘోరాతిఘోరమైన యీ దురదృష్టకర సంఘటనను, అమానుష చర్యను సంస్కారయుతులైన రాజకీయ వాదులెవ్వరూ ఆమోదించ జాలరని స్పష్టం చేస్తున్నాను. ఆరుకోట్ల తెలుగువారి తరపున, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున, తెలుగుదేశం పార్టీ తరపున, నా తరపున యీ పాశవిక చర్యను నిరసిస్తున్నాను. ఈ హింసోన్మాద ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నాను.

**ఈ హింసోన్మాద ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రజాస్వామ్య వ్యవస్థలో సిద్ధాంతపరమైన అభిప్రాయ భేదాలు సహజం. మన ఆలోచనలు వేరు కావచ్చు. మన పార్టీలు భిన్నం కావచ్చు. అయినా యిట్టి ముష్కర చర్యను అందరం కలిసి గర్హిస్తున్నాం.**

ప్రజాస్వామ్య వ్యవస్థలో సిద్ధాంతపరమైన అభిప్రాయభేదాలు సహజం. మన ఆలోచనలు వేరు కావచ్చు. మన పార్టీలు భిన్నం కావచ్చు. అయినా యిట్టి ముష్కర చర్యను అందరం కలిసి గర్హిస్తున్నాం. సమైక్యంగా నిలిచి యిట్టి అరాచక శక్తుల ఆటలను కట్టించి, వ్యక్తి స్వాతంత్ర్యాన్ని, దేశ సమగ్రతను పరిరక్షించుకుంటాం. మనందరిది యీ విషయంలో ఒకే మాట ఒకే బాట.

మరువదు జాతి ఎన్నటికీ ఆ మహామనీషి శ్రీమతి ఇందిరా గాంధీ గారు మన దేశానికి చేసిన మహోన్నత సేవలను. విదేశాంగ నీతిలో అభినవ రాజకీయ విధానాన్ని అవలంభిస్తూ, దేశాభ్యుదయానికి ప్రణాళికా పథంలో సమాజాన్ని ముందుకు నడిపిస్తూ, మతాతీత లౌకిక ఆదర్శం దిశగా మన వ్యవస్థను తీర్చిదిద్దుతూ గత ఒకటిన్నర దశాబ్దాలకు పైగా మన దేశానికి నాయకత్వం వహిస్తూ వారు చేసిన అమూల్య కృషి అందరి హృదయాలలో ఒక పవిత్ర స్మృతిగా మెదులుతుంటుంది శాశ్వతంగా.

ముఖ్యంగా అంతర్జాతీయ రంగంలో శాంతి పరిరక్షణకు, సౌభ్రాతృత్వ భావనా వ్యాప్తికి ఎంతో దక్షతతో, దీక్షతో వారు కృషి సాగించి మన దేశ ప్రతిష్ఠను యినుమడింపజేసిన విషయం మరపురాదు మనకెవ్వరికీ ఎన్నటికీ.

ధైర్యసాహసాలకు మారు పేరుగా, జాతీయసమైక్యతా విధానాలకు ప్రతీకగా అందరి మన్ననలు అందుకొన్న అపూర్వ వ్యక్తి సంకుచిత శక్తుల పశుత్వానికి బలికావడం మానవజాతి కంతటికీ సిగ్గుచేటు. ఇది జాతికి కలిగిన తీరని కళంకం. దేశానికి కలిగిన అపారనష్టం.

ఈ దురదృష్టకరమైన పరిస్థితులలో నిబ్బరంగా నిలిచి, నిగ్రహంతో వ్యవహరించవలసిన అవసరం వుంది. మన పరస్పర విభేదాలను ప్రక్కకు నెట్టి అందరం కలిసి దేశ భవిష్యత్తును కాపాడుకోవలసిన బాధ్యత వుంది. ఏ హింసాత్మక విధానాన్ని మనం యీనాడు ముక్తకంఠంతో గర్హిస్తున్నామో, ఖండిస్తున్నామో, నిరసిస్తున్నామో ఆ హింసాత్మక పద్ధతులకే ఆవేశకావేషాలకు లోనుగాకుండా, ప్రతీకార వాంఛకు పాల్పడకుండా విజ్ఞతతో ప్రవర్తించవలసిన అవసరం ఎంతైనా వుంది.

శాంతి, సహనం, అహింస, ఔదార్యం, సుహృద్భావం, సౌభ్రాతృత్వం – యివి మనకు ఆదర్శం కావాలి. ఇవే మన నైతిక విలువలను తిరిగి నేడు కాపాడాలి. ఈ మార్గమే యీనాడు దుఃఖాంధకారంలో వున్న మన జాతి ప్రగతికి వెలుగుబాట చూపాలి.

సామరస్యంతో కలిసి సమైక్యతతో నిలిచి యీ విషాద వారధిని అధిగమించి తిరిగి శాంతిని నెలకొల్పుకుని, సమ సంక్షేమ సమాజం దిశగా జాతి తన ప్రస్థానాన్ని కొనసాగించేందుకు తగిన శక్తిని భగవంతుడు మనకు ప్రసాదించాలి.

ఈనాడు విషణ్ణతతో వెలవెలబోతున్న జాతి తిరిగి ఆత్మశక్తిని మనోస్థైర్యాన్ని పుంజుకోవాలని, ప్రాంతీయ మత వర్గ భేదాలకు అతీతమైన, సౌభాగ్య విలసితమైన సుస్థిర ప్రజాస్వామ్య వ్యవస్థ స్థాపనకు జాతి పునరంకితం కావాలని కోరుకొంటున్నాను.

**జై తెలుగునాడు. జైహింద్!**



# రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి మన విద్యుక్త ధర్మం

**(1985 జనవరి 1న హైదరాబాదు జూబ్లీహాలులో ఆంధ్రప్రదేశ్ నుండి కొత్తగా లోక్‌సభకు ఎన్నికైన ప్రజాప్రతినిధుల సమావేశంలో ప్రసంగం)**

ప్రజాప్రతినిధుల సభకు యిటీవల జరిగిన చారిత్రాత్మక ఎన్నికలలో లోక్‌సభ సభ్యులుగా అఖిలాంధ్రప్రదేశ్ ప్రజానీకంచే ఎన్నుకోబడ్డ మిమ్మల్నందరనూ నేను హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్ ప్రజలు తెలుగుదేశం పార్టీకి, తెలుగుదేశం మిత్ర పక్షాలకు అఖండ విజయం చేకూర్చారు. ఈ ఘన విజయం ప్రజలది. ప్రజా నిర్ణయం మన అందరిపై మరింత గురుతర బాధ్యతను మోపుతున్నది. ప్రజల ఆశలను, ఆశయాలను, ఆకాంక్షలను సఫలం చేసేందుకు, వారికి నూతన జీవితం ప్రసాదించేందుకు –ముఖ్యంగా తరతరాలుగా దారిద్ర్య రేఖకు దిగువన మ్రగ్గుతూ "మాకు మోక్షం ఎప్పుడు? మాకు సామాజిక న్యాయం ఎక్కడ?"–అని అలమటించే కోట్లాది క్షుధార్తుల బాధార్తుల బడుగు బ్రతుకులలో కాంతులు నింపి తుష్టిగా, పుష్టిగా తీర్చి దిద్దేందుకు మరింత పూనికతో, దీక్షతో నిర్విరామంగా కృషి చేయవలసిందిగా ప్రజలు మనకిచ్చిన నూతన ఆదేశమే యీ ఎన్నికల ఫలితాలు.

చైతన్య రథంపై ఎన్నికల ప్రచార యాత్ర సాగిస్తున్నపుడు నాకు కలిగిన అద్భుతానుభవాలు నా మదిలో నిలిచిపోతాయి–శాశ్వతంగా, మధురాతిమధురంగా.

"అన్నా"! అని ఆప్యాయతతో పలకరించి, అనురాగంతో తిలకందిద్ది, ఆదరంతో హారతులద్ది, "విజయీభవ", అని నన్ను ఆశీర్వదిస్తూ నాకు తోబుట్టువులు లేని కొరత తీర్చారు నా తెలుగింటి ఆడపడుచులు. ఈ జన్మకు యింత మంది అక్కచెల్లెళ్ళను ప్రసాదించాడు ఆ భగవంతుడు. నేనెంతో ధన్యజీవిని.

ఉత్సాహంతో ఉరకలు వేస్తూ, మిన్నంటిన కడలి తరంగంలా నా గుండె నిండా ఆవేశం నింపారు నా తమ్ముళ్ళు. నా విజయ కేతనం వినువీధిలో నిలిపిన యువశక్తిని మరవలేను.

సాంఘిక దురన్యాయాలకు బలియై, సామాజిక సహకారానికి వెలియై, కూటికి, గుడ్డకు కరువై, నిరాశానిస్పృహల మధ్య నలిగిపోతూ భారంగా బ్రతుకులీడ్చుకుంటూ 'మమ్మాదుకునే నాథుడెక్కడ?' అని ఆశాపూరిత నయనాలతో నన్నాశ్వాసించిన కష్టజీవులను, శ్రమజీవులను, బడుగుజీవులను విస్మరించను ఎన్నటికీ.

**సమతాభావంతో, సామాజిక న్యాయంతో, సంపత్తితో, సమృద్ధితో, సుఖ, శాంతి సౌభాగ్యాలతో అందరూ హాయిగా జీవించే రామరాజ్యంపై కలలు కంటున్న వారి కన్నుల కాంతులు మనలను కర్తవ్యపరులను చేయాలి.**

సమతాభావంతో, సామాజిక న్యాయంతో, సంపత్తితో, సమృద్ధితో, సుఖ, శాంతి సౌభాగ్యాలతో అందరూ హాయిగా జీవించే రామరాజ్యంపై కలలుకంటున్న వారి కన్నుల కాంతులు మనలను కర్తవ్యపరులను చేయాలి. కార్యదీక్షతో ముందడుగు వేయించాలి.

పవిత్రమైన పార్లమెంటు భవనానికి దూరంగా వున్నా, ఎప్పటికప్పుడు తమకేదో జరుగుతుందని ఆశించే రాష్ట్రీయ వాసులను, ప్రజా సందోహాన్ని వారి సమస్యలను పట్టించుకొనక కేవలం స్వార్థపరత్వంతో, పదవీ లాలసతతో, అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తూ, అధికార దుర్వినియోగం చేసిన వారిని సామాన్య మానవుడు ఏ మాత్రం యిక క్షమించడని యీ ఎన్నికలవల్ల ఋజువయింది.

ఆ ప్రజలే యీనాడు మిమ్మల్ని యీ మహోన్నత పదవికి, పవిత్ర స్థానానికి తమ ప్రతినిధులుగా ఎన్నుకొని లోక్‌సభకు పంపటం మీ యందు వారుంచిన విశ్వాసానికి మీలో వారికి గల నమ్మకానికి పవిత్ర నిదర్శనం, ప్రత్యక్ష సాక్ష్యం.

నియంతృత్వ, నిరంకుశ గుత్తాధికారాన్ని ఏ ప్రజాస్వామ్యం అంగీకరించదు. రాష్ట్ర స్వయం ప్రతిపత్తి కోసం, రాష్ట్ర స్వయం నిర్ణయాధికారం కోసం, రాష్ట్ర సమగ్ర సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేసే విధానంలో యింకా ఎక్కువ వనరులు, యింకా ఎక్కువ అవకాశాలు రాష్ట్రాలకు కల్గించాలన్నది యీనాడు అందరి మనసుల్లో వున్న భావం, మన రాష్ట్రానికి సంబంధించిన ఎన్నో అతి ముఖ్యమైన సమస్యలు

అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. అందుకు కారణం గతం. భవిష్యత్తు వీటిని రాష్ట్రాభివృద్ధికి పూలబాట వేయాలి. పేదరికాన్ని నిర్మూలించాలి. కష్టజీవుల కన్నీళ్లు తుడవాలి. రాష్ట్రం నవజీవంతో, నూతని చైతన్యంతో, ఆనందంతో ఉరకలు వేస్తూ ముందుకు సాగాలి.

రాష్ట్రాలు బలంగా వుంటేనే కేంద్రం బలంగా వుంటుంది. జవసత్వాలు వుడిగిన అవయవాలతో శరీరం పటుత్వంగా వుండబోదు. ఇదే తెలుగుదేశం పార్టీ, తెలుగుదేశం ప్రభుత్వం విశ్వాసం, విధానం. మనం తొలుత భారతీయులం. ఆ తరువాతే యీ రాష్ట్రవాసులం.

ప్రాంతీయ పక్షంగా ప్రారంభమైనా, జాతీయ స్థాయిలో ప్రధాన ప్రతిపక్షంగా మిగిలింది తెలుగుదేశం. దేశీయ సమగ్రత, జాతీయ సమైక్యత, రాష్ట్ర సమన్వయం, సమున్నతి మన ధ్యేయం.

**“ఏ దేశమేగినా.**
**ఎందు కాలిడినా,**
**ఏ పీఠమెక్కినా**
**ఎవ్వరేమనినా**
**పొగడరా నీ తల్లి భూమి భారతిని**
**నిలుపరా నీ జాతి నిండు గౌరవము”**

సరయిన అవగాహనతో, యికనైనా అందరం కలసికట్టుగా దేశ భవిష్యత్తుకు, ప్రగతికి పాటుపడదాం. అదే నేడు ప్రజలిచ్చిన ఆదేశం. మురికి రాజకీయాలకు, ముఠా రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలు చెప్పిన తీర్పు అది.

వంచనే వన్నెగా, వెన్నుపోటే తమ బాటగా, పతనమే ప్రతిభగా ఎంచుకొంటూ, దిగజారిపోయిన నైతిక విలువలతో, ‘పెచ్చురేగిన స్వార్థపరత్వంతో భ్రష్టు పట్టిన కుటిల రాజకీయాలపై చావుదెబ్బ కొట్టారు. యీ

ఎన్నికలలో ప్రజలు: తమ నిర్ణయం ప్రకటించారు, నిర్ద్వందంగా.

అంతేకాదు, పనిచేసే వారికి, ప్రగతి కోరే వారికి ఈ వోటే ప్రజలు వేసిన పూలమాల. ప్రజలందరి కనీస అవసరాలు తీరేందుకు–ముఖ్యంగా, సాంఘిక, ఆర్థిక అసమానతలతో వేధించబడే హరిజన, గిరిజన, వెనుకబడిన వర్గాల వారికి, అల్పసంఖ్యాక వర్గాల వారికి – సాంఘిక దురన్యాయాలతో అవమానాలతో బాధింపబడే ఆడపడుచులకు –

రెక్కాడినా, డొక్కాడని కోట్లాది పీడిత, బాధిత పేద జనాళికి న్యాయం చేకూర్చేందుకు మన రాష్ట్రంలో జరిగిన, జరుగుతున్న కృషికి యిది గుర్తింపు.

ప్రజలచే ఎన్నుకోబడ్డారు మీరు. ప్రజాసంక్షేమంకై కృషి చేయటం యిక మీ పవిత్ర కర్తవ్యం, ప్రధాన

బాధ్యత. మనందరి విధ్యుక్త ధర్మం. ప్రధానంగా మన రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, ప్రజాక్షేమానికి అంకితం కావటం. అయితే యీ కృషి సమైక్య, సుసంపన్న, పటిష్ట భారతదేశాన్ని నిర్మించుకొనే బృహత్తర ప్రయత్నంలో అంతర్భాగంగా కొనసాగాలి.

మీ ఆలోచనలతో, అవగాహనతో, ప్రతిభా విశేషాలతో, మేధాసంపత్తితో, స్ఫూర్తితో మీరు పార్లమెంటులో ప్రసంగించే విధానం, నిర్వచనం అన్నీ ప్రభావితం కావాలి. ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా వున్న మన సమస్యలకు ఒక పరిష్కారం యివ్వాలి. ఇది నా విశ్వాసం, ఆశ, ఆకాంక్ష. దానిలోనే వుంది – ప్రజా విజయం. దానిలోనే వుంది – దేశ శ్రేయస్సు. దానిలోనే వుంది – మీ ప్రయత్న సాఫల్యం.

లోక్ సభలో ప్రస్తావించదగిన ప్రధాన అంశాలలో కొన్నిటిని మాత్రమే యీనాడు మీ ముందుంచటం జరిగింది. ఈ జాబితా సమగ్రం కాదు. ఈ విధంగా ఎప్పటికప్పుడు వివిధ సమస్యలను వివరంగా మీ దృష్టికి తేవాలన్న మా ప్రయత్నానికి యిది అంకురార్పణ మాత్రమే.

ప్రజాప్రతినిధులుగా మీరు మీ కర్తవ్యాన్ని నిర్వహించటంలో మీకు అవసరమైన సమాచారాన్ని అందించి, సహకరించటం కోసం న్యూఢిల్లీలోని మన ప్రభుత్వ ప్రత్యేక కమీషనరు అధ్వర్యంలో పార్లమెంటరీ లైజాన్ కార్యాలయం ఒక దానిని ఏర్పాటు చేస్తున్నాను. ఇది మీ కృషిలో అవసరమైన సహాయాన్ని మీ అందరకూ అందజేస్తుంది. అదనంగా యింకా ఏ ఏ సదుపాయాలు అవసరమయినా వాటిని గురించి పరిశీలించడానికి నేనెప్పుడూ సంసిద్ధుడనే అని మనవి చేస్తున్నాను.

**ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా వున్న మన సమస్యలకు ఒక పరిష్కారం యివ్వాలి. ఇది నా విశ్వాసం, ఆశ, ఆకాంక్ష. దానిలోనే వుంది – ప్రజా విజయం. దానిలోనే వుంది – దేశ శ్రేయస్సు. దానిలోనే వుంది – మీ ప్రయత్న సాఫల్యం.**

ప్రజలు ఎన్నుకొన్న ప్రతినిధులుగా, వారి విశ్వాసం చూరగొన్న వ్యక్తులుగా మీరు మీ సర్వశక్తులు వినియోగించి ప్రజా సంక్షేమంకై సర్వదా పాటుపడగలరనటంలో నాకెట్టి సందేహం లేదు.

మన రాష్ట్ర గౌరవ ప్రతిష్ఠలు జాతీయ స్థాయిలో జగజ్జేయమానంగా జ్వలింప చేయడానికి కృషి చేయగలరని, దిగ్విజయం చేకూర్చగలరని నా ప్రగాఢ విశ్వాసం.

నా ఆశను మీలో నింపుకొన్నాను. ఫలింప చేయటం మీ బాధ్యత.

**జై తెలుగునాడు. జైహింద్!**



# ప్రజాహిత కార్యక్రమాలకు అండగా నిలవండి

**(1985 జనవరి 15న కొత్త ఢిల్లీలో పార్లమెంటు సభ్యులు, పత్రికా ప్రతినిధుల సమావేశంలో చేసిన ప్రసంగం)**

1984 డిసెంబరు 27 శుభదినం. పర్వదినం. 1983 జనవరి 5వ తేదీన ప్రారంభమైన ప్రజా ఉద్వేగం, ఉత్సాహం-తెలుగుదేశం వాడిలో మెరసి నింగి కెగసిన విజయ ధ్వానం-మరోసారి మ్రోగింది లోక్‌సభ ఎన్నికలలో ప్రజలిచ్చిన తీర్పులో.

అనుకోలేదు. ఆంధ్రప్రదేశ్‌లో తలయెత్తి నిలచిన యీ నవ వ్యవస్థ యీనాటి ప్రజా నిర్ణయంతో జాతీయ స్థాయిలో ప్రధాన ప్రతిపక్షంగా పార్లమెంటులో నిలబడే బాధ్యత "పెనవేసుకోవలసి వస్తుందని, ఈ బాధ్యత గురుతరమైనా, భారతీయులముగా దేశ సేవ చేయడానికి మాకు లభించిన సదవకాశంగా భావిస్తున్నాం, నమ్రతతో స్వీకరిస్తున్నాం.

జాతి సముద్ధరణకు, జటిల సమస్యల పరిష్కారానికి, అన్ని రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధి, సరయిన, సమమయిన, ఆర్థికపరమైన న్యాయం, అభివృద్ధి కార్యక్రమం తోడ్పాటు, ప్రోత్సాహం, సానుభూతి, సహకారం, సమంగా అందరికి అందజేయాలన్న లక్ష్యంతో మీ కృషి నిరంతరం సాగాలి.

ప్రకాశవంతమైన, పరిపుష్టివంతమైన, సంక్షేమశీలమైన సమాజం ఆవిర్భావానికి నాంది పలకాలి.

నిర్వేదన, నిరుత్సాహం, నిస్పృహలను ఆవలకు పెట్టి నిరుద్యోగ రక్కసిని దూరాన బెట్టి నవ చైతన్యంతో, ఆదర్శవంతమైన వృత్తి విద్యా విధానంలో, కట్టలు తెంచుకొని ప్రవహించి సెలయేరులా మన దేశాన్ని కొత్త

వరవడితో, పునీతం చేసే ప్రత్యేక శక్తిగా విద్యార్థినీ విద్యార్థులు, యువత రూపందుకొనేట్లు మలచాలి.

ఎవరికి ఏ అన్యాయం జరగని, ఏ మాత్రం లోటుండని సమసమాజాభివృద్ధికి మానవత్వపు మనుగడకు మీ కృషి దోహదం చేయాలి.

పాతలో వున్న చెడును తీసివేసి, మీతో వచ్చిన కొత్త మంచిని నింపి, అతి పటిష్టమైన వినూత్న ప్రజాస్వామిక వ్యవస్థకు మీరు ప్రతీకలై నిలవాలి.

డెబ్బయి కోట్ల ప్రజానీకం చూస్తున్నది మీ వైపు-ఆశతో, ఆపేక్షతో.

మన రాష్ట్రంలో గత రెండేళ్ళ తెలుగుదేశం ప్రభుత్వ పరిపాలనలో సాగిన సంక్షేమ కార్యక్రమాల వరవడిలో నూతన సామాజికాభ్యుదయ విధానం దేశవ్యాప్తంగా అమలుకు వస్తుందని ఆశిస్తున్నాను. నిరుపేదలు, నిర్భాగ్యులు, సామాజికపరమైన న్యాయానికి నోచుకోని దురదృష్టవంతులు. వారి ఆశలు, ఆకాంక్షలు సఫలం చేయటానికి మీ కృషి దోహదం చేయాలి. జాతీయ జీవన స్రవంతిలో తమ పాత్ర తాము సంతుష్టితో, పుష్టితో నిర్వహించేందుకు, స్వాతంత్ర్యం, అభివృద్ధి అందించే ఫలాలను అందరితో సమంగా తామూ అనుభవించగలందుకు వారికి మనం చేయూత అందించాలి.

ఆది నుంచీ తెలుగుదేశం కృషికి అద్దం పడుతూ, ఆశీర్వదిస్తూ తమ అండదండల నందిస్తూ వస్తున్న పత్రికా లోకం, నేడు కూడా తెలుగుదేశం పార్లమెంటు సభ్యుల కృషికి తమ సహాయ సహకారాలనందించి ప్రోత్సహించాలని కోరుతున్నాను.

విస్మరించలేను ఏనాడూ-మీరు నాకందించిన తోడ్పాటు. 1984 ఆగష్టు నెలలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని సజీవ సమాధి చేయాలని స్వార్థపరశక్తులు ప్రయత్నం చేసినపుడు, పత్రికలే కాదని నిల వేశాయి. ఎదురొడ్డి నిలచాయి. ప్రజాస్వామ్యం పునః ప్రతిష్ఠితం అయ్యేవరకు ఆగని సమరం నడిపాయి.

అదే బాధ్యతతో, ఈనాడు కూడా, తెలుగుదేశం పార్లమెంట్ సభ్యులు నిర్వహించే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసికొని వెళ్లే సహకారాన్ని అందించాలని మిమ్మలందరనూ కోరుతున్నాను.

ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులుగా, ప్రధాన భారత శాసన నిర్మాణ వేదికలో బాధ్యతగల ప్రధాన ప్రతిపక్ష సభ్యులుగా ప్రజాహిత కార్యకమాలకు, ప్రగతి పథకాలకు మీరు అద్దం పట్టాలి, ఆశీర్వదించాలి, అండగా నిలవాలి.

నిజానికి మా పార్టీపై ప్రజలు మోపిన బాధ్యత ఎంతో గురుతరమైనది. గతాన్ని అవలోకిస్తే పరిస్థితి ఎంత జటిలంగా వుందో అర్థమవుతుంది.

మూడు దశాబ్దాలకు పైగా ఏక పక్షంగా సాగిన పరిపాలనా విధానం రాష్ట్రాల పరిపుష్టిని, సంతుష్టిని సాధించ లేకపోయింది, కేవలం ఎప్పటికప్పుడు తమకనుగుణ్యంగా రాజ్యాంగాన్ని మార్చుకొంటూ, రాష్ట్రాల

అధికారాలను కుంచిస్తూ, కుదిస్తూ, "అంతా తనకే దక్కాలి", "అన్నిటికి తన మీదే ఆధారపడాలి" అని వ్యవహరించే సంకుచిత స్వార్థ నియంతృత్వ వ్యవస్థగా యూనియన్ ప్రభుత్వం తయారయింది. గుత్తాధికారం చేతిలో పెట్టుకొని, నిరంకుశత్వానికి దారి తీసింది. అందుకే అసంతృప్తి అన్ని రాష్ట్రాలలో వుంటే, అందుకే కోరుకుంటున్నాయి ప్రజాస్వామ్య శక్తులు ఈ కేంద్ర-రాష్ట్ర సమన్వయం పునఃపరిశీలించబడాలని.

చెట్టు మొదలుకొని కాలవ వరకూ పరిశ్రమ మొదలుకొని పంట ధరల నిర్ణయం వరకూ అంతా తన హక్కే అయినట్లుగా కేంద్రం శాసిస్తోంది. దీని ఫలితం ఏమిటి? పరిశ్రమలు వెనకబడటం, అహర్నిశలు రెక్కలు ముక్కలు చేసికొని మట్టి నుండి మాణిక్యం పండించి దేశానికి యింత తిండి పెట్టే అన్నదాత రైతన్న సంక్షేమం జరగక పోవటం, మామూలు మనిషికి కావలసిన సామాన్యావసరాలు- తిండి, గుడ్డ, గూడు తీరకపోవడం. ఇవి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు సాగించే కృషికి ఎన్ని అవరోధాలు? ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో 'పేద వారికి కిలో బియ్యం రెండు రూపాయలకిస్తుంటే ఎన్నో అడ్డంకులు, నిబంధనలు, నియమాలు, అదే విధంగా గుడ్డకు. దాదాపు కోటి పేద కుటుంబాలకు కేవలం ఒక చీర, ధోవతి సగం ధరకు యివ్వడానికి కూడా ఎన్నో ప్రతిబంధకాలు - అవి చాలక దుష్ప్రచారాలు, అలాగే ఎండిపోయి మోడుబారి బీటలు వేసిన రాయలసీమ, తెలంగాణా ఎగువ ప్రాంతాలకు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఆదిగాగల ఉత్తరకోస్తా మెరక ప్రాంతాలకు మంచి నీరందించడానికి, పునాదిగా పోలవరం ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది.

**ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో 'పేద వారికి కిలో బియ్యం రెండు రూపాయల కిస్తుంటే ఎన్నో అడ్డంకులు, నిబంధనలు, నియమాలు, అదే విధంగా గుడ్డకు. దాదాపు కోటి పేద కుటుంబాలకు కేవలం ఒక చీర, ధోవతి సగం ధరకు యివ్వడానికి కూడా ఎన్నో ప్రతిబంధకాలు.**

ఎప్పుడో ఎన్నడో ఇంత వరకు రూపందుకోలేదంటే, యీ జాప్యం ఎందుకు? ఆహారం ఒక రాష్ట్ర సమస్య కాదు, దేశీయ సమస్య. సమృద్ధిగా పండించి మిగిలింది యితర రాష్ట్ర వాసులకు పంచిపెడుతున్నాం. అయినపుడు యీ ప్రాజెక్టను జాతీయ ప్రాజెక్టుగా ఎందుకు నిర్మించకూడదు.? ముఖ్యంగా విశాఖ ఉక్కుకు కావలసిన నీటిని అందించే యీ ప్రాజెక్టు యిన్నేళ్లు ఎందుకు ఆగింది? అడవుల పేరు మీద ఎన్ని ప్రాజెక్టులు అపబడ్డాయి? ఇదంతా దేశ అభ్యుదయానికి ఏ విధంగా దారి తీస్తుంది? అలాగే, ప్రకృతి సిద్ధమైన వనరులన్నీ ఉపయోగించుకొని పారిశ్రామికంగా అభివృద్ధినొంది రాష్ట్రాలు పరిశ్రమల రొదలతో, స్వయం సమృద్ధితో, సంపత్తితో, పరిఢవిల్లాలంటే ఎందుకు యీ అడ్డంకులు, ఈ అంక్షల ఫలితంగానే ఆగిపోయింది, మంగళగిరి టైర్ల ఫ్యాక్టరీ, ఇలాంటివే యింకా ఎన్నో పరిశ్రమలు ఊహలోనే మిగిలిపోయాయి, నాటికి, నేటికీ రూపందుకోలేకపోతున్నాయి.

అన్ని సౌకర్యాలు కలిగిన విశాఖ ఓడరేవు-ఎన్నిసార్లు అర్థించినా 'ఫ్రీ పోర్టు' గా యింతవరకు ఎందుకు చేయబడలేదు? గల్ఫ్ దేశాలతో వాణిజ్య సంబంధాలు మరింతగా పెంచుకోడానికి, ఎక్కువ

కాలం నిలవ వుండని కూరగాయల వంటి సరుకుల ఎగుమతికి సౌలభ్యం కలిగించడానికి, ప్రయాణీకుల యిబ్బందులు తొలగించడానికి వీలుగా హైదరాబాదు విమానాశ్రయానికి అంతర్జాతీయ విమానాశ్రయస్థాయి కల్పించవలసిందన్న మన అభ్యర్థనలు ఎన్ని, ఎన్నిసార్లు ఏమయి పోయాయి? ఇవన్నీ వెలికి చెప్పాలని కాదు, కాని కడుపులో వున్న బాధ చెప్పగానే గుర్తించినపుడు తృప్తి కలుగుతుంది. లేనినాడు అసంతృప్తి మిగులుతుంది.

రాష్ట్రాల ఉనికికి ప్రమాదం రాకముందే యీ పరిస్థితులు మారాలి. మన ప్రధాన కర్తవ్యం నేడిదే. ప్రజల ఆదేశం యిదే. ఈ నాడు మనకున్నటువంటి సమస్యలే అన్ని రాష్ట్రాలకూ వున్నాయి. అందుకే తెలుగుదేశం సభ్యులు పార్లమెంటులో తమ కర్తవ్య పాలనలో భాగంగా తమ నియోజకవర్గ సమస్యలు, రాష్ట్ర సమస్యలతో పాటు వివిధ రాష్ట్రాల సమస్యలనూ, జాతీయ, అంతర్జాతీయ సమస్యలను అధ్యయనం చేస్తారు. ఒక్కొక్క సభ్యుడు ప్రత్యేకించి ఒక్కొక్క రాష్ట్ర సమస్యపై తన దృష్టిని కేంద్రీకరించి, భారత జాతీయ పౌరుడుగా ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు.


ఈ జాతీయ దృక్పథంలో, సేవా నిరతితో మీరు కృతకృత్యులు కావాలని, భరతమాత సేవ చేసి, ధన్యజీవులు కావాలని, వ్యాపారాత్మకంగా సాగుతున్న యీనాటి రాజకీయాలను తుడిచిపెట్టి పరిశుద్ధమైన పరిపాలన ప్రజల కందే విధానానికి పాటుపడాలని, గాఢాంధకారంలో ఆవేదనతో, ఆవేశంతో, నిరాశతో, నిస్పృహతో, నిర్వేదంతో మగ్గుతున్న బడుగు జీవులకు, బలహీన వర్గాలకు, బాధిత ప్రజాళికి మీరు ఆశాజ్యోతులుగా వెలగాలని.

మీ అవిరళ సేవతో, మీ విజ్ఞాన వెల్లువతో, సదవగాహనతో, ఉద్వేగమైన ఆలోచనలతో, మేధోస్ఫూర్తితో భారతదేశ సమృద్ధి, భారతదేశ ఆర్థిక, వ్యవసాయిక, పారిశ్రామిక ప్రగతి పెంపొంది భారతజాతి ఆత్మాభిమానం. గౌరవ ప్రతిష్టలు, నీతి ధర్మాలు నిలబడి, మంగళప్రదమైన భవిష్యద్భారత భాగ్యోదయానికి నవ గీతికలు పాడే వైతాళికులు కావాలని – నేను మనఃపూర్వకంగా కోరుకొంటున్నారు.

ఇదే మీరు గౌరవిస్తున్న మీ అన్నగా మీ నుంచి నేనాశించేది.

**విజయీభవః దిగ్విజయీభవః**

# అఖిలాంధ్ర ప్రజా జీవితంలో ఈ సంక్రాంతి సరి కొత్త కాంతులు నింపాలని కోరుతూ ప్రభుత్వం పేద ప్రజలకందించే శుభకామన!




తినడానికి తిండి, కట్టుకోడానికి బట్ట, ఉండడానికి ఇల్లు-
ఇవే ప్రతిమనిషి జీవితానికి కావలసిన కనీస అవసరాలు

కట్టిస్తున్నది ప్రభుత్వం పేదలకోసం
పక్కా ఇళ్ళు!
అందిస్తున్నది పేద వారికి 2 రూ. లకే
కిలో బియ్యం!
అమలు పరుస్తున్నది మరో పథకం –


## సగం ధరకే చీరలు ధోవతులు పేదవర్గాలకు పంపిణీ...


| | | అసలు ధర | సబ్సిడీ ధర |
|---|---|---|---|
| • జనతా సాదా చీర | (6 గ") | రూ. ~~32.00~~ | రూ. 16.00 |
| • జనతా ప్రింటెడ్ చీర | (6 గ") | | |
| • జనతా నేత డిజైన్ చీర | (6 గ") | రూ. ~~44.00~~ | రూ. 22.00 |
| • సాదారకం చీర | (6 గ") | | |
| • జనతా ధోవతి | (4 గ") | రూ. ~~19.00~~ | రూ. 9.00 |
| • సాదారకం ధోవతి | (4 గ") | రూ. ~~24.00~~ | రూ. 12.00 |

- ఆకుపచ్చ రేషను కార్డులున్న వారికే యీ పథకం వర్తిస్తుంది.
- ఈ పథకం 1985 జనవరి 26 నుంచి ప్రారంభమై 1985 మార్చి 31 వరకు అమలులో ఉంటుంది.
- రాష్ట్రంలో వున్న 528 ఆప్కో అమ్మకం కేంద్రాల ద్వారానే గాక తాలూకాలలో అన్ని ముఖ్యకేంద్రాలలో కూడా సంచార శకటాల ద్వారా యీ వస్త్రాల అమ్మకానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.




ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
ఈ ప్రభుత్వం ప్రజలకే అంకితం


కండలు కరిగించినా కాలేకడుపులతో మాడుతున్న కార్మిక జన సంక్షేమానికి
అహర్నిశలు చెమటోడ్చినా కడుపు నిండని శ్రామిక జనశ్రేయస్సుకు
ప్రభుత్వం ప్రారంభించిన సరికొత్త పథకాలు
* తొక్కే వానికే రిక్షా పథకం !
*వృద్ధ వ్యవసాయ కార్మికులకు పించను విధానం !
రిక్షా కార్మికుడే రిక్షాదారుడు కావడానికి...
• రిక్షా ఖరీదులో 20 శాతం సబ్సిడీ
• మిగిలినది బ్యాంకులు, ఇతర సహాయ సంస్థలనుంచి ఋణ సౌకర్యం
• దీని కోసం 1 కోటి రూ. లు మంజూరు
60 ఏళ్ళు దాటిన భూవసతి లేని నిరాధార వ్యవసాయ శ్రామికులను ఆదుకోడానికి...
• నెలకు రూ. 30 ల చొప్పున పించను
• దీని కోసం ఈ ఏడాది రూ. 6 కోట్లు మంజూరు
• 5 లక్షల మందికి యీ పథకం ద్వారా ప్రయోజనం
ప్రజా సంక్షేమమే ప్రభుత్వధ్యేయం
ఈ ప్రభుత్వం ప్రజలకే అంకితం


గతం పేరబెట్టిన సమస్యలకు సత్వర పరిష్కారం
వెనుకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి సోపానం
ఆలోచించండి ! వాస్తవాలను తెలుసుకోండి !!
"నా బొందిలో ప్రాణం
వుండగా ఏ ప్రాంతానికీ
అన్యాయం జరగనివ్వను"
— యన్.టి.రామారావు
ముఖ్యమంత్రి
వెనుకబడిన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికే ఈ ప్రభుత్వం అంకితం

# ప్రగతి పథంలో రెండేళ్ళు

"పేదరికాన్ని యీ నేలనుండి తుడిచిపెట్టే వరకు, అంటరాని తనాన్ని ఆవల నెట్టే వరకు, కులమత భేదాలు ప్రక్కకు పెట్టే వరకు, సమసమాజవ్యవస్థ స్థాపన జరిగేవరకు సామాజిక న్యాయం అందరికి అందేవరకు ఆగదు యీ గమనం"

–యన్. టి. రామారావు,
ముఖ్యమంత్రి.



**రూ. 2/- లకే కిలో బియ్యం**
- 96.54 లక్షల పేద కుటుంబాలకు లాభం

**బలహీన వర్గాలకు పక్కా ఇళ్ళు.**
- 1.85 లక్షల పక్కా ఇళ్ళ నిర్మాణం
- 7.18 లక్షల ఇళ్ళ స్థలాల పంపిణీ

**బడుగు వర్గాల సంక్షేమం**
- 13.54 లక్షల మంది షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, వెనుకబడిన వర్గాల కుటుంబాలకు లాభం
- 4.3 లక్షల మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు

**త్రాగడానికి మంచినీరు**
- 28,180 మంచినీటి వనరుల ఏర్పాటు
- 4,000 సమస్యాత్మక గ్రామాలలో మంచినీటి సౌకర్యం

**గ్రామీణ విద్యుదీకరణ**
- 3,310 గ్రామాలు, శివార్లలో విద్యుదీకరణ
- లక్షకు మించిన పంపుసెట్లకు విద్యుత్ సరఫరా

**రైతులకు సహాయం**
- 58,000 టన్నుల మేలురకం విత్తనాల పంపిణీ
- 14.5 లక్షల టన్నుల రసాయనిక ఎరువుల సరఫరా

**తుఫాను, కరువు సహాయక పనులు**
- తుఫానుకు గురైన ప్రాంతాలు, కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రాంతాలకు యుద్ధప్రాతిపదిక పైన సత్వర సహాయక పనులు

**గ్రామీణ పరిశ్రమలు**
- 24000 గ్రామీణ, లఘు పరిశ్రమల స్థాపన
- 21000 మందికి పైగా 'గ్రామోదయ', 'విముక్తి' పథకాల క్రింద లాభం

**పునర్వ్యవస్థీకరించిన రెవెన్యూ పరిపాలన**
**గ్రామాధికారుల పదవుల రద్దు.**
- పరిపాలనా యంత్రాంగాన్ని ప్రజలకు చేరువగా తీసుకొని రావడానికి 1200 రెవెన్యూ మండలాల ప్రతిపాదన

**భూములు లేని వ్యవసాయ కూలీలకు వృద్ధాప్యపు పింఛను**
- నెలకు తలా 30 రూ.ల చొప్పున 5 లక్షల మంది వ్యవసాయ కూలీలకు లాభం.
- ఈ పథకం కోసం రూ. 6 కోట్లు కేటాయింపు.

**సొంత రిక్షా పథకం**
- రిక్షా నడిపే వారికి సొంత రిక్షాలు అందడం కోసం 20 శాతం సబ్సిడీ.
- ఇందుకు ఒక కోటి రూపాయల కేటాయింపు.

**సగం ధరకే చీరలు, ధోవతులు**
- పచ్చ రేషన్ కార్డు గల వారికి సగం ధరకే చీరలు, ధోవతుల సరఫరా

**మహిళా సంక్షేమం**
- తిరుపతిలో మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు
- ఆస్తి పంపకంలో స్త్రీలకు సమాన హక్కుల కల్పనకై శాసనం.

**వితంతువులకు పింఛను**
- 38000 మంది వితంతువులకు నెలకు ఒక్కొక్కరికి రూ. 30/-ల చొప్పున పింఛను.


**మధ్యాహ్న భోజన పథకం**
- 34.32 లక్షల మంది బడి పిల్లలకు లాభం




ముఖ్యమంత్రి శ్రీ యన్. టి. రామారావు గారి సారథ్యంలో ప్రగతి పథంలో ఆంధ్రప్రదేశ్ జనవరి 9, 1985 న రెండు సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్నది. పేదప్రజల బ్రతుకులు పండించడానికి, రాష్ట్రం మరింతగా పురోగమించడానికి, ఉజ్వల భవిష్యత్తుకు దారులు వేస్తున్నది.

ఇది ప్రజా ప్రభుత్వం
... పేదలకే అంకితం.

No. 78/ADVT/C4/85 dated 8/1/85


GOVERNMENT OF ANDHRA PRADESH
సత్యమేవ జయతే
తెలుగుతేజం – వెలుగునిత్యం
ప్రభుత్వమే ప్రజలు ! ప్రజలదే ప్రభుత్వం !
జై తెలుగు నాడు
నూతన కార్యక్రమాలు
'గ్రామోదయ'
'దీప'
విముక్తి

# అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్



43వ స్వాతంత్ర్య దినోత్సవ
శుభ సందర్భంగా
ఆరుకోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు
నా సహృదయ శుభాకాంక్షలు

(యన్.టి. రామారావు)
ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్

చిరకాల దాస్యశృంఖలాలను ఛేదించుకుని, స్వేచ్ఛా వాయువుల్ని గుండెలనిండా పీల్చుకున్నది భారతజాతి నలభై రెండేళ్ళ క్రిందట. సరిగ్గా యిదే రోజున – ఆగస్టు పదిహేనున. ఇది జాతికే పండుగ దినం.

ఎందరో మహానుభావుల త్యాగఫలంగా, మరెందరో వీరపుత్రుల ఆత్మ బలిదాన కారణంగా సాధించుకున్న యీ స్వాతంత్ర్యం కేవలం రాజకీయ స్వాతంత్ర్యంగానే మిగిలిపోకుండా అందరికీ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కూడా ప్రసాదించి నప్పుడే మనం సాధించుకున్న స్వాతంత్ర్యానికి అర్థమూ, పరమార్థమూ వుంటుంది.

ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు గారి సారథ్యంలో రాష్ట్రప్రభుత్వం యీ కృషిలోనే నిమగ్నమై వుంది. ప్రతి మనిషికీ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ప్రసాదించి, ప్రతి వ్యక్తీ పరిపూర్ణంగా అభివృద్ధి చెందాలన్నది తెలుగుదేశ ప్రభుత్వ అభిమతం, అభిమతమే కాదు ఆశయం.

ఈ ఆశయ సాఫల్యం కోసం ఆరున్నర సంవత్సరాల క్రిందట అధికారం చేపట్టినప్పుంచీ అహరహం పరిశ్రమిస్తూనే వున్నది. అనేకానేక సరికొత్త సంక్షేమ సేవాభ్యుదయ కార్యక్రమాల సమాహారంతో, పథకాల తోరణంతో సామాన్యుడి జీవితాన్ని అలరిస్తూ, రాష్ట్రాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి పరుస్తూ స్వాతంత్ర్య ఫలాలను అందరికీ సమానంగా పంచడానికి కృషి చేస్తున్నది. అందుకు యీ వివరాలే తార్కాణం.... పదండి ముందుకు —

- కోటి పేదకుటుంబాలవారు కిలో 2 రూ.లకే చౌకగా బియ్యం అందుకుంటున్నారు.
- 9 లక్షల పేదకుటుంబాలవారు పల్లెల్లో పక్కా ఇళ్ళు పొందారు.
- పట్టణ ప్రాంతాల పేదలకోసం ఏడాదికి లక్ష యిళ్ళ చొప్పున మొత్తం 5 లక్షల ఇళ్ళు ప్రభుత్వం నిర్మిస్తుంది.
- సుమారు 33 లక్షలమందికి ఇళ్ళ స్థలాల పట్టాల ప్రదానం జరిగింది.
- తక్కువ ఆదాయం వర్గాల వారికి, సగం ధరకే 177 లక్షల చీర, ధోవతి జతలు పంపిణీ అయ్యాయి.
- 54,500 పేద వితంతువులకు నెలనెలా పింఛన్లు లభిస్తున్నాయి.
- 2.01 లక్షలమంది గర్భిణులైన వ్యవసాయ కూలీలు ఆర్థిక సహాయం అందుకున్నారు.
- ఏ ఆధారంలేని పేద వ్యవసాయ కూలీలు 6.03 లక్షలమంది ప్రతినెలా పింఛన్లు అందుకుంటున్నారు.
- నెలనెలా వృద్ధాప్యపు పింఛన్లు 2.29 లక్షలమందికి లభిస్తున్నాయి.
- వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ద్వారా 4.37 లక్షల కుటుంబాలు సహాయం పొందాయి.
- షెడ్యూలు తెగల సహకార ఆర్థిక సంస్థ ద్వారా 3.92 లక్షల కుటుంబాలు సహాయం పొందాయి.
- షెడ్యూలు కుల సహకార ఆర్థిక సంస్థ ద్వారా 20.60 లక్షల కుటుంబాలు సహాయం పొందాయి.



- తండ్రి ఆస్తిలో స్త్రీలకు కూడా పురుషులతోపాటు సమాన వాటా. ప్రభుత్వ ఉద్యోగాలలో 30 శాతం మహిళలకు ప్రత్యేకింపు.
- తిరుపతిలో మహిళలకోసం ప్రత్యేకంగా శ్రీ పద్మావతీ విశ్వవిద్యాలయం ఏర్పాటు.
- 1983 నుండి అదనంగా 4.41 లక్షల హెక్టార్లకు సాగునీటి సౌకర్యం కలిగింది.
- స్థాపిత విద్యుచ్ఛక్తి 3,618 మె.వాట్లకు పెరిగింది. విద్యుదీకరించిన గ్రామాల సంఖ్య 26,882 కు పెరిగింది. వ్యవసాయ పంపుసెట్ల సంఖ్య 10.43 లక్షలకు చేరుకుంది.
- గత ఆరున్నర సంవత్సరాలలో 265 భారీ, మధ్యతరహా పరిశ్రమలు, 35,545 చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పారు.
- ఆహార ధాన్యాల ఉత్పత్తి 111.73 లక్షల టన్నుల నుండి 120.00 లక్షల టన్నుల రికార్డుస్థాయికి చేరుకున్నది.
- వరి ఉత్పత్తి 76.71 లక్షల టన్నుల నుండి 105.00 లక్షల టన్నులకు పెరిగింది.
- రైతులకు అందించిన సహకార ఋణాలు రు. 150 కోట్ల నుండి రు. 670 కోట్లకు చేరుకున్నాయి.
- ప్రజలకు సన్నిహితంగా ప్రభుత్వ సేవలు అందించడానికి 1091 మండల ప్రజాపరిషత్తులను ఏర్పరిచారు.
- 25,146 నీటిఎద్దడి గల గ్రామాలకు మంచినీటి సౌకర్యం కలిగించారు.
- 73,371 బయోగ్యాస్ ప్లాంటులను నెలకొల్పడం జరిగింది.
- దేశంలోనే తొలిసారిగా 'దృశ్యశ్రవణ విద్యావిధానం' ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశపెట్టడం జరిగింది.
- సహకార జూనియర్ కళాశాల ప్రారంభం జరిగింది.
- తెలుగు సంస్కృతి, సాహిత్యం, కళల ప్రోత్సాహానికి తెలుగు విశ్వవిద్యాలయం అవతరించింది.
- దేశంలోనే మొదటిసారిగా ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయం విజయవాడలో నెలకొల్పారు.
- ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సౌకర్యాల విస్తరణకు వైద్యవిధాన పరిషత్ ప్రారంభించబడింది.
- పంటలు పండించే విధాన నిర్ణయంలో పంట ఉత్పత్తుల అమ్మకాలలో తోడ్పడేందుకు కర్షక పరిషత్తు ఏర్పాటు.
- రైతన్న సేవలో ఏకగవాక్ష విధానం. వ్యవసాయావసరాలకు వినియోగించే విద్యుచ్ఛక్తి ఏడాదికి ఒక అశ్విక శక్తికి రు.50 శ్లాబ్ పద్ధతి అమలు.

| ప్రణాళికా వ్యయం | .... | 1978-83 | 1983-89 |
|---|---|---|---|
| | | (కోట్ల రూపాయలలో) | |
| వ్యవసాయం | | | |
| అనుబంధ సేవలు | .... | 90.42 | 275.21 |
| గ్రామీణాభివృద్ధి | .... | 112.46 | 491.16 |
| నీటి పారుదల | .... | 761.56 | 1579.43 |
| విద్యుచ్ఛక్తి | .... | 741.67 | 1075.34 |
| పరిశ్రమలు, గనులు | .... | 113.79 | 357.41 |
| రవాణా, కమ్యూనికేషన్లు | .... | 174.62 | 559.41 |
| సామాజిక సేవలు | .... | 436.24 | 1916.87 |
| బలహీన వర్గాల సంక్షేమం | .... | 79.09 | 515.01 |




# ఉదాసీనతకు, అలక్ష్యానికి తావివ్వద్దు

**(1985, జనవరి 18న హైదరాబాదులో జిల్లా కలెక్టర్ల సమావేశంలో ప్రసంగం)**

రాష్ట్రం ఒక క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్న సమయంలో మనం సమావేశమవుతున్నాం. ఒక వైపు రాష్ట్రంలోని మూడు వందల ఐదు తాలూకాలలో, రెండు వందల ఒకటిలో దుర్భర అనావృష్టి పరిస్థితులు తాండవిస్తుండగా, మరొక వైపు పెను తుఫాను తాకిడికి నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలలో కొన్ని ప్రాంతాలు బాగా నష్టపోయాయి. దీనికి తోడు లోకసభకు సాధారణ ఎన్నికలను నిర్వహించవలసిన బృహత్తర బాధ్యత మీ భుజస్కంధాలపై వుంది.

ఈ కార్యక్రమాలు ఎన్ని పై బడినా దారిద్ర్యరేఖకు అట్టడుగున దుర్భర జీవితం గడిపే పీడిత, బాధిత, దళిత వర్గాల సంక్షేమం పెంపొందించి, వారి జీవన ప్రమాణాన్ని మెరుగుపరిచేందుకు ఉద్దేశించబడిన అనేక అభివృద్ధి కార్యక్రమాల అమలును పర్యవేక్షించవలసిన అవసరం విస్మరించరానిది. ఇట్టి గడ్డు పరిస్థితులు, కార్యభారం ఎట్టి ధైర్యశాలినయినా నిరుత్సాహపరచడం తథ్యం. అయితే యిబ్బందులలో నిబ్బరం, క్లిష్ట పరిస్థితులలో తెగువ చూపడంతోబాటు అనేక ఒడుదుడుకులను విజయవంతంగా తట్టుకొని నిలిచిన మన జిల్లా పరిపాలనా యంత్రాంగానికి యిది ఒక పెద్ద సవాలు కాదు. అందువల్లనే అనావృష్టి అతివృష్టి,

బాధా నివారణ చర్యలతోబాటు, ఎన్నికల సక్రమనిర్వహణతోపాటు ప్రభుత్వం అమలు చేయ తలపెట్టిన ప్రణాళికాభివృద్ధి కార్యక్రమాలన్నిటిని – ప్రత్యేకించి ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సంక్షేమ పథకాల న్నింటినీ – మీరు సమర్థవంతంగా అమలు చేయగలరన్న ఆశాభావం నాకుంది.

జిల్లా పరిపాలనా వ్యవస్థలో గ్రామోద్యోగ వ్యవస్థ కీలకమైనది. ఆ గ్రామోద్యోగ వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించే ప్రయత్నంలో భాగంగా గ్రామాధికారుల పదవులను రద్దు చేయడానికి, గ్రామ సహాయకులను నియమించడానికి జనవరిలోనే ప్రభుత్వం ఆర్డినెన్సు జారీ చేసిన సంగతి మీకు తెలుసు. నూతన వ్యవస్థ యింకా రూపుదిద్దుకొంటున్నది. గ్రామ ప్రాంతాలలో నిత్యనైమిత్తిక పాలనా వ్యవహారాలను చక్కబెట్టడానికి యిప్పటికప్పుడే 5,157 జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను నియమించడం జరిగిందని తెలిసి సంతోషించాను.

**జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్, పునాది స్థాయిలో గ్రామం వుండగా మధ్య అంతస్తుగా మండలాల నిర్మాణంతో పునర్ వ్యవస్థీకరించబడిన పంచాయితీరాజ్ వ్యవస్థా విధానానికి యీ రోజు మీరు తీసుకుంటున్న చర్యలు శ్రీకారం చుట్టగలవు.**

సాంప్రదాయక రెవిన్యూ వ్యవహారాలు కానివ్వండి, అభివృద్ధి పథకాల అమలు విషయం కానివ్వండి కొత్తగా నియమించబడిన గ్రామసహాయకులు తమ విధులను సకాలంలో సక్రమంగా నిర్వహించేందుకు దోహదం చేయడానికి మీరు ప్రత్యేక శ్రద్ధ వహించవలసి వుంది.

రెవిన్యూ మండలాల ఏర్పాటు గురించి మీరు మీ కార్యక్రమాలను యీ వరకే పూర్తి చేసి వుంటారు. జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్, పునాది స్థాయిలో గ్రామం వుండగా మధ్య అంతస్తుగా మండలాల నిర్మాణంతో పునర్ వ్యవస్థీకరించబడిన పంచాయితీరాజ్ వ్యవస్థా విధానానికి యీ రోజు మీరు తీసుకుంటున్న ప్రాథమిక పాలనా చర్యలు శ్రీకారం చుట్టగలవు.

జిల్లా స్థాయిలో వివిధ శాఖలు అమలుచేసే అభివృద్ధి కార్యక్రమాల సమన్వయ కృషిలో యిటీవల రూపొందించబడిన జిల్లా ప్రణాళికా మండలులు ప్రముఖ పాత్ర వహించగలవు. అన్ని జిల్లాల ప్రణాళికా మండలులకు అధ్యక్షుల నియామకం పూర్తి కావడంతో యీ సంస్థలు తమ కృషిని మరింత చురుకుగా కొనసాగించగలుగుతాయి. ఆ విశ్వాసంతోనే ప్రభుత్వం అనావృష్టి నివారణ పథకాల అమలు బాధ్యతను కూడా యీ సంస్థలకే అప్పగించింది.

ప్రభుత్వం ఉద్దేశించిన కొన్ని ముఖ్యమైన సంక్షేమ కార్యక్రమాలను గురించి మీతో ప్రస్తావించే ముందు రానున్న ఏడవ పంచవర్ష ప్రణాళికను గూర్చి నాలుగు మాటలు చెప్పదలచుకొన్నాను.

7,900 కోట్ల రూపాయలతో ఏడవ పంచవర్ష ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వం ఉద్దేశించింది. ఈ మొత్తం ఆరవ పంచవర్ష ప్రణాళిక కేటాయింపు కన్నా రెట్టింపు ఎక్కువే అని విడిగా చెప్పనక్కర లేదను కొంటాను. విరివిగా ప్రజలు పాల్గొనడానికి అవకాశమిచ్చే ప్రణాళికా వికేంద్రీకరణ విధానాన్ని దృష్టిలో వుంచుకొని 3,000 కోట్ల రూపాయలను జిల్లా విభాగ పథకాలకు కేటాయించాలని ప్రభుత్వం నిశ్చయించింది.

జిల్లా ప్రణాళికా మండలుల ఆధ్వర్యంలో జిల్లా ప్రణాళికలను యిప్పటికే మీరు రూపొందించి వుంటారు. 23 జిల్లాలు కూడ తమ తమ జిల్లా ప్రణాళికల ముసాయిదాలను రూపొందించాయని తెలిసి నాకెంతో ఆనందమైంది. వీటిని గురించి రాష్ట్రస్థాయిలో చర్చించడం జరిగింది. మీరు చేసిన ప్రతిపాదనలను దృష్టిలో వుంచుకొని రాష్ట్ర ప్రణాళికను యిక రూపొందించడం జరుగుతుంది.

ఈ సందర్భంలో వెనుకబడిన ప్రాంతాలను, దుర్భిక్ష పరిస్థితులకు గురయిన ప్రాంతాలను అభివృద్ధి పరచవలసిన అవసరాన్ని గూర్చి పునరుద్ఘాటించదలిచాను. సంక్షేమ కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యం యివ్వడం జరుగుతుందని చెప్పదలిచాను. ఆరోగ్య, వైద్య సౌకర్యాల కల్పనకు తగినంతగా ప్రాముఖ్యత యివ్వవలసిన అవసరం వుంది. విద్యా సౌకర్యాలు మెరుగుపరచి వున్నత ప్రమాణాలను నెలకొల్పాలి. చిన్న రైతులను, సన్నకారు రైతులను ఆదుకోడానికి విరివిగా బావులను త్రవ్వడం, కరెంటుతో నడిచే పంపుసెట్లను ఏర్పాటు చేయడం వంటి పనులతో ఒక కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రారంభించాలని ప్రభుత్వం ఉద్దేశించింది. వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలి.

ఈ విషయాలన్నీ మీ జిల్లా ప్రణాళికల్లో తగు విధంగా ప్రతిబింబించాలి. అందుచేత జిల్లా ప్రణాళికల అసలు ప్రతులను తయారుచేసేటప్పుడు చాలా జాగ్రత్తగా యివన్నీ అందులో ద్యోతకమయ్యేట్టు చూడాల్సిన బాధ్యత మీ మీద ఉంది. ప్రభుత్వ ఉద్దేశాన్ని, ప్రజల అవసరాలను, ఆయా జిల్లాల ప్రత్యేక పరిస్థితుల ను–వీటన్నిటినీ జాగ్రత్తగా పరిగణనలోకి తీసుకొని, తదనుగుణంగా జిల్లా ప్రణాళికలను రూపొందించుకోవాలి.

ఈ ఏడాది ప్రారంభంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగానే. వున్నాయి. కాని తరువాత పరిస్థితులు మారిపోయాయి. ఆగస్టు 3వ తేదీ నుండి సెప్టెంబరు రెండో వారం వరకు వర్షాలు కురవలేదు. దీనికితోడు. నాగార్జునసాగర్, కె.సి. కాలువలకు, రాజోలి బండ మళ్లింపు పథకం మొదలైన భారీ సేద్యపు నీటి కాలువలకు గండ్లు పడడంతో పరిస్థితి మరీ ఆందోళనగా తయారయ్యింది. మొత్తం 305 తాలూకాలకు 201 తాలూకాలను దుర్భిక్ష ప్రాంతాలుగా ప్రకటించవలసి వచ్చింది.

ఆ తర్వాత రాష్ట్రంలోని దుర్భిక్ష పరిస్థితులను గురించి మరొకసారి సమీక్షిస్తుండగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలోని 33 తాలూకాలలో అదనంగా 72 ఫిర్కాలు కూడా దుర్భిక్ష పరి స్థితులకు గురైనట్లు తేలింది. భారత ప్రభుత్వం నుండి సహాయం ఆశిస్తూ ముందుగా 32 కోట్ల రూపాయల ను రాష్ట్ర ప్రభుత్వం కరువు సహాయక కార్యక్రమాల కోసం విడుదల చేసిన సంగతి మీకు తెలుసు, గ్రామ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా, సేద్యపు నీటి పనులు, భూసార పరిరక్షణ, పశుపోషణ, అడవుల పెంపకం, వ్యవసాయ కార్యకలాపాల వంటి పనులకోసం యీ మొత్తం వుద్దేశించడం జరిగింది. కరువు సహాయక పనులను చేపట్టడంలో యీ ఏడాది కొత్త పద్ధతిని అవలంభించాం. ఏఏ కార్యక్రమాల ను చేపట్టాలో, ఏఏ పనులను అమలు జరపాలో జిల్లా ప్రణాళికా మండలులు నిర్ణయిస్తాయి. అయితే ప్రభుత్వం ఆయా రంగాలకు చేసిన కేటాయింపులకు లోబడే ఆయా కార్యక్రమాలను, పనులను జిల్లా

ప్రణాళికా మండలులు నిర్ధారించవలసి వుంటుంది. పనులను ఎంపిక చేయడంలో శ్రామిక, కార్మిక ప్రజలకు ప్రయోజనం చేకూర్చే వాటికే ఎక్కువ ప్రాధాన్యం మీరు యిస్తారనే భావిస్తున్నాను.

చిన్న నీటి వనరుల మరమ్మత్తు, వాటి అభివృద్ధి, అడవుల పెంపకం వంటివి యీ కోవలోకి వస్తాయి. కర్నూలు జిల్లాలో చేపట్టిన పైలట్ పథకాన్ని యీ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించ దలచుకున్నాను. అక్కడ తెలుగు గంగకు సంబంధించి ప్రధాన కాలువ తాలూకు పనులను కొన్ని చోట్ల నేరుగా శ్రామికులను నియమించడం ద్వారా అమలు జరుపుతున్నారు.

కార్మికులకు వేతనాలు లాభసాటిగా లభించడంవల్ల యీ పైలట్ పథకం విజయవంతంగా అమలు జరుగుతున్నది. ఆ చుట్టుపక్కల యిదే మాదిరి పనికి లభించే కూలీ కన్న వీరికి యిస్తున్న కూలీ మెరుగ్గా వుంది. కాంట్రాక్టరు విధానంలోని మధ్య దళారీల బెడద వీరికి లేదు. అందుచేత యీ శ్రామికులు చాలా వుత్సాహంగానూ, చురుకుగానూ త్రవ్వకం పనిలో పాల్గొంటున్నారు. పని చురుగ్గా సాగుతోంది.

**ఏఏ కార్యక్రమాలను చేపట్టాలో, ఏఏ పనులను అమలు జరపాలో జిల్లా ప్రణాళికా మండలలు నిర్ణయిస్తాయి. అయితే ప్రభుత్వం ఆయా రంగాలకు చేసిన కేటాయింపులకు లోబడే కార్యక్రమాలను, పనులను జిల్లా ప్రణాళికా మండలులు నిర్ధారించవలసి వుంటుంది.**

మీ మీ జిల్లాలలో కూడా యీ మాదిరిగా కార్యక్రమాలను అమలు జరపడంలో మీరు చొరవ తీసుకోగలరని నమ్ముతున్నాను. స్థానిక యువకులకు యిటువంటి పనులలో ప్రాతినిథ్యం యిస్తే ఆయా పనులను శీఘ్రంగా అమలు జరపడానికి వీలవుతుంది.

దుర్భిక్ష ప్రాంతాలలో వున్న చిన్నరైతులకు, సన్నకారు రైతులకు యిచ్చిన తక్కువ కాల వ్యవధి రుణాలపై వడ్డీని మాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. తక్కువ కాల రుణాలను మార్పు చేయడానికి యిచ్చిన రుణాలపై వడ్డీని మాఫీ చేయడానికి ఆర్థిక సహాయ సంస్థలకు దుర్భిక్ష పరిస్థితులకు గురైన ఆయా గ్రామాల ప్రకటన, పంటవారీ దిగుబడి సమాచారం అవసరం గనుక యీ లాంఛనాలన్నీ మీరు త్వరగా పూర్తి చేయవలసిందిగా కోరుతున్నాను.

నెల్లూరు జిల్లాలోనూ, చిత్తూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లోనూ, విపరీతమైన నష్టాన్ని కలిగించిన యిటీవలి తుఫానుకు సంబంధించి ఒక విషయం నేను ప్రస్తావించాల్సివుంది. జిల్లా పాలనా యంత్రాంగం సకాలంలో తీసుకొన్న చర్యలవల్ల అపారమైన ఆస్తినష్టాన్ని, ప్రాణనష్టాన్ని నివారించడానికి వీలయ్యింది, ఈ ప్రాంతాల్లో సహాయక పనులను చురుకుగా అమలుపరుస్తున్నారు. మరమ్మతు పనులు త్వరత్వరగా జరుగుతున్నాయి. వరద బాధితుల పునరావాస కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. తక్షణమే రోడ్డు, వార్తా సౌకర్యాలు, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి సౌకర్యాలను పునరుద్ధరించడంలో పంచాయతీరాజ్, నీటిపారుదల, విద్యుచ్ఛక్తి శాఖలు శక్తివంచన లేకుండా కృషి చేయగలవని, నిర్విరామంగా పరిశ్రమించగలవని నమ్ముతున్నాను.

మీరు మీ మీ జిల్లాలకు తిరిగి వెళ్లడంతోనే ఎన్నికల పనుల సంరంభం ప్రారంభమవుతుంది. నవంబరు 20న ఎన్నికల ప్రకటన వెలువడుతుంది. ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా వుందని నాకు తెలుసు. ఎన్నికలను సక్రమంగానూ, సరైన పంథాలోను నిర్వర్తించాలి. ఇది మీకు ఒక గురుతరమైన బాధ్యత. ఎన్నికలు సక్రమంగా జరగడానికి అవసరమైన ముందు జాగ్రత్త చర్యలన్నీ తీసుకోవాలి. శాంతి భద్రతలకు అంతరాయం కలిగించేవిగా అనిపించే విషయాలను జాగ్రత్తగా కనిపెట్టి వుండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిరంతరం జాగరూకతతో వ్యవహరించాలని మీ అందరినీ కోరుతున్నాను.

ప్రభుత్వం వుద్దేశిస్తున్న కొన్ని అతి ముఖ్యమైన పథకాల గురించి ప్రస్తావించడానికి ముందు 20 అంశాల కార్యక్రమాన్ని గూర్చి, ప్రగతి పథం కార్యక్రమాన్ని గూర్చి నాలుగు మాటలు చెప్పదలచుకొన్నాను.

**ప్రజల శ్రేయస్సుతో ముడి పడిన అభివృద్ధి విధానానికి ప్రభుత్వం కట్టుబడి వుంది. అందుచేత 20 అంశాల ఆర్థిక కార్యక్రమాన్ని ప్రగతి పథం కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు జరుపవలసిన ఆవశ్యకతను గురించి పదే పదే నేను నొక్కి చెప్పుతున్నాను.**

ప్రజలకు–ముఖ్యంగా బలహీనవర్గాల వారికి – ప్రయోజనం చేకూర్చని అభివృద్ధి కార్యక్రమాలకు అర్థం లేదు. ప్రజల శ్రేయస్సుతో ముడిపడిన అభివృద్ధి విధానానికి ప్రభుత్వం కట్టుబడి వుంది. అందుచేత 20 అంశాల ఆర్థిక కార్యక్రమాన్ని ప్రగతి పథం కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు జరుపవలసిన ఆవశ్యకతను గురించి పదే పదే నేను నొక్కి చెప్పుతున్నాను. ఈ కార్యక్రమాలు ఎలాంటి విచక్షణ లేకుండా, ఎటువంటి అవినీతికి తావు యివ్వకుండా, ఏ విధమైన దుబారా జరుగకుండా సకాలంలో అమలు జరగాలి. ఈ కార్యక్రమాల క్రింద జరుగుతున్న అభివృద్ధిని ప్రత్యేక శ్రద్ధతో నేను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాను. నిజానికి యీ విషయంలో మీలో కొందరికి ఉత్తరాలు కూడా వ్రాశాను.

గ్రామీణ విద్యుదీకరణ, వైద్య ఆరోగ్య కార్యక్రమాలలో కొంత మందకొడితనం నాకు కనిపించింది. విద్యుత్ మండలి, కొన్ని ప్రభుత్వ శాఖలు యీ విషయంలో ఎక్కువ శ్రద్ధ వహించవలసి వుంది. ఎన్.ఆర్.ఇ.పి., ఆర్.ఎల్.ఇ.జి.పి. కార్యక్రమాలను యింకా గట్టిగా అమలు జరపడానికి అవకాశాలున్నాయి. ఈ కార్యక్రమాలన్నీ చక్కగా అమలు జరిగేటట్టు వాటి అమలు తీరును మెరుగుపరిచేటట్టు ప్రత్యేక శ్రద్ధ మీరంతా తీసుకోవాలని కోరుతున్నాను. మీకు ఏమైనా యిబ్బందులు వున్నట్లయితే వాటిని ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించుకోమని కూడా కోరుతున్నాను.

ఆవాంతరాలు ఎన్ని ఎదురైనా ప్రగతి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు–ముఖ్యంగా 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం, ప్రగతి పథం అత్యంత ప్రాధాన్యత యిచ్చి అమలు చేయవలసి వుంటుంది.

రెక్కలు ముక్కలు చేసుకున్నా డొక్క నిండని పేద వారికి యింత ఆదరువు కల్పించాలని ప్రారంభించబడిన

2 రూపాయలకే కిలో బియ్యం పథకం లక్షలాది పేద కుటుంబాలకు ఎంతో మేలు చేసింది. వారి మన్ననలు పొందింది. ఇంతగా ప్రజాదరణ పొందిన మరో కార్యక్రమం లేదంటే అతియోశక్తి కాదు, ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగించడానికి ధాన్య సేకరణ చురుకుగా జరగటం అవసరం. ఈ సంవత్సరం 15 లక్షల టన్నుల బియ్యాన్ని భారత ఆహార సంస్థ ద్వారా సేకరించి కేంద్ర నిల్వలకు అందించాలని పరస్పర ఆమోదయోగ్యమైన ధరలకు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ద్వారా మరో ఏడున్నర లక్షల టన్నుల బియ్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

1984-85 సంవత్సరంలో యింకా కావలసిన బియ్యం కొనుగోలు చేస్తారు. లెవీ విధానం ద్వారా అంగీకృత ధరలకు కొనుగోలు ద్వారా - యీ రెండు పద్ధతులలోనూ ధాన్య సేకరణ కొనసాగవలసి వుంటుంది. భారత ఆహార సంస్థకు మిల్లు యజమానుల నుండి ధాన్య సేకరణ ధరలకు అందించబడే ప్రతి టన్ను బియ్యానికి సమంగా ఒక టన్ను దేశంలో ఎక్కడైనా అమ్ముకోడానికి వీలు కల్పిస్తూ, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు అంగీకృత ధరకు అమ్మే ప్రతి అరటన్ను బియ్యానికి సమంగా మరొక అరటన్ను రాష్ట్రం లోపల మిల్లు యజమానులు అమ్ముకోడానికి అవకాశం కల్పించబడింది. అందువల్ల ధాన్య సేకరణ లక్ష్యాలను సాధించడానికి మీరు సర్వశక్తులు ధారపోసి కృషిచేయాలని కోరుతున్నాను. అంతేకాక రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు సాధ్యమైనంత ఎక్కువ మామూలు రకం, మేలు రకం బియ్యం అందేట్టుగా చూడాలని కోరుతున్నాను.

గత సంవత్సరం డెల్టా జిల్లాల్లో ధాన్య సేకరణ కృషి తగినంత ముమ్మరంగా ఒకే రీతిలో జరుగలేదు. గత సంవత్సరం ఈ విషయంలో వెనుకబడిన జిల్లాలు యీ సంవత్సరం ముందంజ వేయగలవని ఆశిస్తున్నాను. గత సంవత్సరం చలామణిలో వున్న బోగస్ రేషన్ కార్డులను ఏరివేసే కార్యక్రమం పెద్ద ఎత్తున మనం ప్రారంభించిన సందర్భంలో కొంత మంది చురుకైన అధికారుల పుణ్యమా అని సక్రమమైన కార్డులు కూడా కొన్ని ఆ ఏరివేత వెల్లువలో కొట్టుకుని పోయినట్టు, కొందరు బీదవారికి ఆ కార్డులు లభించనట్లు ఫిర్యాదులందాయి. ఒకే యింటిలో వేరు వాటాలలో వుంటున్న కుటుంబాలలో కొందరికి విడివిడిగా కార్డులు యివ్వలేదని, అందరినీ ఒకే కుటుంబంగా పరిగణించారని కొందరు నాతో చెప్పుకున్నారు. అలాగే ఆయా కాలాలలో మాత్రమే వుపాధి లభించే వ్యవసాయ కూలీల వంటి కార్మికులకు రోజు కూలీ దామాషాతో సంవత్సరాదాయాన్ని లెక్కగట్టి, ఆయా పంట కాలాలలో తప్ప వారికి తగినంత పని దొరకని వాస్తవాన్ని విస్మరించి, వారిని పచ్చ కార్డుకు అనర్హులుగా పరిగణించిన సందర్భాలు కూడా నా దృష్టికి వచ్చాయి. ఇటువంటి లోపాలను అన్నింటినీ సరిదిద్దుకొని, అర్హులైన పేద వారందరికీ కార్యక్రమ ప్రయోజనం అందేలా చూడాలని కోరుతున్నాను. యిందుకు అవసరమైన ఆదేశాలు పౌర సరఫరాల కమీషనరు ద్వారా మీకు అందే వుంటాయి.

ప్రభుత్వం ప్రాధాన్యత యిచ్చే మరొక కార్యక్రమం-బలహీనవర్గాల గృహ నిర్మాణ పథకం, గత సంవత్సరం 1,31,770 యిళ్ల నిర్మాణం లక్ష్యంకాగా అందులో 93,492 గృహాలు నిర్మించబడ్డాయి. ఈ

సంవత్సరం లక్ష్యం మరి కొద్దిగా పెంచి లక్షానలభై వేల గృహాలుగా నిర్ణయించబడింది. గ్రామాలలో పక్కా యిళ్ల నిర్మాణం విషయంలో 1,12,658 యిళ్లను వివిధ జిల్లాలకు కేవలం 56,975 యిళ్లకు మాత్రమే ప్రతిపాదనలు అందాయి. అంటే చేయవలసిన కృషి యింకా ఎంతో వుంది. మీరంతా ద్విగుణీకృత వుత్సాహంతో పనిచేసి అనుకున్న లక్ష్యాలను అధిగమించి విజయం సాధించాలని కోరుతున్నాను.

**ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన నూతన సంక్షేమ కార్యక్రమాలకు వద్దాం:**

**(1) తొక్కే వారిదే రిక్షా.**

**(2) భూమి లేని వృద్ధ వ్యవసాయ కార్మికులకు పింఛను**

**(3) పచ్చకార్డులు గల పేద వారికి సగం ధరలకే ఒక చేనేత చీర, ధోవతి.**

**(4) అన్ని మునిసిపాలిటీలలోనూ, మేజర్ పంచాయతీలలోనూ ఆధునిక చాకిరేవుల నిర్మాణం.**

**(5) వెదురుపని వారి సంఘాలకు సగం ధరకే వెదుళ్ల సరఫరా.**

**(6) రాళ్ళు కొట్టుకొని జీవించే కార్మికులకు యితోధిక సదుపాయాలు.**

**(7) చిన్ననీటి పారుదల వనరుల కల్పనకై ఒక ప్రత్యేక కార్యక్రమం.**

**(8) గిరిజన గ్రామాలు, హరిజన వాడల్లో యింకా విద్యుత్ సౌకర్యం లేని వాటన్నింటికీ విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయటం, వ్యవసాయ బావుల విద్యుద్దీకరణ.**

స్వంత సైకిలు రిక్షాలు లేక అద్దె బళ్ళు తొక్కుతూ జీవనం గడుపుకొంటున్న వారికి రిక్షాపై యాజమాన్య హక్కులు కల్పించి మధ్య దళారీలను తొలగించేందుకు శాసనపరంగా అవసరమైన చర్యలు తీసుకునే లోపుగా రిక్షా కార్మికులు సొంత రిక్షాను సమకూర్చుకోనేందుకు సహాయపడే పథకాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు ప్రతి జిల్లాకు వేయి రిక్షాలు లక్ష్యంగా నిర్దేశించబడింది.

వాణిజ్య బ్యాంకులు, యితర ఆర్థిక సహాయ సంస్థల సహాయ సహకారాలతో యీ ప్రయోజనకరమైన పథకాన్ని మీరు అమలు జరిపి పీడిత, బడుగు వర్గాలను ఆదుకోవాలని కోరుతున్నాను.

చిరకాల ప్రయోజనాన్నందించే మరో ముఖ్య కార్యక్రమం – 60 సంవత్సరాల పైబడిన, భూవసతి లేని నిరాధార వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 30 రూపాయల నెలసరి పింఛను పథకం, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా మీకు యిందుకు సంబంధించిన నిబంధనలన్నీ తెలియజేయడమైనది. ఈ పథకం అమలుకు అవసరమైన ప్రాథమిక చర్యలన్నీ మీరు ఈ సరికే తీసుకొని వుంటారని విశ్వసిస్తున్నాను.

తరతరాలుగా సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలకు, సాంఘిక అసమానతలకు గురి అవుతూ బడుగు బ్రతుకులు వెళ్లదీస్తున్న రజకులు, మేదరులు, వడ్డెరలు మొదలయిన గ్రామీణ శ్రామిక ప్రజానీకానికి నూతన

చైతన్యం, నవజీవం కల్పించే సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. ఇందుకు వృత్తి ఆధారంగా నెలకొల్పబడే సహకార సంఘాల ద్వారా వారికి కావలసిన కొత్త పనిముట్లు, ముడి సరుకులు, పరపతి సౌకర్యాలు, యితర సదుపాయాలు కల్పించడమే కాక వారు తయారు చేసే వస్తువులకు తగిన మార్కెటు లభించేటట్లు, వారి శ్రమకు తగిన ప్రతిఫలం సమకూరేట్లు చూడటం ప్రభుత్వ విధానం, ఈ దృష్టితో ప్రభుత్వం ప్రకటించిన పథకాలనన్నింటినీ చక్కగా అమలు చేసేందుకు మీరంతా శ్రద్ధతో కృషి చేయగలరని ఆశిస్తున్నాను.

ఈ సంవత్సరం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ్యమైన అభ్యుదయకరమైన మార్పును గురించి యిప్పుడు నేను ప్రస్తావించదలచాను.

పేదవారి పరిస్థితులు మెరుగుపరచేందుకై వారికి యిళ్ల స్థలాలు యిచ్చినా, బంజరు భూములు యిచ్చినా, పింఛన్లు పంచిపెట్టినా అందుకు సంబంధించిన పట్టాలు యిల్లాలి పేరనే వుండాలన్నది యీ నూతన విధానం. ఇంటిని సంబాళించుకొంటూ బరువు బాధ్యతలు మోసే గృహిణి పేరిటనే యీ సౌకర్యాలు కల్పించబడ్డప్పుడు అవి ఆశించిన శాశ్వత ఫలితాలను యిస్తాయన్న వుద్దేశంతో యీ నిర్ణయం తీసుకోబడింది. ఇందువల్ల ఒక పవిత్ర ఆదర్శంతో ప్రభుత్వం అందిస్తున్న సహాయం అన్యాక్రాంతం చేయబడకుండా వుంటుందన్న ఆశాభావం నాకుంది.

**పేదవారి పరిస్థితులు మెరుగుపరచేందుకై వారికి యిళ్ల స్థలాలు యిచ్చినా, బంజరు భూములు యిచ్చినా, పింఛన్లు పంచిపెట్టినా అందుకు సంబంధించిన పట్టాలు యిల్లాలి పేరనే వుండాలన్నది యీ నూతన విధానం.**

పచ్చకార్డులు కల పేదవారికి సగం ధరకే చేనేత చీర, ధోవతి లభింపజేయాలన్న పథకానికి బ్రహ్మాండమైన ప్రజాదరణ లభించింది. ఈ విషయంలో పేద ప్రజలు చూపుతున్న ఆసక్తి దృష్ట్యా అమ్మకం కౌంటర్లను ఎక్కువ చేయట యీ సౌకర్యాన్ని వినియోగించుకోటానికి ముందుకు వస్తున్న పేద ప్రజానీకానికి యీ ప్రయోజనం సులువుగా, సత్వరం పల్లె సీమలకు చౌక దుకాణాల ద్వారా లభించేట్లు చేయడానికి అవసరమైన చర్యలను మీరు ఆలోచించాలని కోరుతున్నాను.

ఈ సందర్భంలో ఒక విషయం స్పష్టం చేయదలచాను. ఈ పథకం సక్రమంగా, సంపూర్తిగా అమల ుచేయటానికి అవసరమైన చేనేత వస్త్రాల నిల్వలు తగినంతగా వున్నాయని ఎట్టి కొరతా వుండబోదని నేను హామీ యిస్తున్నాను.

సాంఘిక సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రస్తావించేటప్పుడు గిరిజన సంక్షేమంకై గిరిజన ఉప ప్రణాళిక, హరిజన సంక్షేమంపై ప్రత్యేక సమగ్ర ప్రణాళిక పేర్కొనదగినవి. బలహీన వర్గాల సంక్షేమానికై మనం కేటాయించిన మొత్తాలు ప్రయోజనకరంగా సమర్థవంతంగా వినియోగించబడేటట్లు మీరు ప్రత్యేకించి శ్రద్ధ వహిస్తారని నమ్ముతున్నాను.

ఇందులో ప్రభుత్వ శాఖలన్నీ ఎట్టి ఉదాసీనతకు, అలక్ష్యానికి తావివ్వకుండా చురుకుగా కృషి కొనసాగించగలవని విశ్వసిస్తున్నాను. ఎంతో సున్నితమైన కష్టసాధ్యమైన విద్యుక్తధర్మం, బాధ్యత మీపై వున్నాయి.

ఎట్టి పరిస్థితినైనా ఎదుర్కొనడానికి తగిన సమర్థత, నేర్పు, ఓర్పు, శిక్షణ మీకున్నాయి. రాష్ట్ర రాజధానిలోని వున్నతోద్యోగుల సహకారంతో, ప్రభుత్వ అండదండలతో, ప్రజల తోడ్పాటుతో మీరు మీ విధులను విజయ వంతంగా నెరవేర్చి స్వచ్ఛమైన, సమర్థవంతమైన, సజావయిన పరిపాలనను ప్రజలకు అందించి రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదం చేయగలరని ఆశిస్తూ మీ కృషి సఫలం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

**జై తెలుగునాడు. జైహింద్!**



# భావిభారత భాగ్యవిధాతలకు శుభాశీస్సులు

**(1985 జనవరి 18న బాలల కార్యక్రమం సందర్భంగా హైదరాబాదులో జరిగిన ఒక సభలో ప్రసంగం)**

ప్రియమైన బాల బాలికల్లారా !

మన ప్రియతమ చాచా నెహ్రూ జన్మదినోత్సవాన్ని భారతదేశమంతటా బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈవేడుకను ఈ సంవత్సరం స్వర్గీయ మన ప్రథమ భారత ప్రధాని నెహ్రూ గారి కుమార్తె మన దేశ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ గారు హత్య చేయబడ్డ ఈ విషాద సమయంలో జరుపుకోవడం కొంత దురదృష్టకరం. కానీ, ఈ రోజు వారి ఆదర్శయుత జీవితాలను, వారి దేశభక్తిని వారి కార్యదీక్షను మననం చేసుకోవాలని భావిభారత పౌరులైన మిమ్మల్ని కోరుతున్నాను.

మీరంతా అరవిచ్చిన ముద్దమందారాలు. అయినా మీ విన్యాసాలు అవీ చూశాక, ఈ స్టేడియం ముంగిట్లో మీ ప్రతిభా పాటవాలు చూస్తూ ఈ సమయాన్ని యిలా మీ అందరితో పంచుకోవడం చాలా సంతోషంగా వుంది. మరోసారి నా బాల్యాన్ని గుర్తు చేసుకున్నట్లుగా వుంది, అనాదిగా అనంతంగా మన పూర్వులు

సంతరించిన అఖండ సంస్కృతీ చైతన్య తెలుగు జాతి ప్రాగ్వైభవాలు మీలో దీప్తించుకున్న వారసులు మీరు. మీరే భావిభారత భాగ్యవిధాతలు. నేడు తొడిగిన ఈ పసిడి మొగ్గల్లాంటి మీరు, రేపు వికసించి, పరిమళాలు వెదజల్లుతారని, ఈ దేశ చరిత్రను మార్చి వ్రాయగల సత్తా మీకుందని, భారత జాతిని, తెలుగు ఔన్నత్యాన్ని సుసంపన్నంచేసి సువర్ణాక్షరమయంగా తీర్చిదిద్దుతారని ఆకాంక్షిస్తున్నాను.

మనదేశం అనాదిగా అనేకమతాల వారికి, అనేక సంస్కృతులకు ఆలవాలమై, భిన్నత్వంలో ఏకత్వాన్ని సంతరించుకుంది. ఇదే విలువలను ఆశయాలను మన రాజ్యాంగంలో కూడా పొందుపర్చుకున్నాం. కానీ అప్పుడప్పుడు మత మౌఢ్యము వల్ల, దురభిమానం వల్ల కొన్ని విచ్ఛిన్నకర శక్తులు మన జాతి సమైక్యతకు భంగం కలుగజేస్తున్నాయి. వాటిని మనం సామరస్యభావంతో ఎదుర్కొంటూ దేశ సమగ్రతను కాపాడుకుంటూ వస్తున్నాం కాని ఈ శక్తులవల్ల యింతకు మున్నెన్నడూ లేనంతగా మన దేశానికి హాని కలిగింది.

బాలబాలికలైన మీరందరూ కులమత వర్ణ భేదాలు వదిలి దేశ సమైక్యతకోసం ఏకమవుతారని ఆశిస్తున్నాను. మీ లేత హృదయాల్లో జాలువారే కొంగొత్త ఊహలే భావితరానికి చైతన్య దీప్తులుగా వెలుగు నింపుతాయని ఆశిస్తున్నాను, మీలోని విద్యా సుసంపన్నత, మీలోని సృజనాత్మక కళలు, నిబిడీకృతంగా ఉన్నాయని వాటిని జాతి జీవన చైతన్యానికి కేతనాలుగా ఎగురవేసి భారతదేశం సగౌరవంగా చెప్పుకోవడానికి మీరు నడుం కట్టాలి. మీరంతా చక్కటి ఆదర్శవాదులుగా శాస్త్రీయ దృక్పథంతో, సాంకేతిక విద్యారంగంలో ప్రగతిశీలురుగా పురోగమించడానికి ప్రభుత్వ బాధ్యతగా, మన విద్యా విధానాలను రూపొందించింది. వివిధ రంగాల్లో ఈనాడు అశాంతికి మూల కారణమై, ప్రస్తుత సమస్యలను సరియైన రీతిలో అవగాహన చేసుకోకపోవడంవల్ల నైతిక విలువలు తగ్గుతున్నాయి.

ధర్మం, న్యాయం, విద్యారంగంలో అభినివేశం, పెద్దలపట్ల గౌరవప్రవత్తులు మీలో పెంచుకోవాలి, దానికి అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు ఉన్న వనరులను ఉపయోగిస్తూ ప్రభుత్వం కూడా శాయశక్తులా కృషిచేస్తుంది. మీకోసం మీసంక్షేమంకోసం, ప్రభుత్వం ఎన్నో పథకాలను, కార్యక్రమాలను రూపొందించి నిర్మాణాత్మకమైన మార్పులు తెచ్చింది. వాటిలో భాగంగా నిర్బంధ ప్రాథమిక విద్యా పథకం, మధ్యాహ్న భోజన పథకం ప్రవేశ పెట్టింది. అంతేకాక హరిజన, గిరిజన, వెనుకబడిన, దళిత జాతులు మొదలగు వర్గాల బాలబాలికలకు ప్రత్యేక సదుపాయాలు కలుగజేస్తోంది.

అయినా ఇవి అన్నీ రాష్ట్రంలోని బాలబాలికలందరికి అందడంలేదు. అందుకే ప్రభుత్వం కుటుంబ కారణంగా, వ్యక్తిగత కారణంగా, సంఘం కారణంగా, సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడి పాఠశాల విద్యకు నోచుకోని విద్యార్థుల సంక్షేమం కోసం అనియత విద్యా పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఇప్పటికే రాష్ట్రంలో 17,452 అనియత విద్యా కేంద్రాలను నెలకొల్పి 4,36,300 వేల మంది బాలబాలికలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతోంది. మధ్యాహ్న భోజన పథకం ద్వారా వీలైనంత మంది బీద విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయం కలుగజేస్తోంది.

మీలో శాస్త్ర విజ్ఞానంపట్ల అవగాహన కలుగజేయడానికి ప్రతి సంవత్సరం జిల్లా స్థాయిలోను రాష్ట్రస్థాయిలోను, జాతీయస్థాయిలోను వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తోంది. మీలోని సేవా పరాయణతను సమాజ సంక్షేమానికి ఉపయోగపడే విధంగా స్కౌటింగ్, గైడింగ్ కార్యక్రమాల పథకాల ద్వారా ప్రతి పాఠశాలలో అంచెలంచెలుగా అమలు పరచడానికి ప్రణాళిక రూపొందించబడింది.

మీలోని మూఢ విశ్వాసాల వల్ల, పేదరికం, ఆహార కొరత వల్ల, ఆహారంలో పోషకవిలువల సూత్రాలు తెలియక పోవడంవల్ల సరియైన పోషకాహారం తీసుకోవడం లేదు. అందుకే పోషణ, ఆరోగ్య విద్య, పరిసరాలు పరిశుభ్రత ఉద్యమాలను ప్రారంభించాము.

**మీలోని మూఢ విశ్వాసాల వల్ల, పేదరికం, ఆహార కొరత వల్ల, ఆహారంలో పోషకవిలువల సూత్రాలు తెలియక పోవడంవల్ల సరియైన పోషకాహారం తీసుకోవడం లేదు. అందుకే పోషణ, ఆరోగ్య విద్య, పరిశుభ్రత ఉద్యమాలను ప్రారంభించాము.**

మీలోని సృజనాత్మక శక్తిని బహిర్గతం చేసేందుకు, మీ సర్వతోముఖాభివృద్ధి కోసం బాలల అకాడమీ, జవహర్ బాల భవనములు మొదలగు ప్రభుత్వ అనుబంధ సంస్థలను, జిల్లా స్థాయిలోను రాష్ట్రస్థాయిలోను నెలకొల్పడం జరిగింది.

అయితే భావి భారత భాగ్యోదయంపై ఎన్నో ఆశలు, ఆకాంక్షలు నింపుకున్న నవభారత నిర్మాత, బాలలందరికి ఆప్తుడు, ఆప్తబంధువు, ఆదర్శమూర్తి, దేశభక్తుడు అయిన పండిత జవహర్ లాల్ నెహ్రూగారి ఈ జన్మదినోత్సవ సందర్భంగా, మీరు మేము వారి పవిత్ర స్మృతికి పుష్పాంజలి సమర్పించడమేకాదు, మహితాత్ముడు చాచా నెహ్రూ అడుగు జాడల్లో నడుస్తూ వారి ఆదర్శాలను అవగాహన చేసుకుంటూ భారతదేశ ప్రగతికి, తెలుగునాడు అభ్యున్నతికి పాటుపడదామని ప్రతిజ్ఞ తీసుకోడంలోనే సార్థకత ఉందని తెలుపుతూ, ఈ సభలో పదవతరగతి, ఏడవతరగతిలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులందరిని అభినందిస్తూ మిగతా బాలబాలికలందరూ విద్య ఎడ అభినివేశం చూపిస్తారని ఆశిస్తున్నాను.

ఈ బాలల దినోత్సవ సందర్భంగా ఇక్కడ కూడిన మీకే కాదు రాష్ట్రంలోని బాలబాలికలందరికి, ఇవే నా శుభాకాంక్షలు, శుభాశీస్సులు.

**చాచా నెహ్రూ – అమర్ రహే!**



# నిరంతర క్రీడాకారుడు మానవుడు

**(1985 జనవరి 18న ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ క్రీడోత్సవాలలో ప్రసంగం)**

గట్లలో, పుట్టల్లో, చెట్లలో, చేమలో తిరుగుతూ, ఆకులో ఆకుగా, రెమ్మలో రెమ్మగా అష్టకష్టాలకు వోర్చి అటవీ సంపదను పరిరక్షిస్తున్న మీ అందరికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.

మీరు ఎన్నుకొన్న ఈ శాఖలో పని చక్కని దేహదారుఢ్యం మీద, శ్రమసహన శక్తి మీద, దృఢతర దీక్ష మీద ఆధారపడిన వ్యవహారం. ఇటువంటి శాఖలో పనిచేసే వారు ఎప్పటికప్పుడు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకొంటూ, దేహదారుఢ్యాన్ని కాపాడుకొంటూ అన్ని శ్రమలకు వోర్చి తమ కర్తవ్య నిర్వహణను కొనసాగించవలసిన అవసరం ఎంతైనా వుంది. ఇట్టి మీ శాఖ ఉద్యోగులకు ఆరోగ్య పోషణకు పనికి వచ్చే ఆటల పోటీలను నిర్వహించడం, తద్వారా మీ అందరికి ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని ఉత్తేజాన్ని కలిగించడం – ఇది ఎంతో అభినందనీయం.

ఆటలు కాని, వాటిలో పోటీలు గాని ఈనాటివి కావు. ఏనాడో వేటను ఒక ఆటగా ఎంచేవాడు

అనాగరికుడైన మానవుడు. అదే అతని దేహదారుఢ్యాన్ని పెంచేది. అదే అతని ఆరోగ్యానికి ఆలంబన అయ్యేది.

ఆ తరువాత మానవుడు క్రమంగా అభివృద్ధి చెంది పరిణతిని సాధించాడు. వివిధ రంగాల్లో పురాణాల్లో, ఇతిహాసాల్లో మనం చదువుతూ వుంటాం–ఆనాడే విలువిద్య, ఖడ్గ విద్య, మల్ల విద్య, రథ చాలన విద్యలు ఇటువంటి వాటిల్లో ఎన్నో క్రీడోత్సవాలు నిర్వహిస్తుండబడేవి. మహా భారతంలో వీరుడు కర్ణుడు – మొట్టమొదటిసారి అర్జునుణ్ణి చూచినపుడు తొడచరిచి, సవాలు చేసి, పోటీకి ఆహ్వానించిన ఘట్టం మన అందరికీ తెలుసు. శివధనుర్భంగంతో శ్రీరామచంద్రుడు సీతాదేవిని గెలుచుకొంటే, మత్స్య యంత్ర్యాన్ని ఛేదించి అర్జునుడు ద్రౌపదిని గెలుచుకున్నాడు తనకే గాక తన అన్నదమ్ములందరకు సతీమణిగా.

నాగరికత విస్తరిల్లిన కొద్దీ మానవ మేధాశక్తితో అనేక రకాల క్రీడలకు రూపకల్పన చేయడం జరిగింది. ఇప్పుడు కండబలంతో కంప్యూటర్లతో కూడా ఆటలు ఆడుకొంటున్నారు.

"మానవుడు నిరంతరం విద్యార్థిగా వుండాలి" అన్నది నానుడి. నా ఈ దేశంలో మానవుడు నిరంతరం క్రీడాకారుడిగా ఉండాలి. ఎప్పటికప్పుడు తన దేహదారుఢ్యాన్ని రక్షించుకొంటూ ఆరోగ్య పటుత్వం పరిపోషించుకుంటూ ఉండడానికి నిరంతరం సాధన చేయడం ఎంతో ముఖ్యం. అట్టి సాధన ఆటల ద్వారానే మనకు అనాయాసంగా లభిస్తుంది. ఈ దృష్టితో చూసినప్పుడు ఉద్యోగస్తులకు ముఖ్యంగా పోలీసు, అటవీ శాఖ వంటి శాఖల్లో పనిచేసే వారికి క్రీడోత్సవాలు నిర్వహించవలసిన అవసరం ఎంతగానో వుంది. ఈ సందర్భంలో మరోసారి ఈ క్రీడోత్సవాల్లో పాల్గొంటున్న అటవీ శాఖ ఉద్యోగులందరికీ నా అభినందనలు తెలియజేస్తూ, ఈ క్రీడోత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

**జై తెలుగునాడు. జైహింద్!**



# ప్రజాసేవకు పునరంకితం

**(1985 మార్చి 9న ప్రమాణ స్వీకారసదస్సులో చేసిన ప్రసంగం)**

ప్రజాస్వామ్యానికి ప్రాణంగా, ఊపిరిగా, సుస్థిరత్వాన్ని, సుస్వరూపాన్ని కల్గించిన ఆడపడుచులకు, అన్నదమ్ములకు, అఖిలాంధ్ర ప్రజానీకానికి, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ శంకర్ దయాళ్ శర్మ గారికి,

ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణ్యంగా నిర్వహణ చేయబోయే పరిపాలనా వ్యవస్థలో నాకు సహచరులుగా తోడు నిలవబోతున్న మంత్రి మండలి సభ్యులకు, పత్రికా ప్రతినిధులకు, పాలనా దక్షులకు, నిర్వాహకులకు ఆశీఃపరమైన అక్షతలతో ప్రభుత్వ విజయాన్ని అకాంక్షిస్తున్న సదస్యులందరకూ నా కృతజ్ఞతా పూర్వక విజయోత్సవ శుభాభివందనాలు అభినందనలు. అమాయకపు స్నిగ్ధ, ముగ్ధ దరహాసాలతో దైవత్వం నింపుకొన్న చిరంజీవులకు శుభాశీస్సులు –

ఎదురు చూచింది దేశం తెలుగునాట ఏమి జరగబోతోందని! ఏమి నిర్ణయించబడుచున్నదని!! మీ

మనోగతాభిప్రాయాలకు, మంచిని పెంచే వౌరవడికి యీనాటి విజయం నిదర్శనం. ఈ తీర్పు మీది. ఈ విజయం మీది. నిలుచున్నాను మీముందు మీమనిషిగా, మీ ప్రతినిధిగా –

ఈనాడు రాజకీయం అంటే దగాకోరు విధానంకాదు, అవినీతి కాదు, అక్రమంకాదు, కుళ్ళుకాదు, అధికార దాహంతో, పదవీ వ్యామోహంతో పార్టీ ఫిరాయించడం కాదు, పవిత్రమైన పరిపాలనా బాధ్యత అప్పగించిన ప్రజలకు విశ్వాసంగా, నైతికమైన విలువలతో కూడిన ప్రవర్తనతో, మానవత్వంతో "మానవసేవే మాధవ సేవ" అన్న పరమార్థంతో అంకితభావంతో సేవచేయడం.

ఏ పేద ప్రజలైతే సంఘానికి దూరమై, సమాజానికి వెలియై, స్వాతంత్ర్య ఫలితాలు అందరితో సమానంగా అనుభవించలేక, సామాన్య మానవుని నిత్యావసరాలైన కూడు, గుడ్డ, నీడ కరువై కన్నీళ్లతో కడుపు నింపుకుంటూ, చావలేక బ్రతుకుతున్నారో అట్టి పీడిత, బాధిత, దళిత సోదరుల సంక్షేమం రాజకీయం ఏనాడు మరచిందో, తన బాధ్యత విస్మరించిందో, ధనవంతులకు తాకట్టు పెట్టబడిందో, బడాబాబుల జేబుల్లో దూరిందో, కలవారి కలిమిని పెంచిందో, అవినీతికి హారతి పట్టిందో, ఆనాడే దేశ సౌభాగ్యం కుదిచించుకు పోయిందన్న భావంతో, బాధతో పాతను కొత్తతో కడగాలని మీరానాడు అందలమెక్కించారు తెలుగు దేశాన్ని.

ఆ విధంగా ప్రజలుంచిన విశ్వాసానికి విరుద్ధంగా నడిచి ఎప్పుడైతే కొంతమంది ప్రజాద్రోహానికి పాల్పడ్డారో, మీరిచ్చిన అధికారాన్ని స్వార్థంతో ముడిపెట్టుకున్నారో, పదవీ దాహంతో ఫిరాయింపులకు పాల్పడ్డారో ఆనాడే అర్హత కోల్పోయారు, మీ ప్రతినిధులుగా వ్యవహరించడానికి –

పెత్తనం కోసం తమ పార్టీనే ముక్కలు చెక్కలు చేయడానికి తెగించిన దుష్ట సంప్రదాయవాదులు వీరికి తోడయ్యారు, అండగా నిలిచారు. ప్రజాస్వామ్యాన్ని కూలగొట్టడానికి కుట్ర చేశారు.

జరగరానిదే జరిగింది. కంచే చేను మేసింది. శాసనసభా సాంప్రదాయమే కించపరచబడింది. మెజారిటీ లేనివారికే పట్టం కట్టబడింది –

ఉడికింది దేశం. గగ్గోలెత్తింది భారతం. పార్టీలు వేరైనా, సిద్ధాంతాలు మారైనా ప్రజాస్వామ్య రక్షణకు పూనుకున్నాయి తమ ధ్యేయంగా, తమ లక్ష్యంగా, తమ బాధ్యతగా ప్రజాతంత్ర పక్షాలు. రుద్రమ వారసత్వాన్ని ఋజువు చేశారు మా ఆడబడుచులు పొంగెత్తిన చైతన్యంతో నడుం బిగించి –

నాటి బాలచంద్రునికి ప్రతిరూపాలై, ఉరకలెత్తే ఉద్రేకంతో ముందుకు దూకారు యువకులు పిడికిలి బిగించి.

ఎందరో నా తమ్ముళ్లు యీ అన్నకోసం తుపాకి గుళ్ళకెదురు నిలిచారు, రక్తాన్ని ధార వోశారు, ఆత్మార్పణం చేశారు, అమరజీవులయ్యారు –

కార్ఖానాలు మూతపడ్డాయి, కార్మిక వర్గం వీధిన పడింది. గ్రామ గ్రామానా చిచ్చు రేగింది. కర్షకలోకం ముందుకు దూకింది–

విద్యాధికులు, విజ్ఞానులు, మేధావులు నిరసన తెలిపారు బహిరంగంగా ఇది రాజ్యాంగానికే విరుద్ధమని–

ప్రపంచవ్యాప్తంగా దుమారం లేచింది ఇది దురాగతమని–

పత్రికాలోకమే ఘోషించింది ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం నిట్టనిలువుగా నడివీధిలో హత్య చేయబడిందని–

ఇంత అయింతర్వాతగాని, ఇంత సంక్షోభం చెలరేగిన తరువాతగాని, ఇంత రక్త తర్పణం జరిగిన తర్వాతగాని 'ఓహో ! ఇదా జరిగిన అన్యాయమని గుర్తించలేదు పెద్దలు. ఈ కుతంత్ర్యాన్ని కప్పదలచారు మేమెరగమని, మాకు తెలియదని.

ఆనాటి ప్రజాశక్తికి తలవంచారు తప్పనిసరై ప్రజా చైతన్యమే ప్రజాస్వామ్యాన్ని రక్షించుకొంది. ప్రజాప్రభుత్వం పున ప్రతిష్ఠితమైంది.

అయినా, తెలుగుదేశం ఆవిర్భవించింది అధికారం కోసం కాదు, అందుకే రాజకీయాలలో నైతిక విలువలు పెరగాలని, ప్రజా విద్రోహులు పదవులలో వుండకూడదని, తిరిగి ప్రజామోదం పొందితేనేగాని శాసన సభ్యులుగా వారికి అర్హత రాదని ఆ పవిత్రతను కాపాడటం కోసమే ఆనాడు శాసన సభను రద్దుచేయటం జరిగింది.

ఈనాటి సంరంభానికి కారణమది. దానికి పర్యవసానమిది. మరోసారి ఋజువు చేశారు తెలుగుదేశం మీదని, తెలుగుదేశం ప్రభుత్వం అవలంభించిన సిద్ధాంతాలు, విధానాలు, కార్యక్రమాలు మంచివని–

సామాన్య మానవునికి కావలసిన తిండి, బట్ట, నీడ, నీరు లభింపజేయడం, కుల, మత, వర్గ, వర్ణ విభేదాలకు అతీతమైత సమ సమాజాన్ని, శ్రేయోరాజ్యాన్ని సృష్టించడం, స్వాతంత్ర్య ఫలితాన్ని సమపాళ్ళలో అందరికీ అందజేయడం, సమానావకాశాలు కలిగించడం, పెత్తందారీ గుత్తాధికారాన్ని కూలగొట్టడం, సమాజ శ్రేయస్సును దోచుకొనే దళారీ వర్గాన్ని తొలగించడం తెలుగుదేశం ఆదర్శం–

ఈనాడు మీరిచ్చిన తీర్పుతో, నిర్ణయంతో, అంగీకారంతో ఆమోదంతో నాలో మీరుంచిన విశ్వాసానికి, నమ్మకానికి తగ్గని విధంగా, పునరంకితమవుతున్నాను ప్రజాసేవకు పవిత్రమైన దీక్షతో, భావంతో– నేడు సమాజంలో, యువకులలో చెలరేగిన నిస్పృహకు, నిరాశకు, నిరుద్యోగానికి కారణం కాలదోషం పట్టిన విద్యావిధానం. తమ అవసరాలకు తగ్గ తాబేదారులను తయారుచేసికొనేందుకు తెల్లవాడు పోసిన మూసలో కొనసాగుతున్న బానిస విద్యావిధానానికి స్వస్తి. నూతన పారిశ్రామిక చైతన్యాన్నందించే వృత్తి విద్యాపరమైన ప్రగతి విద్యావిధానానికి నాంది –

అధికారం రాష్ట్ర సచివాలయానికే పరిమితం కాకూడదని వికేంద్రీకరణ పరంగా పేదవాడి యింటి తలుపు తట్టి, సమస్యలు తెలిసికొని పరిష్కరించ గలిగిననాడు గాని–

అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజలను భాగస్వాములను చేసి, ఆ కార్యక్రమాలను ఎవరికి వారే నిర్వహించు కోగలిగేలా చేసిన నాడు గాని–

పటిష్టమైన, విశిష్టమైన అధికార వికేంద్రీకరణ జరగదని, పూజ్య బాపూజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సుస్వరూపం అందుకోదని, ప్రజాస్వామ్యానికి సరయిన నిర్వచనం కల్పించబడదని – ప్రవేశ పెట్టబోతున్నాం మాండలిక రాజ్యాంగ పరిపాలనా విధానం –

ఎన్ని ఆశలున్నా, ఎన్ని కలలు కన్నా వాటిని వాస్తవం చేసికొనే వనరులు కావాలి. అందుకే అడుగుతున్నాం ఎన్నోసార్లు కేంద్ర రాష్ట్ర సమన్వయం పునః పరిశీలించబడాలని, అభివృద్ధి కార్యక్రమాలతో బాటు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు రోజు రోజుకు ప్రాధాన్యత పెరగడం వల్ల ప్రజాప్రభుత్వాల బాధ్యత హెచ్చుడం వల్ల చాలీచాలని వనరులతో సతమత మవుతున్నాం, సరిపెట్టుకోలేకపోతున్నాం, నిర్వహణ బాధ్యత సమన్వయం చేసి అందుకే కోరుతున్నాం, యీ సత్యాన్ని గుర్తించి, మరిన్ని వనరులు, అధికారాలు రాష్ట్రాలకు సంక్రమింపచేయటం న్యాయమని, అది రాజ్యాంగ విహితమని, సర్వతోముఖాభివృద్ధికి సరయిన విధానమని.

**అభివృద్ధి కార్యక్రమాలతో బాటు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు రోజు రోజుకు ప్రాధాన్యత పెరగడం వల్ల ప్రజాప్రభుత్వాల బాధ్యత హెచ్చుడం వల్ల చాలీచాలని వనరులతో సతమత మవుతున్నాం, సరిపెట్టుకోలేకపోతున్నాం.**

ఈ విధానాల అమలులో ఎవరికి ఏయే ఫలితాలు ఉద్దేశించబడ్డాయో వాటిని ఆయావర్గాల వారికి సక్రమంగా అందజేయాలనీ, సద్ధర్మ పరిపాల నా నిర్వహణలో అన్యాయానికి, అక్రమానికి, అవినీతికి ఆస్కారం లేని వ్యవస్థ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, రాష్ట్రప్రగతికి తోడ్పడాలని నా ప్రభుత్వంతో సహకరించాలనీ ప్రభుత్వోద్యోగులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను –

ఎంతో పవిత్రభావంతో, గౌరవంతో, అనురాగంతో, వాత్సల్యంతో యీ ప్రజాప్రభుత్వ ప్రమాణ స్వీకార సదస్సుకు నిండుతనం తెచ్చి శోభ చేకూర్చిన – కొత్తబలాన్ని, ఆవేశాన్ని, చైతన్యాన్ని నాలో రగలించిన – నా వారందరికీ నా కృతజ్ఞతా పూర్వక సమస్సుమాంజలులు సమర్పిస్తున్నాను –

**'ఏదేశమేగినా ఎందుకాలిడినా**
**ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా**
**పొగడరా నీతల్లి భూమి భారతిని**
**నిలుపరా నీజాతి నిండు గౌరవము'**

**తెలుగు జాతి నిండు గౌరవం నిలవటానికి**
**తలవంచని తెలుగువారి ఆత్మాభిమానాన్ని పరిరక్షించటానికి**
**తెలుగు నేలను సుభిక్షం చేయటానికి**
**తెలుగునాట పారిశ్రామిక ప్రగతి సాధించటానికి–**
**ఆర్థిక అసమానత్వాన్ని తొలగించటానికి–**
**ఆడబడుచులకు అండగా నిలవటానికి–**
**తెలుగుతల్లికి సంస్కృతీ వికాసాల పరిమళాలతో నీరాజనం యివ్వటానికి – అంకితం నా జీవితం!**

అదే నా సమర్పణం!

**జై తెలుగునాడు. జైహింద్!**



# ఆడవారు వంటింటి కుందేళ్ళు కారు

**(ఆంధ్ర ప్రదేశ్ పదవ మహిళా క్రీడోత్సవాల సందర్భంగా ప్రసంగం)**

ఈ రోజు యిక్కడ పదవ ఆంధ్రప్రదేశ్ మహిళా క్రీడోత్సవాలలో పాల్గొని, యీ ఉత్సవాలకు ప్రారంభోత్సవం చేయడానికి నాకెంతో అనందంగా వుంది. ఈ ఉత్సవాలను నిర్వహించటానికి చొరవ తీసుకొన్న రాష్ట్ర క్రీడామండలి అధ్యక్షులు, శ్రీ నారాయణ రెడ్డిగారిని, యితర సభ్యులను, సిబ్బందినీ అభినందిస్తున్నాను. ఈ ఉత్సవాలలో పాల్గొంటున్న మహిళా క్రీడాకారిణులకు నా శుభాకాంక్షలు.

తరతరాలుగా ఆర్థిక అసమానతకు గురియై, సాంఘిక దురాచారాలకు బలియై 'అబల' అని యీసడించబడిన మన మహిళలు ఈనాడు ఒక నవతేజంతో, నూతనోత్సహంతో ముందు కురుకుతున్నారు. అన్ని రంగాలలో ముందడుగు వేస్తున్నారు. పురుషులకు ఎందులోనూ తీసిపోమని అనిపిస్తున్నారు. తమ బలం నిరూపించుకొని సబలలుగా పేరుగడించుకొంటున్నారు.

ఆడపడుచులు ముందుకు వచ్చి తమ ప్రతిభ నిరూపించుకొంటే అది మగవారికి ఎప్పుడూ అబ్బురంగా వుంటూ వచ్చింది. ఆనాడు సత్యభామ విజృంభించి కృష్ణుడి చేతిలో విల్లు తాను పుచ్చుకొని నరకాసురునిపై

బాణ వర్షం కురిపించినప్పుడు "వీణ చక్కగ పట్టవెరవెరుంగని లేదు బాణా సనంబెట్లు పట్టనేర్చె" అని ఆశ్చర్యపడ్డారు.

అయితే రోజులు మారాయి నేడు, ఆడవారు వంటింటి కుందేళ్లు గారు ఈనాడు. అన్నిరకాల ఆటల పోటీలలో తమ వ్యక్తిత్వం నిరూపించుకొని నిలబెట్టుకొంటున్నారు.

వారిలో క్రీడలపట్లగల ఆసక్తి పెంపొందించి, ప్రతిభగల మహిళా క్రీడాకారిణులకు తగిన అవకాశాలు, గుర్తింపు లభించేలా చేయటానికి మహిళల కోసం ప్రత్యేకంగా జాతీయ స్థాయిలో క్రీడోత్సవాలను నిర్వహించటం మనదేశంలో 1975 నుండే ప్రారంభమయింది. 1981లో హైదరాబాదులో ఏడవ జాతీయ మహిళా క్రీడోత్సవాలను నిర్వహించి మనరాష్ట్ర క్రీడామండలి అందరి ప్రశంసలూ చూరగొన్న సంగతి మనందరకు గుర్తుండే విశేషమని నేను వేరుగా చెప్పనక్కరలేదు.

మన రాష్ట్రంలో క్రీడాకారిణులు జాతీయ, అంతర్జాతీయ పరిగణన సంపాదించుకోడం మనందరకు గర్వకారణం.

ముఖ్యంగా వాలీబాల్‌లో శ్రీమతి ములినీ రెడ్డి తన ఆధిక్యత నిరూపించుకొని అర్జున్ ఆవార్డు సంపాదించుకొంది. ఇంకా కుమారి రాధికా రెడ్డి, కృష్ణ బోస్, కుమారి ప్రమీలా రామకృష్ణయ్య, నళిని రాజరత్నం వంటి యువ క్రీడాకారిణులు అనేక బహుమతులు గెలుచుకొని రాష్ట్రం పేరు నిలబెడుతుండటం మనకు ఎంతో సంతోషదాయకం. వారందరిని నేను అభినందిస్తున్నాను.

మన రాష్ట్రంలో మహిళా క్రీడాకారిణుల సామర్థ్యం, కౌశలం పెంపొందించి వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో మరెన్నో ప్రశంసనీయమైన బహుమతులు గెలచుకొని వృద్ధిలోనికి రావటానికి మహిళా క్రీడోత్సవాలు దోహదం చేయగలవని ఆశిస్తున్నాను.

**జై తెలుగునాడు. జైహింద్!**



# ప్రజాసేవకే అంకితం ఈ జీవితం

**(వరంగల్లులో ది. 20-05-1985న పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్న అనంతరం బహిరంగ సభలో చేసిన ప్రసంగం)**

సోదరీ సోదరులారా! మీ అందరికి తెలుసు, ఈనాడు మీరుంచిన విశ్వాసంతో, నమ్మకంతో తెలుగుదేశం అధికారాన్ని చేపట్టింది. దీని ఆంతర్యం కూడా మీకు తెలుసు. 35 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం మన రాష్ట్రాన్ని ఏ పరిపాలనయితే ప్రజలకు సంతృప్తికరమైన మార్గాన్ని, చూపించలేకపోయిందో, ఏ పరిపాలన అయితే అవినీతిని, అక్రమాన్ని, లంచగొండితనాన్ని నిర్మూలించలేకపోయిందో, ఏ ప్రభుత్వమయితే పేదవాని కాలేకడుపులోకి ఇంత గంజిపోయలేకపోయిందో, ఏ పేదరికాన్నయితే నూటికి 52 శాతం దారిద్ర్యరేఖకు దిగువన అట్టి పెట్టిందో, అటువంటి తారతమ్య వ్యవస్థ కాదని తెలుగు దేశాన్ని మీరందరు ఎంతో అభిమానంతో, ఆదరంతో గౌరవించారు. ఆదరించారు. అందుకు అందరికి హృదయపూర్వకమైనటువంటి, స్నేహపరంపరతో కూడినటువంటి కృతజ్ఞతలు, నమస్కారములు అందజేస్తున్నాను.

ప్రజాస్వామ్యం మన రాష్ట్రంలో దెబ్బతింటున్నప్పుడు, ప్రజాస్వామ్య విధానానికి విరుద్ధంగా, తమ పలుకుబడిని కేవలం దగాకోరు విధానంతో రాజకీయాన్ని దెబ్బకొట్టాలని, రాజకీయాన్ని కలుషితం చేయాలని దుష్టశక్తులు ప్రయత్నించినప్పుడు, ఆనాడు మహోద్యమంతో మరొకసారి మీరు తెలుగుదేశాన్ని పునః ప్రతిష్టించారు. మరొకసారి ప్రజాస్వామ్యానికి నివాళులిచ్చారు. కాబట్టి మరొకసారి మీకు విప్లవాత్మక

కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు తెలియజేస్తున్నాను – ఈ సభా ముఖంగా. ఏవరైతే ప్రజాస్వామ్యాన్ని దగాచేయడానికి పూనుకున్నారో, ఎవరైతే విద్రోహులుగా వ్యవహరించారో, అటువంటివారు ఉన్నంత వరకు రాజకీయం పవిత్రంగా ఉండదనే భావంతో శాసనసభను నేను రద్దుచేసినప్పుడు మీరందరూ కూడా ముక్తకంఠంతో ఆనాటి ప్రజాస్వామ్య విధానంతో నేను తీసుకున్న తీర్పును ఆమోదించినందుకు మరొకసారి నా కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నాను.

అంతే కాదు కేవలం ఈనాడు పదవికోసం, అధికారం కోసం రాజకీయాలు పాటుపడనక్కరలేదని, ప్రజల విశ్వాసాన్ని చూరగొని, ప్రజల ప్రతినిధులుగా వ్యవహరించినప్పుడుగాని సరైనటువంటి అభివృద్ధి జరగదనే భావంతో తిరిగి ఎన్నికలు జరిగినప్పుడు 1985 మార్చి 5వ తేదీన జరిగిన ఎన్నికల్లో మరొక్కసారి మీ విశ్వాసాన్ని, నమ్మకాన్ని తెలుగు దేశం పార్టీపై ఉంచి, తెలుగు దేశానికి తిరిగి పరిపాలన బాధ్యత అప్పగించినందులకు అతి సేవా దృక్పథంతో కూడినటువంటి నా నమస్సులు మీ అందరికీ తెలియజేస్తున్నాను – మరొకసారి సభాముంగా. ఇదంతా కేవలం ప్రజా విజయం. ప్రజాస్వామ్యానికి ఒక ఆకృతిగా ఉంటున్నటువంటి ఈ పరిపాలనా విధానానికి మీరందరూ ఇచ్చిన తీర్పుగా నేను దీనిని పరిగణిస్తున్నాను.

ఈనాడు మన దేశంలో సామాన్య మానవునికి కావలసిన తిండి, బట్ట, నీడ కరువైనప్పుడు, వారి నిత్యావసరాలు వారికి ఏ మాత్రం లభించకుండా ఉండే దుస్థితి ఏర్పడినప్పుడు, అటువంటి దురదృష్టకరమైన విధానాన్ని తొలగించి, ప్రజలకు కావలసినటువంటి అవసరాలు తీర్చడం, పేదరికాన్ని నిర్మూలించడం, కాలే కడుపులకు కనీసం ముంతెడు గంజి పోయడం, నిలువ నీడలేక అలమటిస్తున్న బాధిత, పీడిత ప్రజానీకాన్ని ఆదుకోవడం ప్రథమ కర్తవ్యంగా మా ప్రభుత్వం భావించింది.

పేద ప్రజలది ఈ ప్రభుత్వం – పేద ప్రజలకే అంకితం. అదే విధంగా ఈనాడు 1985 మార్చి 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఈ రెండు నెలల కాలంలో తీసుకొన్నటువంటి విప్లవాత్మకమైన, నిర్మాణాత్మకమైన విధానాలేమిటో మీకు తెలుసు. ఎవరైతే నిలువ నీడలేక, పొలము దున్నటానికి కూడా భూమి వసతిలేనటువంటి పేదల కందరికి మిగులు భూమి పంచిపెట్టాలనే భావంతో సుమారుగా 2,300 ఎకరాల విస్తీర్ణం కలిగినటువంటి సుక్షేత్రాన్ని 8,000 మంది నిలువ నీడలేని వారికి, ఆధారం లేనటువంటి వారికి పంచిపెట్టడం జరిగింది.

పరిపూర్ణమైన పవిత్రమైన ప్రభుత్వాన్ని ప్రజలకు అందించడం ధ్యేయంగా పెట్టుకున్నది ఈ తెల ుగుదేశం. దుబారాకు తావివ్వకుండా, పనికిరాని వ్యవస్థలుగా వున్నవాటిని ఏరివేసి, సమర్థవంతమైన ప్రభుత్వాన్ని ప్రజలకు అందించడమే ప్రభుత్వ ధ్యేయం. ఆ ఆలోచన పర్యవసానమే శాసనమండలి రద్దు తీర్మానం. మొదటిసారి దానిని గుర్తించకపోయినా, రెండవసారి అయినా ప్రజాస్వామ్య విధానాన్ని, ప్రజల యొక్క తీర్మానాన్ని, తీర్పును గుర్తించి గౌరవించి శాసనమండలిని రద్దుచేసినందుకు కేంద్ర ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను–సభాముఖంగా.

సోదరులారా! ఇక మూడవ సమస్య–మాండలిక రాజ్యాంగ విధానం. ఈనాడు అధికార కేంద్రీకరణలో ఏమాత్రం అభ్యుదయం జరుగదు. అధికార వికేంద్రీకరణ జరగాలి. స్థానికంగా ఎవ్వరైతే ప్రజలకు బాధ్యత వహించేందుకు ప్రజా ప్రతినిధులుగా ఉన్నారో వారికి సంపూర్ణమైన వనరులు కల్పించాలి. సంపూర్ణమైనట్టి రాష్ట్రాభివృద్ధిని అధికార వికేంద్రీకరణ ద్వారా జరపాలనే నిర్ణయంతో మాండలిక రాజ్యాంగ విధానం అమలుచేస్తున్నది తెలుగుదేశం. ఈ ప్రభుత్వం మీ ప్రభుత్వం.

ప్రజల ప్రభుత్వమని, ఈనాడు ఇటువంటి విప్లవాత్మకమైన విధానాలను ఎన్నో అమలు చేస్తున్నాం. మన రాష్ట్రాన్ని మనం తీర్చిదిద్దుటకు ఈ 35 సంవత్సరాలు జరిగిన అస్థవ్యస్థ పరిపాలనలో ఉన్నట్టి ఈ దురదృష్టకరమైన విధానాన్ని, చెడును తొలగించాలి. పరిపూర్ణమైనటువంటి ఆదర్శవంతమైన విధానాన్ని, రాజ్యాంగాన్ని మనం సృష్టించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. అహర్నిశలు మనసా, వాచా కర్మాణా తెలుగుదేశం ప్రభుత్వం ప్రజాసమస్యలపైన దృష్టి వహించి సామాన్య ప్రజానీకానికి అంకితమైన భావంతో, పేదరికాన్ని నిర్మూలించడానికి కృషిచేస్తుందని ఈ సభాముఖంగా మరొకసారి మనవి చేస్తున్నాను.

అహర్నిశలు మనసా, వాచా కర్మాణా తెలుగుదేశం ప్రభుత్వం ప్రజాసమస్యలపైన దృష్టి వహించి సామాన్య ప్రజానీకానికి అంకితమైన భావంతో, పేదరికాన్ని నిర్మూలించడానికి కృషిచేస్తుందని ఈ సభాముఖంగా మరొకసారి మనవి చేస్తున్నాను.

ఆ కృషి సాగుతుందని, దాని పర్యవసానమే ఈ రోజున ఈ వరంగల్ పట్టణంలో ఈ కార్యక్రమానికి నేను ప్రత్యేకంగా రావటం జరిగిందని కూడా నేను మనవి చేస్తున్నాను. ఎన్నికల సందర్భంలో ఒకసారి వచ్చాను. అప్పుడు మీ సమస్యలన్నీ చెప్పారు. ఈనాడు మంచి నీటి సమస్య ఏవిధంగా ఉంది అనేది గమనించాము. కనుకనే ఈ రోజున ఈ బృహత్తరమైన ఈ మంచినీటి పథకమునకు ప్రారంభోత్సవం చేయుటకు నేను రావటం జరిగింది. ఈ రోజున వాటర్ బెడ్స్‌కయితే ప్రారంభోత్సవం జరిగింది.

ఈ పట్టణమంతా మంచినీటి సరఫరాకు కావలసిన పంప్ లైన్లు వేయవలసిన అవసరం ఉంది. దానికి ప్రభుత్వానికి ఇక్కడ ఉన్నటువంటి ఈ మున్సిపాలిటీ వారు అర్జీ పెట్టారు. వారికి కేవలం 2 కోట్ల 30 లక్షల రూపాయలు సుమారుగా కావలసి ఉంటుంది. ఆ విషయంలో నేను వెంటనే మంజూరు చేస్తానని వారికి నేను మనవి చేస్తున్నాను. వారు ఇవ్వవలసిన నిధిని వారు సమకూర్చుకోవాలి.

ఆ తర్వాత ప్రభుత్వ పరంగా ఈనాడు కావలసిన అవసరాన్ని, సహాయాన్ని, వారడిగినది ప్రజా సంక్షేమ కార్యక్రమం కాబట్టి తప్పకుండా ప్రభుత్వం గుర్తిస్తుంది; గమనిస్తుంది, మీ విధానానికి తోడ్పడుతుంది. త్రాగే నీరైనా సరే సామాన్య మానవునికి, ప్రతి ఒక్క పేదవారికి కూడా అందించుట ప్రభుత్వం తన యొక్క బాధ్యతగా స్వీకరిస్తుందని నేను సవినయంగా, ఈ సభాముఖంగా మనవి చేస్తున్నాను.

సోదరులారా! అదే విధంగా ఈ రోజున 220 కె.వి. విద్యుత్తు విధానానికి శంకుస్థాపన చేయటం

జరిగిందని కూడా మీకందరకు తెలుసు. ఈనాడు డిస్ట్రిబ్యూషన్ సరిగా లేదు. లోడ్ ఎక్కువగా ఉంది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు జనసామాన్య సంక్షేమమును దృష్టిలో వుంచుకొని 1 కె.వి. హార్స్ పవర్ 50 రూపాయలకు ఒక సంవత్సరానికి అతి చౌకగా కేవలం నామమాత్ర రుసుంగా అందించడం జరిగిందని మీకు తెలుసు.

అహర్నిశలు రెక్కలు ముక్కలు చేసుకుని, రక్తాన్నే చెమటగా మార్చి దేశానికి ఇంత కూడు పెడుతున్నటువంటి అన్నదాత రైతన్న సంక్షేమం చూచే బాధ్యత తెలుగు దేశ ప్రభుత్వం స్వీకరిస్తుంది. కాబట్టి ఈనాడు మానవ జీవితానికి నిత్యావసర విధానాలలో విద్యుచ్ఛక్తి ప్రాముఖ్యమైనటువంటి పాత్ర వహిస్తున్నది. అటువంటి విద్యుచ్ఛక్తి ఏ మాత్రం కొరత లేకుండా, ఒడుదొడుకులు లేకుండా, అలా సప్లయ్ చేయడం, ప్రతివారికి అందించడం ప్రభుత్వ ధర్మంగా భావించింది.

**అహర్నిశలు రెక్కలు ముక్కలు చేసుకుని, రక్తాన్నే చెమటగా మార్చి దేశానికి ఇంత కూడు పెడుతున్నటువంటి రైతన్న సంక్షేమం చూచే బాధ్యత ప్రభుత్వం స్వీకరిస్తుంది. మానవ జీవితానికి నిత్యావసర విధానాలలో విద్యుచ్ఛక్తి ప్రాముఖ్యమైనటు వంటి పాత్ర వహిస్తున్నది.**

ఈ రోజున మూడవ కార్యక్రమం–కంటి ఆసుపత్రి. కంటి విషయం ఎంత ప్రాముఖ్యమైందో మీ అందరికీ తెలుసు. మానవ జీవితానికి చూపు అతి ముఖ్యమైనది. కాబట్టి ఆ చూపు రక్షణ కోసం వైద్య సౌకర్యాలు కల్గించడం ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకొంది. ముఖ్యంగా ఎవరైతే పేదవారున్నారో పట్టణాలకు వెళ్ళలేక బాధపడుతున్నారో వారికి అంధత్వం పోగొట్టటానికి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకొని ఈ వైద్యశాల నిర్మాణానికి పరిపూర్ణమైన సహకారం అందిస్తుంది. అదే విధంగా ఈనాడు ప్రజా సంరక్షణ విధానంలో పోలీసువారికి అతి ముఖ్యమైన ప్రాముఖ్యత ఉంది. ఏదైనా సరే ఈ తెలుగు రాష్ట్రం 6 కోట్ల తెలుగు ప్రజలది. ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యొక్క భవిష్యత్తు మనందరం తీర్చిదిద్దుకోవాలి.

హింసాత్మకమైన విధానం మాత్రమే దానికి సరైన మార్గం కాదని ఈ సభాముఖంగా విజ్ఞప్తి చేస్తున్నాను. సమస్యలుండవచ్చు, ఏవైనా ఎన్నో బాధలుండవచ్చు. దానికి పరిష్కార మార్గాలున్నాయి. అంతే తప్ప రక్తపాతాన్ని గాని, హింసాత్మకమైన విధానాన్ని గాని ప్రభుత్వం సహించదు. ఏమాత్రం కూడా హర్షించదు. సామాన్య మానవులలో సంక్షోభాన్ని కలిగించటానికి భయాక్రాంతులను చేసి, వారి జీవితాలకు ప్రమాదాన్ని కలిగించే ప్రయత్నాలన్నీ నిర్దాక్షిణ్యంగా అణచివేయడం జరుగుతుంది. మీరందరూ కూడా పునర్నిర్మిత కార్యక్రమాల్లో, అభివృద్ధి కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

మన రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దుకోవటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి. అంతేకాదు ఇటువంటి విధ్వంస విధానాలను, హింసాత్మక విధానాలకు పాల్పడి అమాయకులైన వారిని ఇబ్బంది పెట్టవద్దని, వారి ప్రాణములకు అపాయం తేవద్దని, హింసాత్మక విధానం సమస్యకు ఏ మాత్రం పరిష్కారం ఇవ్వలేదని నేను మీ అందరికి సవినయంగా మనవి చేస్తున్నాను.

ఈనాడు ఎవరైనా అధికారులు ఈ జిల్లా ఏర్పాట్లు చూడడానికి వచ్చినప్పుడు, వారు ఉండటానికి సమావేశాలు ఏర్పాట్లు చేసుకోవటానికి వసతి గృహం అవసరం కాబట్టి, ఈనాడు అట్లాంటి పోలీసు డిపార్ట్‌మెంట్ వసతి గృహానికి నేను ప్రారంభోత్సవం చేయడం ఎంతో ఆనందదాయకం.

ఎంతో గౌరవంతో, అభిమానంతో, ఆదరించారు నా ఆడపడచులు. జన్మతః నాకు ఆడపడచులు లేనప్పటికీ ఇన్ని వేల మంది, లక్షల మంది ఆడబిడ్డలను నాకు అక్క, చెల్లెళ్ళుగా ప్రసాదించినందులకు ఆ పరమాత్మునికి నేను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. సోదరీమణులు సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు తలపెట్టబడ్డాయి.

ఈనాడు ఎక్కడకు వెళ్ళినాసరే మంగళారతులతో నన్ను ఆశీర్వదిస్తున్నారు. నుదుట కుంకుమబెట్టి "అన్నా! విజయీభవా!"యని ఆదరిస్తున్నారు నా అక్కా, చెల్లెల్లందరూ. ఈ రుణం ఎన్ని జన్మలు ఎత్తినా నేను తీర్చుకోలేను. నూటికి 51 శాతం – అంటే మగవారికంటే జనాభాలో ఎక్కువగా ఉన్నటువంటి నా ఆడబిడ్డల సంక్షేమం చూడటం నా బాధ్యత. ఈనాడు ఒక ప్రత్యేకమైన ఒక అభ్యుదయకరమైన జీవన విధానం ఈ ఆడవారికి, స్వతంత్రమైన జీవనం వారికి ప్రతిపాదించాలి. గౌరవమైన స్థానాన్ని ఈ సమాజంలో వారికివ్వాలి.

కాబట్టి అటువంటి గౌరవమైనటువంటి స్థితిని వారికి కలిగించడానికి ఆ అంతస్థును వారికి అందివ్వటానికి పరిపూర్ణమైన ప్రయత్నం మీ అన్నగా నేను చేస్తానని నా సోదరీమణులందరికీ హామీ యిస్తున్నాను. ఈ రోజున మహిళా విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా ఆడవారి కోసం ఏర్పరచినా, ఉద్యోగాల్లో నూటికి ముప్పయ్ శాతం వారికే కేటాయించినా, ప్రతి గ్రామంలో ఒక్కొక్క ఆధునిక మరుగుదొడ్డి కట్టించి ఆడబిడ్డలకు ఇవ్వాలని అనుకొంటున్నా, వృత్తిపరమైన విద్యా కేంద్రాన్ని ఏర్పరచాలని ఆలోచించినా యివన్నీ సోదరీమణులకు సేవచేయడానికే.

ఈ రోజు ముఖ్యంగా ఒక విప్లవాత్మకమైన విధానాన్ని తెలుగు దేశం ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అది మా ఆడబిడ్డలందరికి తెలుసు. ఈనాడు ఇండ్ల స్థలాలుగాని, పట్టాలుగాని ఆడవారి పేరిటే ఉండాలని ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకొన్నదని మనవి చేస్తున్నాను. ఎందుకంటే ఆడవారి పేరిట ఆస్థి వుంటే కొంచెం భద్రంగా ఉంటాయి. అన్యాక్రాంతం కాకుండా నాలుగు కాలాలపాటు ఏ వసతికి ఏ ఫలితాలకైతే నిర్దేశించబడిందో, ఆ ఫలితాలు పూర్తిగా ఆ కుటుంబాలకు అందచేయబడుతాయన్న విశ్వాసంతోనే, నమ్మకంతోనే ఈ ఇళ్ళ పట్టాలన్నీ కూడా సోదరీమణుల పేరిట, ఆడపడుచుల పేరిట ఇవ్వవలసిందని ఉత్తర్వులు జారీచేయుట జరిగింది.


అదేకాదు మగవారి పెన్షన్లు కూడా ఆడవారి చేతికే ఇవ్వాలని నిర్ణయం తీసుకోవటం జరిగింది. 29 రోజులు ఆవులిస్తూ ఎదురుచూస్తున్నటువంటి ఆ ముసలయ్య 30న రూపాయలు చేతిలో పెట్టేటప్పటికి ఆ రోజే గుటుక్కుమనిపిస్తాడు.

కంచం ముందు కూర్చుంటాడు "ఏమే! అన్నం పెట్టవే" అంటాడు. ఇంటి భారాన్ని వహించి ఇంటి ఇల్లాలు అటు భర్తను కాదనుకోదు, ఇటు బిడ్డలను కాదనుకోదు. భారం వహిస్తుంది. ఆడబిడ్డ కాబట్టి భారం

వహించేటటు వంటి ఆ గృహిణికి, ఆ బాధ్యత వహించేటటువంటి ఆ ఇల్లాలికి ఆ గౌరవం ఇవ్వాలని ఈ పెన్షన్ కూడా ఆడవారికి ఇవ్వాలని ప్రభుత్వ పరమైనటువంటి నిర్ణయం తీసుకొనుట జరిగింది. ఇది మన ఇల్లు మనం చక్కబెట్టుకోవటం లాంటిదే.

మనమంతా ఒక కుటుంబం. మనమందరం ఒక కుటుంబ సభ్యులం. ఈనాడు పెత్తందారు తండ్రిగాను, అన్నగాను ఏ విధంగా కుటుంబ బాధ్యత నిర్వహిస్తాడో అదే విధంగా మీ సంక్షేమాన్ని చూడవలసిన బాధ్యత నాకందించారు మీరు. ఎంతో పవిత్రంగా ఈ కృషిలో మీ అందరి నమ్మకానికి, విశ్వాసానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు నిస్వార్థమైన ప్రజాసేవలో ఈ తెలుగుదేశం ప్రభుత్వాన్ని పునీతం చేస్తానని చెప్పి, ఆఖరి క్షణం వరకు తుది నెత్తుటి బొట్టు వరకు మీ సేవకు, ప్రజాసేవకు అంకితం చేస్తానని సవినయంగా సోదరీ, సోదరులందరికి మనవి చేస్తున్నాను. ఈనాడు ఎండలో ఈ సమావేశం ఏర్పాటు చేసినప్పటికి ఎంతో ఓర్పుతో, ఎంతో దయతో, అనురాగంతో, ఆపేక్షతో వచ్చిన మీ అందరికి మరొక్కసారి మీకు హృదయపూర్వకమైనటువంటి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**జై తెలుగునాడు. జైహింద్!**



# రావాలి మనకు సామ్యవాద సమానత్వం

**(15-08-1985 స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి రేడియో, టి.వి.లలో ప్రసంగం)**

నేడు పర్వదినం. చిరకాలపు దోపిడికి చరమగీతం పాడి, శతాబ్దాల బానిస బ్రతుకులపై తెరదించి – సగర్వంగా నా జాతి జయకేతనాన్ని ఎగురవేసికొన్న పర్వదినం. నేడు సుదినం. తరతరాల దారిద్ర్యంపైన, అంటరాని తనంపైన, అవిద్యపైన, అనారోగ్యంపైన నా జనత తిరుగులేని పోరాటం ప్రకటించి పరిక్రమించిన పర్వదినం.

ఈ ఆనంద సమయంలో, యీ ముప్పది ఎనిమిదవ స్వాతంత్ర్య దినోస్తవం రోజున నా ప్రాణంలో ప్రాణమై, నిత్యమూ నా మదిలో మెదిలే నవభావ తరంగాలై, అనునిత్యమూ నా గుండెలలో రవళించే పురోగమనగీత సంగీత స్రవంతులై భాసిల్లే మాననీయులారా, మహనీయులార, నా అనుంగు సోదరీ సోదరులారా! చిన్నారి తల్లులారా! చిట్టితండ్రులారా! తెలుగు తల్లి ముద్దుబిడ్డలారా! అర్పిస్తున్నాను మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షల్ని! నా మనపూర్వక శుభాశీస్సుల్నీ.

ఎందరో మహనీయుల త్యాగఫలం యీ స్వాతంత్ర్య ఫలం! ఈ స్వాతంత్ర్య మహాయజ్ఞంలో సమిధలై ఆత్మార్పణం చేసుకొన్న మహానుభావులు ఎందరో, వారందరినీ స్మరించుకొందాం ఒక్కసారి నిండు మనస్సుతో. అర్పించుకొందాం నేడు మనకృతజ్ఞతా పూర్వక స్మృత్యంజలి.

ఆ సేతుసీతనగ పర్యంతం, యావద్భారత జాతి మహా ప్రభంజనంలా, మహోత్తుంగ తరంగంలా ఉద్యమించి, విజృంభించి, రవిఅస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యపు పునాదుల్ని పెకలించి, ఎగురవేసింది స్వతంత్ర భారత జాతీయపతాకాన్ని ఎర్రకోటపై. ఆశించింది స్వాతంత్ర్య భానోదయంతో తమకష్టాలు గట్టెక్కుతాయని ఎదురు చూసింది, సురుచిర, చిరస్వప్నం కనులముందు ప్రత్యక్షమౌతుందని, స్వాతంత్ర్య ఫలాలు చేతికొచ్చి నోటికి అందుతాయని.

కాని ఆచరణలో జరిగిందేమిటి? సామాన్యునికి ఒరిగిందేమిటి? చివరకు మిగిలిందేమిటి? ఒకటా, రెండా ముప్ఫయి ఎనిమిదేళ్ళు; ఓ నిండు జీవితంలో సగభాగం గడచిపోయింది. సామాన్యుడు దారిద్ర్య రేఖ నుండి యింకా, యింకా క్రిందికి దిగజారిపోతున్నాడు. స్వాతంత్ర్య ఫలాలను, ప్రగతిఫలితాలను సజావుగా, సక్రమంగా అందుకోలేకపోతున్నాడు. రాజకీయ స్వాతంత్ర్యంతో పాటు కావాలి మనకు ఆర్థిక స్వాతంత్ర్యం. రావాలి మనకు సామ్యవాద సమానత్వం. అదే అదే నిజమైన స్వాతంత్ర్యం.

అందుకే, ఆ లక్ష్య సాధనకే రెండున్నర సంవత్సరాలనాడు పట్టం కట్టారు తెలుగుదేశం ప్రభుత్వానికి మీరు ఎనలేని విశ్వాసంతో, ఆదేశించారు. నన్ను మనరాష్ట్ర సౌభాగ్యం కోసం, సమగ్రాభివృద్ధి కోసం అంకితం కావాలసిందని. మీ సేవలో రెండున్నర ఏళ్లు గడిచిపోయాయి. నేడు గతపురోగతిని సమీక్షించుకొని భావి పురోగతికి పునరంకితం కావాలసిన సుదినం.

ఏ దేశ చరిత్రలో నయినా, ఏ ప్రభుత్వ నిర్వహణలో నయినా రెండున్నర సంవత్సరాలు బహుస్వల్ప వ్యవధి. అయినా యీ అత్యల్ప వ్యవధిలో నా ప్రభుత్వం మీ అభ్యుదయాన్ని కాంక్షించి చేపట్టిన పథకాలు, సాధించిన ప్రగతి మీ ముందు వుంచటానికి నేను ఎంతో గర్వపడుతున్నాను.

అట్టడుగు ప్రజల సముద్ధరణ, ఆడపడుచుల ఆభ్యుదయం, యువశక్తి, వికాసం, గ్రామసీమల సౌభాగ్యం, నిష్కళంకమైన, ప్రయోజన కరమైన పరిపాలన వంటి పదిహేను అంశాల "ప్రగతిపథం"తో మీ ముందుకు వచ్చిన నా ప్రభుత్వం సాధించింది – సగర్వంగా తలెత్తుకు చెప్పుకోగలిగే విజయాలు ఎన్నో.

అన్నపూర్ణగా పేరుపొందిన ఆంధ్రప్రదేశ్‌లో గుక్కెడు గంజి నీళ్ళతోనే బ్రతుకులు వెళ్లమార్చే దాదాపు కోటి మంది నిరుపేద కుటుంబాలకు రెండుపూటలా తినడానికి పట్టెడన్నం పెట్టేందుకు అందిస్తున్నదే కిలో రెండు రూపాయల బియ్యం పథకం. కట్టుకోడానికి సరైన బట్టలేక చిరుగు కంతలకు అతుకుల బొంతలతో శరీరాన్ని దాచుకొంటున్న పేదవర్గాల వారికి సగం ధరకే చీర, ధోవతులు యిచ్చే సబ్సిడీ వస్త్రాల పథకం.

– సరైన గూడులేక, నీడలేక ఎండా వానల్తో సహజీవనం చేస్తూ పూరిగుడిసెల్లో మ్రగ్గుతున్న పేదప్రజలకు

నిలువనీడ కల్పించే పక్కా యిళ్ల నిర్మాణ పథకం.

– కడివెడు మంచినీళ్ళ కోసం క్రోసెడు దూరం ఎర్రని ఎండలో కాళ్లు కాల్చుకొని పోవలసిన దయనీయ పరిస్థితి నుంచి పల్లెల్లో ఆడబడుచులను ఆదుకోవడానికి మంచినీటికి కటకటలాడే మెట్టప్రాంతాల్లో కనీసం ప్రతివందమంది జనాభాకు ఒక మంచి నీటి వనరైనా ఏర్పాటు చేయాలన్న మంచి నీటి పథకం.

– మరుగు సదుపాయం లేని గ్రామీణ ప్రాంతాల్లో మహిళల సౌకర్యం కోసం చేపట్టిన సామూహిక మరుగుదొడ్ల నిర్మాణ కార్యక్రమం.

– జనాభాలో సగభాగంగా వున్న ఆడపడుచుల ఆర్థిక, సామాజిక ప్రతిపత్తిని పెంచి, సమాజంలో పురుషులతో పాటు సమాన హోదా కల్పించడానికి – కృతనిశ్చయంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ఎన్నో వున్నాయి.

**జనాభాలో సగభాగంగా వున్న ఆడపడుచుల ఆర్థిక, సామాజిక ప్రతిపత్తిని పెంచి, సమాజంలో పురుషులతో పాటు సమాన హోదా కల్పించడానికి – కృతనిశ్చయంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ఎన్నో వున్నాయి.**

తిరుపతిలో నెలకొల్పిన శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం జిల్లాలలో ప్రత్యేకంగా మహిళల కోసం నెలకొల్పదలచిన మహిళా పాలిటెక్నిక్‌లు, పెద్ద పెద్ద నగరాలలో, పట్టణాలలో ఏర్పాటు చేయతలపెట్టిన ఉద్యోగ మహిళా వసతి గృహాలు, గర్భిణి స్త్రీలకు మందులు, పౌష్టికాహారం సమకూర్చుకోటానికి చివరి రెండు నెలల్లో నెలకు రూ. 40లు చొప్పున అందించదలచిన ఆర్థిక సహాయం, ఏ ఆధారమూలేని పేద వితంతువులకు యిప్పుడు ఇస్తున్న పింఛన్లు, ప్రభుత్వోద్యోగాలలో మహిళలకు 30 శాతం కేటాయింపు, ఆస్తిలో స్త్రీకి పురుషులతో పాటు సమాన హక్కు కల్పించడానికి శాసనపరంగా ప్రయత్నం వంటి అభ్యుదయ పథకాలు కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి.

అదేవిధంగా చిన్నారి బాలల సర్వతోముఖ వికాసానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. ఒకటి, రెండు తరగతుల్లో చదువుకొనే పేద వర్గాల పిల్లలకు ఒక జత యూనిఫారం బట్టలు, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందించ తలపెట్టడం, బడి పిల్లల ఆరోగ్యపరిరక్షణకు త్వరలో ఒక కార్యక్రమాన్ని రాష్ట్రమంతటా అమలు జరపబోవడం, గుడిసెలలో మురికివాడల్లో మ్రగ్గుతున్న పేదప్రజల పిల్లలకు పుష్టికరమైన ఆహారాన్ని అందించే ప్రయత్నంలో భాగంగా “తెలుగు బాలల క్షీర సంక్షేమం” పేరున 1–6 సంవత్సరాల మధ్య వయస్సు బాలబాలికల కోసం ఒక్కొక్క కుటుంబానికి 400 మిల్లీ లీటర్ల పాలు 25 శాతం తక్కువ ధరకు అందించే పథకాన్ని ముందుగా హైదరాబాద్, సికిందరాబాద్ జంటనగరాలలో నేటి నుండి ప్రవేశపెట్టడం – ఇవి బాలల సంపూర్ణ సంక్షేమ వికాసాలకై ప్రభుత్వం తీసుకొన్న చర్యలలో కొన్ని.

ప్రాథమిక స్థాయిలో విద్యాబోధనను దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా చేయాలనే బృహత్తర పథకాన్ని రూపొందిస్తోంది ప్రభుత్వం. విద్యార్థులలో విజ్ఞాన వికాసానికీ, అర్హతకు తగిన గుర్తింపుగా అందిస్తున్నది “తెలుగు విజ్ఞాన పారితోషికం”.

రెక్కలు ముక్కలు చేసుకొని, రక్తాన్ని చెమటగా మార్చుకొని కష్టించి పనిచేసినా కడగండ్లూ, కన్నీటిగాథలూ తప్ప సుఖసంతోషాలకు నోచుకోని వ్యవసాయ కార్మికులకు అవసాన దశలో వారి కన్నీరు తుడిచి, తినడానికింత ఆదరువు కల్పించి ఆదుకునే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నెల, నెలా యిస్తున్న పింఛన్ల వలన రెండు లక్షల, అరవై వేల వృద్ధ వ్యవసాయ కూలీలు ప్రయోజనం పొందారు. రిక్షా కార్మికుల శ్రమఫలితాన్ని మధ్యదళారీలు తన్నుకుపోయే హీనస్థితి నుంచి వారిని రక్షించేందుకు ప్రవేశపెట్టిన సొంతరిక్షా పథకం వల్ల పన్నెండున్నర వేల మంది రిక్షా కార్మికులు లబ్ధిపొందారు.

ప్రజాప్రతినిధులకు సరైన ఆర్థిక అధికారాలిచ్చి, పేదప్రజల్ని ఆదుకొనే సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా, సజావుగా, శీఘ్రంగా కొనసాగేటట్టు చూడడానికై సామాన్య గ్రామీణ ప్రజల అవసరాలు తీర్చి రైతన్నల కడగండ్లను దూరం చేసి, గ్రామీణుల సర్వతోముఖ వికాసానికి ప్రభుత్వ సేవలను అన్నిటిని వారికి అందుబాటులో ఉంచడానికి, ప్రజలను భాగస్వాములుగా చేసి దేశ పురోగతిని, ప్రగతిని సాధించడానికే ప్రవేశపెట్టినది – "మాండలిక రాజ్యాంగ విధానం".

**రిక్షా కార్మికుల శ్రమఫలితాన్ని మధ్యదళారీలు తన్నుకుపోయే హీనస్థితి నుంచి వారిని రక్షించేందుకు ప్రవేశపెట్టిన సొంతరిక్షా పథకం వల్ల పన్నెండున్నర వేల మంది రిక్షా కార్మికులు లబ్ధిపొందారు.**

బక్కన్న రైతన్న కడగండ్లు బాపేందుకు వారికి కావలసిన పరపతి సౌకర్యంతోపాటు ఎరువులు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ పరికరాలు, మార్కెటింగ్ సౌకర్యాలు అన్నీ ఒకేచోట లభించే విధంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను చైతన్యవంతమూ, ప్రయోజన కరమైనవిగా తీర్చిదిద్దడానికై సింగిల్ విండో పద్ధతిని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తోంది ప్రభుత్వం.

రైతులకు సేద్యపునీటి సౌకర్యాన్ని కల్పించడానికి వ్యవసాయ పంపుసెట్లకు వాడుకొనే విద్యుత్తుకు సాలుకు ఒక హార్స్ పవరుకు రూ. 50లు నామమాత్రంగా వసూలు చేయడం జరుగుతోంది. ఈ పథకం క్రింద లక్షానలభై వేల పంపుసెట్లకు విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగింది.

బిడ్డకు దక్కని స్తన్యంలా ప్రవహిస్తున్నాయి పావన కృష్ణా, గోదావరీ జలాలు. దప్పికగొని బీటలువారిన రాయలసీమ, తెలంగాణా భూములను సస్యశ్యామలం చేయడానికి ప్రభుత్వం చేపట్టిన పథకాలూ, కార్యక్రమాలూ ఎన్నో, ఎన్నెన్నో, సేద్యపునీటితోపాటు మద్రాసు మహానగరంలోని తమిళ, తెలుగు సోదరుల మంచినీటి కొరతను తీర్చడానికి తలపెట్టిన భగీరథయత్నమే తెలుగుగంగ పథకం. అలాగే యీశతాబ్దాంతానికి పూర్తి చేయాలని తలపెట్టిన – "గోదావరి సుజల సాగరం" అనే పోలవరం ప్రాజెక్టు, యింకా వంశధార సంపూర్ణ స్వరూపం, వరదరాజస్వామి, భీమాజూరాల మొదలైన చోట్ల వెలయనున్న ఆధునిక దేవాలయాలు తెలుగు నేలపై పండిస్తాయి బంగారు పంటలు. తరతరాలుగా ప్రశ్నలుగానే మిగిలిపోయి, అడిగినా సమాధానమే లభించని సమస్యలు ఎన్నో ఎన్నెన్నో–ఇప్పుడిప్పుడే ముడివిప్పుకుంటున్నాయి. దశాబ్దాల తరబడి

దీర్ఘనిద్రలోకే ఒరిగిపోయిన సాంఘిక సంక్షేమ పథకాలు మరెన్నో ఇప్పుడిప్పుడే మేలుకొంటున్నాయి. నా జనతను చేరుకుంటున్నాయి.

నా తెలుగు తల్లి సౌభాగ్యాన్ని కోరి, నా తెలుగు జాతి భవితవ్యాన్ని కోరి మేము కల్పించుకొన్న పథకాలు ఎన్నో, కన్నకలలు మరెన్నో. ఈ పథకాలు అన్నీ సమగ్రంగా రూపుదిద్దుకోవడానికి ఆ కలలను అన్నింటిని పెంపొందించుకోవడానికి ఈ జీవితమే చాలకపోవచ్చు కాని తెలుగుజాతి పునర్వికాసానికి అంకితమైన యీ జీవితం – క్షణక్షణం మీ కోసం పరిశ్రమిస్తుంది. పరిక్రమిస్తుంది. తెలుగుతల్లి వైభవోన్నతికి అంకితమైన యీ శరీరంలోని అణువణువూ, అహరహం మీ కోసం పరితపిస్తుంది. పలవరిస్తుంది.

విశ్వకవి రవీంద్రుని ప్రేరణతో నేను అనునిత్యమూ చేసే ప్రార్థన ఒక్కటే – ప్రభూ అంటరాని తనం, అవిద్య, అనారోగ్యం, అసమానత్వం, దోపిడి, దగా, క్షుద్రరాజకీయాలు లేని ఆదర్శ రాజ్యం లోనికి, సుందర స్వర్గసీమలోనికి నా దేశాన్ని మేల్కొలుపు. మాకృషిని దీవించు! మమ్ము ముందడుగు వేయించు.

**జై తెలుగునాడు. జైహింద్!**

# విద్య-మనిషిలోని వ్యక్తిత్వాన్ని వెలార్చే దీపకళిక

**(5-10-1985 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి రేడియో, టి.వి.లలో ప్రసంగం)**

**మాతృదేవోభవ!**
**పితృదేవోభవ!**
**గురు దేవోభవ!**

తల్లీ, తండ్రీ, గురువూ మనకు కన్పిస్తున్న దైవస్వరూపాలు, కనులముందు వెలుగొందుతున్న ప్రత్యక్ష దైవాలు. మనలను కరుణించి, దీవించి ముందుకు నడిపిస్తున్న దేవతామూర్తులు.

తల్లిదండ్రులు ఈ తనువును ప్రసాదిస్తే, యీ జీవితానికి విద్యా గంథం అద్ది – జీవితపథంలో విజ్ఞాన జ్యోతులు వెలిగించి – మానవ మనోనేత్రాన్ని తెరిపించి – మనిషిని మనిషిగా తీర్చిదిద్దునున్న మహానీయుడు, మాననీయుడు–గురువు!

ప్రపంచ ప్రసిద్ధ తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు, విద్యావేత్త, పండితోత్తముడు, కులపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తన జీవితమే తెరచిన పుస్తకంగా, అమూల్య పాఠ్యగ్రంథంగా పలికిన ప్రతి పలుకూ చైతన్యదీప్తిని కలిగించే ఆణిముత్యంగా, రసస్ఫూర్తిని ఒలికించే ఆదేశ సూత్రంగా, రవళించి, ప్రాచ్య, పాశ్చాత్య విజ్ఞాన వారధిగా ప్రాచీన ఆర్వాచీన తాత్విక చింతనా స్రవంతుల సంగమ స్థావరంగా భాసిల్లిన ఆ మహోన్నత మానవతామూర్తి ప్రాజ్ఞుడు, ప్రతిభా సమన్వితునిగా మాత్రమేగాక "గురువుల గురువు" గానూ జేజేల నందుకున్నారు.



నేడే, యీనాడే "ఉపాధ్యాయ దినోత్సవం". ఈ రోజే గురుపూజోత్సవ పర్వదినం. ఇదే పండుగ దినం. ఉపాధ్యాయుడు-దాని భారత పౌరులను తీర్చిదిద్దే తన పవిత్ర బాధ్యతను మరొక్కసారి మననం చేసుకుంటూ-జాతి అభివృద్ధికి దేశ పురోగతికి, విద్యా వ్యాప్తికి తనను తాను ఇంకొకసారి అంకితం చేసుకునే పుణ్యదినం నేడే.

ఉపాధ్యాయులపట్ల ఆరాధనా భావం ప్రజలలో కలిగించి, సామాజికస్పృహను జనతలో వెలిగించి, విద్యా దేవాలయాలలో మేలు కొలుపుల బంగారు జేగంటలు మ్రోగించవలసింది యీనాడే.

'నా గురువే-నా స్నేహితుడు, సన్నిహితుడు, ఆప్తబంధువు, వెలుగు చూపే మార్గదర్శి అన్న ఆత్మీయతా భావాన్ని విద్యార్థులలో రగిలించి, ఈ దేశం నాది, ఈ మహోత్కృష్ట సాంస్కృతిక సంపద నాదే, ఈ జనం నావాళ్లు, ఈ సమాజం అభ్యుదయమే నా అభ్యుదయం అదే నా ధ్యేయం' అంటూ యువత నవజీవన వికాస యాత్రలో మలి అడుగు, మరో అడుగు ముందుకు వేయవలసింది యీరోజే.

చిరకాలపు దోపిడీకి, శతాబ్దాల బానిస బ్రతుకులకు స్వస్తి చెప్పిన భారత భారతి బానిస విద్యావిధానంపై తిరుగుబాటు బావుటా ఎగురవేయవలసిన తరుణం యిదే.

తరతరాలుగా, వలసవాద, సామ్రాజ్యవాద యంత్ర రాక్షసి కోరల్లో చిక్కుకొని ఉదర పోషణ కోసం, జీవనభృతి కోసం అమ్ముడు పోయింది నేటి వరకు మనవిద్యావిధానం. బానిస విద్యావిధానం. కాలం మారింది. బానిస బ్రతుకులకు, బానిస చదువులకూ కాలం చెల్లింది.

మారుతున్న కాలంతోపాటు, మారిన సామాజిక విలువలతోపాటు మారాలి మన విద్యావిధానం. రావాలి మన విద్యావిధానంలో మరెన్నో మౌలికమైన మార్పులూ చేర్పులూ రావాలి.

స్వేచ్ఛా భారతంలో విద్య విశాలమైన ప్రాతివదికపై, సువిశాల పీఠంపై సమున్నతంగా నిలవాలి. విద్య వివేకాన్ని యివ్వాలి, వికాసాన్ని, కలిగించాలి, మనిషిలోని వ్యక్తిత్వాన్ని వెలార్చే దీపకళిక కావాలి.

అదే విద్యకు అర్థం. అదే చదువుకు పరమార్థం. అప్పుడే మనం సాధించుకున్న ప్రగతికి నిండుదనం. మనం సంతరించుకొన్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఉద్దీపనం.

నవభారత నిర్మాణానికి, భావి భారత పౌరులను తీర్చిదిద్దడానికి యీనాడు పునరంకితమవుతున్న మనం, మన విద్యావేత్తలు జాతి గతవైభవాన్ని స్ఫురణకు తెచ్చుకోవాలి. చరిత్ర అట్టడుగున నిలిచిపోయిన మన ప్రాచీన వైభవోన్నతిని వెలికి తీసి, నీతి నిబద్ధమైన మన జీవిత విధానాలను, మహోన్నత మానవతా విలువలను సముద్ధరించే మన విద్యా, విజ్ఞాన, వికాస వైభవాలను స్మరణకు తెచ్చుకోవాలి. బోధనాంశాలుగా మలచుకోవాలి. ..... “పాతకొత్తల మేలు కలయిక” మన పాటల పల్లవి కాగా, నవతకు స్వాగతం చెపుతూ యువతను... సమతా మమతా పథంలో తీర్చి దిద్దుకుందాం. ముందడుగు వేద్దాం.

జాతీయ స్థాయిలో ఎంపిక కాదగిన విద్యా వినయ సంపన్నులు, ఆదర్శ ఉపాధ్యాయులు మనకెందరో వున్నారు. కొండల్లో, కోనల్లో, మారుమూల కుగ్రామాల్లో విద్యా ప్రచారమే ధ్యేయంగా అహరహం శ్రమిస్తున్న విద్యాదాతలు జ్ఞానప్రదాతలు ఇంకెందరో.

పల్లెలలో, పట్టణాలలో, ఉన్నతపాఠశాలల్లో భాషా సౌందర్యానికి, విజ్ఞాన శాస్త్ర వికాసానికి అద్దం పట్టి అన్వయం చెప్పి విద్యాభారతికి నవ్య నీరాజనాలు అందిస్తున్న ఉపాధ్యాయ శేఖరులు మరెందరో!

నీతితో, నిజాయితీతో, కర్తవ్య దీక్షతో, నిరక్షరాస్యతా నిర్మూలనకు, విద్యావ్యాప్తికి, భావ వికాసానికి అంకితమై–నేడు తమ ప్రతిభకు తగిన గుర్తింపుగా రాష్ట్రప్రభుత్వం నుండి సత్కారాలను అందుకుంటున్న గురుదేవులు తొంభై ఇద్దరు – వారికి, ఎందరో మహానుభావులు అందరికీ – ఈ ఉపాధ్యాయ దినోత్సవ శుభదినాన గురుపూజోత్సవ పర్వదినాన నా హృదయపూర్వక వందనాలు ప్రేమాభినందనలు.

**జై తెలుగునాడు. జైహింద్!**



# సాటిప్రాణి సంరక్షణ మన ఆదర్శం కావాలి

ఆద్యంత రహితమైన భగవంతుని సృష్టి కార్యక్రమంలో చరాచర జీవరాసుల ఉత్పన్నం వ్యర్థం కాదు. ఊరికేపోదు. అవతారక్రమంలో యుగధర్మ ప్రకారం పరిణామందాల్చిన జీవరహస్య పర్యవసానమే నేటి మానవాకృతి. పశుపక్ష్యాదులలో సమస్త జీవరాసులలో మానవ ప్రకృతిలో కొన్ని లక్షణాలు సమానమైయుండుట గమనీయార్హం. బాధ, క్షుత్పిపాన సర్వజీవుకు ఒక్కటే, అయినా ఆలోచనతో బుద్ధి విశేషతతో ఎప్పుడు మానవుడు ప్రభావితుడైనాడో, త్రేతాయుగములోని రామభద్రుని సంస్కార సంపత్తి బుద్ధిగుణ విశేషాలను, ఆచార వ్యవహార సిద్ధాంతాలను, మత ప్రబోధితమైన ధర్మరక్షణ కార్యక్రమాలను ఎప్పుడు అలవరచుకున్నాడో, క్రమశిక్షణా విధానంతో కూడిన సహజీవన విధానాన్ని ఎప్పుడు మానవ సమాజంలో ప్రతిష్ఠించుకున్నాడో ఆనాడే సర్వజీవరాసులకంటే సృష్టికార్యక్రమంలో అతి ఆదర్శభావుకుడైనాడు. తన ఆదర్శాలతో, ఆచరణ సిద్ధాంతాలతో సృష్టి కార్యక్రమాన్ని, బ్రహ్మ విజ్ఞాన దీక్షాదక్షుడై పరమార్థ ప్రేరితుడై సృష్టికార్యక్రమాన్ని రక్షించేభార వాహకుడైనాడు.

అయినా ఆశా స్వార్థాలకు, అరిషడ్వర్గాలకు ఆతీతుడు కాని మాయామోహితుడైన మానవుడు తనగతితప్పి

హింసాత్మక విధానంతో సకల జీవజీవన విధానానికీ కంటకుడే అవుతున్నాడు. దానికి పరమ నిదర్శనమే కఠిన రాక్షస ప్రవృత్తిగల క్రూరాత్ములు, దురాత్ములు, వారిని నాశనమొందించి సృష్టి కార్యక్రమాలను లయబద్ధం చేసి ధర్మరక్షణ కావించటానికే ఎన్నో అవతారాలెత్తాడు భగవంతుడు.

**విఘ్నవినాయకుని వాహనం మూషికం.**
**పరమ శివుని పవిత్రవాహనం నందీశ్వరుడు. వంది భృంగీశ్వరుడు.**
**సర్వవంద్యుడైన విష్ణుమూర్తి వాహకుడు గరుడుడు.**
**చండీమూర్తి దివ్యవాహనం మృగరాజు. కాళీమాత వాహనం బెబ్బులి.**

ఈ విధానం ప్రకృతిశక్తులకు వన్య ప్రాణులకు దైవత్వాన్ని ఆపాదించి గౌరవించే సంస్కారవంతమైన మన పద్ధతి. జల వాయు వృక్షరాజముల పూజించుట మనప్రాచీనరీతి. మానవుని మనుగడకు ఆధారాలైన పంచభూతాలు మనకు ఆరాధ్యాలు. ప్రకృతితో ఇంతగా పెనవేసుకున్నది అనాదిగా మానవ నిత్యజీవన విధానం. కనుక సకల జీవకారుణ్యము, సృష్టి రక్షణము, మానవాదర్శము, దైవప్రేరితము.

సర్వసృష్టి మానవక్షేమానికి వాతావరణ పరిశుద్ధతకే ఉపయోగపడుతున్నప్పుడు ఆ నోరులేని జీవరాసుల మీద, మూగవోయిన ఆ అమాయికపు ప్రాణుల మీద మనకెందుకింత నిర్దాక్షిణ్యం?

శక్తిహీనమైన జీవరాసులను కనికరించటం, మహాత్ముడు ప్రబోధించిన అహింసా సిద్ధాంతాన్ని అలవరచుకోవడం మానవగతికి సుగమం కాదా? సులక్షణం కాదా?

మనకు కన్నుల పండువచేసే ప్రకృతిని, మనోహరమై, చిద్విలాస సంపన్నమై, వాసయోగ్యమై, మధురానుభూతితో కనువిందు చేసే ఆ కళ్యాణశోభను ఆ భగవంతుని దివ్యవాంఛకు విరుద్ధంగా, సృష్టి వినాశానికి మానవుడు పూనుకుంటే దైవద్రోహమే అవుతుంది. వృక్షాలను నిర్మూలించడం, నోరులేని పశువులను బలిపెట్టడం ప్రకృతికి ద్రోహం చేయడమే అవుతుంది. భగవత్ సృష్టిని సమాదర భావంతో పూజనీయంగా దర్శించడం మన సాంప్రదాయం.

ప్రకృతి ఒడిలో పరవశించే దివ్యమూర్తుల ఆరాధ్యత్వాన్ని గుర్తించడం మనకు చారిత్రాత్మక ప్రసిద్ధం. చతుర్భుజుని పడకపై అలరించుతూ భూభార వాహకుడైన సహశిర శోభితుడు ఆదిశేషుడు మనకారాధ్య దైవము. నాగదేవతల నారాధించి పూజా నైవేద్యములు సమర్పించే చవితి పండుగ తరాలనాటి ఆచారం. రామభద్రుని ఆంతరంగిక దూత వానర ముఖ్యుడు ఆంజనేయుడు కొందరి యిష్టదైవం. మన సంస్కృతిలో నాట్యమయూరిని జాతీయ విహంగంగా గౌరవించాం. పసందైన నాజూకుతో నవనవలాడే పాలపిట్టను తెలుగుతనాన్ని ప్రతిబింబించే తెలుగువారి పక్షిగా పరిగణించాం. బెదిరే చూపులతో చెంగు చెంగునదూకే విలాసినీ శోభితమైన కృష్ణజింకను తెలుగుతనాన్ని ప్రతిబింబించే తెలుగు జాతి వన్యప్రాణిగా విశిష్టతతో గౌరవించాం.

లేత చిగుళ్లను మేసి మత్తెక్కిన వగరు గొంతుతో పొగరుగా అలపించే కోకిలమ్మను సుస్వర మధురగాన విహంగంగా ప్రస్తుతించాం. గంభీరమైన రీవితో అతి భయంకరమైన ప్రళయ గర్జనా ప్రభావితమైన సింహాన్ని మృగరాజుగా గుర్తించాం.

మానవాళికి స్నిగ్ధముగ్ధ మధురక్షీర సమారాధనతో తమియింపచేస్తున్న గోమాతను ధర్మదేవతగా పూజించాం.

విశ్వాసానికి ప్రతిరూపమైన శునకరాజాన్ని తోడువీడని సహజీవిగా పోషించుతున్నాం. ఇంతటి దయాధర్మ స్వభావమైన మానవ ప్రవృత్తి, ప్రకృతిని రక్షించి తనివితీరా సృష్టి పరమార్ధతను గౌరవించ వలసిన స్థితిలో నేడెందుకింత కఠినత్వం పూనవలసివచ్చిందో, కారుణ్య రహితమై వ్యవహరించవలసి వచ్చిందో ఆలోచించగలిగితే వన్యప్రాణి రక్షణ మన బాధ్యత అని గుర్తించగలుగుతాం, అందుకే యీ వన్య ప్రాణి సప్తాహం. బుద్ధభగవానుడు ప్రవచించిన, పూజ్యబాపూజీ అనుసరించిన విజ్ఞులు. సిద్ధులు, సత్యసంకల్పులు, ఎందరో ప్రబోధించిన అహింసా పరమార్ధ సిద్ధాంతానికి మన నిత్యజీవన సరళి ఆదర్శవంతమైన ప్రతీక కావాలని నేను కోరుకుంటున్నాను. ఆ జీవకారుణ్యమును అలవరచుకున్నప్పుడు, యీ సర్వసృష్టిలో జగన్నాటక సూత్రధారి ప్రతిరూపాన్ని సందర్శించగలిగినప్పుడు, సర్వప్రాణులు సమానమేనని గుర్తించగలిగినప్పుడు, సాత్విక పరతత్వ విజ్ఞానదీప్తుడైన మానవుడు, సృష్టికి హానికలిగించే హింసా సిద్ధాంతాన్ని అవలంభించలేడు–అలంబకుడు కాలేడు.

అసత్య సమాలోచనలో ద్వేషముండదు. ఈర్ష్యవుండదు. స్వార్థముండదు. హింసవుండదు. సర్వసృష్టి సమన్వయమే, సర్వప్రాణి సమానత్వమే, సర్వజీవకారుణ్యమే ప్రపంచగతికి, అష్టగ్రహ పరిభ్రమణ పరిరక్షితమైన వాతావరణ సుస్థిరతకు, సుభిక్షానికి మూలాధారమన్న సత్యాన్ని గుర్తించగల్గుతాం. దయతోకూడిన ధర్మరక్షణ, సాటిప్రాణి సంరక్షణ మన ఆదర్శంకావాలి. అదే యీ వన్యప్రాణి రక్షణసప్తాహ సందర్భంలో మమతతో, సమతతో మానవప్రేమను సమస్త ప్రాణికి పంచిపెట్టమని, ఆ కరుణాభావంలోని మధురానుభూతిని పొందమని నా వారందరికీ నేను చేస్తున్న ఈ విజ్ఞప్తి. అదే వన్యమృగ సప్తాహ సందర్భంగా మనం నోరులేని జీవరాశికి యివ్వగలిగిన వరం....

**జై తెలుగునాడు. జైహింద్!**

# అభ్యుదయకర కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి

**(ఎమ్మిగనూరులో 1985 అక్టోబరు 17వ తేదీన వ్యవసాయ గిడ్డంగుల సముదాయానికి, బలహీన వర్గాల గృహ సముదాయానికి, ఆర్టీసీ బస్సుస్టాండుకు శంకుస్థాపనలు జరిపిన అనంతరం బహిరంగ సభలో చేసిన ఉపన్యాసం)**

కట్టలు తెంచుకొని ప్రవహించే ఉత్సాహంతో ఆదరిస్తూ అభిమానిస్తూ నాకు స్వాగతం పలుకుతున్న నా తమ్ముళ్లకు ఎంతో అనురాగంతో ప్రేమతో దయతో నాకు ఆశీస్సులందిస్తున్న నా తెలుగింటి ఆడపడుచులందరికీ, చిరునవ్వులతో ప్రేమతో జయ జయ ధ్వానాలతో ప్రేమజల్లుకురిపిస్తూ, స్వాగతం పలుకుతున్న చిరంజీవులకు చిట్టి తమ్ముళ్లకు, ఈనాడు ప్రత్యేకంగా ఇక్కడ జరగబోయే ఈ సంక్షేమ కార్యక్రమంలో పాలుపంచుకోవడానికి విచ్చేసిన నా సహచరులు సోదరులు రవాణా శాఖామాత్యులు జానారెడ్డి గారికి, ఈనాడు మీ అందరికి ప్రతినిధిగా ఇటువంటి ప్రజాహిత కార్యక్రమాలలో పాల్గొంటూ అతి ఉత్సాహంతో ప్రజాసేవకు కంకణ బద్ధుడై వ్యవహరిస్తున్న నా సోదరుడు మోహన్ రెడ్డి గారికి ఇక్కడ ఉన్నటువంటి అధికార వర్గానికి, పెద్దలకు పూజ్యులకు, రాజకీయవేత్తలకు పత్రికా ప్రతినిధులకు నా హృదయపూర్వకమైనటువంటి నమస్సులు, శుభాభినందనలు.

ఎమ్మిగనూరు ఈనాటిదిగాదు. ఇక్కడ ఉన్నటువంటి చేనేత కార్యక్రమం ఈనాడు జరుగుతున్నది కాదు. మరి ఎప్పుడో మొదలుపెట్టి ఆరంభమైనటువంటి ఉత్తేజకరమైన ఈ పట్టణానికి ఈనాడు చేయబడ్డ వసతులు ఇంతవరకు లభించలేదు. అంటే ఇదివరకు సాగిన పరిపాలనా వ్యవస్థ ఏ విధమైన దుర్వి ధానముతో ప్రజలయొక్క గౌరవాన్ని, విశ్వాసాన్ని వమ్ము చేయడం జరిగిందో ఒక్కసారి ఆలోచిస్తే ఈనాడు అటువంటి దుర్వ్యవస్థ

# ఎన్.టి.ఆర్. అపురూప చిత్రాలు





జెండాకు వందనం



ప్రభంజనం సృష్టించిన
సైకిల్ ప్రచారం



ఎన్.టి.ఆర్. 'చైతన్యయాత్ర'లో ఉరకలెత్తిన ప్రజల ఉత్సాహం





ప్రచారంలో కొత్త పుంతలు - సామాన్యుడుగా రోడ్లపైనే స్నానాదికాలు









మండుటెండను లెక్కచేయని దృఢసంకల్పం



చెట్టునీడనే అల్పాహారం చేస్తున్న తారక రాముడు



అన్నగారి పట్ల ఆడపడుచుల అభిమానం – పార్టీకి విరాళంగా చెవికమ్మలు



జన సందోహం – దిక్కులు పిక్కటిల్లిన ప్రసంగం





చైతన్య రథంపై నుండి సింహగర్జన




హద్దులు ఎరుగని ఆత్మీయత, అనురాగం



చైతన్య రథం వెంట కదంతొక్కిన ప్రజలు



అభిమాని ఆత్మీయ అలింగనం



వృత్తిదారుల వెతలను శ్రద్ధగా వింటున్న 'అన్న'



'అన్నా' మా బడుగులకు నీవే దిక్కు



తెలుగుదేశానికి జనహారతులు



ఎన్.టి.ఆర్. జనోత్సాహం




చైతన్య రథ సారథి నందమూరి హరికృష్ణ



అన్నగారికి దిష్టి తీస్తున్న వృద్ధ మహిళ



'అన్న' ఉద్వేగం – అభిమానుల ఉత్సాహం



గిరిజనుల గుండెల్లో 'అన్న'






వెన్నంటి ఉంటా మీకోసం


ఎల్లలు ఎరుగని అభిమానం





పేద మహిళలతో మాటా మంతీ



విదేశీ జర్నలిస్టులకు ఇంటర్వ్యూ



జనసందోహానికి శిరస్సు వంచి నమస్కారం




బసవ తారకమ్మతో కలసి ఓటు వేస్తున్న ఎన్.టి.ఆర్.

# రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్.టి.ఆర్. ప్రమాణ స్వీకారోత్సవం



9 జనవరి, 1983





9 మార్చి, 1985




12 డిసెంబర్, 1994

# ఎన్.టి.ఆర్. సంక్షేమ పథకాలు



విశిష్ట పథకాలకు శ్రీకారం



పేదవాళ్ల ఆకలి తీర్చిన
కిలో రెండు రూపాయలకే బియ్యం





పేదల పక్కా ఇళ్లకు ప్రారంభోత్సవం



వ్యవసాయానికి రూ. 50 లకే హార్స్‌పవర్ విద్యుత్



సగం ధరలకే జనత వస్త్రాల పంపిణీ



పేదలకు ఇళ్ళ పట్టాల పంపిణి




నిరుపేదలకు వ్యవసాయభూముల పంపకం



సోమశిల ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం



ప్రజల వద్దకే పాలన – ప్రజా సదస్సులో సామాన్యులతో ఎన్టీఆర్




'తెలుగు గంగ'కు శంకుస్థాపన




మంచినీటి పథకం ప్రారంభం





పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే 'చిరంజీవుల సుఖీభవం'



పేద మహిళల స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్ల పంపిణీ



తిరుమలలో మొట్టమొదటిసారిగా నిత్యాన్నదాన పథకానికి శ్రీకారం




టి.టి.డి. దివ్యారామానికి భూమిపూజ




డెయిరీ భవన సముదాయ ప్రారంభోత్సం




విజయవాడ కనకదుర్గమ్మ వారధికి శంకుస్థాపన



రాజీవ్‌గాంధీ చేతుల మీదుగా నూతన అసెంబ్లీ భవన ప్రారంభోత్సవం చేయించిన ఎన్టీఆర్



అసెంబ్లీ భవన ప్రారంభోత్సవంలో స్పీకర్ నారాయణ రావు, గవర్నర్ కుమిద్‌బెన్ జోషి, ప్రధాని రాజీవ్‌గాంధీలతో ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్.



ఎందుకు పతనమయిందో మనకే అర్థమవుతుందని మీకు నేను సవినయంగా మనవి చేస్తున్నాను. ఈనాడు ఇక్కడ జరిగిన కార్యక్రమంలో మార్కెటింగ్ యార్డు, ఇక్కడ 38 గోడౌనులు రైతుజన సంక్షేమానికై నిర్మించడం, వారు పండించిన ఉత్పత్తులకు సరైన ధర వచ్చే వరకు వాటిని నిల్వచేసు కోడానికి, ఏదైన గిట్టు బాటు ధర వచ్చినప్పుడు వారు ఉత్పత్తులు అమ్ముకోవడానికి సౌకర్యాలు కలిగించడానికి ఆ మార్కెటింగ్ యార్డులో ప్రత్యేకంగా 58 గోడౌవునులు రైతుజన సంక్షేమానికి ఈనాడు నిర్మించ డానికి శంఖుస్థాపన జరిగింది. ఇక్కడ ఇంత మంది ప్రయాణీకు లున్నారు. ఇన్ని బస్సులు బయలుదేరుతున్నాయి. వివిధ కేంద్రాలన్నింటికి కూడా బస్సులు వెళ్లుతున్నాయి. కాని ప్రయాణీకులకు సరయిన వసతులు కల్పించే బస్సుస్టాండు లేకపోవడం దురదృష్టకరం. ఇక్కడ బస్సు స్టాండుకు శంకుస్థాపన కేవలం నాకోసమే వేచిఉందేమోనని ఆనందంతో నేను ఉబ్బితబ్బిబ్బులౌతున్నాను. మీకు నేను నా ఆనందపారవశ్యాన్ని వ్యక్తం చేస్తున్నాను.

ఇక మూడవ కార్యక్రమం బలహీన వర్గాలవారికి ఇండ్ల నిర్మాణం. ఈనాడు సామాన్య మానవుడు ఈ సమాజంలో బ్రతకడానికి సరైన అవకాశాలు ఇంతవరకు కలిగించబడలేదు. అంటే ఈనాడు సమాజాన్ని దోచుకుతింటున్నటువంటి రాజకీయ వ్యవస్థే దీనికి కారణం అని నేను సవినయంగా మనవి చేస్తున్నాను. ఎందుకు రాజకీయం? ప్రజలకు పనికిరాని రాజకీయం ఎందుకు? స్వప్రయోజనాలకోసం, స్వలాభం కోసం వాడుకునే రాజకీయం ఏమాత్రం కూడదు. ఏ పేద ప్రజానీకమైతే తినడానికి తిండి, కట్టడానికి బట్ట ఉండటానికి వాసయోగ్యమైన ఇల్లు లేకుండా బాధ పడుతున్నారో, స్వాతంత్ర్యం ఏదో వారికి అందజేస్తుందని

ఆశించి, దగాపడి ఈనాడు చావలేక బ్రతుకుతున్నారో అట్టి పేద సోదరులందరు కూడా ఈ తెలుగుదేశం ప్రభుత్వం వారికి ఏదో ఇస్తుందని వారి జీవితానికి సరైన సంక్షేమకరమైన విధానాన్ని అందజేస్తుందని ఏ విధంగా ఆశిస్తున్నారో వారి ఆశలకు, వారి నమ్మకాలకు అనుగుణ్యంగా పనిచేయడం తెలుగుదేశం ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నదని నేను మీకు సవినయంగా మనవి చేస్తున్నాను. ఈ సందర్భంగా 400 బలహీన వర్గాల వారికి శాశ్వత గృహనిర్మాణ పథకం క్రింద ఈనాడు ఒక కాలనీ నిర్మిస్తున్నారు.

ఎంతో మంది నా ఆడపడుచులు ఎన్నో విధాలైన ఆశలతో అనురాగంతో ఎప్పుడు వచ్చినా ఆదరాన్ని వర్షిస్తున్నారు. మంగళారతులతో శుభాశీస్సులు అందిస్తున్నారు. నూటికి ఏభై శాతం ఆడువారు ఉంటున్న మన సమాజంలో ఇంతవరకు ఆడువారికి అక్క చెల్లెళ్లకు సరైనటువంటి న్యాయపరమైనటువంటి జీవనం కల్పించలేదు. మగవారితోపాటు ఆడువారికి కూడ సమానమైనటు వంటి హక్కులు కల్పించాలి అని చెప్పి అదే పరమార్థం అని కూడా మీకు మనవి చేయడం జరిగింది. అందుకు గాను ఈనాడు తిరిగి రెండవసారి తెలుగుదేశం పార్టీకి మీరు అధికారాన్ని యిచ్చినప్పుడు వెంటనే ఈ విధానంగా ఒకబిల్లు తయారు చేయడం జరిగింది.

**ఎంతో మంది నా ఆడపడుచులు ఎన్నో విధాలైన ఆశలతో అనురాగంతో ఎప్పుడు వచ్చినా ఆదరాన్ని వర్షిస్తున్నారు. మంగళారతులతో శుభాశీస్సులు అందిస్తున్నారు. మన సమాజంలో ఇంతవరకు అక్క చెల్లెళ్లకు సరైనటువంటి న్యాయపర మైనటువంటి జీవనం కల్పించలేదు.**

ఈనాడు దురాచారాలైనటువంటి వరకట్నం ఇత్యాదులన్నీ పోవాలంటే ఆర్థిక స్థోమత కూడా ఆడబిడ్డలకు కలిగించాలి. దాని పర్యవసానమే ఈ సమానహక్కుల బిల్లు యొక్క ప్రతిపాదన. అదేవిధంగా మహిళా విశ్వవిద్యాలయం నెలకొల్పబడింది.

ఈ ప్రభుత్వం కష్టపడి పనిచేసే వ్యవసాయ కార్మిక సోదరీమణులందరికి కూడా వారు గర్భిణీలుగా వున్నప్పుడు 8, 9వ నెలల్లో పించన్లు ఏర్పాటు చేయడం, వైద్య సదుపాయాలు కూడా కల్పించడం జరిగింది. ఏదైనా సరై మీ రుణం తీర్చాం. ప్రజలే తెలుగుదేశం పార్టీబలం. ఈనాడు ప్రజాబలంతోనే బ్రతుకున్నాం. మేము డబ్బుతో కాదు, సంపన్నవర్గాల వారి అండదండలతో కాదని మాత్రం నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

పేదప్రజానీకం అయితే ఈనాడు తెలుగుదేశంను తమ పార్టీగా గుర్తించి, గౌరవించి, అభిమానించి ఈరోజుకు ఈ విధంగా ఆదరాన్ని కురిపిస్తున్నారో అటువంటి పేదవారి యొక్క సంక్షేమానికి పేదరి కాన్ని ఈదేశం లోనుంచి పారద్రోలడానికి సామాజిక పరమైన న్యాయం అన్ని వర్గాలకు కలిగించడానికి స్వతంత్రతో వచ్చేటటువంటి అవకాశాలు అందరూ అనుభవించేటటు వంటి తీరుతెన్నులు చూడడానికి ఈ ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తుంది, ఈనాడు మీకళ్ల ముందున్నటువంటి ఈ ప్రగతి పథమే దానికి నిదర్శనమని నేను మనవి చేస్తున్నాను. ఎందరో సోదరీమణులు వారి చేతిపనులతో కుట్టుమిషన్లతో వారు జీవితాన్ని గడుపుకొనే అవకాశాలు, ఎంతోమంది పేదరైతు సోదరులు పొలందున్నుకోవడానికి అహర్నిశలు

కష్టపడడానికి బంగారుపంటలు పండించడానికి అనువైనటువంటి ఎడ్లబండ్లు వారికి అందజేయడానికి, అదేవిధంగా రైతుసోదరులకు పంపుసెట్లు, మోటారులు కూడా ప్రగతిపథంలో భాగంగా అందిస్తూ మీ అందరి ముందు ఉంచుతున్నారు.

ఈ అభ్యుదయ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి. వారందరు కూడా మన దేశాభ్యుదయానికి నడుంకట్టాలి. ఈనాడు పరిపాలన వ్యవస్థలో సమాజంలో వున్నటువంటి దుర్విధానం, అవినీతి, అక్రమం, లంచగొండి తనం తుడిచిపెట్టాలి. ఎవరికి వారే సుశిక్షకుడై నటువంటి సైనికుడుగా "ఈదేశం నాది, ఈ రాష్ట్రం నాది సరైనటువంటి విధానాన్ని అమలుచేసెటట్లు చూడడం నా భాధ్యత" అని ప్రతి ఒక్కరు గుర్తించాలి. వారి బాధ్యతగా స్వీకరించాలి. అప్పుడుగాని మన రాష్ట్రానికి సంక్షేమం జరగదు. మనదేశానికి ప్రగతిరాదు. రాలేదు. అటువంటి పరిశుద్ధమైనటువంటి పరిపాలనా విధానాన్ని ప్రజలకు అందించడమే ప్రభుత్వం యొక్క ఆదర్శమని సవినయంగా మనవిచేస్తూ మీ సేవకే మేమందరం కూడా పునరంకితం అవుతున్నామని ఈ సభాముఖంగా ప్రతిఒక్కరితో వ్యక్తం చేస్తున్నాను.

**"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి".**

**జై తెలుగునాడు. జైహింద్!**




# ఆరుకోట్ల ప్రజానీకానిదీ ఒకేబాట కావాలి

**(29-10-85న రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా ఆకాశవాణి, దూరదర్శన్‌లో చేసిన ప్రసంగం)**

ఇది శుభానంద దినం. అఖిలాంధ్ర ప్రజానీకానికి పర్వదినం. ప్రత్యేక రాష్ట్ర సముపార్జనా విధానంతో, భాషాగౌరవానికి, సాంస్కృతిక జాతీయతా వికాసాలకు పరువుతెచ్చుకున్న దినం. ప్రత్యేకత సంతరించుకున్న దినం. ఇది అందరూ గర్వించదగ్గ సాధనే, అయినా ఎన్నో ఉద్యమాలతోగాని, ఎంతో ఆందోళనతో గాని, అమరజీవి ఆత్మార్పణతోగాని యీ ప్రతిపత్తి మన కబ్బలేదు. రాలేదు.

తెలుగువారి ఆత్మగౌరవ విశిష్టతకు వెలలేని పరమార్థం. తెలుగు భాషకు నిండుదనం, గండుదనం, పరిగణనం, పరువం, పుణికించుకున్న ఆంధ్రప్రదేశ్ అవతరణం, యీ శుభదినం.

ఈ సందర్భంలో నాజాతికి, నా వారికి, అఖిలాంధ్ర ప్రజానీకానికి, అర్పిస్తున్నాను సుమాశీఃశుభాభివందనం, రాష్ట్ర అవతరణ దినోత్సవ అభినందనం.

**"ఏ దేశమేగినా ఎందుకాలిడినా**
**ఏ పీఠమెక్కినా ఎవ్వరెమనినా**
**పొగడరా నీతల్లి భూమిభారతిని**
**నిలపరా నీజాతి నిండు గౌరవము".**

కోరుతున్నాను హృదయపూర్వకంగా సిరిసంపదలతో, సస్యశ్యామల స్ఫూర్తితో, సర్వతోముఖ సంక్షేమ ప్రగతితో, తుష్టితో పుష్టితో మన రాష్ట్రం రాణించాలనీ, రవళించాలనీ, శోభించాలనీ, శుభపూరితం కావాలనీ.

తత్పరంగా మనదేశం చైతన్య ప్రగతితో, ముందుకు సాగాలనీ, ఆదర్శవంతమై ప్రజాస్వామ్యానికి ప్రతీకగా, సర్వదా సర్వదా పరిపుష్టివంతమైన రాష్ట్ర సమన్వయంతో, చెక్కు చెదరని ఐకమత్యంతో, మొక్కవోని సమైక్యతా భావంతో, సుస్థిరత్వంతో దీప్తివంతం కావాలని కోరుతున్నాను యీ శుభదినాన.

**"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ"** ఇటువంటి పరమ పవిత్రమైన భావంతో సాధించుకున్న స్వాతంత్ర్యం, స్వరాష్ట్రం మనకు సర్వదా పవిత్రం. యీ రెంటి గౌరవ పరిరక్షణమే మనధ్యేయం. మనం సాధించుకున్న యీ ప్రత్యేకతకు సరైన నిర్వచనం సమసమాజం. పరిరక్షిత ప్రజాస్వామ్యం, సర్వతోముఖవికాసం.

కొరతలేని, లేమిలేని, తృప్తి వంతమైన జీవన విధానం అందరికీ సమకూర్చడం, పేదరికాన్ని నిర్మూలించడం, న్యాయపరమైన, ప్రజాస్వామ్య పద్ధతిలో సామాజిక సిద్ధమైన హక్కులు, అవకాశాలు అందరికీ కల్పించడం, పంచడం, స్వాతంత్ర్యఫలం సరైన అనుభవానికి రావడం ప్రభుత్వ విధానం. పరిపాలనా విధానం దోపిడీ వ్యవస్థగా మారకుండా రాజకీయం వ్యాపారాత్మకం కాకుండా స్వార్థపరులు సమాజాన్ని దోచుకోకుండా, దౌర్జన్యశక్తులు హింసాత్మక విధానంతో ప్రజాపీడనకు పూనుకోకుండా, సురక్షితమైన, సుప్రతిష్టమైన, ప్రతిష్టాత్మకమైన స్వచ్ఛంద పరిపాలనా విధానాన్ని ప్రజలకందించడం, జాతిగౌరవాన్ని పెంపొందించడం, తెలుగుదేశం ప్రభుత్వధ్యేయం.

అంతేకాకుండా నిష్కళంకమైన ప్రజాసేవతో, రాష్ట్రాభ్యుదయానికి, పరిపాలనా పటిష్టతకు సహకరిస్తున్న అధికార వ్యవస్థ కృషిని గుర్తించడం, అభినందించడం, మంచిని గౌరవించడమౌతుంది. ఇది జరిగినప్పుడు గాని ఆదర్శ సేవాతత్పరతకు సామాజిక విలువ సంప్రాప్తించదని, అది శోభించదని నా భావన.

కనుకనే యీ పవిత్ర ఆంధ్రప్రదేశ్ అవతరణ శుభ సందర్భంగా సమర్థతను గుర్తించడం, అర్హతను గౌరవించడం సుసాంప్రదాయం కావాలని తెలుగుదేశం ప్రభుత్వం భావిస్తున్నది. అందువల్ల వారి వారి శాఖల్లో అద్వితీయ ప్రతిభావిశేషాలు కనపరచిన, పవిత్ర ఆచరణ విధానాలకు అంకితులైన ప్రభుత్వోద్యోగులను గుర్తించి గౌరవించడం జరుగుతోంది. ప్రశంసాపరంపరలతో. ఈ విధానం ఉత్తేజితమై ఉద్వేగపూరితమై పరిపాలనా విధానానికి పరిపుష్టి చేకూర్చగలదని నా నమ్మకం. మనరాష్ట్రాభ్యుదయం నీతి నిబద్ధమైన పరిపాలనా విధానం, కేవలం ఏ ఒక్కరివల్లో జరిగేది కాదు. ప్రజలందరిలోను ఇది మన రాష్ట్రం, మాకు చెందవలసిన

ప్రజాపరిపాలనలో చెడును తుడిచిపెట్టి, మంచిని పంచిపెట్టడం అందరిబాధ్యతగా ప్రతి ఒక్కరూ స్వీకరించాలని నా విజ్ఞప్తి. ఆవిర్భావదినమని ఆనందిస్తే సరిపోదు. ఆవిర్భవించిన యీ స్వతంత్ర రాష్ట్ర వ్యవస్థ సరియైన నిజమైన ప్రజాస్వామ్యపద్ధతితో నిబద్ధమైన సంక్షేమకర వ్యవస్థగా రూపొందించుకోవడంలో ఆరుకోట్ల ప్రజానీకానిది ఒకే బాటకావాలని అది ప్రగతి పథంలో దూసుకుపోవాలని, నిరాశాపరులుగా భంగపడ్డ దగాపడ్డ పేద ప్రజలకు ఆదరవు కల్పించే కాణాచిగా కనులముందు సాక్షాత్కరించాలని నా ఆశ, ప్రభుత్వ ఆశయం.

నన్నహర్నిశం ఆదరిస్తున్న, ఆశీర్వదిస్తున్న ఆడబడుచులు, అన్నదమ్ములే నా ఊపిరి ఉత్సాహం.

చిరుదరహాసాల గుబాళింపులో నన్ను పరవశింపచేస్తున్న భావి రాష్ట్ర పౌరులైన చిరంజీవులే, చిట్టి తండ్రులే నా ఆవేశం నాకు ఆశా దీపం. కనుక మనం సాధించుకున్న యీ రాష్ట్ర సమగ్రతను, సమైక్యతను, సర్వతోముఖ వికాసవంతమైన, సస్యశ్యామలమైన పనిగా, గనిగా మనం తీర్చిదిద్దుకోవాలి. మీ ప్రతినిధిగా ఆరుకోట్ల తెలుగు ప్రజలు ఆదరించి, గౌరవించిన మీ మనిషిగా మీ నమ్మకాలకు, విశ్వాసాలకు ఏమాత్రం తగ్గని పద్ధతిలో మన సంస్కృతీ వికాసాల విలువలు కాపాడుతూ అనుక్షణం తెలుగువారి ఆత్మగౌరవానికి పరిరక్షణగా పరిశుద్ధమైన పరిపాలనా విధానానికి ప్రతీకగా నిలిచే ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రజల కందించడంలో వెనుదీయనని రాష్ట్ర ప్రజాసంక్షేమానికి, సేవకు పునరంకిత మవుతున్నానని శపథం చేస్తున్నాను. యీ ఆంధ్ర ప్రదేశ్ అవతరణ శుభోత్సవ సందర్భాన, యీ పర్వదినాన. అందరూ ఆనందంతో తృప్తితో పరవశించాలని, మీ అందరి కుటుంబాలు సంతోష తరంగాలలో తేలియాడాలని తెలుగుబిడ్డలు గండుమగటిమితో, మనోనిబ్బరంతో, విజ్ఞాన వికాసాలతో పరిపుష్టివంతమైన రాష్ట్ర సుస్వరూప సంకలనానికి మహాశిల్పులు కావాలని నా ఆశ, నా ఆకాంక్ష.

అప్పుడే నవంబరు 1కి సరియైన నిర్వచనం. అదే నేను కోరుకునేవరం.

**జై తెలుగునాడు. జైహింద్!**



# చలనచిత్ర కళాలక్ష్మికి నీరాజనం

**(36 వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం ప్రారంభోత్సవ నందర్భంలో ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు గారి ప్రసంగం - తేది: 10-1-1986)**

కళల కాణాచిగా సింగారించుకున్న యీ రంగనపల్లి ప్రారంభోత్సవానికి విచ్చేసిన గవర్నర్ కుముద్‌బెన్ జోషి గారికి..

గౌరవనీయులైన మంత్రి మండలి సభ్యులకు..

పార్లమెంటు ఇరుసభల గౌరవనీయులైన నాయకులకు, సభ్యులకు...

ప్రజా శ్రేయోలగ్నమైన పరమార్ధతతో, సేవానిరతితో రాష్ట్రాభ్యుదయానికి బాటలు వేస్తున్న గౌరవనీయ శాసనసభా సభ్యులకు, ప్రతిపక్ష నాయకులకు, ప్రతినిధులకు, మిత్రపక్ష నాయకులకు, ప్రతినిధులకు..

న్యాయదేవతకు నీరాజనం పడుతూ 'ధర్మోరక్షతి రక్షితః' అన్న పరమార్ధానికి ప్రతీకగా సామాజిక పరమైన న్యాయ నిర్దేశకులుగా, బాధ్యతాయుత పదవీ నిర్వహణాధ్యక్షులు, న్యాయాధిపతులు, గౌరవనీయులు భాస్కరన్ గారికి, న్యాయమూర్తులకు.

ఈ 36వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం మన భాగ్యనగరంలోనే జరుపుకొనే భాగ్యం మనకు కలిగించిన చైతన్య కళా వికాసశోభితులు శ్రీహృషికేష్ ముఖర్జీ గారికి, శ్రీ డి.వి.యస్.రాజు గారికి, శ్రీ వీరేన్ లూథర్ గారికి, నా ఆహ్వానాన్ని పురస్కరించుకొని విచ్చేసిన విరామమెరుగని కళా సంసేవనలో కాకలుతీరిన నా ప్రియ మిత్రులు, ఆవేశ భావక ప్రేరితులు, ఆదర్శ కళాప్రపూర్ణులు శ్రీ అశోక్ కుమార్ గారికి, శ్రీ దిలీప్ కుమార్ గారికి, శ్రీ రాజ్‌కపూర్ గారికి, శ్రీ రాజకుమార్ గారికి, శ్రీ ప్రేమ్‌నజీర్ గారికి...

విబుధ వరేణ్యులకు, విద్వజ్జులకు, సకల కళాపారంగతులకు, కళాప్రియులకు, మమతలు పంచి, మంచికి మారుపేరై నాకు మన్ననలందజేస్తున్న సర్వులకు, ఆశేష ప్రజావాహిని పరంపరకు, ఆడబిడ్డలకు, అన్నదమ్ములకు స్వాగతం, సుస్వాగతం, అభినందనం, శుభ అభినందనం.

కమనీయ మధుర మంజుల కింకిణీ నిర్వాణ సురుచిర శోభాయమానమైన సర్వకళా సంకలనం సంకేతనం, ఆమందానంద కందళిత పారవశ్య ప్రాంగణం, అందాల ప్రోవు ఈ తెలుగు లలిత కళాతోరణం.

ప్రజలే ఏలికలుగా, నిర్దేశకులుగా శాసించబడుతున్న యీ ఆధునిక ప్రజాస్వామ్య యుగంలో ప్రజాప్రతినిధిగా నా పర్యవేక్షణలో నిర్మించబడ్డ యీ సుందర కళానికుంజం తెలుగు కళా ప్రాభవానికి గురుతుగా, కళాపారమార్థానికి ప్రజానీకానికి అంకితం చేస్తున్నాను ఈ చలన చిత్రోత్సవ శుభ సందర్భంగా.

ఈ సురచిర రూపకల్పనా సంవిధానంలో ఎందరో, ఎందరో శ్రామికులు, మరెందరో కార్మికులు, ఎందరెందరో శిల్పాచార్యులు, స్ఫురద్రూపులైన సాంకేతిక పరిజ్ఞానవేత్తల కృషి పరిమళం – ఈ కళా ప్రాంగణం.

అనుకున్నదే తడవుగా, అన్న గడువులో మడమ మళ్లించకుండా మూడు నెలల పరిధిలో యీ సుందరాకృతికి సంపూర్ణత్వం సిద్ధింపచేసిన నిష్ణాతులకు, స్రష్టలకు వారి అమూల్యమైన సేవానిరతికి నా పారవశ్యపరమైన కృతజ్ఞతా పూర్వక అభినందనలు. ఈ పరమానందభరిత సన్నివేశ సందర్భంలో నవయుగ దివ్య వైతాళికుడు, విప్లవ లేఖినీ ఆలంబకుడు, ప్రజాకవి శ్రీశ్రీ రచించిన దివ్యగేయం గుర్తుకు వస్తున్నది:

**తాజ్‌మహల్ నిర్మాణానికి**
**రాళ్ళెత్తిన కూలీలెవ్వరు**
**ప్రభు వెక్కిన పల్లకి కాదోయ్**
**అది మోసిన బోయీ లెవ్వరు?**

కష్టం రంగరించి, స్వేదం చిలికించి ఆ శ్రమజీవులు, కర్మిష్ఠులు పండించిన తెలుగు జిలుగు వెలుగుల తోరణం యీ లలిత కళా తోరణం.

ఈనాడు యీ కళానిష్ణాతుల శుభాశీః పరంపరా పరాగంలో, పండిత ప్రకాండుల, విజ్ఞుల, విద్వజ్జుల పరిష్వంగ పరిమళ వాతావరణంలో పునీతమై తన దివ్య కళాకాంతులు ప్రసరిస్తున్న యీ చిత్ర వైభవ

సంకేతం ప్రజలకు నయనానందకరమై, వినోద, వికాస, ఉల్లాసభరితమై, కళాప్రియులకు కాణాచియై తెలుగు లలిత కళలు గూడుకట్టుకున్న నిలయంగా ప్రజాసేవలో పునీతం కాగలదని ఆశిస్తున్నాను.

ఈనాడు అంతర్జాతీయ చలన చిత్రోత్సవం భాగ్యనగరంతో ప్రథమంగా శోభించబడటం మనందరికి ఆనందాయకం.

కళ కళ కోసం కాదు, మానవ వికాసానికన్న ఆధునిక అభ్యుదయ పరమైన తీర్పుకు ఉద్దీపనాభావ ప్రేరితులై చలనచిత్ర కళాలక్ష్మీకి నీరాజనం పడుతున్న నిర్మాతలకు. సాంకేతిక పరాజ్ఞానవేత్తలకు, విదుషీ ప్రభా విభవ సంపన్నులైన నటీనటులకు యీ ఉత్సవం కొత్త దీప్తిని సరికొత్త స్ఫూర్తిని కలిగించగలదని నా పరిపూర్ణ విశ్వాసం.

చిత్ర నిర్మాణంలో సాగుతున్న కొత్త పోకడలు గమనించిన, భావసంకలన సంవిధానంలో నవ్యతకు నాంది పలికే రీతులకు, నీతులకు యీ అవకాశం పులకాంకురం కావాలని నా కోరిక.

సకల కళా సంకలన ప్రోక్షణాధురీణులైన చిత్ర నిర్మాణ పండితుల ఆలోచనలు ఈ ప్రదర్శన ఫలితంగా పండాలని నా ఆశ, ఆకాంక్ష.

కళలే దేశ ప్రగతికి, సాంస్కృతిక వికాసానికి, సామాజిక పురోగమనకు, సంఘ చైతన్యానికి, మానవాభ్యుదయానికీ పూలబాటలు పరచే పసందైన ఆలోచనా ప్రభావానికి నిర్వచనం కావాలని కోరుతున్నాను.

చిందానంద స్వరూపుడైన నటశేఖరుని లయాభినయ నృత్య విన్యాస విలాస రూపకాలకు ఆలంబనమై, పశుర్వేత్తి శిశుర్వేత్తి అన్నట్లు పండిత పామర జడజంగమ చేతన దీప్తి ప్రభావమై యుగయుగాలుగా చతుష్షష్టి కళా సంప్రోక్షితమైన తెలుగు కళాలక్ష్మికి తమ కళామయ జీవితాలకు కానుకలుగా సమర్పణ చేసి తెలుగు కళా ప్రాభవాన్ని దిక్ దిగంత యశో విరాజితం చేసిన ఆ పాండితీ ప్రకాండుల, నటశేఖరులకు, నాట్యమయూరులకు, సాహితీ వేత్తలకు–సర్వజ్ఞులకు–స్రష్టలకు–నా దివ్య  కళా నీరాజనం.

వారి దివ్యస్మృతిలో పులకాంకితం, పునీతం యీ మధుర మంజుల, మనోజ్ఞ సురుచిర సుందర కళా ప్రాంగణం ప్రారంభం. నా ఊహల పంటగా నిలిచిన యీ తెలుగు లలిత కళాతోరణం ప్రజా మన్ననలతో పునీతమె, ఆశయ సిద్ధిని సంతరించుకోగలదని నా సంపూర్ణ విశ్వాసం– ఆనాడే నా కృషి ధన్యం.

**జై తెలుగునాడు. జైహింద్!**

# మ్యూజియంలు మన సంస్కృతీ నాగరికతలకు ప్రతీకలు

**(సాలార్ జంగ్ మ్యూజియం సంస్థాపకుడు తృతీయ సాలార్ జంగ్ శత జయంతి ఉత్సవంలో, తేది. 22-6-1986 నాడు ముఖ్యమంత్రి శ్రీయన్.టి.రామారావుగారు చేసిన హిందీ ప్రసంగానికి తెలుగు సేత)**

భారత ఉపరాష్ట్రపతి, గౌరవనీయులు శ్రీ ఆర్. వెంకట్రామన్ గారు, ఆంధ్రప్రదేశ్ రాజ్యపాల్ గౌరవనీయులు శ్రీమతి కుముద్‌బెన్ జోషిగారు, భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖామాత్యులు గౌరవనీయులు శ్రీ పి.వి.నరసింహారావుగారు,

భారత ప్రభుత్వ విద్యా సాంస్కృతిక శాఖామాత్యులు శ్రీమతి కృష్ణా సాహీ గారు,

సాలార్ జంగ్ మ్యూజియం ప్రబంధం మండలి సభ్యులారా,

మిత్రులారా, సోదరీ సోదరులారా.

మన భారతదేశం వివిధ మతాలకు, వివిధ భాషలకు వివిధ సంస్కృతులకు విలక్షణమైన కూడలి. అయినా విభిన్నత్వంలో ఏకత్వం మనదేశ విశిష్టత. యిక్కడి ప్రజలందరి హృదయస్పందన ఒకటే. ఆత్మశక్తి ఆమోఘం. కనుకనే మహమ్మద్ ఇక్బాల్ కవి భారతావని ప్రశస్తిని క్రిందివిధంగా గానం చేశారు. :-

**ఏ భూమిపై చిష్తీ మహాశయుడు భగవత్ సందేశం వినిపించాడో-**

**ఏ పూదోటలో గురునానక్ ఆద్వైత బోధకావించాడో,**



**ఏ గడ్డను తాతారీలు తను మాతృభూమిగా భావించి కీర్తించారో,**

**ఏ గద్దెను హిజాజీల బారినుండి అరబ్బులు రక్షించి కాపాడారో అదేనా మాతృభూమి-అదే, అదే నా మాతృభూమి.**

**ఏ గడ్డ గౌతమ బుద్ధుని మాతృభూమియో !**

**ఏ గడ్డ జొపానీయుల విహారస్థలియో !**

**ఏ గడ్డ ఏసుక్రీస్తు భక్తులకు జెరూశలేమో,**

**ఏ గడ్డ ఇస్లామ్ మతానురక్తుల నిలయమో,**

**ఏ గడ్డ మీద వికసించిన ప్రతిపూవు పరిమళ వంతమో, ఆరాధ్యమో, అదే నా మాతృభూమి – అదే, అదే నా మాతృభూమి.**

ఇది భారతదేశ విశిష్టత. ఇదీ భారతావని మట్టియందలి మహత్తు. అనేకత్వంలో ఏకత్వం సంతరించుకున్న భారతావనివలెనే, యీ సాలార్‌జంగ్ మ్యూజియం కూడా రంగురంగుల పరిమళ వంతమైన పుష్ప రాజాల సమాహారం. మనమంతా యీ గడ్డమీద విహరించే పక్షులం. యిది మనందరికీ గులాబీలవనం.

ఇటువంటి మ్యూజియం స్థాపకులు తృతీయ సాలార్ జంగ్ నవాబ్ మీర్ యూసఫ్ అలీఖాన్ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొని, మీవంటి మేధావులను, కళా ప్రియులను దర్శించే అవకాశం యీనాడు నాకు కలిగినందుకు సంతోషిస్తున్నాను. ఎంతో శ్రమించి యింత పెద్ద స్థాయిలో యీ శతజయంతి ఉత్సవాలు జరుపుటకు ఏర్పాట్లు చేసిన సోదరీసోదరులనందరినీ యీ సందర్భంగా అభినందిస్తున్నాను.

అత్యద్భుతమైన కళాఖండాలకు, నేర్పరితనంతో కూడిన శిల్పకళా చాతుర్యానికి, మన సాంస్కృతిక సమ్మేళనానికి యీ మ్యూజియం నిలయం, సంగమం. యీ మ్యూజియం నిమిత్తం ప్రపంచం నాలుగు చెరగుల నుంచి తన సర్వము ధారపోసి, అమూల్యమైన కళాఖండాలను తెప్పించి, యీ మ్యూజియమును సర్వాంగ సుందరంగా మలచిన భారతమాత ముద్దుబిడ్డ తృతీయ సాలార్ జంగ్ నవాబ్ మీర్ యూసఫ్ అలీఖాన్

ఆంధ్రప్రదేశ్ మాత్రమేగాక, యావద్భారతావని గర్వించతగిన కళాతపస్వి. వివిధ మేలు కళాఖండాలను సమకూర్చి రాబోయే తరాలవారికి ఆదర్శమార్గం చూపించారు. దేశ దేశాలనుంచి ప్రతిరోజు యిక్కడికి వచ్చే దర్శకుల హృదయాలను రంజింపచేయడమేగాక, యీ మ్యూజియం వారి జ్ఞానాభివృద్ధికి కూడా ఎంతో దోహదం చేస్తూ వున్నది. అందువల్లనే 1961 లో భారత పార్లమెంటు యీ మ్యూజియానికి జాతీయ ప్రతిపత్తినిచ్చి గౌరవించింది.

యీ మ్యూజియాలు మన సంస్కృతీ, నాగరికతలకు శ్రీరామరక్ష. వీటి భద్రతకు అవసరమైన చర్యలు గైకొని వీటిని సంరక్షించడం ప్రతి భారతీయుని కర్తవ్యమని మనవి చేస్తున్నాను. సోదరులారా, ఏ సమాజంలో మానవుడు జన్మిస్తున్నాడో, పెరిగి పెద్దవాడవుతున్నాడో, ఏ సమాజంలో మనిషి, మనిషిగా గుర్తించబడుతున్నాడో, అభ్యుదయానికి, ప్రగతికి అవకాశాలు, గౌరవ మర్యాదలు పొందుతున్నాడో, ఆ సమాజానికి నిస్వార్థంగా సేవ చేయడం, ఆ సమాజాభివృద్ధికి కృషి చేయడం అతడి విధి, కర్తవ్యం. అదే మానవ జన్మకు పరమావధి. అదే మానవ జన్మకు సాఫల్యం. 'సంఘం శరణం గచ్ఛామి' అను బోధకు అర్థం యిదే. మానవ జన్మకు అవసరమైన తపనకు, కృషికి, నిస్వార్థ సేవాభావానికి, మానవ సాధనకు యీ మ్యూజియం మంచి తార్కాణం, కళా ఖండాల యీ నిలయం మానవుని భావ ఔన్నత్యానికి, పవిత్రమైన కళా హృదయానికి ప్రత్యక్ష నిదర్శనం. ఇంత మహత్కారణం సాధించాడు, శారీరికంగాను, మానసికంగానూ, ఆర్థికంగాను తన సర్వము అర్పించిన ఒక మహానుభావుడు ఆ మహామనీషి. ఆ కళాతపస్వి మనందరివాడు కావడం, మన ప్రాంతానికి చెందినవాడు కావడం మనకు గర్వకారణం.

ప్రపంచంలో యిటువంటి మనిషి మరొకరు లభించడం దుర్లభం. అటువంటి కళాతపస్వి తృతీయ సాలార్ జంగ్ శతాబ్ది ఉత్సావాలలో పాల్గొని ఒక మహోన్నత భావాలలో కృషిచేసిన కళాతపస్వికి గౌరవం కల్పించారు మన భారత ఉపరాష్ట్రపతి శ్రీ ఆర్.వెంకట్రామన్ గారు. వారికి మీ అందరి తరపున, నా తరపున అభివందనం. శుభాభివందనం. తృతీయ సాలార్ జంగ్ మహాశయునికి యీ సందర్భంగా సమర్పిస్తున్నాను గౌరవ నమస్సుమాంజలులు నిండుగా, మెండుగా సోదరులారా. నన్ను యిక్కడికి ఆహ్వానించి, ప్రశాంతంగా నా మాటలు విని, మ్యూజియం పక్షాన ప్రకటించిన గ్రంథాల ఆవిష్కరణ నా చేత కావింపచేసి, నన్ను గౌరవించిన మీ అందరికీ సమర్పిస్తున్నాను, ప్రణమాంజలులు.

**జై తెలుగునాడు. జైహింద్!**



# స్వాతంత్ర్యానికి సరైన నిర్వచనం

**(స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీయన్.టి.రామారావు గారి పెరేడ్ ప్రసంగం 15-8-86)**

జాతీయకేతనం స్వేచ్ఛా భారత గగనతలంపై విజయోత్సాహంతో రెపరెపలాడిన సుదినం నేడు. జాతికే పండుగదినం ఈనాడు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజాన్ని ఎదిరించి, ప్రాణాలొడ్డి, రక్తం ధారపోసి, అనేక కష్టనష్టాలు భరించి సాధించుకున్నాం స్వాతంత్ర్యాన్ని మనం - సరిగ్గా ముప్పయ్ తొమ్మిదేళ్ళ క్రితం. ఈ స్వాతంత్ర్య మహాయజ్ఞంలో సమిధులై ఆత్మార్పణం చేసుకొన్న మహనీయులను స్మరించుకొంటూ, ఆనాటి స్మృతులను నెమరేసుకుంటూ స్ఫూర్తిని పొంది, ఉద్దీపన చెంది కర్తవ్యోన్ముఖ చైతన్యంతో ముందుడుగు వేయడానికి జరుపుకుందాం పర్వదినంగా, మనందరికోసం, రానున్న తరాల కోసం తమను తాము అంకితం చేసుకున్న ఆ మహనీయులను ఒకసారి స్మరించుకొందాం గుండెలనిండా తొణికిసలాడే కృతజ్ఞతాభావంతో.

పరాయి పాలనలో స్వేచ్ఛ లేక, అభివృద్ధికి నోచుకోక వెనుకబడిపోయిన జాతి జీవితంలో స్వాతంత్ర్యం క్రొత్త పుటలు తెరిచింది. ఉషోదయ రేఖలు విచ్చుకుని చీకట్లు పటాపంచలయ్యాయి.

ఈ వెలుగులన్నీ తమ యింటిముంగిటే పరచుకుంటాయని ఆశించింది సామాన్య ప్రజ. స్వరాజ్య సిద్ధితో

పేదరికం పక్కకు తప్పుకుంటుందని, అభివృద్ధి అందల మెక్కిస్తుందని ఎదురుచూసింది అట్టడుగు ప్రజ. కళ్ళలో వత్తులు పెట్టుకుని కాచుకుని కూర్చుంది దాదాపు నాలుగు దశాబ్ధాలపాటు.

కానీ, జరిగిందేమిటి !?

పంచవర్ష ప్రణాళికల సోపానాలపై అంచలంచెలుగా దేశం పురోగమిస్తున్న కొద్దీ సామాన్యుడు యింకా యింకా అడుక్కి దిగజారిపోతున్నాడు. దారిద్ర్యరేఖకు దిగువ పేదరికం ఊబిలో కూరుకుపోతున్నాడు. స్వాతంత్ర్యం పండించిన ప్రగతి ఫలాలను సంపన్నులూ, పలుకుబడిగల పెద్దలూ తన్నుకుపోతున్నారు. ఈ మధ్య కాలంలో దళారీ వర్గం ఒకటి కొత్తగా అవతరించి అన్ని రంగాలకూ విస్తరించి వికృతంగా వికటాట్టహాసంతో విజృంభించడం మొదలెట్టింది. సంపన్నులు మరీ సంపన్నులవుతున్నారు. పేదలు మరీ నిరుపేదలుగానే మిగిలిపోతున్నారు.

**దేశం పురోగమిస్తున్న కొద్దీ సామాన్యుడు యింకా అడుక్కి దిగజారి పోతున్నాడు. దారిద్ర్యరేఖకు దిగువ పేదరికం ఊబిలో కూరుకుపోతున్నాడు. స్వాతంత్ర్యం పండించిన ప్రగతి ఫలాలను సంపన్నులూ, పలుకుబడిగల పెద్దలూ తన్నుకుపోతున్నారు.**

అందుకే దేశంలో యీనాడు యింత వైరుధ్యం.

అభివృద్ధి పక్కనే బక్కచిక్కిన బడుగుతనం. ఐశ్వర్యం సరసనే కటిక పేదరికం. విజ్ఞాన జ్యోతుల చెంతనే అజ్ఞాన తిమిరాలు. భవంతుల నీడలోనే పూరి గుడిసెలు.

ఇదా స్వాతంత్ర్యానికి పూజ్య బాపూజీ యిచ్చిన నిర్వచనం?

ఇదా స్వాతంత్ర్యవీరులు ఆశించిన స్వేచ్ఛాపదం?

ఇదా మనం కలలుకన్న స్వతంత్ర్య భారత సమతా వాదం?

స్వాతంత్ర్య ఫలాలు ఏ ఒక్కరిసొత్తూ కావు. అవి అందరివీ.. అందరికీ.

జాతి పురోగతికి, దేశప్రగతికి, వ్యక్తి వికాసానికి, సమాజ శ్రేయస్సుకు దోహదం చేయడమే స్వాతంత్ర్యానికి అర్థం.. పరమార్థం.

ఆనాడే మనం ప్రతిష్ఠించుకున్న ప్రజాస్వామ్యం పుష్పించి పరిమళిస్తుంది. అప్పుడే మనం కన్న కలలకు వాస్తవరూపం సిద్ధిస్తుంది.

ఆ లక్ష్య సాధననే తెలుగుదేశ ప్రభుత్వ ఆదర్శం. స్వాతంత్ర్యానికి నిజమైన నిర్వచనం యివ్వాలన్నదే తెలుగుదేశ ప్రభుత్వ సువిధానం.

అందుకే ఆర్థికంగా, సామాజికంగా అట్టడుగున వున్న వారికి చేయూతనిచ్చి, పైకి తెచ్చి, వెనుకబడిన వారికి ఆసరాయిచ్చి ముందుకు నడిపించడం ప్రథమ కర్తవ్యంగా భావించింది రాష్ట్ర ప్రభుత్వం. అభివృద్ధి కార్యక్రమాలకన్నా సంక్షేమ సేవలకు అధిక ప్రాధాన్యమిచ్చి, దశాబ్ధాలుగా అభివృద్ధికి నోచుకోక స్వార్థపరుల

పాదాల కింద నలిగి అట్టడుగున అంధకారంలో మ్రగ్గుతున్న బాధిత బడుగువర్గాల సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశం పరిశ్రమిస్తోంది.... నిర్విరామంగా కృషిచేస్తోంది.

దిక్కూ మొక్కూ లేక, ఆలనా పాలనా లేక, తమ బాధలు చెప్పుకునే నోరులేక, తమ హక్కులకోసం నినదించే విజ్ఞతలేక కేవలం మురికివాడల్లో, కుగ్రామాల్లో చాలీచాలని వృత్తిలో జీవితాన్ని ముడిపెట్టుకుని సరిపెట్టుకుంటున్న ఆ దయనీయ మూర్తులకు తినడానికి తిండి, వుండడానికి యిల్లు, కట్టుకోడానికి బట్ట సమకూర్చి ఆర్థిక పరిపుష్టి, సాంఘిక ప్రతిపత్తి కలిగించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించడమే ప్రభుత్వ సంక్షేమ విధానం. అందుకే ప్రభుత్వం అమలుపరుస్తోంది, గత మూడున్నర ఏళ్ళుగా ఎప్పటికప్పుడు సరి కొత్త సంక్షేమ పథకాల్ని.

రెండు రూపాయలకే కిలో బియ్యం, నిలువ నీడలేనివారికి పక్కాయిళ్ళు, సగం ధరకే చేనేత వస్త్రాలు, వృద్ధ పేద వ్యవసాయ కార్మికులకు, నిరాధార పేద వితంతువులకు, గర్భిణులైన మహిళా వ్యవసాయ కూలీలకు పింఛనులు, మురికివాడ నివాసుల పిల్లలకు చౌకగా పాలు, భూమిలేనివారికి భూవసతి, ఇళ్ళు లేనివారికి యిళ్ళ స్థలాలు–ఇవన్నీ పేదల సంక్షేమానికై ఉద్దేశించినవే.

నవనాగరిక ప్రపంచానికి దూరంగా అడవుల్లో, కొండల్లో జీవించే ప్రకృతిమాత ముద్దుబిడ్డలైన గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపడానికి, వారి అవసరాలకు గుర్తించి కార్యక్రమాలు రూపొందించడానికి, వారిని ప్రత్యక్షంగా కలుసుకుని వారి కష్టనిష్టురాలు తెలుసుకోవడానికి ఇటీవలే రాష్ట్రంలోని లోతట్టు గిరిజన ప్రాంతాలలో పర్యటించాను.

అదేవిధంగా పల్లె ప్రాంతాల్లో, పట్టణాలలో ఆర్థిక, సామాజిక ప్రగతి లేక వెనుకబడివున్న బలహీన, నిరుపేద వర్గాలను కలుసుకోవడానికి మరోసారి రాష్ట్రమంతటా విస్తృతంగా పర్యటించాను.

ఈ పర్యటన సమయంలో అనేక సంక్షేమ సేవా కార్యక్రమాలలో పాల్గొని, అక్కడికక్కడే పలు నిర్ణయాలు తీసుకుని, తమకు అండగా ప్రభుత్వం కలదన్న సత్యాన్ని వారికి తెలియజెప్పటం.. నిరూపించడం జరిగింది.

స్వతంత్ర భారతదేశంలో సంభవిస్తున్న అభ్యుదయకరమైన మార్పులకు, జరుగుతున్న ప్రగతికి గ్రామసీమలు దూరమైపోకుండా, అభివృద్ధిలో పాలుపంచుకుంటూ సమగ్ర గ్రామీణాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం యిప్పటికే అనేక చర్యలు చేపట్టింది.

వివిధ ప్రభుత్వశాఖల సేవలనన్నింటిని గ్రామీణ ప్రజానీకానికి ఒకేచోట లభ్యంచేసి సాధ్యమైనంత సమీపంలో అందుకొనే సౌలభ్యం కల్పిస్తూ తీసుకున్న నిర్ణయమే రెవిన్యూ మండలాల ఏర్పాటు.

బక్క రైతన్న బాధలు బాపేటందుకు వారికి ఎరువులు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ పనిముట్లు, రుణాల, మార్కెటింగ్ సౌకర్యాలు ఒకేచోట అందించే విధంగా సహకార సంఘాలను చైతన్యవంతంగా, ప్రయోజనకరంగా తీర్చిదిద్దేటందుకే ఏక గవాక్ష విధానాన్ని ప్రవేశ పెట్టాలన్న యోచన.

అభివృద్ధికి నోచుకోని గ్రామీణ ప్రాంతాలలో ప్రజావసరాలకు తగినట్టు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయా గ్రామ ప్రజలే భాగస్వాములై పాలుపంచుకుని మధ్య దళారీలైన కాంట్రాక్టర్ల బెడదను వారికి తప్పించి, స్వచ్ఛందంగా ఏర్పడే శ్రమదళాల కృషిని ప్రభుత్వ కృషికి జోడించి, తమ సామాజిక అవసరాలను తామే తీర్చుకునే విధంగా గ్రామస్తులను తీర్చిదిద్దడానికి ప్రారంభించినదే గ్రామీణ క్రాంతిపథం–కార్యక్రమం.

నిరుద్యోగ గ్రామీణ యువకులకు ఉపాధి కల్పిస్తూ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించి ప్రకృతిలో వాతావరణ కాలుష్యాన్ని నిరోధించి, భూసార పరిరక్షణకు దోహదం చేసి వంట చెరకు తదితర అటవీ ఉత్పత్తులను పెంపొందించేటందుకే అమలు జరుగుతున్నది సామాజిక అడవుల పెంపకం కార్యక్రమం.

మరుగుదొడ్ల సౌకర్యం లేక అనేక యిబ్బందులకు గురవుతున్న గ్రామ సీమల్లోని ఆడపడుచులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేటందుకు ఉద్దేశించినదే గ్రామీణ మహిళా బహిర్ ప్రదేశ పథకం.

**మరుగుదొడ్ల సౌకర్యం లేక అనేక యిబ్బందులకు గురవుతున్న గ్రామ సీమల్లోని ఆడపడుచులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేటందుకు ఉద్దేశించినదే గ్రామీణ మహిళా బహిర్ ప్రదేశ పథకం.**

ఇంకా – తెలుగు మాగాణి సమారాధానం, పంటల సమగ్ర బీమా పథకం, వృద్ధ వ్యవసాయ కూలీలకు పింఛనులు, గ్రామాధికార్ల పదవుల రద్దు వంటి కార్యక్రమాలు, చర్యలు మన గ్రామసీమలలో నూతన చైతన్య వీచికలకు, నవోదయ గీతికలకు నాంది పలికి రాష్ట్రాభ్యుదయానికి, దేశ ప్రగతికి పట్టుకొమ్మలైన గ్రామాల స్వరూప స్వభావాలనే మార్చివేసి యింతవరకు అలక్షింపబడిన గ్రామీణ ప్రజల సర్వతోముఖ ప్రగతికి బాటలు వేయగలవు.

ఒక ప్రక్క సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున చేపట్టుతూ, మరో ప్రక్క అభివృద్ధి కార్యక్రమాలను అమలు జరుపుతూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం.

రాష్ట్ర పారిశ్రామికీకరణ, విద్యా వైద్య సౌకర్యాల విస్తరణ, పొలాలకు జలాలు, మహిళా అభ్యుదయం, యువజన శ్రేయస్సు వంటి అభివృద్ధి కార్యక్రమాలతో సంక్షేమ కార్యక్రమాలను సమన్వయపూర్వకంగా జోడించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడం రాష్ట్ర ప్రభుత్వ దృక్పథం.

ప్రభుత్వ పారిశ్రామిక విధానంవల్ల రాష్ట్రంలో అత్యాధునిక పరిశ్రమలు అవతరిస్తున్నాయి.

మహిళాభ్యుదయ కార్యక్రమాలు ఆడపడచుల ఆర్థిక, సామాజిక ప్రతిపత్తికి విజ్ఞానవికాసాలకు, స్వయం ఉపాధికి దోహదం చేస్తున్నాయి.

విద్యారంగంలో తీసుకున్న విప్లవాత్మక చర్యలవల్ల గణనీయమైన అభివృద్ధికి వీలు ఏర్పడింది. ప్రతిభను ప్రోత్సహించడంలో ప్రభుత్వం ఎప్పుడూ అశ్రద్ధ వహించలేదు. పేద బడిపిల్లలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారం బట్టలు ఉచితంగా పంపిణీ చేయడం, ఏడవ తరగతి, పదవ తరగతి, ఇంటర్ పరీక్షలలో విశేష

ప్రతిభ కనపరచిన విద్యార్థులకు తెలుగు విజ్ఞాన పారితోషికాలను అందించడం, ప్రతిభ ప్రాతిపదికగా విద్యా సంస్థల్లో 20 శాతం సీట్లను విద్యార్థులకు కోసం వెచ్చించటం, ఉన్నత విద్యాపరిషత్, వైద్యవిద్యాపరిషత్‌ల ఏర్పాటు వంటి చర్యలు విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొని రావడానికే.

ఇటువంటివే ఎన్నో మరెన్నో యింకెన్నో !

ఈ ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సర్వులకు సమాన అవకాశాలు లభించే ఆదర్శ విధాన పథంగా అఖిలాంధ్ర ప్రజానీకం తుష్టితో, పుష్టితో ప్రగతి పథానికి సంకేతం కాగలదని, మా ఆడపడచుల, అన్నదమ్ముల సర్వతోముఖ వికాసాభివృద్ధికే నా సర్వశక్తులు అంకితం కాగలవని, నిండు హృదయంలో తొణికిసలాడుతున్న నా కృతజ్ఞతా భావాన్ని మీకు నా ప్రతిజ్ఞగా స్పష్టం చేస్తున్నాను.

**జై తెలుగునాడు. జైహింద్ !**



# పోలీసు వ్యవస్థకు సరికొత్త స్వరూపం

**(13-10-1986 'పోలీసు మీట్' సందర్భంగా)**

ఈ పోలీసు మీటుకు కారణభూతులైన ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్-జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ సల్ధానా గారిని, ఈ మీటును సుగమం చేయడానికి అహర్నిశం సహకరించిన పోలీసు ఉద్యోగుల నందరినీ యీ సభాముఖంగా అభినందిస్తున్నాను.

ఈ 30వ పోలీసు మీటులో పాల్గొనేందుకై వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన పోలీసు అధికారులకు స్వాగతం చెబుతున్నది ఆంధ్ర ప్రదేశం. మీ అందరికీ స్వాగతం - సుస్వాగతం. మీరందరు మాకు అతిథులు, సర్వజనాదరణీయమైన మా అతిథ్యంలో మీకు ఏ యిబ్బందులు లేక. అన్ని విధాల సౌకర్యవంతమైన ఆనందాహ్లాదాతిరేకం అనుభవం కావాలనీ నేను హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను - ఇక్కడ మీ ఉనికి స్నేహభావంతో, ఆరోగ్యవంతమై, శ్రేయోదాయకమై, గణనీయమైన పరిపుష్టిని, అభివృద్ధి చేకూరుస్తుందని నేను భావిస్తున్నాను. మేము ఆంధ్రప్రదేశ్ వాసులమైనా భారత దేశ వాసుల్లో ఒకరం. సర్వత్రా సార్వజనీయతనే

కోరుకునే వారం. కనుకనే తొలుత భారతీయులం. అన్ని విధాలా ఒకరికొకరు అండదండగా నిలచి, ఉత్తమ భావాలను, ఆదర్శ విధానాలను అత్యాధునికమైన విషయాలను కలబోసి, కేవలం మీ ఉనికికి, మీ శాఖకే కాక, సర్వజాతికే రక్షణ కాగలరని నా అభిమతం–అదే "పోలీసు" వారి నిర్వచనం. ఆ సహభావనమే, ఆ సౌశీల్యమే, ఆ సహృదయతనే జాతి ఎప్పుడూ మీనుండి ఆకాంక్షిస్తూ వుంటుంది. హింసకు గురైన వారికి, పశుబలానికి లోకువైన వారికి, న్యాయం కోరే ఉద్వేగులైన ఆడబిడ్డలకు, పోలీసు ఠాణా – కనిపించే ప్రభుత్వ ప్రథమ సోపానం. అది గుర్తించుకోగలిగితే బాధ్యత ఏమిటో నేను వివరించ నక్కరలేదు కనుక దుష్టశక్తుల ఆలింగనలో పడి, దుష్ట రాజకీయ వాదుల చేతబడి, అలమటించి, ఆక్రోశించి, నిలువునా నీరుగారే జనానికి పోలీసుదళం ఆత్మబంధువు కావాలి. అదే నేను కోరుకునే నిర్గుణ విధానం. అదే నేను ఊహించే పోలీసుదళం. దాన్ని ఏవిధంగా ఉంచాలి అన్న విజ్ఞత, ఏ విధమైన ఆదర్శ శిక్షణతో దానిని ఉదాత్త వంతమైన శక్తిగా రూపొందించాలి, అలవర్చాలి అన్న పవిత్ర కార్యాచరణకు, దీక్షకు, ఈ పోలీసు 'మీట్' సుదీర్ఘమైన యోచనచేసి ఒక నిర్ణయానికి రావలసిన అవసరమున్నది.

రెండవది:– పోలీసు వారి పటిష్టతను, బహుముఖ ప్రజ్ఞా విశేషాన్ని పెంచడం, ఇక్కడకుచేరిన అన్ని రాష్ట్రాలవారు అన్నదమ్ములైనా, పోటీకి వచ్చామన్న భావము విడనాడక అన్ని క్రీడలలో, విజయవంతులు కావడానికి ప్రయత్నించాలని నేను కోరుకుంటున్నాను. ఒకరినొకరు చూచుకోవడం, ఒకరితో ఒకరు పోల్చుకోవడం, ఒకరితో ఒకరు తారసిల్లడం, పోటీపడటం, ఒకరికంటే ఒకరు మిన్న కావాలని పోటీపడటం మనకు క్రొత్త కాదు. విడమర్చిన చరిత్రలో నలిగిన పుటలు చెబుతున్నవి ఈ సత్యాన్ని – తరతరాల నిజాన్ని ప్రోక్షిస్తూ అటువంటి వారసత్వమే మీలో వెలగాలని, అందరూ విజయవంతులు కావాలని నా కోరిక – అయినా తెలుగువాడిగా పాట్నా 'మీట్'లో 29 పతకాలు తీసుకొన్నారట మావాళ్ళు ఆనాడు, మరి అంతకంటే తక్కువ తీసుకోవడం మంచిది కాదు సుమా' అని హెచ్చరించడం నా ధర్మం యీ నాడు. మరి యీసారి ఎన్ని గెలుస్తారో చూడాలి. వచ్చింది అవకాశమని, ఎన్ని మా వాళ్ళు సాధిస్తారో, పోనీలే వచ్చిన వారిని పోనిద్దుమని ఎన్ని వదలిపెడతారో వారిష్టం, అయినా మాకానందమే, అన్నదమ్ములు ఎవరు గెలిచినా ఆనందమే, పరమానందమే.

ఈ పోలీసు దళాన్ని పటిష్టం చేయడానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్నో రీతులైన కార్యక్రమాలు చేపట్టింది–మేధావంతమైన పటిష్ఠతను, యోగత్యను గుర్తించడం, దానికి అనువైన మెడల్సును, ఇంక్రిమెంట్లను, ప్రశంసా పత్రాలను బహుకరించడం, దురదృష్టవశాత్తు ఎవరైనా అరాచకపు చర్యలకు, కిరాతకానికి, తీవ్రవాదుల హింసాత్మక చర్యలకు బలిఅయివుంటే, 25 వేల రూపాయల నగదుతో పాటు, భార్యకు అతని సర్వీసు కాలం యావత్తు జీతాన్ని అందించడమే కాకుండా పింఛను సౌకర్యాది వేతన సౌలభ్యాలు అందింప చేయడం. 25 వేల మందికి గృహ వసతి కల్పించడం, పోలీసు స్టేషన్లను ఆధునికీకరణ చేయడం, పోలీసు వ్యవస్థను పటిష్టం చేసేటందుకు 'వార' సరి కార్యక్రమంగా అన్ని స్టేషన్లలోనూ కవాతుతో సహా ఏర్పాటు చేయడం. 336 సమితులస్థానే 1104 మండలాలు ఏర్పరచి ప్రతి మండలంలోనూ, ఒక పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసి ఇతోధికమైన వనరులతో పటిష్టతతో కూడి వికేంద్రీకరణవంతమైన

పోలీసు దళాన్ని రూపొందించడం, పోలీసులతో పాటు హోంగార్డులను తగినంత మందిని నియమించి, తగిన విధంగా తర్ఫీదు యిచ్చి భృతి కల్పించి పని కల్పించడం, రిటైరైన ఆర్మీ సిబ్బందిని అవసరానికి వాడుకోవడం, పోలీసులకు వలెనే అధికారులకు గృహ సౌకర్యం ఏర్పాటు చేయడం శిక్షకులుగా వెళుతున్న ఉద్యోగులకు 20 శాతం అదనంగా బేసిక్ స్కేలుకు జీతం పెంపు చేయడం – అన్నింటికంటే ముఖ్యంగా రాష్ట్ర గౌరవ సముపార్జనకుగాను పోలీసు అకాడమీ ఒకటి ఏర్పాటు చేయడం. అది శ్రీ సల్దానాగారి అధ్యక్షతనే నిర్వహించగలగడం, పరిచయ విశేషం. ఈ అకాడమీలో ఇన్స్పెక్టర్లు మొదలు పై తరగతి వారందరికీ శిక్షణ ఇవ్వబడుతుంది. దీనితో పాటు అనంతపూర్‌లో పోలీసు జవాన్ల, పోలీసు ఇన్‌స్పెక్టర్ల శిక్షణ కేంద్రం పని చేస్తున్న విధానం యీ సందర్భంగా గమనార్హం, ప్రమోషన్‌కు, రిఫ్రెషర్ కోర్సులు ప్రథమ సోపానం–ప్రథమ అర్హత. అవి లేనిదే ప్రమోషన్ శూన్యం. ఇటువంటి కట్టుదిట్టాలతో ప్రతి అధికారి 15 దినాలకు తక్కువ కాకుండా రిఫ్రెషర్ కోర్సులలో పాల్గొనడం ముఖ్యాతి ముఖ్యమైన ప్రమోషన్ అర్హతగా నిర్ణయించబడుతుంది. ఈ అకాడమీలో పాల్గొననివారు, శిక్షణబొందని వారు, ప్రమోషన్‌కు అర్హులు కారన్నమాట.

అటువంటి కార్యక్రమాలతో ఆదర్శవంతమైన ఆధునిక ప్రయోగాలతో, సంయోగాలతో యీ పోలీసు బలగాన్ని అత్యంత బలమైన, ఉత్తేజకరమైన శక్తిగా రూపొందించాలన్నది ప్రభుత్వపరమైన ధ్యేయం. చక్కని వేతనం, చక్కని యూనిఫారం, చక్కని జీవనం. సరైన అధికారమిచ్చి యీ శక్తిని పోషించడం ప్రభుత్వ విధానం. దీనివల్ల పరిరక్షితమైన నిజమైన రాజ్యాంగం ఏర్పడగలదని నా ఆశాభావం? కనుక యిన్ని విశేషాలతో కూడిన మా రాష్ట్ర పోలీసు శాఖను తెలుసుకొనే అవకాశం మీకు కలిగింది.

ఇవన్నీ మీరు ఊహించి ప్రభుత్వానికి సరియైన సలహా ఇవ్వాలనీ క్రమశిక్షణకు, పాటవ పరీక్షకు సరియైన కొత్త విధానం రూపొందించాలనీ నా ఆశయం ! ఈ పోలీసు వ్యవస్థకు కొత్త నిర్వచనం "రక్షకుడు" అని గణుతి కెక్కవలసిన ఆదర్శం ప్రబోధించవలసింది మీరు – ఇది మీ బాధ్యత. అప్పుడే ఇటువంటి ప్రయోజనవంతమైన సామాజిక సంక్షేమదాయకమైన విషయాలు నిర్ణయమైనప్పుడే ప్రసాదించే సదస్సుగా ఇది రూపొందుకుంటుంది. చరితార్థమవుతుంది.

అదే నేను కోరేది.... అదే నేను వాంఛించేది.... సర్వేజనా సుఖినోభవంతు...

**జై తెలుగునాడు. జైహింద్!**



# పృథ్వీతలం మహనీయుల సుప్తాస్థికల సమాధి

**(టాంకుబండ్ మీద తెలుగు వెలుగుల మూర్తి నిక్షిప్త కళా ప్రాంగణం ప్రారంభోత్సవం, తేది: 01-11-1986)**

సర్వతోముఖవికాస శేముషీదురంధరులు, విజ్ఞాన ధనులు, వివిధ రంగాలలో ప్రజ్ఞానిధులు, కళాహృదయులు, వేదాంతసారసౌరభపరిమళోజ్వల విభవా సంపన్నులు – ప్రజాహితులు, ప్రజాప్రతినిధులు, మాన్యులు, జంటనగరాల పురప్రముఖులు. అనునిత్యము ఆత్మీయానురాగాలు సానురాగ, సుమాపూరిత మంగళాక్షతలుగా నాపై వర్షించి, నన్నాశీర్వదించే ఆడబిడ్డలు – అన్నదమ్ములు, ముగ్ధస్నిగ్ధ దరహాసాల దివ్యత్వంతో జయంపలికే చిట్టితండ్రులు, చిన్నారిపాపలు–ప్రజాస్వామ్యానికి పరాకాష్టగా నా ప్రభుత్వానికి గౌరవం కట్టబెట్టిన ఆరుకోట్ల అఖిలాంధ్ర ప్రజానీకానికి –ఈ దివ్య దీపావళి పర్వదినాన.... ఈ రాష్ట్రావతరణ దినోత్సవ శుభోదయ సమయాన.... ఈ తెలుగు వెలుగుల మూర్తినిక్షిప్త కళా ప్రాంగణ ఆవిష్కరణ ఆనందోత్సాహ వేడుకల వేళ నా వినమ్రతాపూర్వక పరిమళ నమస్సుమాంజలి. ఇది సుదినం... పర్వదినం... చిరస్మరణీయదినం.

చీకట్లు చెల్లాచెదరై వెలుగులు వెల్లివిరిసిన పర్వదినం. చిరకాల వాంఛితం నెరవేరి తెలుగుజాతి ఒక్కటైన పండుగ దినం. దివ్యదీపావళి స్పందనతో దివ్యత్వం పొందిన దినం. చరిత్ర తొలినాళ్ల నుంచి నేటివరకు

జాతిని ఉద్దీప్తం చేసిన తెలుగు వెలుగుల కాంస్యరూపాలు కళ్లముందు ఆవిష్కరింపబడుతున్న చరిత్రాత్మక సార్థక దినం. ఈ త్రివేణి సంగమ కార్యక్రమంలో విశిష్టతను ప్రత్యేకతను సంతరించుకున్నది ఈ రోజు.

హైదరాబాదు ఆంధ్రుల భాగ్యనగరం. వారికి అత్యంత ప్రీతిపాత్రమైన రాజధాని. అనేక చారిత్రక స్మృతులతో పులకరించే జీవగడ్డ ఇది. అనేక రాజవంశాల, సామ్రాజ్యాల అభ్యుదయ విధానాలకు, యుద్ధాలకు, సంక్షోభాలకు స్తంభించి సాక్షీభూతంగా నిలిచిన మాగాణమిది. బహుళమైన జాతి, మత, భాషా సంప్రదాయాల కూడలి. విభిన్నమైన ఆచారాలకు సంస్కృతులకు, జీవన విధానాలకు, విద్యా వైజ్ఞానిక కళాస్రవంతులకు సంగమస్థలి. ఉత్తర దక్షిణ భారతదేశాల మధ్య వారధి.

ఇటువంటి భాగ్యనగరంలోని హుస్సేన్‌సాగర్ తీరంలో చిరకాలంగా తెలుగువారి మదిలో, హృదిలో మనోమందిరంలో, స్మృతిపథంలో, మసలుతూ, వారి ప్రేమానురాగాలు అభిషేకించుకుంటూ శ్రద్ధాభక్తులతో ఆరాధింపబడుతూ సమస్యలను, దివ్యనీరాజనాలనూ ప్రోక్షించుకుంటున్న మహాత్ముల ప్రతిరూపాలు జాతికి అంకితం కావించబడే శుభసందర్భం, తరుణం ఈ విగ్రహ ప్రతిష్టలోని ఆంతర్యం నగర సౌందర్యాన్ని ఇనుమడింపచేయడం మాత్రమే కాదు, ఆంధ్రుల ప్రతిభను, వారి నాగరికతను, సంస్కృతీప్రాశస్త్యాన్ని, వారి మహోజ్వల చరిత్రను ప్రజల స్మృతిపరిధులలోనికి తేవడమే పురావైభవాన్ని గుర్తుచేయడమే. జాతీయ భావానికి పునాది స్మృతి ప్రవణతే. భావ సమైక్యతకు, చైతన్యస్ఫూర్తికి, సామాజిక పటిష్టతకు, భావి భాగ్యోదయానికి ప్రగతి పురోగమునకు వెలుగు బాటలు వేసేది మహిమాన్వితుల జీవన సంస్మరణమే. అమెరికనులు న్యూయార్కు నౌకాశ్రయద్వారంలో స్వాతంత్ర్యదేవతా ప్రతిమను ప్రతిష్ఠించినా, రాకీ పర్వత సానువుల మీద ప్రముఖ అధ్యకుల ముఖాలను మలచినా, మరొకచోట పిరమిడ్లను నిర్మించినా, స్మారక భవనాలు కట్టినా, ప్రాచీన శిథిలాలను చారిత్రక అవశేషాలను భద్రపరిచినా, ఇతిహాసాలు రచించినా, వీరగాథలను వినిపించినా ధ్యేయమొక్కటే – సారభూతమైన గతానికి అమరత్వం కలిగించడం.. పూర్వుల భావ పరంపరలను, సత్యాన్వేషణా నిరతిని, కళాభిజ్ఞతను, ఆదర్శాలను, మహోజ్వలతను వర్తమాన జీవిత విధానాలతో అనుసరించడం.

'పృథ్వీతలం మహనీయుల సుప్రాస్థికల సమాధి' అన్న గ్రీకు రాజనీతిజ్ఞుడు పెరిక్లిస్ మాటల అంతరార్థం ఇదే. ఈ విధంగా పరికించి, పరిశీలించినట్లయితే మహనీయ జీవిత సమాహారమే మానవ చరిత్ర అన్న సత్యం స్ఫురిస్తుంది. అటువంటి పరమోత్తమ మానవ చరిత్రకు రూపకల్పన చేసిన మహనీయులను సంస్మరించుకోవడం. వారి అడుగుజాడల్లో పయనించడం పురోగమించడం మనందరి కర్తవ్యం. జాతిని సుసంపన్నం చేసిన, చరిత్రకు కొత్త సొగసులు కూర్చిన తేజోమూర్తులను అలక్ష్యం చేయడం, విస్మరించడం మానవాదర్శం కాదు – కారాదు.

చిరకాలంగా తెలుగుజాతికి జీవగర్రలై, స్ఫూర్తిప్రదాతలై, పథనిర్దేశకులూ, ధృవతారలుగా నిలిచిన మహనీయులను మనస్మృతిపథంలో నిలిపి గౌరవించుకోవడం చెరిగిపోనిరీతిగా సుస్థిరంగా ప్రతిష్ఠించుకోవడమే

ఈ తెలుగు వెలుగుల మూర్తి నిక్షిప్త కళాప్రాంగణ రూపకల్పనా పరమార్థం. ఈ పోతుగడ్డమీద వెలసిన మహనీయులు ఎందరో మరెందరో ఇంకెవరో.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్ధంలో ఆంధ్రమహా సామ్రాజ్యాన్ని స్థాపించిన శాతవాహనుడు మొదలు మొన్న మొన్నటి అభ్యుదయ సాహితీమూర్తి, నవకవితా ప్రయోక్త శ్రీశ్రీ వరకు అనేక మూర్తులు మన ఎదుట సాక్షాత్కరించబడ్డాయి. సాహితీ సమరాంగణ చక్రవర్తి, కర్ణాటాంధ్ర సమన్వయ నిత్యవిస్ఫూర్తి శ్రీకృష్ణదేవరాయులు, అరివీర భయంకర, రుద్రస్వరూపిణి రుద్రమదేవి, రామన్నకు ముత్యాల తలంబ్రాలు పోసి, మత సామరస్యభావోద్దీపనకు ప్రేరణ కర్తగా నిలిచిన గోలకొండ పాదుషా తానీషా, ఆర్తజన నిత్యపోషకుడు మహబూబ్ అలీఖాన్.

ప్రథమాంధ్ర మహాకావ్య నిర్మాత నన్నయభట్టు, తెలుగు నుడికారాన్ని పుణికిపుచ్చుకున్న తిక్కన, అశేష ఆగమశాస్త్రతత్వ నిపుణుడు ఎర్రాప్రగడ. ఆంధ్రమహా భాగవత కర్త పోతన, రామాయణ కావ్యరచనా రసధుని మొల్ల, ఆధునికాంధ్ర కవితా వైతాళికుడు గురజాడ, నవయుగ కవి చక్రవర్తి జాషువా, ఆధునిక ఉర్దూకవి మగ్దూం మొహియుద్దీన్ వంటి కవిపుంగవులు–

చాపకూటితో సమతను నేర్పిన పలనాటి బ్రహ్మనాయుడు, ఆటవెలదిని ఈటెగా విసిరి ఛాందసభావాలపై తిరుగుబాటు వేసిన వేమన, ఆగామి కాలజ్ఞానవేత్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, వితంతువివాహ ప్రయోక్త కందుకూరి వీరేశలింగం, హేతవాద సాహితీ కృపాణధరుడు త్రిపురనేని రామస్వామి చౌదరి, బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు వంటి సంఘసంస్కర్తలు–

పదకవితాపితామహుడు అన్నమాచార్య, మువ్వగోపాల మోహనకవి క్షేత్రయ్య, భద్రాచల రామన్నకు గుడికట్టిన రామదాసు, అగ్రేసర దాక్షిణాత్య వాగ్గేయకారుడు త్యాగయ్య వంటి భక్తాగ్రగణ్యులు–

మన బెబ్బులి అల్లూరి సీతారామరాజు, త్రివర్ణపతాక రూపకర్త పింగళి వెంకయ్య, సంపాదకీయస్ఫూర్తితో రాజకీయ చైతన్యాన్ని కలిగించిన ముట్నూరి కృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి వంటి రాజకీయ మేధావులు–

విద్యాపరిపాలనా రంగంలో దిట్ట సి.ఆర్.రెడ్డి, వేదాంత విజ్ఞాన తిలకుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి వేద వేదాంత పారంగత విజ్ఞానవేత్తలు – ఆంధ్రనాటకరంగ ప్రభాకరుడు బళ్లారి రాఘవ, అపరభగీరథుడిగా తెలుగునాట ఖ్యాతిగాంచిన సర్ ఆర్థర్ కాటన్ వంటి మహనుభావులు, ఈ కళావేదికలమీద నీ వారుగా నిలబడి నీ ఒరవడినీ, నీతినీ, విధానాన్నీ దశాబ్దాల, శతాబ్దాల తెరలను తొలగించి చూడమంటున్నారు. మన మనోచక్షువులతో చారిత్రక విధాత సంధ్యలలో వారసత్వంగా వారు మనకు మిగిల్చిపోయిన వికాసాన్ని, పరమార్థాన్ని అర్థం చేసుకోమంటున్నారు. సాంప్రదాయబద్ధమైన మన బంధురతను, విశిష్టతను, వైవిధ్యాన్ని, జ్వలిత వైభవాన్ని సౌందర్యాన్ని అవగాహన చేసుకోమంటున్నారు. శాంతి సామరస్యాలతో, సర్వధర్మ సమన్వయభావంతో, సహృదయ సౌమరస్యాలతో ప్రగతిపథంలో మహోన్నతమైన అభ్యుదయ, ఆదర్శభావ

శిఖరాల వైపు తరలి పొమ్మని ఆదేశిస్తున్నారు. నేటి నీ ఉనికికి మనుగడకు కారణభూతమైన సంస్కృతీ వికాస విధానం యిది అని సత్య స్ఫూర్తిని కలిగిస్తున్నారు. గతాన్ని గుర్తుకు తెస్తున్నారు. గతమెరుగని జాతికి భవిష్యత్తు లేదని, నీవెవరో నీవు తెలసుకోవాలంటే గతాన్ని తెలుసుకోవడమే మార్గమని ప్రబోధిస్తున్నారు.

జాతి, మత వివక్షతలేని, వర్గ భేదం పాటించని, సమాజానికి ఆదర్శంగా ఈ ప్రతిమలు మన ఊహలో పవిత్రతను నింపుతున్నాయి. ఈ సత్యాన్ని తెలుసుకోగలిగితే అంతర్యాన్ని గుర్తించగలితే యిది యాత్రాస్థలియే కాదు. దివ్యత్వాన్ని ప్రబోధించే చారిత్రాత్మక కళా సంసేవనా ప్రాంగణమే అవుతుంది. గతాన్ని గుర్తుచేస్తూ, వర్తమానానికి ప్రేరణ యిస్తూ, భవిష్యత్తుకు మంగళారతి పట్టే కమనీయ కళా ప్రాంగణంగా ముద్ర వేసుకుంటుంది.

మీ మనిషిగా, మీ అభిమానాన్ని చూరగొన్న వ్యక్తిగా, తెలుగుజాతి పూర్వౌన్నత్య ప్రాభవాన్ని పునః ప్రతిష్టంచడానికి, పూనుకొన్న ప్రజాప్రతినిధిగా ఈ తెలుగు వెలుగుల మూర్తి నిక్షిప్త కళా ప్రాంగణానికి రూపకల్పన చేసి మీకు సమర్పిస్తున్నాను. ఈ కళా ప్రాంగణ భవిష్యత్ రాష్ట్ర వికాస వైభవాలకు. ఐక్యతకు, అవగాహనకు, ప్రగతికి దివ్య సజీవ క్షేత్రం కావాలని నా ఆకాంక్ష – ఈ దివ్య దీపావళి పర్వదినాన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభోదయాన ఈ తెలుగు వెలుగుల మూర్తి నిక్షిప్త కళా ప్రాంగణాన్ని జాతికి అంకితం చేస్తున్నాను. వివిధ రంగాలలో లబ్ధప్రతిష్టులైన మానవీయులు., శేముషీ దురంధరులు, విజ్ఞాన ధనులు, స్రష్టలు, ద్రష్టలు ఈ పవిత్ర రూప శిల్పాలను ఆవిష్కరిస్తారు.

రాష్ట్రాభ్యుదయానికి, తెలుగు ప్రజల సర్వతోముఖ వికాసానికి, ఆత్మ గౌరవ ప్రతిష్టకు నా జీవితం అంకితం.... పునరంకితం,

**ఏ దేశమేగినా ఎందుకాలిడినా – ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా**
**పొగడరా నీ తల్లి భూమి భారతిని – నిలుపరా నీ జాతి నిండు గౌరవము.**

**జై తెలుగునాడు. జైహింద్!**



# మన విశిష్ట వారసత్వాన్ని మరువరాదు

**(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణోత్సవాల సందర్భంగా కొత్త ఢిల్లీలో ముఖ్యమంత్రి ప్రసంగం, తేది:1-11-1986)**

దేశ రాజధానిలోవున్నా, ఎక్కడవున్నా మన విశిష్ట వారసత్వాన్ని మనం మరవరాదు, మరువకూడదు-

మన గడ్డకు విలువ తెచ్చేవిధంగా ప్రతిష్ట పెంచేవిధంగా బాధ్యత గుర్తించి అనుక్షణం, ప్రతిక్షణం సర్వదా-సర్వదా ఎవరైతే తమ అమూల్య ప్రాణాలను, విలువైన జీవితాలను నివేదన యిచ్చి కవోష్ణ రుధిరాన్ని వారవోసి, వెచ్చని పారాణి భరతమాత పాదాలకు దిద్దారో; ఎవరి త్యాగఫలంగా స్వతంత్ర భారత పౌరులుగా యీనాడు ప్రపంచ పౌరసత్వాన్ని సంపాదించుకున్నామో అట్టి స్వాతంత్ర్య ఫలం సర్వులకూ అందజేస్తామని, సమాజంలో అన్ని వర్గాలకు,

**జననీ జన్మ భూమిశ్చ - స్వర్గాద పిగరీయసీ...**

ఆంధ్రప్రదేశ్ 30వ, అవతరణ దినోత్సవ మంగళాశ్వాసనా సదస్సు, మన రాజధాని హస్తినలో జరుపుకోగలగడం. మన పవిత్ర రాజ్యాంగ బద్ధులై దేశ సమైక్యతను రాష్ట్ర సమన్వయతను గౌరవించి, భారతదేశ పటిష్టతకు పరమమైత్రీ బంధాన్ని మూల సూత్రంగా ఉపాసిస్తున్న 72 కోట్ల వివిధ రాష్ట్రాల

పౌరులకు, సమస్త ప్రజానీకానికి, ఆరుకోట్ల అఖిలాంధ్ర ప్రజానీకం తరపున, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున స్వాగతం పలుకుతున్నాను. శుభాభినందనం ఘటిస్తున్నాను అభివందనం–దిగ్దిగంత విశ్రాంతయశో విరాజితులై ఖండ ఖండాంతరాలలో తెలుగు జాతి సంస్కృతీ వికాస విభవాలకు, ప్రజ్ఞాపాటవాలకు, శేముషీదురం ధరతకు, ప్రతీకలై నాస ప్రవేశాలలో వెలుగులు నింపుతున్న ప్రవాసాంధ్ర ప్రజా సందోహానికి దివ్యఆశీః ప్రవచనం – తొలుతమనం భారతీయులం – ఆ తరువాతే వివిధ రాష్ట్ర వాసులం – భిన్నత్వంలో ఏకత్వం మన ఆదర్శం–

ఆంధ్రమనే శబ్దం శతాబ్దాల బరువును మోస్తున్నది. ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రజాతి ప్రసక్తి వున్నది. మౌర్యవంశం ఏకచ్ఛత్రాధిపత్యం నడిపిన కాలంలో సామంత ప్రతిపత్తిగల్గిన ఆంధ్రులు ఆ సామ్రాజ్యం క్షీణించిన తరువాత, ఒక బలవత్తరమైన సర్వసత్తాక రాజ్యాంగ వ్యవస్థను రూపొందించుకున్నారు. శాతవాహనులనాడే తెలుగువారి పరిపాలనా దక్షత మనదేశం నాలుగు చెరుగులా చెరగని ముద్రవేసింది. వారు క్రీస్తుపూర్వం 3వ శతాబ్దం నుండి సుమారు 450 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా, నిరాఘాటంగా పరిపాలించి, ఆర్థిక సామాజిక పటిష్టతను సాధించి వాఙ్మయానికి, విజ్ఞానానికి లలిత కళలకు, అపూర్వమైన పోషణనిచ్చి ప్రతిభావంతమైన చరిత్రను సృష్టించుకున్నారు. తర్వాత అనేక చిన్న రాజవంశాలు–

**ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రజాతి ప్రసక్తి వున్నది. మౌర్యవంశం ఏకచ్ఛత్రాధి పత్యం నడిపిన కాలంలో సామంత ప్రతిపత్తిగల్గిన ఆంధ్రులు ఆ సామ్రాజ్యం క్షీణించిన తరువాత. ఒక బలవత్తరమైన సర్వసత్తాక రాజ్యాంగ వ్యవస్థను రూపొందించుకున్నారు.**

ఇక్ష్వాకులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు, పల్లవులు, వేములవాడ చాళుక్యులు, రెడ్డిరాజులు వివిధ ప్రాంతాలలో రాజ్యాలు స్థాపించి పాలించారు.

కాకలుతీరిన కాకతీయుల కరవాలాల ధ్వనులు తెలుగునాట ప్రతిధ్వనించాయి. తెలుగు వారి కీర్తి చంద్రికలు పున్నమితో పరిమళించి గుబాళించాయి. సస్యశ్యామలమై సౌభాగ్య నిలయమై సుఖ సంతోషాలకు ఆలవాలమై అలరిన తెలుగు జాతియశో ప్రాభవం సరిహద్దులుదాటి, సాగరతీరాల నధిగమించి సుదూర ప్రాంతాలకు విస్తరించింది.

తెలుగు నేలపై పూచి, సవ్యతతో కొంగ్రొత్త రీతులలో పరిఢవిల్లిన తెలుగు వారి కళా వైదుష్యం వెలుగు పందిళ్లు వేసి దశదిశలా యశః కాంతులు విరజిమ్మింది. విజయనగర రాజవీధులలో రత్నాలు బేరం జరిగిందట ఆనాడు. ఆత్మ తృప్తికి, సాహితీ సౌరభాలకు వేదాంత విజ్ఞాన విశేషాలకు, కలిమికీ, బలిమికీ కొరతలేక ఆఖండంగా బ్రతికారు మనవారు సోదరభావం, సౌహార్దత, సర్వమత సహనం ప్రదర్శించారు.

ఆనాడే చండాలోస్తు – సతుద్విజోస్తు – అన్న ఆదిశంకరుల సమభావనా విధానం, అలనాటి పలనాటి బ్రహ్మన్న చాపకూటి సిద్ధాంతం, అనేక రాజ్యాల సామ్రాజ్యాల శౌర్య సాహస విస్తరణం పతనం, ఆ నదీ

పరీవాహక ప్రాంతాలలో సంభవించాయి. వివిధ వంశాల వైభవ స్పందనం ఆ నదీ తీరాలనే, పులకితం ప్రభావితం చేశాయి. గోదావరి చారిత్రక స్రవంతి అయితే, కృష్ణవేణి సాంస్కృతిక ప్రవాహం–

**దేశమంటే మట్టికాదోయ్**
**దేశమంటే మనుషులోయ్**

అని రవళించిన గురజాడ ప్రబోధం –

**పొలాలనన్నీ హలాలదున్నీ ఇలాతలంలో హేమంనిండగ.**

అన్న శ్రీశ్రీ విప్లవ భావోద్దీపనా ప్రభంజన స్నిగ్ధసుజల, వాహినీ ధారలుగా, అమృత వాహినులుగా తెలుగు గడ్డను పునీతం చేస్తున్న పవిత్ర కృష్ణా, గోదావరీ, పెన్న తుంగభద్రల పావన పానం–

**తెలుగుజాతి చైతన్యం,**
**వేదాంత విజ్ఞాన విభవా సంపద,**
**చిలకిన దివ్యాక్షణా సంప్రోక్షణం,**

అసంఖ్యాక దేవాలయాలు, బౌద్ధారామాలు, విద్యా పీఠాలు, అద్భుత శిల్ప కళాఖండాలు, ఆంధ్రుల కళా ప్రాభవ ప్రతీకలు, ఆ నదీతీరాలనే సాక్షాత్కరించాయి. తుంగభద్రా తీరాన ఆంధ్రుల విజయ ప్రతాపం మహోన్నత శిఖరాలను అధిరోహించి, స్వప్న కథా విశేషమై, చరిత్ర గర్భంలో కలిసిపోయింది. ద్రవించిన శిలలు మన కన్నీటిలో కదలాడుతున్నాయ్, ఆ ఆంధ్రుల పరిపాలనాదక్షత, రాజనీతిజ్ఞత, జగద్విఖ్యాతి గాంచిన కళా ప్రసన్నతతో సింగారించుకున్న వారి పరిశ్రమలు, వ్యాపారకుశలత, భాషా పరిణామ వికాసం, తాత్విక వైజ్ఞానిక ప్రసారం, మహోజ్జ్వలమైన సాహిత్య సృష్టి, అయ్యారే అది అద్వితీయం అది అపూర్వం ఇదంతా సారభూతమైన గతం, గర్వకారణమైన, వారసత్వం, మన నాగరికత, సంస్కృతీ సంప్రదాయ వికాసాలకు, మనజాతి ఉత్కృష్టతకు, ఔన్నత్యానికి, కారణ భూతులైన మహనీయులకు మనమెప్పుడూ కృతజ్ఞులం.. సంస్మరణమే, వారికి మన దివ్యనీరాజన సమర్పణం, ఆ వినమ్ర భావానికి తాత్పర్యంగా హైదరాబాదు నగరంలో, హుస్సేన్‌సాగర్ తీరంలో, నవంబరు 1న ఆవిష్కరించబడ్డ “తెలుగు వెలుగుల మూర్తి నిక్షిప్త కళాప్రాంగణం” శకకర్త శాతవాహనుడు మొదలు, మొన్నటి అభ్యుదయ సాహితీమూర్తి, నవకవితా ప్రయోక్త శ్రీశ్రీ వరకు అనేక మూర్తులు సాక్షాత్కరించబడ్డాయి.

చిరకాలంగా తెలుగుజాతికి జీవగర్రలై, స్ఫూర్తి ప్రదాతలై, పథ నిర్దేశకులై, ధృవతారలుగా నిలిచిన మహనీయులను మన స్మృతిపథంలో గౌరవించుకోవడం, చెరిగిపోని రీతిగా సుస్థిరంగా ప్రతిష్టించుకోవడమే ఆ కళాప్రాంగణ రూపకల్పనా పరమార్థం. ఆ మహనీయుల, చరితార్థుల భావ పరంపరలను, సత్యాన్వేషణా నిరతిని, కళావిజ్ఞతను, ఆదర్శాలను, మహోజ్జ్వలతను, వర్తమాన జీవన విధానాలతో అనుసంధానించడం, మన చారిత్రాత్మక కర్తవ్యం. విస్మరించగూడని బాధ్యతా విధానం.

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి మునుపే దక్షిణాపథంలో రాజకీయ చైతన్యానికి లక్ష్మీ నరసుచెట్టి మూలపురుషుడని చరిత్ర చెబుతున్నది. సత్యాగ్రహ సమరాన్ని నడిపిన జాతిపిత, పూజ్య బాపూజీ, సత్యాహింసలే ఆయుధాలుగా, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య సింహాన్ని జూలుపట్టి, అదలించి మాతృభారతిని విదేశ దాస్య శృంఖలీల నుండి విముక్తి చేశాడు. ఆ స్వతంత్ర మహా సంగ్రామంలో ఆ జాతిపిత ఆధ్వర్యంలో తెలుగువారు నిర్వహించిన పాత్ర అనన్య సామాన్యము, అద్వితీయము.

సర్వశ్రీ కొండా వెంకటప్పయ్య, దుగ్గిరాల గోపాల కృష్ణయ్య, టంగుటూరి ప్రకాశం, గారిచర్ల హరి సర్వోత్తమరావు, కాశీనాథుని నాగేశ్వరరావు, కల్లూరి సుబ్బారావు, బులుసు సాంబమూర్తి, డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు మున్నగు ఆంధ్రప్రముఖుల మాననీయమైన సారథ్యంలో ఆంధ్రులు అపూర్వ త్యాగాలు చేశారు. స్వరాజ్య ఉద్యమంలో మహిళామణులు వీరోచిత పాత్ర నిర్వహించారు. అజ్ఞాత వీరులైన స్వచ్ఛంద సేవకులు దేశ సేవలో తమ సర్వస్వాన్ని ధారపోశారు. కవోష్ణధారలతో భరతమాత పదకమలాలకు వెచ్చని పారాణి దిద్దారు. అమరత్వంలో దివ్యత్వం సిద్ధించుకున్నారు.

జాతికే గర్వకారణమై, భారత స్వాతంత్ర్య సమర దీప్తి జ్వాలకు చిహ్నమై నేడు విశ్వంబర వీధులలో ఉత్తిష్టంగా రెపరెపలాడుతున్న జాతీయ పతాక ప్రదాత శ్రీ పింగళి వెంకయ్య తెలుగువారి కీర్తి తిలకం.

మధ్యందిన భానుడిలా మన్నెంలో మెరసి బెబ్బులిలా గాండ్రించి కుటిల నియంతల ఆగడాలకు స్వైర విహారాలకు బలై బ్రతుకుతున్న అటవికులను సంఘటితపరచి, తెల్లదొరల గుండెల్లో నిదురించిన తెలుగు తల్లి అనుంగు బిడ్డ అల్లూరి సీతారామరాజుకు గుండెల నిండుగా స్మృత్యంజలి. భారత స్వాతంత్ర్య సమరారంభ దినాలలోనే ప్రత్యేకాంధ్ర రాష్ట్ర నిర్మాణోద్యమానికి అంకురార్పణ జరిగింది. శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ, శ్రీ జొన్నవిత్తుల గురుమూర్తి, చెట్టి నరసింహం, ఆ భావానికి నాందీ వాచకం పలికారు. ప్రథమాంధ్ర సభ బాపట్లలో జరిగినప్పటి నుండి ప్రత్యేకాంధ్ర రాష్ట్రోద్యమం బలవత్తరం కాజొచ్చింది.

అయితే 1920 నుండి 1936 వరకు ఆంధ్ర రాష్ట్రోద్యమ నినాదం, భారత స్వాతంత్ర్య సమర దుందుభీధ్వానాల మధ్య మూగవోయింది. స్వాతంత్ర్య సముపార్జనానంతరం భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణాన్ని సూత్రప్రాయంగా కేంద్రం అంగీకరించినప్పటికీ ఆంధ్రుల ఆశయం సిద్ధించలేదు. అకళంక దేశ భక్తుడు, అద్వితీయ త్యాగనిరతుడు, ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధన దీక్షా కంకణుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో కానీ ఆంధ్రరాష్ట్రం సిద్ధించలేదు.

హైదరాబాదు సంస్థానంలో మ్రగ్గుతున్న ప్రజానీకం, నిజాం నిరంకుశత్వ పీడనకు వ్యతిరేకంగా సాగించిన ఉద్యమాలు - సర్వశ్రీ మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, ముందుమల నరసింగరావు, రామనందతీర్థ, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి, మగ్దూం మొహియుద్దీన్ మొదలైన మహానాయకులు రేకెత్తించిన రాజకీయ చైతన్యం ప్రభంజనంగా ప్రసరించి హైదారాబాదుకు నిరపేక్ష నిరంకుశత్వం నుండి విముక్తి కలిగించింది. 1956 నవంబరు 1న హైదరాబాదు రాజధానిగా

ఆంధ్రప్రదేశ్ అవతరణ ఆంధ్రుల తపోఫలం.

బహుకాలంగా నిర్నిర్ధంగా, అవిచ్ఛిన్నంగా, నిర్వహింపబడ్డ మహోద్యమాలకు శుభావహమైన భరతవాక్యం. 39 సంవత్సరాల స్వాతంత్ర్యాన్ని చవిచూచాం. పూజ్య బాపూజీ నేతృత్వంలో సాధించుకున్న స్వాతంత్ర్యం, ఆశించిన ఫలితాలనందివ్వలేదు. కన్నీళ్లను తుడవలేదు. కలలుగన్న గ్రామ స్వరాజ్యం అడియాసగానే మిగిలిపోయింది.

1983లో, నాలో విశ్వాసముంచి నన్ను వెన్నుతట్టి గెలిపించి, తెలుగు దేశానికి జీవంపోసి, ప్రభుత్వాన్నిచ్చి యీ బరువైన బాధ్యతా నిర్వహణలో నిండు మనసుతో నన్నాశీర్వదించారు అరుకోట్ల తెలుగు ప్రజానీకం.

మనకు ప్రాంతీయ సంకుచితత్వం లేదు ప్రాంతీయ భేదంలేదు. మనమంతా భారతీయులం. తరువాతే వివిధ రాష్ట్రాల వాసులం. ఆంధ్రప్రదేశ్ అఖిల భారత సమాఖ్యలో ఒక భాగం మాత్రమే – మన జాతి భవితవ్యం మనకై నిర్దేశించిన గమ్యాలు, మనకత్యంత విలువైన పరమ ప్రామాణికమైన రాజ్యాంగ పీఠికలో నిర్ద్వందంగా పొందుపరచబడ్డాయి.

**ఆంధ్రప్రదేశ్ అఖిల భారత సమాఖ్యలో ఒక భాగం మాత్రమే– మన జాతి భవితవ్యం మనకై నిర్దేశించిన గమ్యాలు, మనకత్యంత విలువైన పరమ ప్రామాణికమైన రాజ్యాంగ పీఠికలో నిర్ద్వందంగా పొందుపరచబడ్డాయి.**

జాతీయాభ్యుదయమే – మన అభ్యుదయం – తెలుగు దేశ పురోగమనం భారతదేశ పురోగమనంతో ముడిపడి ఆధార పడివుంది. భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వంలో భిన్నత్వం మనదేశపు ప్రత్యేకత – విశిష్టత– ఉత్కృష్టత – అనేక భాషల విభిన్నమతాల వేరువేరు సంస్కృతుల, అనేక ఆచార వ్యవహారాల, అశేష నమ్మకాల పుణ్యభూమి – కర్మభూమి మనది.

ప్రజాస్వామ్య రక్షణ, లౌకిక రాజ్య సిద్ధాంత పరిరక్షణ, ఫెడరల్ సమాఖ్య సమర్థ నిర్వహణ, సమ సమాజ స్థాపన, దేశ సమైక్యత, జాతీయ సమగ్రత, మనముందున్న గమ్యాలు. ఆ పరమోత్కృష్ట పరమ పవిత్ర కేదారాలవైపు కలిసికట్టుగా, ఒకటిగా అరమరికలు లేకుండా, భాగస్వాములై, అవిశ్రాంతంగా పయనించడమే మనకత్యంత ఆప్తమైన లక్ష్యం– చరిత్ర నిర్దేశించిన గమ్యం.

మీ అందరి ఆశీస్సులతో, సహకారంతో బడుగు బలహీన వర్గాల సముద్ధరణకు, అల్ప సంఖ్యాక వర్గాల రక్షణకు, రైతు కూలీల సంరక్షణకు, కార్మికుల సౌభాగ్యానికి, సర్వజన సంక్షేమానికి, ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతిష్టలు ఇనుమడింపచేయడానికి సర్వతోముఖ వికాసానికి తెలుగుదేశం ప్రభుత్వం అంకితం. ప్రభుత్వాధినేతగా, మీవాడుగా, మీలో ఒకనిగా యీ ఆశయాల సాధనకు నా జీవితం అంకితం– పునరంకితం. సరైన సంక్షేమం, సమానమైన అవకాశం, సమైక్య, సమన్వయ సిద్ధాంతపరమైన ఆచరణతో భరతమాతకు వన్నె తేవాలని దృఢ ప్రతిజ్ఞాపూర్వక కంకణధారులం కావాలని యీ రాష్ట్రావతరణోత్సవాల అంత్య సదస్సులో నేను ఉద్ఘోషిస్తున్నాను.

కుల, మత, వర్ణ, వర్గాలకు తావులేని ఈర్ష్య, ద్వేష అసూయలకు లోనుగాని సమ సమాజస్థాపనోద్దీపితమైన క్రాంతితో ప్రగతికి నివాళి పట్టగలమని నిబ్బరంతో పలుకవలసిన తరుణమిది.

ఈ భావమే సద్భావమై, స్నేహభావమై యీ దేశాంతరములో విస్తరించి, వికసించి, పరిమళించి, గుబాళించగలదని నా ధృఢ విశ్వాసం.

**ఎందరో మహిమాన్వితులు**
**ఎందరో రాజకీయ స్రష్టలు**
**ఎందరో విజ్ఞాన ధనులు**
**ఎందరో శేముషీ ధురంధరులు**

ఈ పావన సుదినాన సంప్రాప్తమైన వారి పరిచయ వీక్షణానికి నా ఆనందాన్ని, తృప్తిని వ్యక్తం చేస్తూ ఆరుకోట్ల అఖిలాంధ్ర ప్రజానీకం తరఫున, తెలుగుదేశం ప్రభుత్వం తరఫున శుభాశీ: పరంపరలను తెలియజేస్తున్నాను. తెలుగుతనం ఎక్కడవున్నా – ఏ దేశంలో విస్తరించినా, విహరించినా ఏ అంతస్తుల నధిరోహించినా – ఆచార నియమనిబద్ధమైన – చారిత్రాత్మక స్మృతి వికాస వైభవ సంప్రోక్షితమైన – కళా విన్యాస రాగరంజితమైన వారసత్వం, ఏ తెలుగుబిడ్డనూ వదలదు, ఆదర్శావేశాలకు మూర్తీభావం – అభ్యుదయ స్ఫూర్తికి స్పందనం పవిత్ర త్యాగానికి నిత్య నీరాజనం – ఉగ్గుపాలతో రంగరించి మా తెలుగుతల్లి మాకుపోసిన సాంప్రదాయం.

**సర్వేజనా సుఖినోభవంతు**
**ఓం సహనావవతు**
**సహనౌభునక్తు**
**సహవీర్యం కరవావహై**
**తేజస్వినావధీతమస్తు**
**మా విద్విషావహై**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**జై తెలుగునాడు. జైహింద్!**

# పీడిత, తాడిత జనోద్ధారకునికి స్మృత్యాంజలి

**(జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ హైదరాబాదు, తేది: 12-11-1986)**

భారతీయుల మనో హృదయాలలో ఏనాటి నుంచో సుప్రతిష్ఠితుడైన ఒక మహామనిషి కాంస్య ప్రతిరూపాన్ని యీనాడు ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ఆవిష్కరించి స్మృత్యంజలిని ఘటిస్తున్నాం. బాబూ జగ్జీవన్‌రామ్ హరిజనుల, నిమ్నజాతుల, దళిత పీడితజాతుల, బాధా సర్పదష్టుల ఉద్ధరణకు బద్ధకంకణుడై వారి అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన ధన్యుడు.

జాతీయ జీవనాన్ని బహుముఖాలుగా వివిధ రంగాలలో ప్రభావితం చేసిన ప్రతిభాశాలి. బాబూజీ జీవితమంతా దేశ చరిత్రతో అల్లుకుపోయింది. రాజకీయ రంగస్థలి విద్యుద్దీపాల వెలుగు ఆయనమీద నిర్విరామంగా దీర్ఘకాలంగా ప్రసరించింది. కేంద్రస్థానం నుండి ఆయన ఏనాడు పార్శ్వాలలోనికీ జరగలేదు.

1906లో బీహార్ రాష్ట్రంలోని ససారా జిల్లా చాంద్వా గ్రామంలో ఒక బీద హరిజన కుటుంబంలో జన్మించి స్వశక్తి, బుద్ధిబలం, దీక్షలతో అత్యున్నత స్థానాలను అధిరోహించిన అగ్రగణ్యుడాయన. విద్యార్థి దశలోనే మహాత్మాగాంధీ, బాబూ రాజేంద్రప్రసాద్ ప్రసాదించిన చైతన్యస్ఫూర్తితో ఉద్దీపితుడైనాడు. కార్మిక సంఘాలతో సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచుకున్నాడు.

ఉజ్వల దేశభక్తి ప్రేరణతో యవ్వనంలోనే, నిషేధించబడిన జాతీయోద్యమ వాఙ్మయాన్ని రహస్యంగా అందజేస్తుండేవాడట. ఆయన మేధాపటిమను గుర్తించి బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను కృతజ్ఞతాభావ శృంఖాలతో బంధించడానికి బీహారు రాజకీయ పరిషత్తులో సభ్యునిగా నియమించింది. బ్రిటిష్‌వారి ప్రలోభానికి ఆయన లొంగకపోవడం ఆయన అచంచల దేశభక్తికి మచ్చుతునక. 1937లో కాంగ్రెస్ రాష్ట్ర

ప్రభుత్వాలను కైవసం చేసుకున్నపుడు, బీహారు ప్రభుత్వంలో పార్లమెంటరీ కార్యదర్శిగా ఆయన నియామకం, ఆయన రాజకీయ జీవితానికి నాందీప్రస్తావన.



స్వాతంత్ర్య సమరంలో నిమగ్నుడవడం, అనేక పర్యాయాలు కారాగార క్లేశాల్ని అనుభవించడం, సత్యాగ్రహిగా మన్ననల నందుకోవడం మొదలైనవన్నీ యధావిధిగా జరిగిపోయాయి.

అఖిల భారత నిమ్నజాతుల సంఘానికి అధ్యక్ష పదవిని చిరకాలం నిర్వహించారు. వారి ప్రయోజనాల పరిరక్షణకు ఎనలేని కృషి చేస్తూ కొందరికి అప్రియమైనా, విమర్శలకు గురియైనా జాతీయ సమైక్యతా దృష్ట్యా గాంధీజీ దృక్పథాన్ననుసరించి సంయుక్త నియోజకవర్గ ప్రతిపాదనను బలపరచిన గాంధేయుడు, ధైర్యశాలి బాబూజగ్జీవన్‌రామ్.

1946లో పండిట్ జీ నాయకత్వంలో ఏర్పడిన తాత్కాలిక మంత్రివర్గంలో సభ్యుడిగా నియమించబడినప్పటి నుండి ఆయన పరిపాలనాదక్షుడుగా ప్రసిద్ధికెక్కాడు. మూడు దశాబ్దాలు కేంద్ర ప్రభుత్వ మంత్రివర్గంలో కొనసాగడంలో గాని, నిర్వహించిన పరిపాలనా శాఖల వైవిధ్యంలోగాని, అమరణాంతం శాసనసభ్యత్వాన్ని అలంకరించడంలోగాని ఆయన అద్వితీయుడు. మంత్రిత్వశాఖల నిర్వహణలోను, క్లిష్ట సమయాలలోను అత్యంత సామర్థ్యాన్ని, శక్తిని, ప్రజా విశేషాలను ప్రదర్శించారు.

రాజనీతి తంత్రజ్ఞుడుగా, పరిపాలనా దురంధరునిగా, అద్భుతమైన పార్లమెంటేరియన్‌గా సమయస్ఫూర్తి, వక్తృత్వ నైపుణ్యంగల ధీశాలిగా అనుపమానమైన కీర్తిని గడించిన ప్రతిభా సంపన్నుడాయన. ఆయన జీవితాన్ని పరిశీలించినట్లయితే అదృష్ట రేఖలు ప్రస్ఫుటంగా ద్యోతకమవుతాయి. ఈ సంవత్సరం జూలై నెలలో ఆయన జీవితంపై అవనికి జారేవరకు ప్రజాసేవ చేస్తూనే ఉన్నాడు.

జీవితంలో వెలుగు నీడలు, విజయ పరాజయాలు, ఆటుపోటులు ఉండటం సహజం. జీవితానికి సార్థకత చేకూర్చేవి అధికారాలూ కావు, సంపదలు, అంతస్తులు, అందలాలు కావు – బాబూజీకి చరిత్రలో

శాశ్వతస్థానాన్ని సాధించి పెట్టినవి ఆయన వ్యక్తిత్వం, నిస్వార్థసేవా తత్పరత, కర్తవ్యదీక్షాదక్షత, అపార రాజకీయానుభవం, ఆయన ఆదర్శాల మహోజ్వలత.

ప్రజాస్వామిక విలువలను పరిరక్షించి, నిమ్నజాతి ఉద్ధరణకు అహరహం శ్రమించి సమసమాజ స్థాపనకు, జాతీయ సమైక్యతా భావానికి దోహదం కలిగించి, లౌకిక రాజ్య ప్రతిష్టాపనకు కృషి చేసి ప్రజల ఆదరాభిమానాలను అపారంగా చూరగొని, రాజకీయ గగనంలో దీప్తిమంతమైన తారగా మిగిలిపోయిన బాబూజీకి నమస్సుమాంజలి ఘటిస్తున్నాను.

**జై తెలుగునాడు. జైహింద్!**




# మానవాభ్యుదయానికి మార్గం చూపేదే కళ

**(నంది బహుమతుల ప్రధానోత్సవ ఉపన్యాసం, తేది: 30-3-1987)**

విద్వద్వరేణ్యులకు, విద్వజ్జనులకు, సకల కళాపారంగతులకు, శేముషీ దురంధరులైన న్యాయనిర్ణేతలకు, కళాప్రియులకు, మమతలు పంచి, మంచికి మారుపేరై - నాకు మన్ననలందజేస్తున్న సర్వులకు సమాచార శాఖా ప్రధాన సంచాలకులకు స్వాగతం- సుస్వాగతం - అభినందనం - శుభాభినందనం.

అరవై సంవత్సరాలు అధిగమించి, నూతన పరిభ్రమణం పునరారంభమైన శుభారంభం, యీ ప్రభవారంభం ఈ సుమనోహర మధుర మంజుల భావదీపికా వీచికా ఉద్దీపనతో, తెలుగుజాతి పర్వదినమైన నూతన ఉగాది శుభసందర్భాన ఉత్తేజపూరితమైన మధుర తరంగాలతో కళలు స్పందించాలనీ, కళారాధకులైన ఆరుకోట్ల తెలుగు ప్రజానీకం, అత్యుత్తమమైన రుచిరానంద సంతృప్తులతో మెండైపండి నిండాలని.

39 సంవత్సరాల నిరంతర నిరీక్షణతో-సాగిన ప్రజాపరిపాలనా విధాన విహారం తమకు సంక్రమించవలసిన సమభాగం తమకు సిద్ధించవలసిన సమఫలం తాము ఆశించిన కొంగ్రొత్త జీవనం - తమ దారిద్ర్యానికి

నిష్కృత పరిహారమైన విమోచనం. సర్వత్రా సమమైన సంక్రమణం – తమకు సంక్రమింపజేయబడగలదనీ. రాజకీయస్ఫూర్తికీ, సరళికీ, రీతికీ, నీతిని రంగరించగలదని – సమాజంలోని అవినీతి, ఆక్రమం, లంచగొండితనం, దగాకోరు విధానం తుడిచిపెట్టగలదనీ –

రాజకీయం అధికార దాహంతో కూడిన పదవీ వ్యామోహం కాక సానుభూతితో సాగేపవిత్ర సేవా విధానం కావాలనీ స్వపర, వర్ణ, వర్గ, కుల భేదాలు రూపుమాపబడాలనీ ప్రజాస్వామ్యం పూజాఫలమై భవిష్యత్ కాలరోదసీ గ్రహాంతర ప్రయాణంలో – తరతరాలనుండి పేరుకుపోయిన కుటిల, జటిల, దుష్కృత్య విధానాలను తుడిచి పెట్టాలనీ –

ఈ నూతన సంవత్సరం తొలిమెట్టయి ప్రాభవొద్దీపనతో దిక్ దిగంత విశ్వాంత యశోవిరాజితమై సంక్షేమ దీప్తిచంద్రికా వికాస విధానమై మన భారతదేశ సర్వతోముఖ ప్రజాస్వామ్య ప్రగతి ప్రయోగ వికాస విధానాలను వెన్నుతట్టి ముందుకు నడిపే ఉద్దీపనపథం కావాలనీ ఐక్యభావం సర్వజనసంక్షేమం, సార్వత్రిక ప్రగతి, విశేష విజ్ఞానపథవిహారం – దశదిశలా విస్తరించిన భరతఖండం– కీర్తి యశోవిరాజితంగా – మానవతా జనితా కారుణ్యంగా మలచబడాలనీ – యీ ప్రభవనామ సంవత్సరం విభవమై జాతికి నాంది పలకాలనీ శుభాశీః పరంపరలు అందజేస్తున్నాను. నాదికాదు మనదన్నది మననానుడి. అందుకే తొలుత భారతం ఆ తరువాతనే ఆంధ్రం.

**"తెలుగుదేల యన్న దేశంబు తెలుగు**
**నేను తెలుగు వల్లభుండ తెలుగొకండ**
**ఎల్ల నృపులు గొలువ ఎరుగవే బాసాడి**
**దేశ భాషలందు తెలుగులెస్స"**

మానవ మానసిక వికాసావిర్భావమే లలితకళలు మనిషిలో చైతన్య స్ఫూర్తిని, అనుభూతిని రగిలించడానికి రవళించినవే అభినయదృశ్య రూపకాలు, నటరాజస్వామి లయ విన్యాస భంగిమలే సంగీత, నృత్య, మాధురీ మధురిమలు, లలిత కళల సమగ్ర, సమన్వయ సంక్షిప్త రూపకల్పనమే చలన చిత్రకళా స్వరూప స్పందనం.

నేడు కళా సరస్వతి ఉల్లాస వీణలు మీటి, అంతర్ హృదీ ఆనంద పారవశ్యంలో పరవళ్ళు తొక్కుతున్నది.

తెలుగు కళామతల్లి తన కన్నబిడ్డల భావవిన్యాస విధానపురోగతిని చూసి నిండుగా పులకించి పరవశించుతున్నది. ప్రజలే ఏలికలుగా, నిర్దేశకులుగా నిర్ణేతలుగా, నేతలుగా శాసిస్తున్న యీ ఆధునిక ప్రజాస్వామ్య యుగంలో – ప్రజా ప్రతినిధిగా యీ సుందర కళానికుంజం, తెలుగు కళా ప్రాభవానికి గురుతుగా, పారమార్థానికి ప్రతీకగా ప్రాతినిథ్య పారితోషికంగా నావారికి, నా ఆరుకోట్ల తెలుగు ప్రజానీకానికి, నిండు హృదయంతో అంకితం చేశాను.

ఈ ఏడు యీ కళా వేదిక తెలుగు చలన చిత్ర వికాసోత్సవానికి రంగవల్లిగా, హరివిల్లయ్యింది. ఈ

సందర్భంగా బహుమతి గ్రహీతలైన కళా విభవ సంపన్న శోభితులను, కళారాధకులను, – కళాస్రష్టలను – నిండు గుండెతో అభినందిస్తున్నాను.

ఈ శుభ సందర్భ సన్నివేశం – నూతన లయబద్ధమైన రవళిని రగిలించగలదనీ, చిత్ర జగ్రత్తులో అంకితమైన భావస్ఫూర్తిని ప్రేరేపించగలదనీ నా మనోనిశ్చితం 'కళ కళ కోసం కాదు' కళ మానవ వికాసం కోసం, కళ దేశ సమగ్రత కోసం, కళ జాతీయ భావనా ప్రేరణ కోసం – అన్నదే గీటై గుర్తింపుకు రావాలని నా ఆకాంక్ష కళ ద్వేషాన్ని ప్రభోదించదు అసూయను రగిలించదు, మతిని మందగించదు – ప్రకోపించి ఉన్మాదించదు – సర్వమానవ సమానత్వ శోభిత జీవన విధానమే తన క్షమాది అత్యుత్తమ గుణవిశేష ప్రాభవమే కళ – ఆ కళే అజరామరం – అదే శాశ్వతం. అదే నిత్యం – అదే నూతనం.

సాటి కళాకారులను ప్రస్తుతించడానికి గౌరవించడానికే నాకు దక్కినదీ ఈ అవకాశం – సామర్థ్యానికి కొలత కాదిది గౌరవప్రధాన ప్రదానమే దీని పారమార్థ్యం – కై మోడ్పులతో కళామతల్లికై కాన్కలిచ్చే శుభ ముహూర్తం–

కళను మానవాభ్యుదయానికి దారిచూపే కరదీపికగా వెలిగించి కళామ తల్లికి నీరాజనం పడుతున్న యీ విదుషీ ప్రభా విభవ సంపన్నులకు ఈ బహుమతీ ప్రధానోత్సవం సరికొత్త దీప్తినీ, స్ఫూర్తినీ రగిలించగలదని నా పరిపూర్ణ ప్రగాఢ విశ్వాసం.

**"ఓం సహనా వవతు**
**సహనౌభునక్తు**
**సహవీర్యం కరవావహై**
**తేజస్వినా వధీతమస్తు**
**మా విద్విషావహై "**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**జై తెలుగునాడు. జైహింద్!**

# సమ సమానావకాశ సమర్పణమే జాతి పురోగమనంకు నివేదనం

**(1987 ఆగస్టు 15 వ తేదీన 40వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాన సికిందరాబాదు పెరేడ్ గ్రౌండ్స్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీయస్.టి.రామారావు గారి అభిభాషణ)**

భారత దేశ విజ్ఞాన విశేష ప్రాభవ విభవాలకు వారసులుగా, బ్రిటిష్ నిరంకుశ, నియంతృత్వ వలస విధానాన్ని కూలగొట్టి అద్వితీయ చరిత్ర పుటలను విజ్ఞాన వీచికలతో స్పందింపజేసిన శేముషీ దురంధరులుగా, అహర్నిశలు స్వేదం చిలికి భరతమాతను సస్య శ్యామల శోభితగా ప్రోక్షిస్తున్న శ్రామిక, కార్మిక, కర్షక ప్రగతి విధాతలకు, అన్నదాతలకు, భావి భారత పౌరులకు పౌరుషం ఉగ్గు పాలతో రంగరించి పడుతూ వీర సంస్కృతీ విధానానికి నీరాజనాలందిస్తున్న నా ఆడబడుచులకు, వికసిత విజ్ఞాన దరహాసాల వెల్లువలో భవిష్యత్ పౌరసత్వ భాగ్యపీఠాన్ని అధిరోహించబోయే ఆవేశదీప్తులు యువమూర్తులకు, చిరంజీవులకు, ప్రజాస్వామ్య విధాన విధాతలై మానవ కళ్యాణానికి మంగళాక్షతలు చిలుకుతున్న మేధావులకు, స్రష్టలకు, సర్వజ్ఞులకు, సర్వులకు స్వాతంత్ర్య దినాభినందనం. శుభాభివందనం.

40 ఏళ్ల నుండి వాణి పలుకుతున్నది, జనం నమ్ముతున్నది. ప్రజాస్వామ్య విధానంలో నమ్మకం వుంచి, స్వాతంత్ర్య సముపార్జనానంతరం బ్రతకడం కూడా పేదవాడి జన్మహక్కని, మూగ వోయిన గొంతు పొరలలో నుంచి రోద వినిపిస్తున్నది. సమాజంలోని చినిగిన ముక్కల అంతరంలో నుంచి సమానత కావాలని పెనుగులాడుతున్నది బాధాతప్త హృదయం. విస్మృతాధికారం విచ్చలవిడిగా, పెచ్చుమీరిన స్వార్థంతో సమాజం మీద సవారీ చేస్తూనే వున్నది. కాలే కడుపుకు గంజి ఆజ్యం పోస్తున్న అభాగ్యుడు ఈ రొదలో తట్టుకోలేక



గొణుగుతున్నాడు – కాలం గడుస్తున్నది గాని కళ్యాణం మాకెప్పుడని? ఇంకెన్నాళ్లకని? నా బ్రతుకు ఏమిటని? నా గుడిసె వారసత్వం పోలేదేమని? నా బిడ్డకు చదువు ఏదని? వెలివేసిన చీకటి బ్రతుకును పలుకరించే వారేరని? ఏదని? నిన్న మొన్న పెడబొబ్బల సిద్ధాంత వివాదాలతో నాకు పూలమాలలు వేసి ఎర చూపి వోటు అడిగిన వారి అడ్రసు ఏదని?

పేదతాత చేతిలో పెరిగాను. చదువు సంధ్యలకు దూరమైన బక్కచిక్కిన అయ్యకు వారసుడనయ్యాను. అదుగో! నిర్వేద నిస్త్రాణ, నిర్భాగ్య, దౌర్భాగ్య అమాయక నిరుపేద జాతికి కన్నయ్యనయ్యాను. ఏదో తెలియని రొదతో తబ్బిబ్బు చేస్తున్నారు. తెలివిగల మనుషులు ప్రజాస్వామ్యం అని, పాలన ప్రజలే చేస్తున్నారని.

నా ఎదుట వున్న భయంకర రాకాసి యీనాడు బలిసి మత్తెక్కిన కొవ్వు పొరలలో నుంచి వికటాట్టహాసంతో ఇనుప పాదమెత్తింది నన్ను అణిచిపెడదామని, ఆ నిరంకుశ విజృంభణను ఆపేదెవరు? అడుగుదామంటే బాపూజీ లేరు – నెత్తురు కార్చి నేల ముద్ద చేసి దేశమాత పాదాలకు పారాణిదిద్దిన ఆ విప్లవజ్యోతులు లేరు.

ఇంక్విలాబ్ జిందాబాద్, స్వతంత్ర భారత్ కీ జై అంటూ జాతిని ఉవ్వెత్తున ఉత్తేజపరచిన ఆ వీర గంభీర నినాదాలు చిరుగాలి ఈలలలో లయలుగానే మిగిలిపోయాయి. ఆ ఆవేశ రవాలలో పేదవాని మూలుగు ముప్పిరిగొంటూనే ఉన్నది. ఏమని? తెలివి తేటల బూటకపు ఊపులలో నిలవలేకపోతున్నానని, గతి తప్పిన సుడిలో నీతి తప్పిన వంచనలో దగాపడ్డానని, పెద్దతనానికి, పెత్తనానికి, బలై పోయానని, అంతా నీకేనని చెబుతూ నా మూతిని నాకే నయవంచకుల నీతిమాలిన విధానానికి చివికిపోయానని. ఏడీ? నాకు గతి చూపే నాథుడేడీ? ఏడీ? ననుదరి చేర్చే విధాత ఏడి? స్వేచ్ఛా స్వాతంత్ర్య చలువ పుటలను నాజీర్ణ శిధిల పేద ఆకృతిపై కప్పే ఆ బాబు ఎక్కడ? కాపు ఎక్కడ? ఇదీ యీనాటి సుడిగుండంలో సొదగా రొద చేస్తున్న ఆశాంతుల అపస్వరం.

ఇదీ యీనాటి సమాజంలో సామాన్యుడు గడుపుతున్న దుర్భర జీవన విధానం. ఈ రొదలో పొటకరించిన భావనోద్దీపిత ప్రస్ఫుటమే తెలుగుదేశం ప్రభుత్వం. బక్కచిక్కిన బడుగు జీవులకు, నిరాశోపహతులైన పేద

ప్రజానీకానికి శోష తీర్చగలనని, ఆశ్రయమిచ్చి సేద తీర్చగలనని నాలో రగిలింది ప్రేరణ. సాధించింది ఏమో – అది చెప్పలేనిది – చెప్పుకోకూడనిది. మెప్పు కోసం కాదది. మేలు కోసం అందించినది.

కాలే కడుపుల కన్నీరు కొంతైనా తుడవగలిగితే, ఆడబిడ్డల దీనాలాపనం, బలహీన బడుగువర్గాల జీవన సరళి విధానం కూసింతైనా మెరుగుపరచగలిగితే, విజ్ఞాన శేముషీ ప్రాభవ యువ విధాతల్లో విప్లవ సరళిని రవ్వంతైనా రగిలించగలిగితే, ఈ ప్రజాసేవలో గమ్యానికి చేరువ కాగలనేమోనన్న వడిగాడ్పుల ప్రయాణమే యీ జీవితచరిత్ర పుటలు తిరగవేసి చూస్తే యీ అనుభవం యినాటిది కాదు.

ఒకసారి పిండారీలన్నారు. మరొకసారి బందిపోటులన్నారు. వేరొకసారి దోపిడీదారులన్నారు. మరి యీనాడు సమాజాన్ని దోచే యీ అక్రమ విధానాన్నేమంటారు? ఈ విధాన విధాతలనేమని పిలుస్తారు? నిష్కర్షగా ఆత్మావలోకనం చేసుకుంటే యీ గతిమాలిన యీ లంచాల బ్రతుకులేమిటి? పెడబొబ్బ పెడుతున్న ఈ అవినీతి అక్రమ విధివిధానాలేమిటి? ఇది మానవుడు మానవుడికి చేస్తున్న మోసం కాదా?

ఎన్ని అతుకులు పెడుతున్నా, కుట్టే మాసికలే గాని ప్రగతికది మార్గం కాదని తేలుతున్నది. ఈ విధానం పోవాలి. నిజమైన మానవత్వం పెరగాలి. నేను ఆశావాదిని. యువతరం కదిలి గాండ్రు పెడుతుందని, తప్పును తప్పని నిలబెట్టి అడిగే రోజు వస్తుందని, కడబెడుతున్న పేదరికం, పెత్తనాన్ని, పెత్తందారీ, గుణాధికారాన్ని నడివీధిలో నిలబెట్టి పటాపంచలు చేస్తుందని నా విశ్వాసం. అంతటి మరో మానసిక విప్లవం జాతిని ఆవరిస్తేగాని, ఆ సమ వికాసం, సహజీవనం మానవతను ఆవహిస్తేనే గాని నిజమైన స్వాతంత్ర్య ఫలితం సామాన్య మానవుడికందదని నా భావన.

సమ సహజీవన విధానం, హెచ్చుతగ్గులు లేని ఆచరణం, ఆనాడు గాని నా జాతిని నింపి పండించదని, అప్పుడు గాని అలనాటి స్వాతంత్ర్య పిపాసనా యోధులైన అమరజీవుల ఆత్మపీఠం నా భారతమాత పాదాల దగ్గర ప్రతిష్టించబడదని నా నమ్మకం, అందుకే యీ పయనం. అందుకే గతాన్ని గుర్తుంచుకొని, చెడు అనుభవాన్ని తొలగించుకొని, స్పందించిన సశ్యసూక్తులతో మచ్చలేని మాసిపోని ఆత్మార్పణాదీక్షతో, అంకిత భావంతో ముందుకుసాగడమే మన కర్తవ్యం. భావమన్నది ఒకరిది కాదు. ఎవరిదీ కాదు సమతా భావం అందరిదీ. సర్వులదీ. ఆ స్వచ్ఛమైన భావన అవినీతిని దుయ్యబట్టే ధైర్యం, ఆశకు లోబడని ఆలోచన, ప్రగతికి మార్గం వేసే శీలం, జాతికి సేవ చేసే ధర్మం, పేదరికాన్ని తుడిచే పెట్టే లక్ష్య విధానం మన జాతికి రక్షణ కవచం కావాలి.

1947 ఆగష్టు 15 నాటి స్వాతంత్ర్య లబ్ధి తరువాత భారత సంస్కృతీ వికాస విధానంలో భారత రాజ్యాంగ బద్ధమైన ఫెడరల్ వ్యవస్థలో అంతర్లీనమైన తెలుగు భాషా రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించింది. భిన్న భాషల, భిన్న సంస్కృతుల, భిన్న ఆచారాల, విభిన్నమైన కట్టుబాట్ల పసందుపొసుగులలో తానూ ఒక్కటై ఒదిగి పోయింది. అందుకనే మనం ప్రథమంగా భారతీయులం. ఆ తరువాతనే భిన్న రాష్ట్ర వాసులం. భిన్నత్వంలో ఏకత్వమే మన వారసత్వం, మన రాజ్యాంగమే మన పవిత్ర గ్రంథం, ప్రజలు రచించి తమకు

తామిచ్చుకున్నదే ఆ పవిత్ర బంధం. దేశ సర్వతోముఖాభివృద్ధే మన లక్ష్యం. వెనుకబడినతనమన్నది లేకుండా అనాగరికతను రూపుమాపి, నిరక్షరాస్యతను నిర్మూలించి, మేటి సమైక్య వ్యవస్థగా జాతీయ సమాలోచనాపరమైన ఏకసూత్రానికి అందరం బద్ధులం కావడమే మన దృఢదీక్షా విధానం. ఈ విధాన సంరక్షణ ప్రాభవమే పరిపక్వ జాతీయ నాయక విధానం. సడలించని, తలవంచని, ఆత్మగౌరవ పరిరక్షణమే మనకు ప్రాణప్రదం. భాషా ప్రయుక్త రాష్ట్ర ప్రాతిపదికతో నాంది పలికిన రాష్ట్ర అవతరణ కారణ కారకులైన ఆ శిల్పులకు నా శ్రద్ధాంజలులు.

ఆ భావనా విధాన స్రష్ట, తెలుగుదనానికి పరాకాష్ట అమరజీవి పొట్టి శ్రీరాములు గారి మధుర స్మృతికి మనస్సు స్పందిస్తున్నది. ఎందరో మహనీయుల త్యాగం, దీక్షాదక్షత, వాడి వేడి, మన జీవననాడీ స్పందనం. ప్రకృతి ప్రసాదించిన వనరులను వాడుకొని, శాస్త్రీయ పరిజ్ఞానానికి పదును పెట్టి, కులమత వర్గ వర్ణ విభేదాలను ఆవలకు నెట్టి సర్వతోముఖ, సమ సమానావకాశ సమర్పణమే మన జాతి పురోగమనకు నివేదనం. అల్ప సంఖ్యాకవర్గాల సమాదరణమే మన శ్రేయో సమాజానికి సోదర భావ వికాస విధానం.

**దేశ సర్వతోముఖాభివృద్ధే మన లక్ష్యం. వెనుకబడిన తనమన్నది లేకుండా అనాగరికతను రూపుమాపి, నిరక్షరాస్యతను నిర్మూలించి, మేటి సమైక్య వ్యవస్థగా జాతీయ సమాలోచనా పరమైన ఏకసూత్రానికి అందరం బద్ధులం కావడమే మన దృఢదీక్షా విధానం.**

సర్వమానవ ధర్మ పరిరక్షణా ప్రాభవమే సామాజిక న్యాయ స్ఫూర్తికి ఆలంబనం.

**"ధర్మో రక్షతి రక్షితః"**
**"దేశమనియెడి దొడ్డ వృక్షం**
**ప్రేమలను పూలెత్తవలెనోయ్**
**నరుల చెమటను తడిసి మూలం**
**ధనం పంటలు పండవలెనోయ్ !"**

చిస్తీ నే జిస్ జమీన్ మే
పైగామే హక్ సునాయా
నానక్ నే జిస్ చమన్ మే
వేహదా కా గీత్ గాయా
తాతారియోం నే జిస్ కో
అపనా వతన్ బనాయా
మేరావతన్ వహీ హై !
మేరావతన్ వహీ హై!

Where the mind is without fear
and the head is held high;
where knowledge is free;
where the world has not been broken up
into fragments by narrow domestic walls;
where words come out from the depth of truth
where tireless striving stretches its
arms towards perfection;
where the clear stream of reason
has not lost its way;
into the dreary desert sand of dead habit;
where the mind is led forward by thee
into ever widening; thought and action-
into that heaven of freedom;
my father, let my country awake.

- RABINDRANATH TAGORE

**జై తెలుగునాడు. జైహింద్!**



# అంగవైకల్యం జీవన యాత్రకు ప్రతిబంధకం కారాదు

**(జాతీయ వికలాంగుల ఉపాధి వారోత్సవం, 8-10-87)**

భారత స్వాతంత్ర్య సమరానికి విజయవంతమైన నేతృత్వాన్ని నెరపి, హైందవ జాతిలో ఆత్మాభిమానాన్ని, నిర్భయత్వాన్ని, అహింసాతత్వాన్ని, సత్యధర్మనిష్ఠను జాగృతంచేసి అజరామరమైన కీర్తిని గడించుకున్న మహామనిషి శ్రీ బాపూజీ జన్మించిన దినం అక్టోబరు రెండు. ఈ రోజు నుండి వికలాంగుల ఉపాధి వారోత్సవం ప్రారంభం కావడం ముదావహం, సముచితం. దీనజనోద్ధరణకు తన జీవితాన్ని అంకితంచేసి, ప్రతి మానవుని దుఃఖాశ్రువులను తుడవడమే తన పరమధర్మం అని ఉద్ఘాటించిన మహనీయమూర్తి గాంధీజీ.

దారిద్ర్యాన్ని అనుభవిస్తూ పుట్టుకతోగాని, ప్రమాదవశానగాని, జాడ్యప్రకోపం వల్ల గాని, విధి వైపరీత్యం వల్ల గాని అంగవైకల్యాన్ని పొందినవారు, లుప్తేంద్రియులైన వారు సమాజంలో అతి బలహీనమైన, దయనీయమైన వర్గాలు, సాటి మనిషి చేత హీనంగా చూడబడటం, న్యూనతాభావంతో కుమిలిపోవడం దుర్భరమైన పరిస్థితి. వారి అంధకారమయమైన జీవితాలలో వెలుగులను ప్రసరింపచేసి, నిరాశా నిస్పృహ మనఃస్థితిలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మస్థయిర్యాన్ని నెలకొల్పి, నిత్యజీవిత సమస్యలను ఎదుర్కొనడానికి వారికి

విద్యను, శిక్షణను సాధనా సంపత్తిని, చేయూతను, స్ఫూర్తినీ అందచేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి మీదా ఉన్నదని మనవి చేస్తున్నాను.

అంగవైకల్యం ఒకలోపం కావచ్చు. అయితే అది ఒక శాపంగా పరిణమించగూడదు. జీవిత యాత్రకు ప్రతిబంధకం కాగూడదు. వ్యక్తిత్వ వికాసానికి వినాశ హేతువు కాకూడదు, మానవతా దృక్పథంతోనే ప్రభుత్వం అంగవికలుల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను రూపొందించి నిర్వహిస్తున్నది.

అంగవైకల్యం వల్ల, ఇంద్రియలోపాల వల్ల, మానసిక శక్తులు అభివృద్ధి చెందకపోవడం వల్ల ఏర్పడే సమస్యలను పరిష్కరించడానికి, అశక్తతలను అధిగమింప చెయ్యడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్థలను నెలకొలుపుతున్నది, చికిత్సా విధానాలను, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను ప్రక్రియలను నిర్వహిస్తున్నది. 1983 నుండి వికలాంగుల సంక్షేమ పర్యవేక్షణకు ఒక ప్రత్యేక పరిషత్తు నెలకొల్పబడ్డది.

అంధులకు, బధిరులకు, మూగవారికి శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేక సంస్థలు, వసతి హాస్టళ్లు, స్కాలర్ షిప్పులు, ఉచిత విద్యా, భోజనాది సౌకర్యాలు ఎన్నో ఏర్పడినై, వీరి ఉపయోగార్థం ప్రైవేట్ యాజమాన్యం క్రింద నడుపబడుతున్న సంస్థలకు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. వృత్తి విద్యాబోధనకు, సాంకేతిక శిక్షణకు వనరులు ఇతోధికంగా సమకూర్చడం జరుగుతున్నది. ఉపాధి దొరకని వికలాంగులకు నిరుద్యోగభృతి ప్రభుత్వం అందచేస్తున్నది.

యువకులకు టైప్ రైటింగ్, షార్టుహాండుకు సంబంధించిన పోటీలలో పాల్గొనడానికి ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతున్నది. సంగీత విద్యనభ్యసించిన అంధులకు జంత్ర పరికరాలు ఉచితంగా లభిస్తున్నవి. న్యాయశాస్త్ర పట్టభద్రులకు న్యాయవాద వృత్తిని కొనసాగించడానికి ఆర్థిక సహాయం లభిస్తున్నది.

మానసికాభివృద్ధి కుంటుపడిన వారికి ప్రత్యేకమైన వైద్యశాఖలో చికిత్స లభిస్తున్నది. వికలాంగుల ఆర్థిక స్తోమతను పటిష్టం చెయ్యడానికి పెంపొందించడానికి కొన్ని వృత్తులలో వారికి ప్రవేశాన్ని కల్పించడమేగాక కొన్ని పరిశ్రమలను నిర్వహించడానికి అవసరమైన ఆర్థిక సహాయం లభిస్తున్నది.

గతించిన రెండేళ్ళలో ఈ కార్యక్రమాల మూలంగా ప్రయోజనం పొందిన వారు దాదాపు 24,000. రాష్ట్ర విస్తీర్ణం బహుళమైన జనసంఖ్య దృష్ట్యా, ఈ సంఖ్య చిన్నదే అని అనిపించవచ్చు. అయితే మున్ముందు అధిక సంఖ్యలో ఈ నిర్భాగ్యులు ఇతోధికమైన ప్రయోజనాలను పొందడానికి అవసరమైన అవస్థాపన మన రాష్ట్రంలో ఏర్పడగలదని చెప్పగలను.

ఉద్యోగ నియామకాలపై ఉన్న ఆంక్షలను తొలగిస్తూ, వికలాంగులకు ఉపాధి కల్పించవలెననే ఉద్దేశ్యంతో ప్రభుత్వ ఉద్యోగాలలో వారికి మూడు శాతం కేటాయింపు జరిగింది.

ప్రభుత్వం అందచెయ్యగలిగిన సహాయాన్ని అందిస్తుంది. అందించి తీరుతుంది, అయితే, సంక్షేమ నిర్వహణా భారమంతా ఒక్క ప్రభుత్వమే వహించడం అసాధ్యం. దాని వనరులు పరిమితం గనుక

బహుసంఖ్యాకమైన లక్ష్యాలను సాధించవలసిన అవసరం ప్రభుత్వానికి ఉన్నది. గనుక, సమాజంలోని సంస్థలు, వ్యక్తులు ఈ బాధ్యతను పంచుకోవలసి ఉంటుందని మనవి చేస్తున్నాను. ప్రైవేటు యాజమాన్యాలు గూడా అంగవికలులకు ఉపాధి కల్పించవలెనని కోరుతున్నాను. ప్రజలకు చేయూతనిమ్మని అర్థిస్తున్నాను.

గాంధీజీ జన్మదినోత్సవ శుభసమయాన వికలాంగులైన సోదరసోదరీమణులకు నా హృదయపూర్వకమైన ఆశీస్సులను, శుభాకాంక్షలను అందజేస్తున్నాము.

**జై తెలుగునాడు. జైహింద్!**



# సర్వతోముఖ సంక్షేమ ప్రగతితో మన రాష్ట్రం శోభించి రాణించాలి

**(రాష్ట్ర అవతరణోత్సవ సందర్భంగా టి.వి., రేడియో ప్రసంగం, తేది: 31-10-1987)**

ఇది శుభానంద దినం, అఖిలాంధ్ర ప్రజానీకానికి పర్వదినం. ప్రత్యేక రాష్ట్ర సముపార్జనకు భాషా గౌరవానికి, సాంస్కృతిక జాతీయతా వికాసాలకు పరువు తెచ్చుకున్నదినం. ప్రత్యేకత సంతరించుకున్న దినం. ఇది అందరూ గర్వించదగ్గ విజయం. ఎన్నో ఉద్యమాలతో, ఎంతో ఆందోళనంతో, అమరజీవి ఆత్మార్పణతో యీ ప్రత్యేక ప్రతిపత్తి మనం సాధించుకున్నాం.

తెలుగువారి ఆత్మ గౌరవ విశిష్టతకు వెలలేని పరమార్థం. తెలుగుభాషకు నిండుదనం, గండుదనం, పరిగణనం. పరువం, పుణికించుకున్న ఆంధ్రప్రదేశ్ అవతరణం. యీ శుభదినం.

ఈ సందర్భంలో నా జాతికి, నా వారికి, అఖిలాంధ్ర ప్రజానీకానికి అర్పిస్తున్నాను సుమాశీః శుభాభి నందనం రాష్ట్ర అవతరణ దినోత్సవ అభినందనం.

రాష్ట్రోదయాన్ని స్మరించి కీర్తిస్తున్న ఆనందాతిరేకంతోనే భారతావనికి గూడా నమస్సుమాంజలులను ఘటిస్తున్నాను. భరతధాత్రి గర్భసంజనిత, ముక్తాఫలమే ఆంధ్రుల చారిత్రక విశిష్టత, వైభవస్ఫూర్తి.

**"ఏ దేశమేగినా ఎందుకాలిడినా**
**ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా**
**పొగడరా నీతల్లి భూమి భారతిని**
**నిలపరా నీ జాతి నిండు గౌరవము".**

కోరుతున్నాను హృదయ పూర్వకంగా సిరిసంపదలతో, సస్యశ్యామల స్ఫూర్తితో సర్వతోముఖ సంక్షేమ ప్రగతితో, తుష్టితో పుష్టితో మనరాష్ట్రం రాణించాలనీ, రవళించాలనీ, శోభించాలనీ.

తత్పరంగా మనదేశం చైతన్యప్రగతితో, ముందుకు సాగాలనీ, ఆదర్శవంతమైన నిజప్రజాస్వామ్యానికి ప్రతీకగా, సర్వదా సర్వదా పరిపుష్టివంతమైన రాష్ట్రాల సమన్వయంతో నికరమైన ఐకమత్యంతో, తిరుగులేని సమైక్యతాభావంతో సుస్థిరత్వంతో దీప్తివంతం దివ్యం కావాలని.

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అనే పరమ పవిత్ర భావంతో సంతరించుకున్న స్వాతంత్రం, స్వరాష్ట్రం మనకు ఎన్నటికీ ఆత్మదీప్తి వంతం గౌరవ ప్రదీప్తం యీ సౌభాగ్య పరిరక్షణమే మనధ్యేయం, మనం సాధించుకున్న యీ ప్రత్యేకతకు సరైన నిర్వచనం సమసమాజం. యీ సమసమాజ స్ఫూర్తి విధానం ప్రజాస్వామ్యం.

తృప్తివంతమైన ఆనందమయమైన జీవనవిధానం అందరికీ సమకూర్చడం, పేదరికాన్ని నిర్మూలించడం, న్యాయపరమైన, ఆ ప్రజాస్వామ్య పద్ధతిలో లభ్యమైన సామాజిక హక్కులు, అవకాశాలు అందరికి సమానంగా కల్పించడం, పంచడం, స్వాతంత్ర్యఫలం సరైన అనుభవంలోకి తేవడం, కులమత వర్ణ వర్గ వ్యవస్థను కూలగొట్టడం, నీతి, నియమబద్ధమైన, స్వచ్ఛమైన పటిష్టపాలనం, ప్రభుత్వ విధానం. ఆ పరిపాలన దోపిడి వ్యవస్థగా మారకుండా, రాజకీయం వ్యాపారాత్మకం కాకుండా స్వార్థపరులు సమాజాన్ని దోచుకోకుండా, దౌర్జన్యశక్తులు హింసాత్మ'క విధానంతో ప్రజాపీడనకు పూనుకోకుండా, విశృంఖల విహారాన్ని అరికట్టి. అన్ని రంగాలలో సురక్షితమైన, సుప్రతిష్ఠమైన ప్రతిష్టాత్మకమైన, స్వచ్ఛంద పరిపాలనా విధానాన్ని ప్రజలకందించడం, జాతి గౌరవాన్ని పెంపొందించడం, తెలుగుదేశం ప్రభుత్వం ధ్యేయం.

కనుకనే ప్రతి సంవత్సరం ఆంధ్రప్రదేశ్ అవతరణ శుభ సందర్భంగా సమర్థతను గుర్తించడం, అర్హతను గౌరవించడం సుసంప్రదాయం కావాలని తెలుగుదేశం ప్రభుత్వం భావిస్తున్నది. అందువల్ల వారి వారి శాఖల్లో అద్వితీయ ప్రతిభావిశేషాలు కనపరచిన, పవిత్ర ఆచరణ విధానాలకు అంకితులై ప్రభుత్వోద్యోగులను గుర్తించి గౌరవించడం జరుగుతోంది ప్రశంసాపరంపరలతో, మన రాష్ట్రాభ్యుదయ సాధన, నీతినిబద్ధమైన పరిపాలనా విధానం, కేవలం ఏ ఒక్కరివల్లో జరుగదు. ప్రజలందరిలోను ఇది మన రాష్ట్రం. మాకు చెందవలసిన ప్రజాపరిపాలనలో చెడును తుడిచిపెట్టి మంచిని పంచిపెట్టడం అందరి బాధ్యతగా ప్రతి ఒక్కరూ స్వీకరించాలని నా విజ్ఞప్తి. రాష్ట్ర ఆవిర్భావదినమని ఆనందిస్తే సరిపోదు. ఆవిర్భవించిన యీ స్వతంత్ర రాష్ట్ర వ్యవస్థ సరియైన నిజమైన ప్రజాస్వామ్య పద్ధతిలో నిబద్ధమైన సంక్షేమకర వ్యవస్థగా రూపొందించుకోవడంలో

ఆరు కోట్ల ప్రజానీకానిదీ ఒకేబాట కావాలని, అది ప్రగతిపథంలో దూసుకుపోవాలని, నిరాశాపరులుగా భంగపడ్డ దగాపడ్డ పేదప్రజలకు ఆదరువు కల్పించే కాణాచిగా కనులముందు సాక్షాత్కరించాలని నా ఆశ, ప్రభుత్వ ఆశయం.

ఆంధ్రప్రదేశ్ అవతరించి మూడు దశాబ్దాలు గడిచినవి. ఎన్నో ప్రతిబంధకాలు, క్లిష్టపరిస్థితులు, ఆశాభంగాలు సమస్యల తోరణాలు ఎదురవుతూనే ఉన్నవి. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, వైజ్ఞానికంగా, మనం సాధించవలసిన లక్ష్యాలు ఎన్నో ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థకు పటిష్టత చేకూరినా ప్రగతిశీలత్వం తగినంతగా ఏర్పడలేదు. అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ బడుగువర్గాల జీవనం దుర్భరంగానే ఉంటున్నది. అతివృష్టి అనావృష్టి ఫలితంగా ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకులకు లోనవుతూనే ఉన్నది. విద్యా వైజ్ఞానిక రంగాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించగలిగి నప్పటికీ వయోజన విద్య సంతృప్తికరంగా ఉన్నదని చెప్పలేము. దారిద్ర్యరేఖకు అడుగున ఉన్న వారి శాతం అధికంగానే ఉంటున్నది.

**ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మనం సాధించ వలసిన లక్ష్యాలు ఎన్నో ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థకు పటిష్టత చేకూరినా ప్రగతిశీలత్వం తగినంతగా ఏర్పడలేదు. అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ బడుగువర్గాల జీవనం దుర్భరంగానే ఉంటున్నది.**

అయితే ఈ సమస్యలు మన మేధస్సుకు, పట్టుదలకు కార్యదక్షతకు మరింత వైవిధ్యాన్ని బలాన్ని ప్రసాదించాలి. ఉధృతోత్సాహం అభివ్యక్తం కావాలి.

“ఉద్ధరేదాత్మనాత్మానాం” మన కృషితోనే మనం అభ్యున్నతిని సాధించాలి.

మీ ప్రతినిధిగా ఆరుకోట్ల తెలుగు ప్రజలు ఆదరించి గౌరవించిన మీ మనిషిగా, మీ నమ్మకాలకు, విశ్వాసాలకు ఏ మాత్రం తగని పద్ధతిలో మన సంస్కృతీ వికాసాల విలువలు కాపాడుతూ అనుక్షణం తెలుగువారి ఆత్మగౌరవానికి పరిరక్షణగా, పరిశుద్ధమైన పరిపాలనా విధానానికి ప్రతీకగా నిలిచే ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రజలకందించడంలో వెనుదీయనని, రాష్ట్ర ప్రజా సంక్షేమానికి, సేవకు పునరంకితమని శపథం చేస్తున్నాను. ఈ ఆంధ్రప్రదేశ్ అవతరణ శుభోత్సవ సందర్భాన, యీ పర్వదినాన, అందరూ ఆనందంతో తృప్తితో పరవశించాలనీ, మీ అందరి కుటుంబాలు సంతోషతరంగాలలో తేలియాడాలని, తెలుగుబిడ్డలు గండుమగటిమితో, మనోనిబ్బరంతో, విజ్ఞాన వికాసాలతో పరిపుష్టివంతమైన రాష్ట్ర సుస్వరూప సంకలనానికి మహా శిల్పులు కావాలని నా ఆశ, నా ఆకాంక్ష.

అప్పుడే నవంబరు 1కి సరియైన నిర్వచనం, అదే నేను కోరుకునే వరం,

**జై తెలుగునాడు. జైహింద్!**



# నీతిని పెంచి జాతిని ఉద్ధరించాలి

**(లాల్ బహదూర్ స్టేడియం – ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం, తేది: 01-11-1987)**

ఇది శుభానందదినం – అఖిలాంధ్ర ప్రజానీకానికి పర్వదినం, – ప్రత్యేక భాషాప్రయుక్త, రాష్ట్ర సముపార్జనా విధానంతో – తెలుగుభాషకు, – తెలుగు దనానికి – సాంస్కృతిక కళావికాసాలకు – పరువు తెచ్చుకున్న దినం – గౌరవం సంతరించుకున్న దినం –

అందరూ ఆమోదించిన విధానాలే అయినా – ఎవరో ఒక మహానీయుడు నడుంకట్టి ప్రాణం పణంగా పెట్టందే – ఏ ఉద్యమం ఫలించలేదు – విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు రుధిరం స్రవించందే – ఎంతోమంది జాతీయ వీరులు నేలకొరగందే – మనకు స్వాతంత్ర్యం లభించలేదు.– అదే స్వతంత్ర భారత దేశంలో – అమరజీవి ఆత్మార్పణతో కాని – యీ ప్రతిపత్తి తెలుగువారికి సిద్ధించలేదు. – కనుక యీ ప్రత్యేక రాష్ట్ర సముపార్జనకు ప్రాణతాగ్యం చేసిన – పొట్టి శ్రీరాములుగారికి– ఆరుకోట్ల ప్రజానీకం తరపున సమర్పిస్తున్నాను నమస్సుమాంజలి. – భక్తి ప్రపూరితమైన శ్రద్ధాంజలి –

ఈ శుభోదయ పర్వదినాన – నా జాతికి – నావారికి – కులమత వర్గవర్ణ భేదాలకు అతీతంగా – జగదేకకుటుంబంగా – సఖ్యతతో ప్రవర్ధమానమవుతున్న ఆరుకోట్ల ప్రజానీకానికి పలుకుతున్నాను –

సుమాశీఃశుభాభివందనం – మత సహనం – కులభేద రాహిత్యం – ప్రాంతీయ సమైక్యతాభావం – వర్గ – వర్ణ – సమాదరణం కోరుతున్నాను హృదయపూర్వకంగా –

మతమన్నది ఎవరి ఎవరి అభిమతం, వారివారిది.

**"మజహబ్ నహీ సిఖాతా
ఆపస్ మే బైర్ రఖ్‌నా
హిందీ హై హమ్,
వతన్ హై, హిందూస్తా హమారా"**

అదే విధంగా మతాతీతమైన మనస్తత్వంతో, భిన్నత్వంలో ఏకత్వాన్ని సంతరించుకోగలిగిన మనం – తొలుత భారతీయులమని – ఆ తరువాతనే భిన్న రాష్ట్రవాసులమని నమ్ముతున్నాం, – వ్యవహరిస్తున్నాం.

**"ఏదేశమేగినా ఎందుకాలిడినా
నీ పీఠ మెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము"**

కోరుతున్నాను హృదయపూర్వకంగా సిరిసంపదలతో, – సస్య శ్యామల స్ఫూర్తితో – భారతీయులందరూ ముందుకు సాగాలనీ, – ఆనంద డోలికలలో – తేలియాడాలని,– అందులో – సమగ్రభారత దేశంతో భాగంగా ఉన్న మనం – జాతి సంక్షేమంలో భాగస్వాములుగా, – తుష్టితో, – పుష్టితో – రాణించాలని, – మన రాష్ట్రం రవళించాలనీ – శోభించాలని – శుభపూరితం కావాలని, – సర్వదా సర్వదా పరిపుష్టివంతమైన నిజ ప్రజాస్వామ్యానికి ప్రతీకగా – నిండుగా ఐకమత్యంతో – సుస్థిరత్వంతో – ఉద్దీపితం కావాలని – ప్రత్యేక రాష్ట్రం జాతిపరువు తెచ్చింది. – భాష విలువ హెచ్చింది – ఆత్మగౌరవం పెంచింది. – మనిషి నమూనాకు తెలుగు తనమబ్బింది. మరి ఇంత చేసిన రాష్ట్రానికి మనం ఇవ్వగలిగింది ఏమిటి? – ఇవ్వబోయేది ఏమిటి? – అదీ యీనాడు, యీ అవతరణ దినోత్సవ సందర్భంలో – మన తెలుగు తల్లికి మనం ఇవ్వగల అంకితార్పణం.

ఆ తల్లి సంపద అడగలేదు.– షడ్రసోపేతమైన విందు అడగలేదు.– కేవలం కోరుకున్నది స్వచ్ఛంగా బ్రతకమని – మాలిన్యం విడనాడమని – స్వార్థం చంపుకోమని. – దగాకోరు విధానంతో మీ తమ్ముళ్ళకు నీవు ద్రోహం చేయవద్దని – పేదరికాన్ని పెంచవద్దని – సామాజిక పరమైన న్యాయం అందరికీ పంచమని – ప్రత్యేకతలో సంతరించుకున్న వృత్తి విజ్ఞాన అవకాశాలు – సమంగా, సక్రమంగా అందరికీ పంచమని భేదాలకు అతీతమైన భావంతో – బిడ్డలందరూ సహోదర భావంతో మెలగాలని – ఈర్ష్యాద్వేష మాత్సర్యాలకు అతీతంగా – అందరూ సంచరించమని, – ప్రేమను పంచమని, పంచుకోమని, – అనురాగం పెంచుకోమని, అడుగుతోంది. – తన సంపదను – శక్తియుక్తులతో వ్యాపారాత్మకమైన కలుషిత రాజకీయ దగాకోరు

విధానంతో – కొందరే అనుభవించడం – మరికొందరు కటిక దరిద్రంతో కంటి నీళ్ళతో కడుపునింపుకొని బ్రతకడం – ఆదర్శం కాదయ్యా అని అంటోంది, – అతి దీనంగా నిస్సహాయంతో, – మరి ఇంత తెలివిగల వాళ్లం. – ఇంత చరిత్ర ఉన్న వాళ్లం – గండుమగలుగా, మేటిమగటిమితో – మత్తమద గజకుంభ స్థలాలను బ్రద్దలు కొట్టిన పౌరుషవంతులం.–

సాహిత్య నృత్య కళావైభవ వికాసాలకు మంగళారతులు అద్దిన మేటి కళాశిల్పులం – తిరుపతి వెంకన్న – భద్రాద్రిరామన్న – శ్రీశైలం మల్లన్న దివ్యాదరణ తీర్థప్రసాదాలతో తరిస్తున్న వారం అమ్మ కోరిక తీర్చడం మన కర్తవ్యం కాదా – అని అడుగుతున్నాను, – మీ మనిషిగా మీలో ఒకడిగా – మీరు గౌరవించిన వ్యక్తిగా – అర్థిస్తున్నాను నాపరంగా – ప్రభుత్వపరంగా –

> **తన సంపదను – శక్తియుక్తులతో వ్యాపారాత్మకమైన కలుషిత రాజకీయ దగాకోరు విధానంతో – కొందరే అనుభవించడం – మరికొందరు కటికి దరిద్రంతో కంటి నీళ్ళతో కడుపునింపుకొని బ్రతకడం – ఆదర్శం కాదయ్యా అని అంటోంది.**

ఈ సూక్తులకు అనుగుణ్యంగా – ప్రజాస్వామ్య నియమనిబద్ధమైనటువంటి తెలుగుదేశం ప్రభుత్వం – మానవ మనుగడకు – అతిసామాన్యమైన, అత్యవసర సౌకర్యాలను కలిగించడం, – నిరాశ్రయులకు గృహవసతి కల్పించడం, – నిరుపేదవారికి సులభ వస్త్ర సౌకర్యం కలిగించడం – తన విద్యుక్త ధర్మంగా, బాధ్యతగా భావించింది.

ప్రజల హృదయ స్పందనలను అవగాహన చేసుకుని – వారి అభీష్టాలను నెరవేర్చి – వారి ఆశయసిద్ధికి, విధాన రూపకల్పన చెయ్యడమే ప్రజాప్రభుత్వాల ఆదర్శం, కర్తవ్యం, పరమావధి పరమార్థం, – తెలుగు దేశ ప్రభుత్వం ఆంధ్ర ప్రజానీకానికి సేవలను అందించడంలో కార్యదీక్షను – అలవాటు చేసుకున్నది ప్రజాస్వామ్య ఎన్నికల విధానంలో – విప్లవాత్మకమయిన సంస్కరణలు తల పెట్టినా – స్థానిక స్వపరిపాలనారంగంలో మాండలిక వ్యవస్థను నెలకొల్పినా – మహిళలకు పురుషులతో సమానంగా ఆస్తిహక్కులను కల్పించినా – స్త్రీల పురోభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి, విద్యా సౌకర్యాలు యితోధికంగా ఏర్పరిచినా – మహిళా ప్రాంగణాలు రూపొందించినా – పాఠశాలలో దృశ్య శ్రవణ విధానాన్ని ప్రవేశ పెట్టినా – వృత్తి విద్యా శిక్షణ నిమిత్తం సంస్థాగతమైన మార్పులను అమలు పరిచినా – వ్యవసాయరంగ పటిష్టతకు, రైతు సోదర సంక్షేమానికి దోహదక్రియగా, కర్షక పరిషత్తులను రూపొందించినా – రైతుల సౌకర్యార్థం, ఏకగవాక్ష పద్ధతిని ప్రవేశపెట్టినా – తెలుగు గంగ వంటి ప్రతిష్టాత్మకమైన సాగునీటి పథకాలను చేపట్టి, దుర్భిక్ష పరిస్థితులను తొలగించి, వ్యవసాయిక సమృద్ధిని సాధించడానికి కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నా – ఋణభారంతో క్రుంగిపోతున్న రైతాంగానికి ఉపశమనం కలిగించడానికి, వ్యావసాయిక ఋణాల మీద వడ్డీ మాఫీ చేసినా – బడుగువర్గాలకు నిత్యజీవితావసరాలను నిర్ణీత ధరలకు అందచేసినా – వైద్య సహాయ కార్యక్రమాలను పటిష్టం చెయ్యడానికి, ప్రజారోగ్య ప్రదాయక ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయడానికి, వైద్య విజ్ఞాన పరిషత్ స్థాపించినా – షెడ్యూల్డు కులాలు, తెగలకు – ప్రత్యేకమైన

సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినా – హుస్సేన్ సాగర తీరాన, తెలుగు వెలుగుల మూర్తులను నిలిపి జాతికి నివాళులిచ్చినా – జాతికి కానుకగా సమర్పించినా – పరిపాలనా యంత్రాంగాన్ని మిళితంచేసి, సుశిక్షతమైన, బాధ్యతాయుతమైన, సంస్థగా రూపొందించినా – ధ్యేయ మొక్కటే – ప్రజావసరాలను తీర్చి ప్రజాశ్రేయస్సును ఇనుమడింపచెయ్యడమే – ఈ లక్ష్య సాధనకే ఎన్నో ఇంకెన్నో; మరెన్నో పథకాలు, ప్రణాళికలు – కార్యక్రమాలు.

ఈ శుభసమయాన, తెలుగుదేశం ప్రభుత్వం తలపెట్టిన కొన్ని విధాన నిర్ణయాలను ప్రజలముందుంచు తున్నాను – మొదటిది విద్యా విషయకమైనది – ప్రతి మండలములో స్థాపితమయ్యే జూనియర్ కాలేజీలలో విద్యాబోధనతో వృత్తి విద్యా శిక్షణ అనుసంధానింపబడుతుంది – ఇంతేకాదు, మున్ముందు నెలకొల్పబడే జూనియర్ కళాశాలల యాజమాన్యం, సహకార సూత్రం మీద వ్యవస్థితమవుతుంది. – ప్రజలకే ఈ సంస్థలను నెలకొల్పే అవకాశాన్ని కల్పించి, నిర్వహణ బాధ్యతలను అప్పగించడం జరుగుతుంది.

కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులకందరికీ, యు.జి.సి. వారిచే నిర్ణయించిన వేతనాలు ఇవ్వడానికి ప్రభుత్వం నిశ్చయించింది – విశ్వవిద్యాలయాలలో పనిచేసే అధ్యాపకేతర సిబ్బందికి సవరించబడ్డ, పి.ఆర్.సి. రేట్లు వర్తింపచెయ్యాలన్నది మరొక నిర్ణయం–

ఇక రెండవది – వ్యవసాయకూలీల మనుగడకు సంబంధించిన విషయం – అల్పాదాయంతోపాటు, అనిశ్చిత ఉపాధి కలిగిన వర్గమిది. – ఈ బడుగు కుటుంబాలలో, ప్రధాన వ్యక్తి మరణించినట్లయితే, కుటుంబసభ్యుల జీవితం దుర్భరమవుతున్న విషయం జగద్విదితమే – జీవిత బీమా సంస్థ వారి తోడ్పాటుతో, రాష్ట్ర ప్రభుత్వం గ్రూపు ఇన్సూరెన్స్ పథకాన్ని చేపట్టబోతున్నది – ఈ సాహసోపేతమైన నిర్ణయం, సంకల్ప శుద్ధితో నిర్ణయించబడింది.

ఈ సంక్షేమ పథకాలు, సమాజ శ్రేయస్సుకు ఉద్దేశించబడ్డా, వాటిని అమలు చేసే విధానంలో, ఏ ప్రజానీకానికి, – ఏఏ వర్గం వారికి – ఏఏ ఫలితాలు ఉద్దేశించబడ్డవో – వాటిని వారికి సక్రమంగా అందించగల అధికార వ్యవస్థను పటిష్టం చేసుకోవడం అంతకన్నా ముఖ్యం. – కనుకనే, కేవలం వారి వారి నియమ పరిమితిలో, నిర్ణయ పద్ధతిలో గాక – త్యాగబుద్ధితో, దీక్షతో, అంకితమైన భావంతో, – ధైర్యంతో, సాహసంతో, – ఉత్సాహంతో ప్రభుత్వ కార్యక్రమాలను సకాలంలో ప్రజలకు అందించడం – దుష్టశక్తులను అణచి వేయడం – శాంతి భద్రతా రక్షణ కలిగించడం, లంచగొండి విధానాన్ని తుడిచి పెట్టడం – దగాకోరుల ఆట కట్టించడం – ఆశలకు అతీతులుగా, వృత్తి ధర్మాన్ని పరమార్ధంగా భావించి కృషి చేస్తున్న ఆదర్శ ప్రభుత్వ అధికార్ల సేవలు గుర్తించి – వారి సత్యశీల ప్రవర్తనను గౌరవించడం – అర్హతను ప్రశంసించడం – విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది తెలుగు దేశం ప్రభుత్వం – అందుకే యీ పవిత్ర దినాన వివిధ శాఖలలో – భిన్న అంతస్తులలో ఉండి, – ఆదర్శవంతులై పవిత్ర స్వచ్ఛంద సేవ, భిన్న విధానానికి అంకితులైన ప్రభుత్వోద్యోగులకు – అధికారులకు – ప్రత్యేక గౌరవం – దానికి తగ్గ ప్రత్యేక పారితోషికం, ఈనాడు అందిస్తోంది ప్రభుత్వం.

నీతిని పెంచాలి – జాతిని ఉద్ధరించాలి – తెచ్చుకున్న స్వరాష్ట్రాన్ని సర్వతోముఖ వికాసవంతమైన, – సమగ్రాభివృద్ధితో శోభితమైన, సస్యశ్యామల పూరితమైన జీవగడ్డగా – మనం మలచుకోవాలి – ఇది అందరి కృషి – అందరి సమన్వయం దీనికి కేవలం ఒక ప్రభుత్వ బాధ్యతే కాదు – అందరూ యీ రాష్ట్రం నాది నా ధర్మం నేను నిర్వర్తించాను – స్వచ్ఛపరిపాలనను ప్రజలకు అందించే విధానంలో నాకు ప్రాతినిథ్యం వహిస్తున్న తెలుగుదేశం ప్రభుత్వానికి – కాకలుతీరిన సామాజిక పరిరక్షకునిగా అండనిలవాలి – సురక్షితమైన ప్రజాస్వామ్యానికి పాటుపడాలి. పేదరికాన్ని పారద్రోలాలి – అనే నిశ్చయ, నియమబద్ధ ప్రతిజ్ఞ – ఆత్మతో పలకాలి. అప్పుడే యీ నవంబరు ఒకటికి సరియైన నిర్వచనం. అదే నా వారందరిని చేజాచి నేను యాచించే వరం.

**"దేశమనియెడి దొడ్డవృక్షం**
**ప్రేమలను పూలెత్త వలెనోయ్**
**నరుల చెమటను తడసిమూలం**
**ధనం పంటలు పండవలెనోయ్".**

**జై తెలుగునాడు. జైహింద్!**



# అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలి విజ్ఞాన దీపకళికలను వెలిగించేదే విద్య

**(తెలుగు విశ్వవిద్యాలయ ద్వితీయ వ్యవస్థాపనా దినోత్సవం సందర్భంగా 1987 డిసెంబరు 2వ తేదీన ఉదయం 9-00 గంటలకు రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి యన్.టి. రామారావుగారి ప్రసంగం)**

**తెలుగదేలయన్న దేశంబు తెలుగేను**
**తెలుగు వల్లభుండ తెలుగొకండ**
**యెల్ల నృపులు గొలువ ఎఱుగవే బాసాడి**
**దేశభాషలందు తెలుగులెస్స.**

మనిషి హృదయాంతరాళాలను అవరించిన అజ్ఞాన తిమిరాన్ని సంహరించి, విజ్ఞాన దీపకళికలను వెలుగొందింపజేసే మహా మహిమాన్విత శక్తి పూరితమైనది విద్య. విద్యలేని వాడు వింత పశువు అన్న నానుడి మనకందరకూ తెలిసిందే. తరతరాలుగా మన తెలుగు జాతికి సంక్రమించిన సాహితీ ఉషస్సులను, సాంస్కృతిక సౌరభ విభవాలను నలుగడల పరిక్రమింపజేసే సద్భావనతోనే ఈ తెలుగు విశ్వవిద్యాలయం

మన రాష్ట్రరాజధానిలో అవతరించింది ఇటువంటి మహోజ్జ్వలమైన ఆశయంతో వెలసిన ఈ తెలుగు విశ్వవిద్యాలయం నేడు ద్వితీయ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం అందరకు ఆనందదాయకమైన విషయంగా నేను భావిస్తున్నాను.

సేచ్ఛా భారత దేశంలో విద్య విశాలమైన ప్రాతిపదికపై, సువిశాల పీఠంపై సమున్నతంగా నిలవాలి. మానసిక వికాసాన్ని కలిగించాలి. మనిషిలోని వ్యక్తిత్వాన్ని వేలార్చే దీపకళిక కావాలి. అందుకే తెలుగుదేశం ప్రభుత్వం విద్యకు అపార ప్రాముఖ్యాన్ని యిచ్చింది. మహిళల సర్వతోముఖ వికాసానికి ప్రోత్సాహకంగా పుణ్యక్షేత్రం తిరుపతిలో వెలసింది పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం, ప్రప్రథమంగా ప్రాథమిక స్థాయిలో సంచలనాత్మకమైన దృశ్యశ్రవణ విద్యాబోధనా విధానాన్ని ప్రవేశ పెట్టింది, తెలుగుదేశం ప్రభుత్వమేనని చెప్పటానికి నాకు ఎంతో గర్వంగా వుంది.

**సేచ్ఛా భారత దేశంలో విద్య విశాలమైన ప్రాతిపదికపై, సువిశాల పీఠంపై సమున్నతంగా నిలవాలి. మనిషిలోని వ్యక్తిత్వాన్ని వేలార్చే దీపకళిక కావాలి. అందుకే తెలుగుదేశం ప్రభుత్వం విద్యకు అపార ప్రాముఖ్యాన్ని యిచ్చింది.**

శాతవాహన, కాకతీయ, రెడ్డి రాజులు మొదలుగా ఎందరో మహరాజులు మన ఆంధ్ర రాష్ట్రాన్ని పరిపాలించి తమ యశః చంద్రికలను దశదిశలా వెదజల్లుకున్నారు. వారి ఏలుబడిలో అనేక సంస్కృతుల మేళవింపుతో కళలకు కాణాచిగా మన తెలుగుదేశం తేజరిల్లింది.

ఆనాటి కళలను, ఆనాటి సాంస్కృతిక ప్రాభవాలను పరిరక్షించి, ప్రోత్సహించటం తెలుగు విశ్వవిద్యాలయం యొక్క సమున్నతమైన ఆశయం. లలితకళలను సముద్ధరించడానికి నృత్యం, సంగీతం, నాటకం, చిత్రకళ, శిల్పం వంటి ప్రక్రియలలో ఇదివరకు అమలులో వున్న విధానాలను అనుసరిస్తూనే మరిన్ని ప్రోత్సాహక చర్యలను చేపట్టింది.

బోధన, పరిశోధన, సంస్కృతి, ప్రసారణం ముఖ్యాంగాలుగా ఏర్పడిన తెలుగు విశ్వవిద్యాలయం గతంలోని ఆకాడమీలను, సంస్థలను తనలో సంలీనం చేసుకోవడమే కాకుండా ఆయా అకాడమీల కార్యక్రమాలను రెమ్మలు కొమ్మలుగా విస్తరింపజేయడానికి ప్రభుత్వం సర్వ విధాలుగా పటిష్టమైన చర్యలను గైకొంటున్నది.

పల్లెవాసులకు ఆటపట్టులైన జానపద కళారూపాలను పరిశోధించి ఆధునిక సౌకర్యాలతో వాటిని భావితరాలకోసం ప్రక్షిప్తం చేయటం, అలభ్యము అపురూపమైన గ్రంథ సంచయాలకు అచ్చు వెలుగు చూపటం, వివిధ సాహితీ ప్రక్రియలో పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం గావించడం, స్మారకోపన్యాసాలను నిర్వహించడం వంటి అనేక బృహత్తరమైన కార్యక్రమాలను తన భుజస్కందాలపై వేసుకొని ఈ విశ్వవిద్యాలయం దిగ్విజయంగా సాహిత్య సాంస్కృతిక పురోభివృద్ధిపథం వైపు ప్రస్థానం కావించటం హర్షదాయకమైన విషయం.

అంతేకాదు ఈ ఏటి నుండి విశ్వవిద్యాలయం - సాహిత్యపీఠం, చరిత్ర, సంస్కృతి, పురావస్తు

శాస్త్రపీఠాలలో ఎం.ఫిల్., పి. హెచ్ డి. పరిశోధనా తరగతులను కూడా నిర్వహిస్తుందని చెప్పటానికి నేను సంతోషిస్తున్నాను. లలితకళా పీఠంలో నృత్యం, సంగీతం, శిల్పం, జానపద కళారూపాలు, జ్యోతిషంలో బి.ఎ. డిగ్రీ తరగతులు కూడా ప్రారంభమయినాయి. వీటిలో డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులు కూడా ప్రారంభం కానున్నాయి.

విశ్వవిద్యాలయ అవసరాలు తీర్చడానికి రూపుదిద్దుకున్న గ్రంథాలయం వికాసోన్ముఖంగా సాగుతోంది.

ఒక విశ్వవిద్యాలయం చరిత్రలో రెండేళ్ళ కాలం అతి స్వల్పమైనదైనప్పటికీ ప్రతిక్షణం అత్యంత విలువైనదిగా భావిస్తూ ఈ ఆలయం సర్వాంగ సుందరంగా పరిఢవిల్లడానికి అహరహం కృషి సల్పటం ప్రశంసనీయమైన విషయంగా నేను భావిస్తున్నాను. ఈ కృషిని మరింత ఉద్దీపింపజేసి తెలుగు విశ్వ విద్యాలయాన్ని దేశంలోనే ఒక ఆదర్శప్రాయమైన, అనుసరణీయమైన సాహితీ సాంస్కృతిక రూపంగా రూపొందింపజేయాలని నేను ఆకాంక్షిస్తూ ఈ శుభ సందర్భంగా శుభాభినందనలను తెలియజేస్తున్నాను..

**జై తెలుగునాడు. జైహింద్!**



# ప్రకృతి వైపరీత్యాలను ధైర్యంతో కలసికట్టుగా ఎదుర్కొందాం

**(వరదలు వాటిల్లిన సందర్భంగా రేడియో - టి.వి.లలో ముఖ్యమంత్రిగారి ప్రసంగం - 1988)**

మానవ సమాజంలో ఆది నుంచీ ప్రకృతికి, మనిషికి మధ్య నిరంతర పోరాటం జరుగుతూనే వుంది. మానవుడు ఎంతటి శాస్త్ర పరిజ్ఞానాన్ని, సంతరించుకున్నా, ఎంతటి మహోన్నత విజ్ఞాన శిఖరాలను అధిరోహించగలిగినా ఎక్కడో ఒక చోట ఎప్పుడో ఒకప్పుడు ప్రకృతితో తారసిల్లి పరాజయం పొందుతూనే వున్నారు. ఆశక్తతతో తలవంచుకొంటూనే తన ఓటమిని అంగీకరిస్తున్నాడు.

ఇటువంటి నిత్య సంఘర్షణలను మనమెన్నిటినో చూశాం.... చూస్తున్నాం. ముఖ్యంగా ఈ ప్రకృతి విలయతాండవంలో చిక్కుకుని విలవిలలాడేది శ్రామికులు, కర్షకులు, గ్రామీణ ప్రజానీకం, హతాశులు, గతాశులు, ఎందరో మరెందరో, నిన్న మొన్నటిదాక అనావృష్టితో, కరువుతో కృంగి మలమలలాడిన మన

రాష్ట్రానికి యీనాడు వరద విపత్తు సంభవించింది. ఇది దురదృష్టకరం.

త్రాగే నీటికి కొరవడిన మనం, పొంగే వరదను అదుపు చేసుకోలేని, అడ్డు వేసుకోలేని దురదృష్టవంతుల మయినాం. ఖమ్మం, వరంగల్లు, అదిలాబాదు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలలో ఎంతో మంది తమ గూడు చెదరి చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లా చెదురైన దుస్థితి ఏర్పడింది. ఆశతో నాటుకున్న పచ్చని పంటలను నీటి పాలుచేసి, ఆస్తిపాస్తులను వరద ముంపుకు వదలివేసి, ప్రాణాలు అరిచేతుల్లో పట్టుకొని భీతావహులై రక్షణకోసం ఆరాటపడుతున్నారు.

మీరు గౌరవించిన మీ మనిషిగా, అనుక్షణం మీ ఆశీస్సులందుకొంటున్న మీ సోదరునిగా, మీరు అప్పగించిన పరిపాలనా బాధ్యతను స్వీకరించిన మీ ప్రతినిధిగా – అనుక్షణం, ప్రతిక్షణం, ఉద్వేగమైన యీ విలయానికి అడ్డుకట్టలు వేయడానికి నా సేవలను అంకితం చేస్తున్నానని సుస్పష్టం చేస్తున్నాను.

1953లో వచ్చిన వరద భీభత్సం కనీవినీ ఎరుగనిది. కాని యీనాటి వరద విలయం అలనాటి భీభత్సాన్ని అతిక్రమించింది – అంటే యిది మన అదుపులోలేని ప్రకృతి విలయతాండవంగా, మన శక్తికి మించిన సంభవంగా గుర్తించాలి. ఆనాడు గోదావరి ఆనకట్టమీద 19 అడుగుల నీరు పొంగి పొర్లితే అది యీనాడు యిప్పటికే 20 1/2 అడుగులకు చేరుకుంది. ఇంకా గోదావరి నీటి మట్టం పెరుగుతూ నేవుంది. అది 21 1/2 అడుగులకు చేరుకోగలదని ప్రమాద సూచన. అంటే యీ విలయాన్నుంచి తప్పించుకోడానికి మనందరం సమిష్టిగా ఎంతగా కృషిచేయాలో గుర్తించాలని మనవి చేస్తున్నాను. ఇందులో నా ప్రజల సహకారం ఎంతయినా అవసరమని నా భావనను వ్యక్తం చేస్తున్నాను.

ఈ ఆపత్సమయంలో విపన్నులను ఆదుకోడానికి ప్రభుత్వం సర్వసన్నద్ధమైంది. ఎప్పటికప్పుడు ముందుగానే అంచనా వేసిన భవిష్యత్ విలయాన్ని గురించి ప్రజలకు తెలియజేయడం, ఆపన్నులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వారికి ఆహారాది సదుపాయాలు కల్పించటం, ఆరోగ్యాన్ని పరిరక్షించే వైద్య విధానాన్ని పాటించటం – ప్రథమ కర్తవ్యంగా ప్రభుత్వం భావించింది. వరద ముంపు వార్త వినగానే రాజమండ్రి, కాకినాడలలో సుమారుగా 63 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ముంపులో వున్న కొన్ని వేల మందిని రక్షించి సురక్షిత కేంద్రాలకు తరలించడం జరిగింది.

జలదిగ్బంధనంలో చిక్కుకున్న కొన్ని వేలమందికి.... లక్షల మందికి ఆహార పొట్లాలను హెలికాప్టర్ల ద్వారా అందించడం జరుగుతోంది. ప్రత్యేకంగా యీ ప్రవాహాన్ని అదుపులో పెట్టటానికి సైనిక, నావిక, వాయుసేనా సిబ్బందిని సమన్వయ పర్చుకుని ఆహార పదార్థాలందించే, ప్రజలను తరలించే, వరద పొంగును నివారించే కార్యక్రమాలన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో 9 హెలికాప్టర్లు, 3 విమానాలు, ఎన్నో నావలు పాల్గొంటున్నాయి. ఆధునిక సాంకేతిక యంత్రసామాగ్రి ఎప్పటికప్పుడు వార్తలందించడానికి ఏర్పాటు చేయబడింది. ఒకవేళ మామూలు వార్తా సౌకర్యాలు పని చేయక పోయినప్పటికీ హేమ్ రేడియో ద్వారా సమాచారాన్ని అందుకుని తక్షణమే సహాయ చర్యలు చేపట్టడం జరుగుతోంది.

అనుభవం సంతరించుకున్న ప్రముఖ ప్రభుత్వోద్యోగులు ప్రత్యేకంగా యీ జిల్లాలలో పర్యవేక్షకులుగా నియమించబడ్డారు. ఆహార పదార్థాలు సరఫరా చేయడానికి, ఇంధనం విమానాలకు సరఫరా చేయడానికి, విస్తృతమౌతున్న వరదకు ఎప్పటికప్పుడు అడ్డుకట్టలు వేయడానికి వీరందరూ రేయింబవలు నౌకా, వాయు, భూతల సైనిక సిబ్బందితో సమన్వయపూర్వకంగా కృషిచేస్తున్నారు. ఈనాడు యీ వరద ముంపుకు గురై ఎన్నో కష్టనష్టాలకు లోనవుతున్న నా వారికి, నా ప్రాణబంధువులకు నా బాధాతప్తమైన సానుభూతిని అందజేయడం నా ధర్మంగా నేను భావిస్తున్నాను.

దురదృష్టవశాత్తు గతాశువులైన వారి కుటుంబాలకు నా సానుభూతి సంతాపాలను వ్యక్తం చేస్తున్నాను.

ఈ విపత్సమయంలో గుండె చెదరని మొండి ధైర్యంతో, మొక్కవోని ఆత్మ విశ్వాసంతో ఎప్పటికప్పుడు మనకు ఎదురవుతున్న యీ విపత్కర సంఘటనను ఎదుర్కొని నిలవడం, ఒకరి కొకరు సానుభూతితో సమన్వయంతో సహకారాన్ని అందించుకుంటూ మానవత్వపు విలువలతో సమాజాన్ని ప్రోక్షించడం యీనాటి మన సమ సమాజ ధర్మం.

కుల మత వర్ణ వర్గ విభేదాలకు అతీతమైన సమసమాజంలో బాధాతప్త హృదయుల మదిలో చెలరేగిన ఆ విషాదానుభవాలను తుడిచివేయడం వారి కన్నీళ్ళు తుడవడం మన అందరి నైతిక బాధ్యత. కాబట్టి నా తెలుగింటి ఆడబడుచులు, అన్నదమ్ములు అందరూ కలిసికట్టుగా ఒక్కటై గుండె దిటవుతో యీ వెతలకు కృంగని ధైర్యంతో సమాజానికి అండగా నిలవవలసినదిగా కోరుతున్నాను.

**మన కృషే మనకు రక్ష కావాలి**
**మన ఆత్మీయతే మనలను పరిరక్షించాలి.**

అందుకే మనందరం కలిసికట్టుగా భయ భీతులు వదిలి, యీ వరద భీభత్సాన్ని వివ్వత్సులై విక్రమించి విజయం సాధించాలని, విహ్వలతప్తమైన సమాజానికి నేను హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

**జై తెలుగునాడు. జైహింద్!**



# నా జీవితం జాతికే అంకితం

**(1989 జనవరి 9, తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా)**

ఆత్మీయత స్పందించి, అనురాగం చిలికించి, మమతల అభిషేకంతో మంగళాశీః పరంపరలందజేస్తున్న మా తెలుగింటి ఆడబడుచులకు –

ఉద్వేగ ఉత్తుంగ తరంగ సదృశంగా, మిన్నంటే ఆవేశంతో స్ఫూర్తిప్రదాతలైన నా తమ్ముళ్లకు –

పచ్చదనాల వెచ్చదనాలతో, సామాజిక క్రాంతికి, సర్వసమతా విక్రాంతికి, ప్రగతి వికాస విధానానికి, వెలుగు దివ్వెలు పడుతున్న సముజ్జ్వల రాజకీయ వారసులకు –

ప్రజాస్వామ్య ప్రాణ ప్రతిష్ఠాపకులైన విజ్ఞాన విధాతలుగా, ప్రజాభిషిక్త, ప్రతిభామూర్తులైన ప్రతినిధి ప్రభావులుగా, రాజకీయ స్రష్టలుగా దేశ భవిష్యత్ ద్రష్టలుగా, ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్షాదక్షులుగా,

మా ఆహ్వానాన్ని మన్నించి, గౌరవించి ఈ మహోత్సవానికి విచ్చేసిన భవ్యులు, దివ్యులు మాన్యమిత్ర మహోదయులకు తెలుగుదేశం ప్రభుత్వం తరఫున, నా తరఫున నమస్సుమ పరీమళమిళిత కృతజ్ఞతాపూర్వక అభినందనలు, అభివందనములు –

జనవరి తొమ్మిదవ తేదీ – ఇది మనకు పండుగ దినం. ప్రజలు చిలికిన విజయాక్షతలతో, ప్రజాస్వామ్య విధాన బద్ధులమై, మా ప్రభుత్వ సేవలు ప్రజలకు అంకితం చేసిన శుభదినం.

"జయీభవ, విజయీభవ" అని తెలుగుతల్లి మంగళాశీస్సులతో తెలుగుదేశం ప్రభుత్వాన్ని ప్రోక్షించిన పర్వదినం.

పటిష్టము, పరిశుద్ధమూ అయిన పరిపాలనా విధానానికి ప్రతిజ్ఞా పూర్వకబద్ధులమై, మా జీవితాలు సేవాకుసుమాలుగా ప్రజలకు సమర్పణం చేసిన సుముహూర్త దినం..

**జనవరి 9 – ఇది మనకు పండుగ దినం. ప్రజలు చిలికిన విజయాక్షతలతో, ప్రజాస్వామ్య విధాన బద్ధులమై, ప్రజలకు అంకితం చేసిన శుభదినం."జయీభవ, విజయీభవ" అని తెలుగు తల్లి మంగళా శీస్సులతో తెలుగుదేశం ప్రభుత్వాన్ని ప్రోక్షించిన పర్వదినం.**

ఇది తమ ప్రభుత్వంగా, తమపాలిటి ప్రజాస్వామ్య వ్యవస్థగా, విశ్వాసముంచి, గౌరవించి నడిపిస్తున్న నా వారికి, నా ఆప్తబంధువులకు, నా ఆత్మీయ ప్రజావాహినీ పెన్నిధికి స్వాగతం, శుభస్వాగతం, సమర్పితం, శతసహస్రమంగళ అభివందన సమర్చనం, ఈనాడు స్వాతంత్ర్య పౌరులుగా, స్వేచ్ఛా జనులుగా, గౌరవ ప్రతిపత్తితో నిండుదనం సంతరించుకున్న భరతజాతిలో ఒకరంగా, యీ గారాబు గౌరవ నిక్షిప్త దీప్తికి కారకులైన, ఆశేష అమర దేశభక్తులకు, స్వాతంత్ర్య సమరయోధులకు శ్రద్ధాంజలులు –

ఈ స్వాతంత్ర్య నావకు చుక్కానిగా, సత్యాహింసల స్ఫూర్తివిధాతగా, నవభారత భవ్య స్వాతంత్ర్య ప్రదాతగా, జాతిని నడిపిన దేశపిత పూజ్య బాపూజీకి జోహార్లు –

ఆనాడు పలికింది ఒక గొంతైనా, మేళవించింది నలబైకోట్ల జనశృతిరవం. ఆలయపుంఖంలో, ఆ ఝంఝూ ప్రభంజనంలో, పునాదులు పెకలించబడి, సప్తసాగర తీరాలుదాటి, ఒడి ఉప్పెనలో పడి కొట్టుకుపోయింది. తెల్ల దొరల నిరంకుశ నియంతృత్వ వలస ప్రభుత్వం, చరిత్రపుటలలో నిలిచిన పేర్లు కొన్నైనా, చిరునామాల గురుతందని ఎందరో, మరెందరో ఆలనాటి స్వాతంత్ర్య సమరజ్వాలల్లో ఆత్మార్పణం చేసుకొన్నారు.

ఈ త్యాగాల ఫలితంగా, 1947 ఆగష్టు 15వ తేదీన, ఢిల్లీ ఎర్రకోట బురుజు మీద, అరుణారుణ కిరణాలలో స్వేచ్ఛా స్వాతంత్ర్య వీచికలలో రెపరెపలాడింది జాతీయ త్రివర్ణ పతాకం. బానిస సంకెళ్లు

బదాబదలు చేసుకున్న జాతి. స్వేచ్ఛాభావనోద్దీపనమైన కొత్త ఆశలతో, సరికొత్త ఆలోచనలతో నింగికి చూచి ఊహించుకున్నది భవిష్యత్తును గురించి –

తరతరాల తలరాతగా, వెనుకబడ్డవారుగా, బలహీన వర్గాలుగా. అంటులేని సొంటులేని, విచక్షణకు రాని, నిర్లక్ష్యం చేయబడ్డ, నికృష్ట నిమ్నజాతులుగా, యుగయుగాలుగా దగాపడ్డ తమ్ముళ్లకు, తమ పూరిగుడిసెల కంతలలో పొటకరించిన భవన సముదాయం: చిరుగుల గంతను విదిలించుకొని కొంగ్రొత్త వలువలు సింగారించుకున్న లక్ష్మీసదృశ సతీసందర్శనం: సంస్కారహీనమై, ధూళిధూసరితమైన మైల విదిలించుకొని, మిలమిలలాడే విజ్ఞాన దీప్తిలో మెరిసిపోయే సంతానం: లేమిపోయి, కలిమి కప్పుకున్న వెచ్చదనం కనిపించింది.

స్వాతంత్ర్య వరప్రసాదంగా పరాయిదేశాల పరపతి మీద ఆధారం చెరిగి పోతుందని, పారిశ్రామిక ప్రగతి నిండుదనం సంతరించుకుంటుందని, కార్మిక శ్రామికస్వేదంతో, ధనం పొంగి తృప్తినిస్తుందని, పల్లెలే దేశానికి పట్టుగొమ్మలన్న నినాదాలకు విధానాలుగా గ్రామీణ వాతావరణం పులకరిస్తుందని, మేధలో అణిగి మణిగి నిద్రాణమైన శాస్త్రవిజ్ఞానం. పచ్చని తోరణమై పెల్లుబికి, దేశ కళ్యాణానికి మంగళారతి పడుతుందని, ప్రగతికి పడగెత్తిన ఆర్థిక విధానం. స్తోమతు పెరిగిన జీవన ప్రమాణం, హెచ్చుతగ్గులు లేక లొచ్చురొచ్చులు లేక, సోదర భావంతో, సమత సమభాగమై పరవళ్లు తొక్కుతుందనీ, అలనాటి సామాన్యుల తలపులలో తళుకు తళుకుమన్నది.

ఎదపొంగి మదిమీటిన వీణానాదంగా కాని ఆ కల ఏమైంది? కేవలం అరచేతి స్వర్గంగా మిగిలిన శుష్కవాగ్దానాలతో, శూన్యహస్తాలతో, అశాంతితో, ఆవేదనతో, మాటల దగాలో, నినాదాల పొలికేకల రొదలో, భిన్న వదనంతో, మిన్నదనంతో, మూగవోయిన బాధతో 35 సంవత్సరాలు సరిపెట్టుకున్నది జాతి, స్వతంత్రం పేరిట సాగిన పరిపాలనలో కడుపులో బిడ్డకు కులం లేదు. గర్భస్థ శిశువుకు గోత్రం తెలియదు.

సమాజపు వ్యత్యాసాల విష వాయువులు సోకినకొద్దీ, నడమంత్రపు విజ్ఞానం వెర్రితలలు వేసినకొద్దీ, స్వార్థ సంకుచిత నియమాలు ముళ్ల కంచెలు నాటినకొద్దీ, వర్గ వ్యత్యాసాలు గుబులుకున్నకొద్దీ, మత విద్రోహాలు అలముకున్నకొద్దీ, వేర్పాటు తత్వాలు విషం కక్కినకొద్దీ, పడగలెత్తినవే మానవ మనుగడకు ద్రోహం చేసిన వికృత విధానాలు, విపరీత సాధనాలు. నక్కజిత్తులతో, నయగారపుటెత్తులతో, కుటిల యుక్తులతో, కుహనాశక్తులతో రాజకీయం చదరంగం ఆడుతున్నప్పుడు ధనదాహంతో మత్తెక్కి స్వార్థం, సంకుచితత్వం, పందెం పెడుతున్నప్పుడు, అధికారలాలసత్వం.

పదవీ వ్యామోహం, పశుబలంతో పగలబడ్డప్పుడు, వోట్ల పేరుతో, నోట్లకట్టలతో, పెత్తందారీ గుత్తాధికారం ప్రజాభీష్టాన్ని పొట్టన బెట్టుకొని, జనం నెత్తిన విశృంఖలంగా సవారీ చేస్తున్నప్పుడు, కళ్లు

మూసుకుపోయిన చీకటి పొరలలో – సామ్యవాదం ఖరీదైన ప్రయోగంగానే కనిపిస్తుంది, అనిపిస్తుంది ఈ సిద్ధాంతానికి విలువ ఖరీదు కాదు – మానవత్వం.

పెరిగిన ఐక్యతతో, తుష్టితో నిండిన మనస్సుతో, ఏక కుటుంబంగా సాగే మనుగడతో, వాంఛారహితమైన సమాదర సోదర మధురభావనంతో ఈ సమాజాన్ని కక్షల కార్పణ్యాల చీలికల ముంపు నుంచి, వెలివేయబడ్డ వితండ విధానాల ముప్పు నుంచి, కాల దోషం పట్టిన వక్ర గతుల గుంపు నుంచి తప్పించడమే దీని చరమాశయం. సూక్తులు – ప్రవచనాలు, ఘోషలు – నినాదాలు, కంటి ఎరుపులు – కడుపు మంటలు అసంతృప్తులు – ఆవేశాలు, ఎదురు తెన్నులు చూసిన లక్ష్యమే ఈ గమ్యం. డబ్బును గడ్డి పరకగా మానవత్వం తృణీకరించగలిగినప్పుడే ఇది సాధ్యం. భేద విభేద భావనలు సమాజ సమైక్యతకే అఘాతం. సాటివారిని తోటి వారిగా గుర్తించకపోవడం, మానవత్వానికే కళంకం.

ప్రజాస్వామ్య హక్కును సరిసమానంగా అనుభవించే పరిస్థితులు కల్పించక పోవడం. స్వార్ధపరత్వానికి నిదర్శనం. కులం పేరుతో తోటివారిని తక్కువగా చూడటం, మానవ దురహంకారానికి, నీతిమాలిన తప్పుడు విధానానికి తార్కాణం. కనుక జాతి సమైక్యతకూ, సమన్వయానికి, సమ భావనకూ సరిసమానతకూ సామ్యవాద సిద్ధాంతమే శరణ్యం. సమవాదం సామ్యవాదం – సమ భావం తెలుగుదేశం – "నా కన్నా – మనదన్నదే మిన్న" ఇదే మా మతం. ఇదే కులం. ఇదే ఆశయం. ఇదే లక్ష్యం.

ఈ భావనల ప్రతిరూపమై, 1982వ సంవత్సరంలో సామ్యవాద సిద్ధాంత స్వరూపమై, వేగుచుక్కగా జీవన నిశిలో మెరిసింది "తెలుగుదేశం', ఆశయాలు, విశ్వాసాలు, ఆచరణలు ముప్పేటగా ముప్పిరిగొని ముడి పెట్టుకున్న ప్రజాస్వామ్య సంకేతంగా, ప్రజా హృదయ సంగీతంగా 1983 సమరసమోత్తుంగ శృంగంగా నిలిచే ఎన్నికల విజయంతో ప్రపంచ రాజకీయ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో సంచలనం సృష్టించింది తెలుగుదేశం. ప్రజలచేత, ప్రజల నుండి, ప్రజల కోసం ఎన్నికైన ప్రజాస్వామ్య పరిపాలనా విధానంగా నూతన శకాన్ని సృష్టించిందీ తెలుగుదేశం.

నాటికీ, నేటికి సమాజంలో మారిన అవసరాలు, సామాన్య ప్రజల సంక్షేమానికి సంకల్పించబడ్డ విధానాలు, వివిధ వర్గాల సమస్యా పరిష్కారాలు, తరతరాల తలరాతగా పేరుకున్న పేదరికాన్ని నిర్మూలించడానికి, ప్రణాళికాబద్దంగా కేటాయింపులు ఏ విధంగా పెంచబడ్డవో – గురుతు లేని, దృష్టికి రాని కొత్త రీతులు. మానవ జీవన వికాస విధానానికి, సమ పద్ధతిలో, ఏ విధంగా సమర్పించబడ్డవో – ఆ ప్రభుత్వ సేవా సంక్షేమమే ఈనాడు జాతికి నేనంకితం చేసే కృషి ఫలితం.

1983వ సంవత్సరంలో మన రాష్ట్ర వార్షిక బడ్జెటు 2500 కోట్లుగా వుంటే, యీనాడది 5000 కోట్లకు పెరిగింది. కృష్ణా, గోదావరి, పెన్న, తుంగభద్రా నదీమతల్లుల శీతల పావనోదక వీచికా తరంగ విహార

పవిత్ర మాగాణంలో 1983వ సంవత్సరంలో వ్యవసాయ రంగానికి 26 కోట్ల 21 లక్షలు అయితే, అది ఈనాడు 66 కోట్ల 69 లక్షలకు పెరిగింది. సస్యశ్యామల పులకితమైన పుడమితల్లి కడుపు పంటకు 1983లో నీటిపారుదలకు, సాగుబడికి 172 కోట్ల 70 లక్షలు అయితే, అది ఈనాడు 512 కోట్ల 50 లక్షలకు పెంపు చేయబడింది. వరదలొచ్చినా, కరువులొచ్చినా కడగండ్లు వడగాడ్పులో కర్షక లోకం కుతకుతమన్నప్పుడు.

అన్నదాతలను ఆదుకోడానికి సగం ధరకే ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు అందించడం – అసలుకు మించిన వడ్డీలతో ప్రకృతి విలయాలలో నలిగి సతమతమౌతున్న రైతన్నల రుణ భారాన్ని నివృత్తి చేయడానికే, సుమారు 80 కోట్ల రూపాయల మేరకు పేరుకుపోయిన వడ్డీని మాఫీ చేయడం జరిగింది.

వ్యవసాయోత్పత్తుల కృషికి అండగా ఒక ఆశ్విక విద్యుచ్ఛక్తికి, నామమాత్రంగా 50 రూపాయలకు ఎక్కడా ఏ దేశంలోనూ లేని చౌకరీతిలో అందించడం. సాగుబడి కొరవడిన మెట్ట క్షేత్రానికి పాతాళగంగను పైకి తెచ్చి, ఆ తల్లి కరుణాకటాక్ష పవిత్ర ప్రోక్షణంతో పంటలు విరియించి, విరగపండింప చేయడమే మా దీక్షాలక్ష్యం. కృషీవలుర కృషిఫల ప్రాప్తికే ప్రభుత్వ కృషి అంకితం.

శాస్త్ర పరిజ్ఞాన శేముషీ ప్రాభవానికి పట్టంగడుతూ, పెట్టుబడులు పెంచుతూ, గనిలో, పనిలో, కార్ఖానాలో, యంత్రభూతాల రొదలో, పొగవారిన బ్రతుకులలో సతమతమౌతున్న శ్రామిక కార్మిక సోదర సంక్షేమ శుభ విధానానికే తెలుగుదేశం సదా సర్వదా అంకితం. ప్రగతి పంటకు మంగళాక్షతలు సంప్రోక్షించే నా తమ్ముళ్ల శ్రేయస్సుకే చట్టపరంగా నిర్వచించిన కార్మిక సంక్షేమ విధానం.

**శాస్త్ర పరిజ్ఞాన శేముషీ ప్రాభవానికి పట్టంగడుతూ, పెట్టుబడులు పెంచుతూ, గనిలో, పనిలో, కార్ఖానాలో, యంత్రభూతాల రొదలో, పొగవారిన బ్రతుకులలో సతమతమౌతున్న శ్రామిక కార్మిక సోదర సంక్షేమ శుభ విధానానికే తెలుగుదేశం సదా సర్వదా అంకితం.**

1983లో భారీ పరిశ్రమల సంఖ్య 390 అయితే అది ఈనాడు 606కు పెరిగింది. ఆనాడు చిన్నతరహా పరిశ్రమలు 37,813 ఉండగా ఈనాడు అవి 58,213గా పెరగడం జరిగింది. ఆనాడు పారిశ్రామికవేత్తలకిచ్చిన రాయితీలతో పోలిస్తే ఈనాడు 143.6 శాతంగా పెరిగిన ప్రోత్సాహం గమనార్హం.

నేటి సాంకేతిక శాస్త్ర పరిజ్ఞాన ప్రయోగాలకు మూలాధారంగా, జీవిత సౌలభ్య వికాస విధానాలకు కాంతిపుంజంగా, వెలుగులు విరజిమ్మే విద్యుత్తు రంగానికి 1983లో 143 కోట్ల 25 లక్షలు మంజూరయితే నేడది 265 కోట్ల 35 లక్షలకు పరిపుష్టినందుకుంది.

పారిశ్రామిక రంగానికి, జీవన ప్రగతికి అవసరమైన విజయవాడ థర్మల్ కేంద్రం – రాయలసీమలో రతనాల దీప్తి కురిపించే ముద్దనూరు విద్యుత్ ప్రాంగణం – తెలంగాణాకు వరంగా రామగుండం విద్యుత్

కేంద్రం – గోదావరీ తీర ప్రాంతాన లభ్యమయ్యే ఇంధనంతో విద్యుత్ ఉత్పాదక యంత్రాల నిర్మాణం – రాష్ట్ర పురోగతికి ప్రభుత్వం పలికిన స్వాగతగీతికాలాప మంగళ నీరాజనం.

సంఘంచేత లేనివారుగా శపించబడి, గుబులుకున్న దిగులు బ్రతుకుతో, దినాలు దుర్భరంగా గడుపుతున్న దురదృష్ట బాధా సర్పదష్టుల సంక్షేమ పథకాలకు 1983లో 129 కోట్ల 63 లక్షలయితే అది యీనాడు పెరిగి 203 కోట్ల 48 లక్షలై ప్రభుత్వ సమర్పిత పారితోషికమయింది.

జాతికి విద్యా వైద్య రంగాలు రెండు నయనాలు. మసకపడక, సునిశితమైన విజ్ఞానస్ఫూర్తితో జాతి దీప్తి ప్రభావితం కావాలి. ఆరోగ్యం వయఃప్రమాణాన్ని పెంచే కాయకల్పమై పరవళ్ళు తొక్కాలి. అందుకే ప్రథమ స్థాపనా గౌరవం రాష్ట్రానికి దక్కించి వైద్య రంగానికి మకుటాయమానమైన ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ ప్రతిష్ఠాపనం. జాతి అలసట మటుమాయం చేయటానికి మండలానికో "ప్రాథమిక ఆరోగ్య కేంద్రం". అందుకే బాలబాలికల రుగ్మతల నివారణకు సంజీవనీ ప్రయోగంగా "తెలుగు చిరంజీవులు సుఖీభవ పథకం".

**వాగ్దేవి కృపాకటాక్ష వీక్షణంతో గాని విజ్ఞాన నేత్రం విడివడదన్నట్టుగా ఆ సరస్వతీ ప్రసన్నతకు అలనాటి 8 విశ్వ విద్యాల యాలతోపాటు ఈనాడు మరొక 4 విశ్వవిద్యాలయాల ప్రభవం జరిగింది.**

అందుకే ప్రజాస్వామ్యం, ప్రజల భాగస్వామ్యంతో పండాలన్న పరమార్థంగా, సహకార రంగంలో వైద్య విస్తరణకు అంకురార్పణం. ఈ రంగానికి వినియోగం 1983లో 120 కోట్లు అయితే అది ఈనాడు 252 కోట్ల 33 లక్షల రూపాయల పెంపందుకుంది.

వాగ్దేవి కృపాకటాక్ష వీక్షణంతో గాని విజ్ఞాన నేత్రం విడివడదన్నట్టుగా ఆ సరస్వతీ ప్రసన్నతకు అలనాటి 8 విశ్వ విద్యాలయాలతోపాటు ఈనాడు మరొక 4 విశ్వవిద్యాలయాల ప్రభవం జరిగింది. భాషా సంస్కృతులకు కాణాచి "తెలుగువిశ్వవిద్యాలయం" వృత్తికి అంతరాయం కలగకుండా, ఎవరు ఏ గూటిలో వున్నా, ఏ దూరాన నుంచైనా, పై చదువులు అధ్యయనం చేయడానికి సుగమ పథ నిర్దేశికం "సార్వత్రిక విశ్వవిద్యాలయం".

శుభశకునాలకు సంకేతాలై, అహరహం ఆశీస్సులు కురియిస్తున్న ఆడబిడ్డలకు ప్రత్యేకమైన వృత్తి విద్యా ప్రధాన విధానంతో పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం. స్వేచ్ఛ లేక, స్వాతంత్ర్యం లేక బిక్కుబిక్కుమంటున్న ఆడబడుచుల జీవితాలకు ఆర్థిక స్తోమతు కలిగించటానికే ఆస్తిలో మగ బిడ్డలతోపాటు సమాన హక్కులు కల్గించి అన్నగా చెల్లెళ్లకు నేనిచ్చిన నా నజరానా (కానుక). వారికి నిర్ణయించబడిన 30 శాతం ఉద్యోగాల ప్రాభవార్హతల సాధనకే జిల్లాకొకటిగా బాల మహిళా ప్రగతి ప్రాంగణం. తోడు పోయి, నీడ లేని నిరాశ్రయ వితంతువులకు పెన్షన్లు ప్రదానం. బ్రిటిష్ నియంతృత్వం తరలిపోయినా, వారు జాతిపై రుద్దిన బానిస

విద్యా విధానం ఇంకా కొనసాగడం దురదృష్టం.

విద్య విజ్ఞాన ప్రదాయిని గాని – బానిస ప్రవృత్తికి ఆలంబనం కారాదు. నిరుద్యోగాన్ని పెంచరాదు. అందుకే విద్యా విధానానికి ప్రభుత్వం చేస్తున్న సంస్కరణం. చిరంజీవులకు సూక్ష్మమై, ఆకర్షవంతమై, ఉత్తేజకరమైన దృశ్య శ్రవణ బోధనా విధానం. విద్యనమ్ముకునే నీచత్వం నిర్మూలించి వ్యాపారాత్మకంగా కుళ్ళిపోయిన దురాచారం కూలగొట్టి క్యాపిటేషన్ పద్ధతి రద్దు చేయడం. ఉన్నత విద్యను, ఏ కొందరికో దత్తం చేయకుండా, సహకార రంగంలో, విద్యార్థుల తల్లిదండ్రుల సంరక్షణకు అప్పగించడం, ప్రభుత్వ విప్లవాత్మక సంకల్పం. చదువుల తల్లికి నివేదనం 1983లో 288 కోట్ల 44 లక్షలయితే, ఈనాడు ఆ వాగ్దేవికి ఆరాధనం 720 కోట్ల 14 లక్షలుగా, మనమంచికే. పరిజ్ఞాన పుష్టికే.

సామాన్య మానవుని మనుగడకు కూడూ, గుడ్డా, నీడా కనీస అవసరాలు. వీటిని సమకూర్చడం ప్రజాప్రభుత్వ ప్రాథమిక ధర్మం. నిత్యసంకల్ప సంసేవనంగా రెండు రూపాయలకే కిలో బియ్యం, ఆ సౌలభ్యంతోపాటు సగం ధరకే చీరలు, ధోవతులు అందించడం, భవంతులు నివాసం – కలిగిన వారి చెల్లుబడే కాదు – పేదవారి అనుభవానికి రావాలి అన్న సమ భావంతోనే బలహీన వర్గాల వారికి, సుమారు 7 లక్షల 60 వేల పక్కా యిళ్ళు నిర్మించి యివ్వడం జరిగింది.

సాలీనా 27.5 లక్షల టన్నుల బియ్యం, సుమారు 1 కోటి 20 లక్షల కుటుంబాలకు పంపిణీ అయితే, 60 లక్షల వస్త్రాలు అక్క చెల్లెళ్లకు, అన్నదమ్ములకు సాలీనా సమర్పించబడుతున్నాయి. బలహీన, బడుగువర్గాల, షెడ్యూల్డు కులాల, తెగల సంక్షేమానికి 1983లో 120 కోట్లు వెచ్చించడం జరిగితే ఈనాడు ఆ సంక్షేమమే 203 కోట్ల 80 లక్షలుగా విస్తృతమయింది.

పేదరికం అవహేళనకు గురి కాకూడదన్న భావంతో వెనుకబడ్డవారికి ప్రత్యేక సౌలభ్యం కలిగించి సామాజికపరమైన న్యాయం దీక్షాబద్ధంగా అందించడం జరిగింది. ఈ దీక్షా పర్యవసానమే రాజకీయ రంగంలో స్థానిక స్వపరిపాలనా సంస్థ ఎన్నికలలో వెనుకబడినవారికి, ఆడబిడ్డలకు, దేశంలో తొలిగా, విప్లవాత్మకంగా స్థానాలు ప్రత్యేకించడం.

దీని పర్యవసానంగా 209 మండలాలు వెనుకబడిన వారికి, 95 మండలాలు ఆడబిడ్డలకు, 159 మండలాలు 14 నుంచి 15 శాతం రిజర్వేషన్లు పెంచబడ్డ షెడ్యూల్డ్ కులాల వారికి, 65 మండలాలలో 4 నుంచి 6 శాతం రిజర్వేషన్లు పెంచబడ్డ షెడ్యూల్డ్ తెగల వారికి కేటాయించడం జరిగింది.

22 జిల్లా పరిషత్తులలో 3 స్థానాలు వెనుకబడ్డ వారికి, 2 స్థానాలు మహిళలకు, 3 స్థానాలు షెడ్యూల్డ్ కులాల వారికి, 1 స్థానం షెడ్యూల్డ్ తెగలవారికి అధ్యక్ష పదవీ సంప్రాప్తం చేయడం జరిగింది. ధన ప్రాబల్యాన్ని రూపుమాపి, స్వచ్ఛమై, నీతివంతమై, రుజువర్తనతతో కూడిన ప్రజాప్రతినిధికి పట్టం కట్టే

అవకాశం కల్గించడానికే దేశంలో, ఎక్కడా, ఎవరూ సాహసం చేయని విప్లవాత్మకమైన ఎన్నికల మార్పు విధానం అమలు చేయాలని ఆలోచనలో ఉంది.

అధికార వికేంద్రీకరణకు వరంగా ఇదివరకు అనుకున్నా ఆచరణకు నోచుకోని మాండలిక రాజ్యాంగ విధానంతో పెత్తనం ప్రజలకే అందివ్వడం: రైతన్నలకు తాకట్ల విధానం తప్పించి సేద్యానికి వినిమయ సౌకర్యాలు సర్వం ఒకేచోట లభించేటట్లు ఏకగవాక్ష విధానం ప్రవేశపెట్టడం – ప్రతిష్ఠాత్మకంగా పాసుబుక్కుల పద్ధతి ఆచరణకు తేవడం – ప్రభుత్వ అభ్యుదయ విధానానికి నిదర్శనం.

ప్రాచీన సంస్కృతీ కళాప్రాభవ విభవానికీ, జాతీయ స్పందనకు పరాకాష్ఠలయి – గత కాలంలో ముక్కలు చేయబడి స్వార్థపరత్వానికి కుక్షింభరత్వానికి భక్ష్యాలైన సాహిత్య, సంగీత, నృత్య, నాటక అకాడమీలన్నింటిని గౌరవంగా ఒకే గూటికి చేర్చడం జరిగింది. సేవా దీక్ష ఫలితంగా, నా కలల పంటగా, ఆశయ సాఫల్యతకు నిదర్శనంగా, తెలుగు జాతి పునరుజ్జీవన కార్యక్రమంలో, పురోగమన యాత్రలో చిరస్థాయిగా నిలచిపోగల జ్ఞాపికలలో, దీపికలలో ఇవి కొన్ని మాత్రం.

విశాల ప్రాతిపదికపై, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని రూపొందించుకొన్న ఈ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు, అభివృద్ధి ప్రణాళికల అమలుకు, ధనం మూలమని మీకు తెలుసు.

నాటికి, నేటికి మన వార్షిక బడ్జెట్ కేటాయింపు ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. అదే నిష్పత్తిలో వివిధ రంగాలలో మనం సాధించిన ఫలితాల అభివృద్ధి సగటున, 200 శాతం నుండి దాదాపు 650 శాతం వరకు చేరి పతాక స్థాయిని అందుకొంది. ఆదాయ, వ్యయాలను సమాంతరంగా, ఒకే తలంలో నిలిపేటందుకు, వనరులను కేటాయింపులను సమతూకంలో సమకూర్చుకునేటందుకు ఈ క్రతు నిర్వహణలో ఎవరికి ఏ కష్టం కలిగించినా పన్నుల భారంతో నొప్పించినా. అది ప్రభుత్వం తొందరపాటు చర్యగా, ద్వేష భావంగా భావించవద్దని, మన్నించమని కోరుతున్నాను. సమాజ సేవకు నన్ను ముందుకు నడిపించి ఆశీర్వదించమని అర్థిస్తున్నాను.

మేడలలో, మిద్దెలలో, కొరత లేని, వెలితి కాని జీవన సౌభాగ్యానికి నోచుకున్న అదృష్టవంతులు ఒక మెట్టయినా దిగివచ్చి, అసమ సమాజంలో, కాలే కడుపున, రేగే మంటల వేదనలతో రోదిస్తున్న, అధోజగత్ సహోదరులకు చేయూతనిచ్చి సేద తీర్చగలిగితే, అదే భూతల స్వర్గం. సమత ఫలం–సమతలం. ఆనాడు గాని లేమికి, కలిమికి వున్న విపరీత వ్యత్యాసం, ఉన్న వారికి, లేనివారికి మధ్య పెరిగి పూడ్చలేని అగాధం తొలగిపోదని ప్రభుత్వ భావం. అంబరాన్ని చుంబించే ఆకాశ హర్మ్యాలు, ఆ నీడనే మురికితో, దరిద్రంతో మేలమాడుతున్న పూరి గుడిసెల వికృత దృశ్యాలు, సమ సమాజ సుందర వదనం వికృతం చేసే మాయని మచ్చలు కాగూడదు.

త్యాగం లేని పురోగతి లేదు. మానవత్వానికి – మమతకు మించిన వరం లేదు. ఎన్నో త్యాగాల ఫలితం స్వరాజ్యమయితే, మరెన్నో త్యాగాలతో గాని ప్రజారాజ్యంగా పండదు.

**దేశమనెయెడి దొడ్డ వృక్షం**
**ప్రేమలను పూలెత్తవలెనోయ్**
**నరుల చెమటను తడిసి – మూలం**
**ధనం పంటలు పండవలెనోయ్ –**

అని మహాకవి నోట పలికిన ఈ అక్షర సత్యం – రగలాలి ప్రబోధ గీతమై, మన మదిలో అనునిత్యం – కావాలది జీవిత సత్యం.

**సుఖదుఃఖే సమే కృత్వా**
**లాభాలాభౌ జయాజయౌ.**
**తతో యుద్ధాయ యుజ్యస్వ**
**నైవం పాపమవాప్స్యసి.**

నా ధర్మ నిర్వహణా దీక్షకు నా తెలుగు వేలుపులు ఆనాడు ప్రతిస్పందించి పలికిన జయజయధ్వాన రవళి నిర్దేశకమే ఈనాటి కృత సేవాసమర్పణం.

నటజీవితంలో మీ అభిమాన ఆదరణంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాను. పలు భూమికా నిర్వహణంతో వివిధ పాత్రల స్వభావాల వైవిధ్య అనుభూతిని పండించుకోగలిగాను. ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నాను. ఒకప్పుడు పొంగిపోనూ లేదు. మరొకప్పుడు కృంగిపోనూ లేదు.

**నటజీవితంలో మీ అభిమాన ఆదరణంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాను. పలు భూమికా నిర్వహణంతో వివిధ పాత్రల స్వభావాల వైవిధ్య అనుభూతిని పండించుకోగలిగాను. ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నాను.**

ఈ సమాజంలో పలు రకాల వ్యక్తుల మధ్య, ద్వేష మాత్సర్య అసూయల మధ్య విభిన్న ఆలోచనావేశాల మధ్య నలుగుతున్నప్పుడు, ఎదురు తారసిల్లే శక్తులను ఎదుర్కోక తప్పడం లేదు. ఆనాడు ప్రజా విశ్వాసాన్ని కోలుపోయిన దుష్టశక్తులే – మళ్లీ మళ్లీ విజృంభించి ఈ 5 సంవత్సరాల ప్రజాసేవా తపస్సులో శ్రేయోదాయక సమాజానికి పాటుపడుతున్న నన్ను నా ప్రభుత్వాన్ని కూలగొట్టాలని కుట్ర పన్నుతున్నాయి. నీచ నికృష్ట ఆరోపణలతో, సంవిధానాలతో సంఘ విద్రోహానికి పాల్పడి, ధర్మ హానికి తలపడుతున్నాయి.

ఈ పరిణామాలకు మన ప్రతిస్పందన ఏమిటి? కర్తవ్యం ఏమిటి? ఈ 5 సంవత్సరాల కాలంలో నేను సాధించిన పరమార్థం ఏమిటి? చేసిన ఒప్పులేమిటి? తప్పులేమిటి? నాలో నేను చర్చించుకొన్నాను. ఆత్మావలోకనం చేసుకొన్నాను. నా పార్టీలోని గౌరవ సభ్యులందరం మనసు విప్పి మాట్లాడుకున్నాం. మేము

కొన్ని పొరపాట్లు చేసి వుండవచ్చు.

కాని, స్వాతంత్ర్యానంతర కాలంలో ఈ 40 సంవత్సరాల సమయంలో ఈ రాష్ట్రంలోనే కాదు – ఏ రాష్ట్రంలో జరగనంతటి అభివృద్ధిని అనుకున్నంత కాకపోయినా కొంతైనా మనం సాధించాం. సమ సమాజ సమతా విధానంతో పేదరికాన్ని తుడిచిపెట్టడానికి ప్రక్రియలనేకం చేపట్టాం. ఇంకా చేయవలసింది. సంస్కరించవలసింది ఎంతో వుంది.

అవినీతిని తుడిచిపెట్టి. పరిశుద్ధ పరిపాలనా విధానాన్ని అందిస్తానని దీక్షబూనిన నా మీదే అవినీతి ఆరోపణలు కల్పించబడ్డాయి. నన్నూ, నా కుటుంబాన్ని. నా పార్టీని విమర్శించారు. మరి కొంతమంది దుర్భర దూషణలతో నన్ను దీవించారు. ఇవి ఎంతవరకు సమంజసం?

ప్రజాదరణతో బాధ్యత చేపట్టిన నన్ను రాజకీయపరమైన దుర్బుద్ధితో ప్రజలకు దూరం చేయాలన్న కుయత్నాన్నాలు జరిగాయి. జరుగుతున్నాయి. పార్టీలో కలతలు, చీలికలు తేవడానికి దుస్తంత్రాలు నడచాయి. ఈ సంఘటనలను గూర్చి నేను ఆలోచించాను. నా పార్టీ ఆలోచించింది.

**ప్రజాదరణతో బాధ్యత చేపట్టిన నన్ను రాజకీయపరమైన దుర్బుద్ధితో ప్రజలకు దూరం చేయాలన్న కుయత్నా న్నాలు జరిగాయి. జరుగుతున్నాయి. పార్టీలో కలతలు, చీలికలు తేవడానికి దుస్తంత్రాలు నడచాయి. ఈ సంఘటనలను గూర్చి నేను ఆలోచించాను.**

ఈనాడు ప్రభుత్వ ఆహ్వానాన్ని మన్నించి వచ్చిన నా వారు – మీరూ ఆలోచించండి. లక్షలాది రూపాయల ఆదాయాన్ని తృణప్రాయంగా విసర్జించి, విధి ప్రేరణతో ప్రజాసేవకు జీవితాన్ని మళ్లించిన నేను అవినీతికి పాల్పడడమా? నాకు ఈనాడు ఆ అవసరం వుందా?

కాషాయం పవిత్రతకు చిహ్నం. సేవకూ, త్యాగానికి ప్రతి రూపం. ఈనాడు నేను ధరించిన బట్టలను. వాటి రంగు తీరును కూడా అపహసించే దురదృష్టకరమైన అవహేళనకు తలవొగ్గవలసి వచ్చింది. ఇదేనా మన విజ్ఞతా విశేష ప్రాభవమని అప్పుడప్పుడు సిగ్గు పడుతున్నాను. ఇదే మానవ సంస్కారమని కొందరు అనుకొంటే అందుకు నా బాధను, పరితాపాన్ని వ్యక్తం చేస్తున్నాను.

రాగద్వేషాలకు అతీతంగా వున్న నాకు కుటుంబపాలనమనే కుళ్లు అంటగట్టడానికి కుయత్నాలు జరిగాయి. 60 ఏళ్లుగా సాగిన జీవన బంధంలో ఆర్జించినది యావత్తు తండ్రిగా అందరకూ పంచిపెట్టాను.

నా బిడ్డలు పెద్దవాళ్లయ్యారు. వారి బ్రతుకు వారు చూసుకోగల సమర్థులయ్యారు. మమతానుబంధాల ను తెంచుకొన్న నాకు వారిని గూర్చిన ఆలోచనే లేదు.

ఈనాటి నా సమభావ దృష్టిలో వారు మీ కంటే భిన్నం కారు. నా ప్రజలు మీరెంతో నాకు వారూ అంతే. వారిలో ఎవరూ నా పాలనలో జోక్యం కలిగించుకోలేదు, కలిగించుకోరు. ఇక అల్లుళ్ల విషయం. ఇది ఈ

నాటిది కాదు. రాజకీయ జీవితానికి రాకముందు ఏర్పడ్డ బంధం. చంద్రబాబునాయుడు గారు నేను పార్టీ పెట్టక ముందే రాజకీయాల్లో వున్నారు.

ఆనాడు వీరిని పార్టీలో చేర్చుకోవడమా – లేదా అన్న విషయంలో ఏర్పడ్డ శాసన సభ్యుల సంఘం – వారికి పార్టీ పట్ల కలిగిన ఆవేశానుభూతిని, వారి గత అనుభవ ప్రజాసేవా విధానాన్ని గుర్తించి పార్టీలో చేర్చుకొమ్మని సిఫార్సు చేసింది. చంద్రబాబునాయుడు గారు యింతవరకు పార్టీలో కార్యకర్తగా – పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శిగా – పార్టీ క్రమగతిని పాటించారు. పార్టీ అభివృద్ధికి పాటుపడ్డారు.

ఇక డా. వెంకటేశ్వర రావు గారు. నేను ఎంపిక చేసిన వ్యక్తి కాదు. పార్టీ పుట్టుకతో, తమ ప్రాక్టీసును వదలి వచ్చిన కార్యకర్త. ప్రజలు ఎన్నుకొన్న ప్రజా ప్రతినిధి.

కొందరు తెలుగుదేశ ప్రభుత్వానికి రాజకీయ విధానమే లేదని విమర్శిస్తున్నారు. మాది సామ్యవాద సిద్ధాంతమని ఎన్నోసార్లు చెప్పాము. మాకు సమాజమే దేవాలయమనీ–మానవుడే దేవుడనీ భావించాం. సమ సమాజ ఆవిర్భావమే మా లక్ష్యం. సర్వతోముఖ వికాస విధానమైన సమతకు మా సేవ సమర్పణం.

సామ్యవాద సిద్ధాంతమే మాకు శరణ్యం. ఉత్పత్తులు, ఉత్పత్తి సాధనాలు, పంపిణీ విధానాలు, ఆర్థిక అంతస్తులు. వ్యక్తుల పరంగా భిన్నంగా వున్నాయి. ఏనాటికైనా సమిష్టిగా ప్రజలందరి పర్యవేక్షణా పరిధిలోకి అవి రాక తప్పదు. ఈనాడు భూమి మీద మాత్రమే ఒక పరిమితి విధించారు. అదే పరిమితి కోట్లకొలది పెట్టుబడితో నిర్వహిస్తున్న వుత్పత్తి సాధనాలపై కూడ సమాజ ఆధిపత్యమే వుండాలని మేము అనుకొంటున్నాం.

దేశాభివృద్ధికి సంబంధించినంతవరకు మాకు నిర్దుష్టమైన విధానమున్నది. సరైన అవగాహన వున్నది. మనదేశంలో పట్టణాలు వృద్ధి చెందినంత వేగంగా పల్లెసీమలు అభివృద్ధి కాలేదు. పూరి గుడిసెలు కంతలతో కూడిన గంతలుగానే వున్నాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే పల్లె ప్రాంతాలకు సాంకేతిక విజ్ఞానం వ్యాప్తి చెందలేదు. పల్లె ప్రజలు కూడా ప్రగతి అభివృద్ధితో పుష్టి చెందినప్పుడు, ఆర్థిక విధానంతో పట్టణ ప్రజలతోపాటు సర్వ సౌకర్యాలు అన–ుభవించగలిగినప్పుడు గాని, నిజమైన గ్రామీణాభివృద్ధి జరుగదు. నాడు గాని పట్టణ వ్యామోహం పోదు.

ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా చేయాలని ఆలోచిస్తున్నాం. ఈ నమూనా గ్రామంతో సమానంగా రాష్ట్రంలో గ్రామాలన్నీ సింగారించబడాలి. సర్వశోభలు, సౌకర్యాలు సమకూర్చబడాలి. పల్లెసీమలే ప్రజల సౌభాగ్యానికి పట్టుగొమ్మలని పూజ్య బాపూజీ భాషణ మాకు శిరోధార్యం.

1990వ సంవత్సరం అంతంలోగా సమస్యా గ్రామాలన్నిటికి మంచి నీటి సౌకర్యం కలిగించాలని

నిర్ణయం తీసుకొన్నాం. ఈ నిర్ణయానికి ధనాభావం అడ్డురాబోదని మీ ముందు ప్రత్యక్షంగా పలుకుతున్నాను. నిరుద్యోగుల ఉపాధి కల్పనకు అవసరమైనంత కృషి జరగలేదని అంగీకరిస్తున్నాను – బాధపడుతున్నాను.

మన రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి పాటుపడి నిరుద్యోగ సమస్య తీవ్రతను తగ్గించే విధంగా విద్యార్హతలు కల్గినవారిని తగిన ఆర్థిక సహాయమిచ్చి ఆదుకొని, ఆ పారిశ్రామికాభివృద్ధికి నిపుణులు ఆలోచనా సహకారం అందుకుంటున్నాం. ఉద్యోగార్థి అయిన ప్రతి అభ్యర్థికి వెంటనే ఉద్యోగం ఇవ్వలేకపోతున్నప్పటికీ, ఆ పేద విద్యార్థులు అప్లికేషన్ల నిమిత్తం ఖర్చు చేయవలసిన ఫీజు రద్దు చేయాలనుకొంటున్నాం.

ఇంటర్వ్యూలకు వచ్చే అభ్యర్థులకు ప్రయాణ సౌకర్యాన్ని కలిగించాలని ఆలోచిస్తున్నాం. సాధ్యమైనంతగా వనరుల వినిమయంతో, శాస్త్ర విజ్ఞతా వికాసాన్ని జోడించి, వుత్పత్తుల పెంపుకు పాటుపడడమే ప్రభుత్వ విధానం. రానున్న కాలగతిలో అభివృద్ధి కార్యక్రమాలపట్ల ప్రభుత్వం దృష్టిని కేంద్రీకరిస్తుంది. కులం కులమని సతమతమవుతున్న ఈ కుళ్లు రాజకీయాల్లోనే నా కాలం వృధా చేయడం నా అభిమతం. కాదు. ప్రజలు కోరినంత కాలం నేను అధికారంలో వుంటాను.

నా సేవలు కోరే నా ప్రజలను నిరాశపరచను. మూడు ప్రాంతాల నుండి రుజువు చేసుకొన్న నా ప్రాతినిధ్యాన్ని కాదనడానికి ఎవ్వరికీ అధికారం లేదు. ప్రజలే నా ప్రాణం. ప్రజలే నా దైవం. ప్రజలే నా ఊపిరి. ప్రజలే నా సర్వస్వం. ఈనాటి దేశ సమస్యలు కూడా నన్నెంతో కలవరపరుస్తున్నాయి. నేనే కాదు ఈ దేశాన్ని ప్రేమించే ప్రతివారూ ఈ దేశమేమౌతుందోనని కలత చెందుతున్నారు.

**నా సేవలు కోరే నా ప్రజలను నిరాశపరచను. మూడు ప్రాంతాల నుండి రుజువు చేసుకొన్న నా ప్రాతినిధ్యాన్ని కాదనడానికి ఎవ్వరికీ అధికారం లేదు. ప్రజలే నా ప్రాణం. ప్రజలే నా దైవం. ప్రజలే నా ఊపిరి. ప్రజలే నా సర్వస్వం.**

వివిధ రాజకీయ పక్షాల సహకారం కోసం కృషి చెయ్యడం. దేశ సమస్యలకు సమిష్టిగా పరిష్కారం కనుగొనడం కోసమే కానీ స్వార్థ దృష్టితో కాదు.

**ఏ దేశ మేగినా**
**ఎందు కాలిడినా**
**ఏ పీఠమెక్కినా**
**ఎవ్వరెదురైనా**
**పొగడరా నీ తల్లి**
**భూమి భారతిని**

అన్నది మా పరమార్థం కాని స్వార్థం మాత్రం కాదు. నేను ప్రధాని పదవి కోసం ప్రాకులాడుతున్నానని

నా వెనుక ప్రచారం జరుగుతోంది. ఇంతకంటే విష ప్రచారం మరొకటుంటుందా?

దేశ సర్వతోముఖ ప్రగతికి, భవిష్యద్భారత శాస్త్ర పరిజ్ఞాన ఆధిపత్యానికి, స్వతంత్ర ఫలం సర్వులకూ సమంగా అందించడానికి, అవకాశాలు అందరకూ సమంగా పంచి పెట్టడానికి, 72 కోట్ల మంది భారతీయులలో ఒకనిగా నా ఆరాటం ఇది నేరమా? ఈ దేశం నాదనుకోవడం తప్పా?

ప్రస్తుత పరిస్థితులలో జాతీయ స్థాయిలో అన్ని పార్టీలు కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యడమే వుత్తమ పరిష్కార మార్గమని నాకు అనిపిస్తున్నది. ఇలా అనడంలో తెలుగుదేశానికి అధికారం సంపాదించాలన్న స్వార్థం వుందని అనుకోవద్దు. మాకున్న సంఖ్యా బలంతో నిమిత్తం లేకుండా జాతీయ స్థాయిలో, అన్ని రాష్ట్రాలలో ప్రజా బలమున్న రాజకీయ పక్షాలతో సమాన ప్రాతినిధ్యానికి సిద్ధపడతాం. మా రాజకీయ చిత్తశుద్ధికి యింతకంటే ఏం చెప్పగలం?

ఏ ప్రజాబలం నాకు అండగా గుండెగా నిలిచి ఒకనాడు ప్రజాస్వామ్య పరిరక్షణలో నేలకు ఒరగనున్న తెలుగుదేశం జెండాను అంబర చుంబితం చేసిందో – ఏ తెలుగింటి ఆడపడచులు మంగళారతులు సంప్రోక్షణం నా సేవా విధానాన్ని ఆశీర్వదించిందో, నిష్కల్మష శుద్ధబద్ధమైన ఏ చిరంజీవుల జయజయధ్వాన రవళి నన్ను ముందుకు నడిపిందో – ఏ నెత్తురు మండే యువకుల గుండెలు పొంగి, పరవళ్లు తొక్కి నాకు ఆవేశ మిచ్చిందో – ఏ అశేష ప్రజానీక పరమోత్సాహ పూరితసాగర తరంగం నాలో శక్తిని పెంచిందో – అట్టి నా వారికి, నా ఆత్మ వికాస వైభవ ప్రేరకులకు – నా ఆత్మ బంధువులకూ – మీకూ – నా మేధః తపస్సు, సేవాఫలం, ఆత్మగౌరవ దీప్తి విధానం నా సర్వస్వం సర్వదా సర్వధా – శతధా – సహస్రధా సంప్రోక్షితం. అర్పితం. సమర్పితం.

**జై తెలుగునాడు. జైహింద్!**



# అన్నదాతకు కొండంత అండ కర్షక పరిషత్తు

**(గౌ.ముఖ్యమంత్రి యన్.టి.రామారావు గారి ప్రసంగం)**

ప్రభవ అంతరించింది. విభవ ఆవిర్భవించింది. ఈ నూత్నవత్సరారంభ శుభ ఘడియలో, ఈ లేత భానుని పసిడి కిరణాల కాంతులలో ఈ చేదు తీపుల మేలు కలయికల వేప పచ్చళ్ల రుచులతో శ్రీకారం చుట్టుకొన్న ఈ తెలుగు ఉగాది సంప్రోక్షించిన శుభ సందర్భంలో నా తెలుగురైతుకు అభివందనం పలుకుతూ శ్రామిక జాతి చెమట బిందువుకు జయధ్యానం సలుపుతూ యీ రోజు "కర్షక పరిషత్తు"ను తెలుగు రైతాంగానికి అంకితం చేస్తున్నాను.

తరతరాల వ్యవస్థకు భరత వాక్యం పాడుతూ ఒక తెర తొలగిస్తున్నారు. ఈ కర్షక పరిషత్తు నా సుందర స్వప్నం. రైతుబిడ్డగా, నా రైతన్నలకు అందిస్తున్న పచ్చదనాల సిరుల కాణాచి.

ఇది హాలికావళి జీవిత, పంటల పంట.

రైతు శ్రామికుడు, కష్టజీవి. కర్షకుడు మట్టిని పిసికి మాణిక్యాలు సృష్టించే విధాత. హలం పట్టి, కొంగ్ర వేసి, నేల పదును చేసి అన్న ప్రదానంతో కబళమందించే కరుణామయుడు. శ్రమ ఫలం లోకానికిచ్చి,

చాకిరి మిగుల్చుకునే త్యాగజీవి పరగడువుల పస్తులుండే నిస్వార్థజీవి. పేరెత్తి ప్రస్తుతింపబడని తరతరాల నుంచి దగాపడ్డ తమ్ముడు. యుగయుగాల నుంచి ఉపేక్షించబడ్డ ఉదాసీనుడు.

**"అగునా జీవాలు**
**సాగు లోకాలు**
**రాజుగా మనమెంచి**
రైతు జూడక పోతే" అని కవులు ప్రస్తుతించారే అతడూ రైతు.
"మల మల మాడు పొట్ట
తగ మాసిన బట్ట కలంతపెట్టగా" అని దైన్యస్థితికి జాలి పడ్డామే అతడు రైతు.
అన్నదాతనీ, దేశానికి వెన్నెముకనీ, నాయకులు నయవంచనం చేశారే అతడు రైతు.
రైతే రాజని, మహనీయులు కమనీయమైన వాగ్దానాలు కురిపించారే అతడు రైతు.
మాటల్తో, బంధించి,
పాటలో మంత్రించి,
కూతల్లో స్వర్గాన్ని,
చేతల్లో వల్లకాటి దుర్గాన్ని చూపించారే

అతడూ రైతు – మాయా మర్మం తెలియని అమాయకుడు. మౌనం కమ్మిన మునీశ్వరుడు. ఇవ్వడమేగాని పుచ్చుకోవడం తెలియని అభిమానధనుడు. ఆ అన్నదాతకు, ఆ సౌభాగ్య ప్రదాతకి స్వతంత్ర్యం సిద్ధించాక, పరతంత్ర్యం పటాపంచలైనాక, ఈ నలభై ఏళ్ల సుదీర్ఘ స్వప్నాల సందడిలో, ఆ కామందును మరిచామా? దుస్తితి తొలగించామా? ఆ మూగ వేదనతో బాధాతప్త హృదయం చెమర్చిన ఒక్క కన్నీటి బొట్టయినా తుడిచి వేయగలిగామా? అలసిపోయిన బక్కచిక్కిన ఆ బడుగుజీవిని ఓదార్పుతో సేద తీర్చగలిగామా? లేదు. ఈ ప్రశ్నలకు సమాధానం వుండదు. వొరవడ్డ గొంతులో మడతపడ్డ నాలిక మెదలదు.

అతివృష్టి ఒకసారి విసరితే, అనావృష్టి మరోసారి కసరితే, ప్రకృతి యింకోసారి ప్రకోపిస్తే కాలగతి కలసిరాక వక్రిస్తే కొనబోతే కొరివిగా, అమ్మబోతే అడివిగా, దుర్భర ఆర్థిక దావానలం దహించి వేస్తే, అర్థం కానీ, అవగాహనలేని భ్రష్ట నికృష్ట దొరతనాల పెత్తనం కనలేకపోతే – గుడ్డితనాల అధికార బధిరం వినలేక పోతే, పండించిన పంటకు గిట్టుబాటు ధర పలక్కపోతే మధ్య దళారీల దురంతం, స్వార్థం రైతు జీవితం మేసేస్తే – బైర్లు గమ్మిన, ఆ బడుగు బ్రతుక్కి కనిపిస్తుందా దారి?

ఇక ఆ శ్రమ జీవికి బ్రతుకే ఎడారి.

ఎక్కడ జానెడు నల్లరేగడి కనపడితే అదే పబ్బమనుకొని పరుగులెత్తి పరవళ్లు తొక్కే పిచ్చిమారాజు మా తెలుగు రైతు అటుచూస్తే అప్పు – ఇటుచూస్తే ఆకలి ముప్పు. తలవంచనీయని ఆత్మాభిమానం. భవిష్యత్తు అంధకార

బంధురం. కన్న కొడుక్కు చదువు చెప్పించలేదు – గారాబు పట్టికి పెళ్లి చేయలేదు – తాకట్టు లేక బ్రతకలేదు – ఇక్కట్ల కడలిని ఈదలేదు – ఇది కర్మగా సరిపెట్టుకొని నిరీహంగా నిట్టూరుస్తున్నాడు తెలుగురైతు.

**ఏదీ దీనికి పర్యవసానం?**

**ఏదీ దీనికిచ్చే పరిష్కారం?**

**ఎప్పుడు రైతుకు మోక్షం?**

రైతుబిడ్డగా పుట్టిన నేను రాష్ట్రాధినేతగా రైతులకేం చేశాను. తెలుగు రైతుకు సర్వతోముఖ వికాసానికి తెలుగు దేశం ప్రభుత్వం ఏ విధంగా స్పందించింది? కర్షకుని సమగ్ర ఆర్థికాభివృద్ధికి నా ప్రభుత్వం ఏ మార్గం సూచించింది? ఏ బాణం సంధించింది? కృష్ణా, గోదావరి, పెన్న, తుంగభద్ర వాహినుల శీతల జల వీచికా విస్ఫూర్తిలో తెలుగు మాగాణాన్ని సుజలాం, సుఫలాం, మలయజ శీతలాం సస్య శ్యామలాంగా చేయడానికి మా తపస్సును ధారవోస్తున్నాం.

తరాలుగా బీడుపడి, మోడువారిన నీరెక్కని ప్రాంతాలకు ఎత్తిపోతల అడ్డుకట్టల పథకాల ద్వారా భగీరథ ప్రయత్నంలో నీటిని కుమ్మరిస్తున్నాం.

సంపన్న దేశాలలో ఎక్కడా లేనంత చవుకగా వ్యావసాయిక క్షేత్రాలకు ఒక్క ఆశ్విక శక్తిని సాలుకు నామమాత్రంగా యాభై రూపాయలకే విద్యుచ్ఛక్తిని అందిస్తున్నాం.

ప్రకృతి విలయాలతో అసలుకంటే వడ్డీ ఎక్కువై రుణభారం తీర్చుకోలేని రైతన్నకు ఆ వడ్డీ షుమారు 80 కోట్లు పూర్తిగా మాఫీ చేయడం జరిగింది.

అరిష్టాలు సంభవించినపుడు ఆ తాకిళ్లకు నలిగిపోయిన రైతులు మరో పంటతో పునరుజ్జీవాలు కావాలని ఆశించి వారు వినియోగించే విత్తనాలు, క్రిమి సంహారక మందులు దేశంలో ఎక్కడా లేని విధంగా సగం ధరకే లభింపజేయడం జరుగుతోంది.

సామూహిక వ్యవసాయ బావుల నిర్మాణానికి, గొట్టపు బావులు వేసుకోవడానికి – నీరెండిన బావులలో రిగ్గులు వేసి పాతాళ గంగను పైకి తీయడానికి అయ్యే వ్యయంలో 50 శాతం రాయితీ యిచ్చి రైతన్నలకు అండగా నిలబడటం జరిగింది.

ప్రజల భాగస్వామ్యమే, ప్రజాస్వామ్యానికి పరమావధిగా మధ్య దళారీలను తుడిచి పెట్టి, శ్రమదానంతో ప్రభుత్వ ఆర్థిక పుష్టితో గ్రామీణాభివృద్ధి పండాలన్నదే "తెలుగు గ్రామీణ క్రాంతి పథం" ఆంతర్యం.

రైతుకు తాకట్ల బ్రతుకు తప్పించి అన్ని రుణ సౌకర్యాలు వ్యవసాయోత్పత్తి, ఉపకరణాలు ఒకేచోట లభింపచేసే ఆదర్శ సువిధానమే "ఏక గవాక్ష" విధానం.

భూమి లేని వారి నిత్య కృషి సమారాధనకే "తెలుగు మాగాణ సమారాధనం."

సమాజమే మా దేవాలయం. సామాన్య మానవుడే మాకు దేవుడు. నిత్య పస్తులతో పరగడపులుండే ఆ నిరుపేద దేవునికి ఇంత ప్రసాదం పెట్టడమే మా ధ్యేయం. అందుకే ఆ పేదమూర్తికి రెండు రూపాయలకే కిలో బియ్యం మా నైవేద్యం – కుల, మత, వర్ణ, వర్గ రహితమైన దృష్టితో ఇది మా సమర్పణ.

వ్యాపారాత్మక బ్యాంకుల దోపిడి విధానానికి గురై పరాధీనుడైన రైతు బ్రతుకు భారం కాకుండా అతడు తీసుకొనే రుణాలకు ఐదున్నర శాతం వడ్డీ ముదరా నిర్ణయించి 6 శాతం వడ్డీకే యీనాడు సహకార బ్యాంకుల ద్వారా అప్పులందించడం జరుగుతుంది. లాభాలు మెక్కే పెట్టుబడిదారీ గుత్తాధికార వ్యవస్థలను కూకటి వేళ్లతో కదల్చడం జరిగింది.

**వ్యాపారాత్మక బ్యాంకుల దోపిడి విధానానికి గురై పరాధీనుడైన రైతు బ్రతుకు భారం కాకుండా అతడు తీసుకొనే రుణాలకు ఐదున్నర శాతం వడ్డీ ముదరా నిర్ణయించి 6% వడ్డీకే సహకార బ్యాంకుల ద్వారా అప్పులందించడం జరుగుతుంది.**

ప్రభుత్వమున్నది ఉన్నవాడికే కాదు, ప్రాపున్న వాడికేకాదు. పేదవాడి గుడిసె ముందు నిలవాలి. తలుపు తట్టాలి. సమస్య తెలుసుకోవాలి. పేదరి కం తుడిచి పెట్టాలి. కష్టాలు తీర్చాలి – అన్న అధికార వికేంద్రీకరణమే మాండలిక రాజ్యాంగ పరిపాలనా విధానం. పిలిస్తే పలకాలి ప్రభుత్వం.

సన్నిహితత్వంతో పండాలి ప్రజాస్వామ్యం. రాసిందే రాతగా, గీసిందే గీతగా, నీతిమాలిన కలం పోటుతో పేదవారి నుదుటి రాతలు మారుస్తున్న గ్రామాధికార వ్యవస్థను రద్దు చేయడం. నడుం వంగి, జవం చచ్చి బిక్కపోయిన దిక్కులేని వ్యవసాయ కూలీలకు, వితంతువులకు పెన్షన్ సౌకర్యం కలిగించాలి.

వచ్చింది స్వతంత్ర్యం 1947లో, పెడబొబ్బలెత్తింది జాతి కడగట్టిన గుండెతో – వడగట్టి, పారాణి పెట్టిన నెత్తుటితో – ఫలితం అందుకోలేని సామాన్యుడు, సమంగా, సంతుష్టిగా, భాగస్వామ్యం పొందలేని నిర్భాగ్యుడిగా మిగిలాడు. అసంతృప్తితో, ఆవేదనతో, నిర్వేదనతో

దాని ఫలితమే 1983వ సంవత్సరపు చారిత్రాత్మక సంఘటనం – ఆ చరిత్రాత్మక విప్లవ స్ఫూర్తే "తెలుగుదేశం" ఆవిర్భావం. ఆ ఆవిర్భావంలోని మేధస్సు పండిన పంటే యీనాడు ప్రారంభించబడుతున్న "కర్షక పరిషత్తు".

'ఇది రైతుజన బాంధవి'.

దయనీయ స్థితిలో వున్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న అభయ హస్తం. రెక్కాడినా డొక్కాడని రైతన్నల పాలిటి వరం.

ఇది రైతాంగం సంక్షేమం కోసం –

మా మానస వీధిలో వెలిగిన దీపం – ఈ ఉగాది సందర్భాన మేమందిస్తున్న అపూర్వ కానుక. రైతుల కన్నుల్లో వెలుగు దీపిక, కర్షక పరిషత్తు ప్రభుత్వ జోక్యం లేని స్వచ్ఛంద సంస్థ. రైతులకోసం రైతులే ఏర్పరచుకొన్న శ్రేయోబాంధవి ప్రజల భాగస్వామ్యంలో భాగమిది. ప్రజాస్వామ్యానికి భాష్యం యిది.

ఇది కృషీవలురు తమకు తామే నిర్వహించుకునే సర్వతంత్ర స్వతంత్ర్య కృషి విధానం.

ఇది రైతు బాంధవుల కొంగు బంగారమై, ముంగిటి పెన్నిధానమై, తంగేడు పువ్వయి – కల్పతరువై – భవిష్యత్తును పండించే సామ్యవాద, సౌమ్యవాద సిద్ధాంతానికి పునాది కావాలని ఆకాంక్షిస్తూ, రైతన్నలకు ఈ “కర్షక పరిషత్తును” అంకితం చేస్తున్నాను.

**జై తెలుగునాడు. జైహింద్!**




# పేదరికం నిర్మూలనే పరిశ్రమల లక్ష్యం

**(1988 ఏప్రిల్ 11న, రాష్ట్రస్థాయి ప్రభుత్వరంగ సంస్థల సమావేశంలో ముఖ్యమంత్రిగారి ప్రారంభోపన్యాసం)**

ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ బోర్డు ఛైర్మను, వైస్ ఛైర్మను, సభ్యులు, మంత్రివర్గ సహచరులు, స్నేహితులారా,

ప్రభుత్వరంగ సంస్థల ఛైర్మన్లు, చీఫ్ ఎగ్జిక్యూటీవ్‌లు. రాష్ట్రస్థాయిలో జరుపుతున్న ఈ సమావేశంలో నేను కూడా పాల్గొంటున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది. ప్రభుత్వరంగ సంస్థలతో ఇలా సమావేశమవడం నాకు ఇవాళ కొత్త కాదు. దాదాపు అయిదేళ్లనుండి అంటే 1983 నవంబరు నుండి మనం ఇలాంటి సమావేశాలు జరుపుకుంటున్నాం.

కాని ఆనాటి సమావేశానికి నేటి ఈ సమావేశానికి ఎంతో తేడా వుంది. ప్రభుత్వరంగ సంస్థలు పదికాలాలపాటు మనుగడ సాగించేందుకు వీలుగా ప్రభుత్వం ఇచ్చిన కొత్త ఆదేశాలకు సరికొత్త రూపమిస్తూ, ఛైర్మన్లు, ఛీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు ఈ నాటి సమావేశంలో పాల్గొనడం దీనికున్న ప్రత్యేకత. ఎన్నికయిన ప్రతినిధులు, వృత్తిపరమయిన ప్రతిభావంతులు, మేధావులు, సివిలు సర్వీసులోని అధికారులు సమన్వయ భావంతో కలిసికట్టుగా పనిచేసిన నాడే ఆశించిన అభివృద్ధి, సామాజిక వికాసం సమకూరగలదని మనమందరం మరొక్కసారి మననం చేసుకోవాలి.

గతానికి, వర్తమానానికి మధ్య చోటుచేసుకున్న ఈ మార్పులను తెలుసుకోడానికి ఇతర మార్గాలు కూడా ఉన్నాయి.

**నాణ్యత మరింత మెరుగు పడాలన్నదే మన ధ్యేయం. నిరుపేదల సంక్షేమానికే ఈ ప్రభుత్వం పూర్తిగా అంకితమై ఉంది. ఈ లక్ష్యసాధన కోసమే ఈ ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థల కార్యకలాపాలను తగువిధంగా రూపొందించి విస్తృత పరుస్తున్నది.**

గత అయిదేళ్లుగా ప్రభుత్వరంగ సంస్థలను గణనీయంగా విస్తృతపరచామని సగర్వంగా చెప్తున్నాను. గత అయిదేళ్లలో మన పెట్టుబడి స్థాయి పెరిగింది. ఫలితంగా టర్నోవరు కూడా విపరీతంగా పెరిగింది. అయితే అంకెల జోలికి వెళ్లదలచుకోలేదు. ఎందుకంటే వాటి వివరాలు ఎజెండా నోట్సులో ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే. బహుశా ప్రభుత్వరంగ సంస్థల విస్తరణను ఇప్పటి ఈ ప్రభుత్వం జరిపినంత గొప్పగా, మరే రాష్ట్రంలోనూ, ఆ మాటకొస్తే మన రాష్ట్రంలో మరే ప్రభుత్వ కాలంలోను జరగలేదని మీకు సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

కేవలం విస్తరణ ఒక్కటే మన లక్ష్యం కాదు. నాణ్యత మరింత మెరుగుపడాలన్నదే మన ధ్యేయం. నిరుపేదల సంక్షేమానికే ఈ ప్రభుత్వం పూర్తిగా అంకితమై ఉంది. ఈ లక్ష్యసాధన కోసమే ఈ ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థల కార్యకలాపాలను తగువిధంగా రూపొందించి విస్తృత పరుస్తున్నది. చరిత్రలోనే మొట్టమొదటిసారిగా, వినీల విశాల గగన తలాలను స్పృశించే ధనిక గృహాలనే కాకుండా దుర్భర దారిద్ర్యంతో బక్కచిక్కిన బడుగుజీవుల, పేదల ముంగిళ్లను కూడా పిలిచి పలకరించే విధంగా మా ఈ ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలను తీర్చిదిద్దింది. ఈ సంస్థలకు కొత్త నిర్వచనాన్ని ఇచ్చాం.

సరికొత్త జీవవాన్ని పోశాం. కొంగ్రొత్త భావనను తీసుకువచ్చాం. నిండుదనాన్ని నింపాం. ధనిక–పేద అన్న భావం విడనాడి ప్రతివారి ఇంటి తలుపుల్ని తట్టే విధంగా బియ్యం, బట్టలు, గృహనిర్మాణం మొదలగు కార్యకలాపాలను చేపట్టే సంస్థలను తీర్చిదిద్దాం. ఇదొక అపూర్వమైన విజయం మనందరి విజయమని నేనీనాడు మీముందు సగర్వంగా మనవి చేసుకుంటున్నాను. మన, విప్లవాత్మకమయిన ఈ మార్పులకు అహర్నిశలు కృషి సల్పిన వారందరికి ఈ శుభతరుణంలో నా అభినందనలు తెలియచేస్తున్నాను.

ప్రభుత్వరంగ సంస్థలకు, ఈ ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని పరికించినట్లయితే ప్రభుత్వ విధానాలు ప్రగతిపథం వైపుకు ఎలా సాగిపోతున్నాయో మీరు తెలుసుకోవచ్చు. గతంలో ప్రభుత్వరంగ సంస్థలకిచ్చే సబ్సిడీలు, ధనిక వర్గాల జేబుల్లోకి వెళ్లేవి. శ్రమజీవుల పేరు చెప్పుకొని బడాదొరలు తరుచుగా తమ పొట్టల్ని నింపుకొనేవారు. కాని నేటి ఈ ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల ఆశయాలలోనే మౌలికమయిన మార్పులను ప్రవేశపెట్టింది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలలో 90శాతం సబ్సిడీలను ఈనాడు, రాష్ట్రంలోని ప్రభుత్వరంగ సంస్థల ద్వారా పూర్తిగా పేదప్రజల సంక్షేమం కోసమే వినియోగించడం జరుగుతున్నది.

ప్రభుత్వ రంగ సంస్థలు నేరుగా, పేదల ముంగిళ్లకు వెళ్లి ప్రతీ కుటుంబాన్ని పలకరించాలన్నదే మా ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మకమయిన విధానం. ఈ విధానాన్ని సఫలీకృతం చేయడానికి ప్రభుత్వరంగ సంస్థలను సాధనాలుగా ప్రభుత్వం తీర్చిదిద్దింది.

ప్రభుత్వ విధానంలో భాగంగా, ప్రభుత్వరంగ సంస్థలలో, వృత్తి పరమయిన నైపుణ్యాలకు పెద్దపీట వేశాం. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వ్యక్తులు కావలసినపుడూ, తగు సాంకేతిక నైపుణ్యం గలవారు లభించినపుడు, ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ బాధ్యతను వారికప్పగించేందుకు ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడడం లేదు.

విశ్వవిద్యాలయాల నుండీ, ప్రయివేటురంగం నుండీ, ఇతర ప్రభుత్వరంగ సంస్థల నుండి అర్హత గలవారిని తెప్పించుకున్నాం. కొందరు పార్టు-టైం ఛైర్మన్లు అయితే మరికొందరు పూర్తికాలిక ఛైర్మన్లు, మేనేజింగు డైరెక్టర్లుగాను ఉంటున్నారు. మన ఈ ప్రభుత్వరంగ సంస్థలకు మార్గదర్శకత్వం వహిస్తూ, వాటిని ప్రగతి బాటలో ముందుకు తీసికెళ్లేందుకు, మనకు ఎందరో సాంకేతిక నైపుణ్యంగల వ్యక్తులు, పరిణతి చెందిన సివిలు సర్వీసు అధికారులు, మేధావులయిన ప్రజలు ఉన్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది. మనవి వట్టి మాటలుగావు. ఆచరణలో చేసి చూపాం. అదే ప్రత్యక్ష నిదర్శనం.

ప్రభుత్వ విధానాలకు అద్దంపట్టే సాధనాలుగా ఉపయోగపడే ప్రభుత్వరంగ సంస్థల సిద్ధాంతానికి, కార్యాచరణకు ఒక విలక్షణమయిన రూపాన్ని సంతరింపచేసేందుకు ప్రభుత్వం అన్ని రకాలయిన చర్యలు తీసుకున్నది. ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణకు సంబంధించి సక్రమమయిన పద్ధతులను నెలకొల్పడంలో మన రాష్ట్రం అగ్రగామిగా ఉంది. మనం సాధించిన విజయాలను, సత్ఫలితాలను చూచి, దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం కూడా మన విధానాలను అవలంభించేందుకు ఆరాటపడుతున్నాయి.

ప్రభుత్వరంగ సంస్థల రూపురేఖలకు మనం మరో కొత్త అలంకారాన్ని తీర్చిదిద్దాం. అదే సాంకేతిక నైపుణ్యం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ అభివృద్ధి సంస్థ ద్వారా ఎలక్ట్రానిక్స్ రంగాన్ని అన్నివిధాలా అభివృద్ధి పరిచేందుకు ఈ ప్రభుత్వం పూనుకుంది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థలోని పెట్రోలియం రంగంపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసులను నెలకొల్పిన ఘనత మన

ప్రభుత్వానికే దక్కింది. దీనిని ఈనాడు ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. ఈ ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అంకితమయిందని చెప్పడానికి ఇది మరొక నిదర్శనం.

నిర్వహణపరంగా కొన్ని సాధకబాధకాలు కూడా ఉన్నాయి. లాభాలు రాకపోవడం, లెక్కలను తేల్చకపోవడం, సంఘటిత ప్రణాళికను రూపొందించడానికి సంసిద్ధులు కాకపోవడం, వార్షిక బడ్జెటులను తయారు చేయడంలో విపరీతమయిన జాప్యం జరగడం. ఛైర్మన్లు, బోర్డు, ఛీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల మధ్య గిరిగీచిన అధికారాలు, బాధ్యతలు వుండడం, మానవ వనరుల అభివృద్ధికి తగినంత అవకాశం లేకపోవడం వంటి సాధకబాధకాలు ఈ సంస్థల నిర్వహణలో మనకు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితులను చక్కపరచడానికిగాను గత రెండేళ్లుగా, మంత్రిమండలి జారీచేసిన నిర్దిష్టమయిన ఆదేశాల ననుసరించి ఒక ప్రత్యేక ముమ్మర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ ముమ్మర కార్యక్రమం ద్వారా మనం కొంత ప్రగతిని సాధించాం. అంత మాత్రంచేత మనం పూర్తి అభివృద్ధిని సాధించాం అనిగాని, గమ్యాన్ని చేరుకున్నామనిగాని చెప్పడానికి సాహసించలేము.

1983లో, వివిధ ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించిన ప్రాథమిక సమాచారం కూడా ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉండేది కాదు. కాని ఇప్పటి పరిస్థితి వేరు. సమాచార సేకరణతోపాటు నిర్విరామ పరిశీలన గణనీయంగా జరిగింది. ఇందుకు ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ బోర్డును, వారి సిబ్బందిని అభినందిస్తున్నాను. ప్రభుత్వ సంస్థలు, అవసరమయిన సమాచారాన్ని ప్రభుత్వానికి సకాలంలో అందిస్తేనే తప్ప, ప్రభుత్వం తమ విధానాలను అర్థవంతంగా అమలుపరచడానికి వీలుపడదు.

మనం చేసినవన్నీ సక్రమంగానే వున్నాయని అనుకోవడానికి వీల్లేదు. మనం అందరికంటే ముందున్నాం. సరికొత్త భావాలతో ముందుకు సాగుతున్నాం. అయినప్పటికీ మనం చేయవలసింది, సాధించవలసింది ఇంకా ఎంతో వుంది. ప్రభుత్వరంగ సంస్థల సిద్ధాంతం, వాటి పనితీరులో ఇంకా విప్లవాత్మకమైన మార్పు తీసుకురావలసిన సమయం ఆసన్నమయిందని భావిస్తున్నాను. కావలసినంత అనుభవం మనకుంది. కొత్త సవాళ్లను మనం ఈనాడు ఎదుర్కొంటున్నాం.

ఈ ప్రభుత్వం తీసుకున్న చర్యల మూలంగా చేతికి అందిన ఫలితాలు ప్రజల్లో – ముఖ్యంగా పేదప్రజానీకం గుండెల్లో మరిన్ని ఆశలు రేపాయి. వారి ఆశలు పండించడం మన కర్తవ్యం. అందుచేత. నాలో మెదిలే ఆలోచనా స్రవంతి భవిష్యత్తులో ఈ సంస్థలను నడిపించే కరదీపిక కావాలని నా ఆశయం.

ఆ విషయమై ముందుగానే ఈ సదస్సులో చర్చించడం నా ఉద్దేశం కాదు. కాని మన సమాజంలో ప్రభుత్వరంగ సంస్థలు, ప్రశంసాపూర్వకంగా పని చేయాలంటే అవి ఎలాంటి సిద్ధాంతాలను అలవరచుకోవాలో, ఎలాంటి సూత్రాలను పాటించాలో సూచించడం నా విధిగా భావిస్తున్నాను.

ఏ విషయంలోనయినా మన లక్ష్యాలు సుస్పష్టంగా ఉండాలి. ప్రతీ ప్రభుత్వరంగ సంస్థను ఒక నిర్దిష్టమైన లక్ష్య సాధన కోసమే ఏర్పాటు చేయడం జరుగుతున్నది. ఈ ఆశయ సాధనకు మనం పాటుపడుతున్నామా లేదా అని తరచూ ఆత్మ పరిశీలన చేసుకొంటూ ఉండాలి. ఆశయాలను మార్చుకోవలసిన అవసరం ఏర్పడిందని మనం అనుకొంటే వాటిని లక్షణంగా మార్చుకోవచ్చు. కేవలం ఆశయాలలో ఔన్నత్యం ఉంటే సరిపోదు. వాటి సాధనకు చేపట్టే మార్గాలలో కూడా ఔన్నత్యం ప్రస్ఫుటించాలి.

స్పష్టమయిన ఆశయాలు లేకపోవడం, ఉత్పాదకతకు అవసరమయిన అంశాలేమిటో తెలియక అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుండడం, ప్రభుత్వరంగ సంస్థలకు అనేక సమస్యలను తెచ్చిపెట్టాయని నా అభిప్రాయం. ఒక్కొక్క సంస్థను ఒక్కొక్క ఆశయంతో నెలకొల్పిన మాట వాస్తవమే. అయితే మొత్తం మీద ప్రభుత్వరంగ సంస్థల ప్రధాన లక్ష్యాలు ఏమిటో మనకు తెలియనివి కావు.

**3 లక్షల మంది కార్మికుల జీవనోపాధికి రక్షణ కల్పిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఏటా రూ. 300 కోట్ల నష్టంతో ఖాయిలా పరిశ్రమలను ఎందుకు నడుపుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ప్రయివేటు వ్యక్తుల దోపిడీ విధానంవల్ల నష్టాలు ఏర్పడ్డాయి.**

దేశంలోని పేద ప్రజానీకం ఆర్తిని తీర్చడమే ప్రభుత్వ సంస్థల ప్రథమ కర్తవ్యం. సామాజిక బాధ్యతల గురించి ఏదో మాట్లాడుతుంటారు. మూడు లక్షల మంది కార్మికుల జీవనోపాధికి రక్షణ కల్పిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఏటా రూ. 300 కోట్ల నష్టంతో ఖాయిలా పరిశ్రమలను ఎందుకు నడుపుతున్నదో సులభంగా అర్థం చేసుకోవచ్చు. స్వార్థపరులయిన ప్రయివేటు వ్యక్తుల దోపిడీ విధానంవల్ల ఈ నష్టాలు ఏర్పడ్డాయి. ఈ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కార్మికులను పావులుగా ఉపయోగించుకొనడం జరుగుతున్నది.

వాస్తవానికి, సమాజపరంగా తమకు కొన్ని బాధ్యతలున్నాయని, అందువల్ల తమకు నష్టాలు వాటిల్లుతున్నాయని అనేక ప్రభుత్వ రంగ సంస్థలు చెప్పుకొంటున్నాయి. స్కూటర్లు, స్టీలు, ట్రక్కులు వంటి ఉత్పాదక రంగానికి చెందిన ప్రభుత్వరంగ సంస్థలకు నష్టం వస్తున్న సంగతి నాకు తెలుసు. పేదల కడుపులు కొట్టడం, శ్రామికుల రక్తం దోచుకోవడం, మనల్ని మనం వంచించుకోవడం వంటి విధానాలకు స్వస్తి చెప్పవలసిన తరుణం ఈనాడు ఆసన్నమయినది. పేద ప్రజలపట్ల తమ సముచిత కర్తవ్యాన్ని నిర్వర్తించడమే ఈ సంస్థల ప్రాథమిక సూత్రం అని నేను నిర్వచిస్తున్నాను..

మన పిల్లలకు, మన భావితరాల వారికి ఉజ్వలమైన భవిష్యత్తును మనం కల్పించాలి. మనందరం గర్వించే విధంగా రాష్ట్రాన్ని మనం ముందుకు తీసుకుపోవాలి. వ్యయప్రయాసల కోర్చి అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానం మీద శ్రద్ధ చూపవలసిన బాధ్యత ప్రజలమీద – ముఖ్యంగా ప్రభుత్వరంగ సంస్థల మీద ఉంది. మనం ఆశాజీవులం. భవిష్యత్తు మీద ఆశలు పెంచుకొని కలలు కంటుంటాం. అందుకోసమే అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాలను వినియోగించుకొని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్సు అభివృద్ధి, సంస్థ

వంటి సంస్థలకు ప్రాధాన్యం ఇచ్చి విస్తృతపరిచాం. పాలనా వ్యవహారాలకు సంబంధించిన అన్ని అంశాలలో కూడా వినూత్నమయిన పద్ధతులను ప్రవేశపెట్టాలన్నదే మా సంకల్పం. ఈ ఉద్దేశంతోనే మన ప్రభుత్వం 'టెక్నాలజీ సర్వీసెస్' అనే ప్రత్యేక సంస్థ నొకదానిని ప్రారంభించింది.

ప్రభుత్వరంగ సంస్థలు, తాము ఏయే రంగాలలో అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టి, వాటిని అభివృద్ధి పరచాలి అన్న విషయంలో, ఈ వ్యాపార సంస్థల నిర్వహణ బోర్డు క్రియాశీలకమైన నిర్ణయాలు తీసుకుంటుందని నేను విశ్వసిస్తున్నాను.

ప్రభుత్వరంగ సంస్థలు అనుసరించే సాంకేతిక విషయాలపై పరిశోధన జరిపి వాటిని అభివృద్ధి పరచడానికి గల అవకాశాలను కూడా బోర్డు పరిశీలించాల్సి ఉంటుంది. అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో భావితరాల వారికి సేవలు అందించడమే మరో సూత్రమని మీకు సవినయంగా మనవి చేస్తున్నాను.

**ప్రభుత్వరంగ సంస్థలు తమ పనివారి యోగక్షేమాలను కూడా చూడాల్సి ఉంది. ధనికుల అడుగులకు మడుగులొత్తడానికో లేదా ఏ విధంగానయినా ఉద్యోగాలను అంటిపెట్టుకొని పబ్బం గడుపుకోవడానికో ఏర్పడ్డాయన్న అపప్రథ రాకుండా చూచుకోవాలి.**

ప్రభుత్వరంగ సంస్థలు తమ పనివారి యోగక్షేమాలను కూడా చూడాల్సి ఉంది. ప్రభుత్వరంగ సంస్థలు ధనికుల అడుగులకు మడుగులొత్తడానికో లేదా ఏ విధంగానయినా ఉద్యోగాలను అంటిపెట్టుకొని పబ్బం గడుపుకోవడానికో ఏర్పడ్డాయన్న అపప్రథ రాకుండా చూచుకోవాలి. పనివారిని హృదయంలేని పనిముట్లుగా చూడరాదు. వాళ్లు కూడా మానవమాత్రులే అన్న భావం కలగాలి.

ప్రభుత్వరంగ సంస్థలలో వారికి కూడా వాటా ఉండాలి. కేవలం నిర్వహణలోనే కాకుండా యాజమాన్యంలో కూడా పనివారల ప్రమేయం ఉండేటట్లు చూచే ఆదర్శ యజమానిగా ఈ సంస్థలు పనిచేయాలి. ఈ సంస్థల యాజమాన్యాన్ని ఉమ్మడి రంగాలకు మనం పూర్తిగా బదిలీ చేసే రోజు త్వరగా రావాలని ఎదురుచూస్తున్నాను. అంటే యాజమాన్యం, పనివారు, ప్రభుత్వం, ఈ సంస్థల్లో భాగస్వాములుగా ఉండాలి.

సంస్థ స్వభావాన్నిబట్టి దామాషా పద్ధతిలో వీరికి వాటాలుండాలి. మానవ శ్రేయస్సుకోసం, తమ రక్తాన్ని స్వేదంగా మార్చి శ్రమించే నిష్కళంక, నిస్వార్థ కార్మికులే ప్రభుత్వరంగ సంస్థల యజమానులు కావాలన్నది. మరో సూత్రంగా పాటించాలని మీకు సవినయంగా మనవి చేసుకొంటున్నాను.

పని ఎగ్గొట్టి తిరిగే వారికి కాకుండా, చెమటోడ్చి శ్రమించే కార్మిక మిత్రులకు మా మన్ననలెప్పుడూ ఉంటాయని నిర్మొహమాటంగా చెబుతున్నాను. కష్టించి పనిచేసేవారిని ప్రోత్సహించాలన్నదే మన అభిమతం ఉత్పాదకతను బట్టి బోనసు చెల్లించాలి. బోనసు చట్టబద్దం చెయ్యాలనే అర్థరహితమయిన పిడివాదాన్ని

మనపై రుద్దుతున్నారు. ఎక్కువ వేతనాలు ఇవ్వాలనుకుంటే ఆ పనిని మనం నిరభ్యంతరంగా చేయవచ్చు. ఉత్పాదకతను బట్టి, మాత్రమే బోనసును చెల్లించాలి.

ప్రభుత్వ రంగ సంస్థలు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ, తమ పనివారల ఉపాధికి రక్షణ కల్పించాలనే వాదన తరచుగా వింటుంటాం. ప్రభుత్వరంగ సంస్థలు ఉపాధి హామీ పథకాలు కావనే అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారనుకొంటాను. ఆర్థిక భారాన్ని పూర్తిగా విస్మరించి ఏ కొద్ది మంది ఉద్యోగులకో రక్షణ కల్పిస్తూ పోలేం కదా !

వృత్తిపరమైన నిపుణులు, 'జవాబుదారీతనం' అనే మాటకు లేనిపోని అర్థాలను కల్పిస్తూ, స్వార్థచింతనే పనిగా పెట్టుకున్న కొంతమంది వ్యక్తులు ప్రభుత్వరంగ సంస్థల కార్యకలాపాలలో అనవసరంగా జోక్యం చేసుకొంటున్నారు. తాము వాటాదారులకు జవాబు చెప్పాల్సివుంది, అన్న నగ్నసత్యాన్ని ప్రభుత్వ రంగ సంస్థలు తరచుగా మరచిపోవడం జరుగుతున్నదని, 1983 నాటి నా ప్రసంగంలోనే మీకు గుర్తు చేశాను. వాటాదారులంటే ఎవరోకాదు. కాలే కడుపులతో, మండే డొక్కలతో రోజుకోపూటయినా గంజిలేక, దుర్భర దారిద్ర్యంతో మగ్గిపోతున్న కోటానుకోట్ల బడుగుజీవులే వాటాదారులు. ప్రభుత్వరంగ సంస్థలు ఈ మూగజీవులకు జవాబుదారులుగా ఉండాలనే ఆనాడు చెప్పాను.

ఈనాడూ మళ్లీ చెబుతున్నాను. యావత్ ప్రజానీకం ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టింది. నిరంతర పస్తులతో సతమతమవుతూ. బ్రతుకు బరువును లాగుతున్న బడుగుజీవుల ప్రయోజనాలను పరిరక్షించే నిమిత్తం ప్రభుత్వం, ఈ సంస్థల పనితీరును గమనించవలసిన అవసరం ఉంది. ఛైర్మన్లు, డైరెక్టర్లు ప్రభుత్వం నామినేటు చేసి పంపిన వ్యక్తులు గనుక, ప్రభుత్వ ప్రయోజనాలను పరిరక్షించడం వారి ప్రథమ కర్తవ్యం.

ఇక 'స్వయం ప్రతిపత్తి' గురించి రెండు మాటలు మాకు స్వయం ప్రతిపత్తి కావాలంటూ ప్రభుత్వరంగ సంస్థలు ప్రభుత్వాన్ని అదేపనిగా అడుగుతున్నాయి. అసలు దేనికోసం ఈ స్వయం ప్రతిపత్తి? అనవససరంగా అయినవారందరికి ఉద్యోగాలిచ్చి సంతృప్తి పరచడానికా? సంపన్నులయిన ప్రయివేటు పారిశ్రామికవేత్తల సంస్కృతిని వారి జీవన విధానాలను పుణికి పుచ్చుకోవడానికా? కానేకాదు. ఎన్నటికీ కాదు.

సంక్షేమమే ప్రభుత్వరంగ సంస్థల ధ్యేయం కావాలి. బలహీనవర్గాల ఆర్థిక సహాయ సంస్థ, రోడ్డు రవాణా సంస్థ వంటి ప్రభుత్వ రంగ సంస్థలవల్ల లక్షలాది మంది ప్రజలు నష్టపోతున్నట్లయితే, ఆ సంస్థల కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించవలసి ఉంటుంది. ఐసుక్రీములు తినేవాళ్ల కోసం రిఫ్రిజిరేటర్లను మాత్రమే తయారు చేసే యూనిట్లకు స్వయం ప్రతిపత్తి ఉంటే ఉండనివ్వండి.

తద్వారా లాభాలను ఆర్జించుకోమనండి ఎవరూ కాదనరు. కాని యూనిట్లు మాత్రం ప్రభుత్వాన్ని నిధులు అడగడానికి వీల్లేదు. విచిత్రమేమిటంటే, కొన్ని ప్రభుత్వరంగ సంస్థలు రాష్ట్రప్రభుత్వం నుండి

సబ్సిడీలు తీసుకొని, కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం పన్ను చెల్లించేందుకు తమ స్వయం ప్రతిపత్తిని వినియోగించుకొంటున్నాయి.

ఈ అంశం మీద మన విధానమేమిటో స్పష్టంగా చెప్పనివ్వండి. ఆశయాల ఆధారంగా 'స్వయం ప్రతిపత్తి' నిర్ణయించబడుతుంది. ప్రభుత్వరంగ సంస్థల కార్యకలాపాలలో రాజకీయ జోక్యాన్ని ప్రభుత్వం ఏ మాత్రం సహించదు. ఇకముందు సహించబోదు.

'జవాబుదారీ తనం' 'స్వయం ప్రతిపత్తి వంటి అంశాలమీద మన దృఢవైఖరి 'బాధ్యత' అంటే ఏమిటో నిర్ణయించేందుకు దారితీస్తుంది. ప్రభుత్వరంగ సంస్థలు ఏమి చెయ్యాలో స్పష్టంగా నిర్ణయించాం. విధులను గుర్తించే బాధ్యత ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ మీద ఉంది. అసమర్థులయినవారు తమ దోషాలకు బాధ్యత వహించక తప్పదు.

ఇక 'లాభనష్టాల' విషయానికి వద్దాం ధనార్జన ప్రభుత్వ ధ్యేయం కాదు. అలాగని చూస్తూ చూస్తూ నష్టాలను కొనితెచ్చుకోలేదు. ప్రభుత్వానికి రాబడి చాలామటుకు పన్నుల రూపంలో వస్తుంది. పన్నులలో చాలామటుకు ప్రజలు – ముఖ్యంగా పేదప్రజల కష్టార్జితం నుండి చెల్లించినట్టివే. ఏదేని ప్రభుత్వరంగ సంస్థకు నష్టమొచ్చినప్పుడు "నష్టమెందుకు వస్తోంది? లాభాలు ఎవరు తింటున్నారు? నష్టాలను ఎవరు భరిస్తున్నారు?" అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. నష్టాలను పేదలే భరిస్తారు గనుక నిర్భాగ్య నిరుపేదల సముద్ధరణ కోసమే నష్టాలు వాటిల్లుతున్నట్లయితే అందుకు నా కెలాంటి అభ్యంతరం లేదు. అలా కాకుండా, ఇతర విధంగా ప్రభుత్వరంగ సంస్థల్లో నష్టాలు రావడం కేవలం ఆర్థికపరమైన అవివేకమే కాదు, దానిని సమాజానికి చేసిన ఘోర అపచారంగా భావించాలి.

ఉదాహరణకు భార్యాబిడ్డలను విడిచిపెట్టి, పనికోసం పొట్ట చేతబట్టుకువెళ్లే పేద కార్మికుని నుండి 'అన్‌రిచ్ ' (2000) రెండువేల రూపాయలు వసూలు చేస్తుంది. ధనికుడయిన పారిశ్రామికవేత్త అయిదువందల రూపాయలు మాత్రమే చెల్లించి చేయి దులుపుకుంటున్నాడు. ఫలితంగా దానికి నష్టాలు రాక ఏమొస్తాయి? స్కూటర్లు తయారుచేసి నష్టాలు కొని తెచ్చుకోనేల? మళ్లీ ఆ యూనిట్టును ఊబినుండి పైకి  లాగడానికి మరింత ధనం పొయ్యనేల? దీనివల్ల ఎవరిని ఉద్ధరిస్తున్నాం మనం? అంతగా కార్మికుల సంక్షేమం పట్ల మనకు శ్రద్ధే వున్నట్లయితే, తక్కువ వ్యయంతో వాళ్లని మనం ఆదుకోవచ్చు.

ప్రతీ ప్రభుత్వరంగ సంస్థ, లాభాలు ఆర్జించడానికి ప్రయత్నించాలని మీకు స్పష్టంగా మనవి చేస్తున్నాను. దురదృష్టం కొద్దీ నష్టాలే గనుక వచ్చినట్లయితే, ధనవంతుల పబ్బం గడపడం లేదా సరఫరాదారులకు సాయపడడం, ఆశ్రితులను సంతృప్తి పరచడం వంటి కారణాల మూలంగా కాకుండా, నిరుపేదలకు

చేయూతనివ్వడంలో నష్టాలు తప్పనిసరి అయ్యాయని బాహాటంగా చాటిచెప్పాలి.

ఇదివరకే చితికిపోయిన లేదా దీర్ఘకాలంగా నష్టాల ఊబిలో కూరుకుపోయిన సంస్థల మాటేమిటని మీరు నన్నడగవచ్చు. ప్రతి ప్రభుత్వరంగ సంస్థ స్వయంపోషణ శక్తిని గురించి పరిశీలించవలసిన సమయం ఆసన్నమయిందని భావిస్తున్నాను. నిర్వహించశక్యంకాని, భారీ పరిమాణాన్ని తగ్గించి వాటిని పునరుజ్జీవింప చేయాలి. అక్కరకు రాని యూనిట్లను ఎత్తివేయాలి. నా దృష్టిలో అక్కరకురాని యూనిట్లంటే సంఘంలో నలుగురికి ఉపయోగపడే పనులు చేయకుండా నష్టాలను తీసుకువస్తూ ప్రభుత్వానికి భారంగా తయారయ్యే యూనిట్లని అర్థం. ఉదాహరణకు, మార్క్‌ఫెడ్‌ను మనం కొనసాగించవలసిన అవసరం ఉందా అని అడుగుతున్నాను.

**ప్రభుత్వరంగ సంస్థల పనితీరును సమీక్షించేటప్పుడు అది పొందుతున్న సబ్సిడీలను కూడా మనం పరిశీలించాల్సి వుంది. షెడ్యూలు కులాల వారికిగాని, వెనుకబడిన తరగతుల వారికిగాని ఇచ్చే సబ్సిడీలు కొన్ని ఉన్నాయి.**

విలీనం, పునర్వ్యవస్థీకరణ రద్దు వంటి అంశాలను ఒక పద్ధతి ప్రకారం సమీక్షించాలేగాని ఉద్దేశరహితంగా ప్రభుత్వ రంగ సంస్థలను అంతకంతకు పెంచుకుంటూ పోవడంలో ఏమాత్రం ప్రయోజనం కనపడదని మీకు మనవి చేసుకుంటున్నాను.

ప్రభుత్వరంగ సంస్థల పనితీరును సమీక్షించేటప్పుడు అది పొందుతున్న సబ్సిడీలను కూడా మనం పరిశీలించాల్సి వుంది. షెడ్యూలు కులాల వారికిగాని, వెనుకబడిన తరగతుల వారికిగాని ఇచ్చే సబ్సిడీలు కొన్ని ఉన్నాయి. వీటిని గురించి ఎప్పుడూ చర్చించడం జరుగుతున్నది. అలాంటి బలహీనవర్గాల వారికి సబ్సిడీలు ఇవ్వాలన్నదే మా ఈ ప్రభుత్వ ధ్యేయం. కాని సంపన్నులకు ఉపయోగపడే సబ్సిడీలు ప్రభుత్వరంగ సంస్థలో ఎన్నో ఉన్నాయి. ఇవి పైకి కనిపించవు. ప్రజలకు వీటి విషయం తెలియదు.

డబ్బున్న బడాబాబులకు ఆర్థిక సహాయం చేస్తే దానిని "ఇన్సెంటివ్" అంటారు. అదే పేదలకు చేస్తే 'సబ్సిడీ' అంటారు. మన సమాజం మానసిక పరిపక్వత ఎలాంటిదో తేటతెల్లమౌతున్నది. ఎవరు ఎవరి డబ్బుతో ప్రయోజనం పొందుతున్నారో మనం తెలుసుకోవాలి. ప్రజలే ఈ విషయాన్ని నిర్ణయించాలి.

ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేస్తున్న మరో విషయం దుబారా ఖర్చులు. కార్లమీద కానివ్వండీ, వినోదాల మీద కానివ్వండీ, టెలిఫోన్ల మీద కానివ్వండీ మనం అనవసరమయిన ఖర్చులను మానుకోవాలి. ఈ డబ్బు ఎవరిదోకాదు ప్రజలది. చిన్న చిన్న విషయాలలో కూడా ఖర్చు పెట్టేటప్పుడు అది ప్రజల డబ్బు అనే భావంతో తగు జాగరూకత వహించాలి. మీరీ అంశాన్ని కూడా పరిశీలించగలరని ఆశిస్తున్నాను.

ఇక స్వయం పోషక శక్తికి వద్దాం. తమకు రావలసిన పైకాలను తిరిగి రాబట్టుకోకపోవడం వల్లే,

కొన్ని ప్రభుత్వరంగ సంస్థలు ఖాయిలా పడుతున్నాయి. అనేక బాకీలు వసూలుకాకుండా అలాగే వున్నాయి. వసూళ్లపట్ల, మేనేజర్లు తగు శ్రద్ధ చూపడం లేదన్న కారణంతో మన మీ ప్రభుత్వరంగ సంస్థలను చితికి పోనివ్వరాదు.

అనావృష్టి పరిస్థితులను, పరిశ్రమలకు కావలసిన సాధారణ వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని చూస్తే మన యూనిట్లు సక్రమంగానే పని చేస్తున్నాయని చెప్పవచ్చు. ఏది ఏమయినప్పటికీ మీకు రావలసిన పైకాలను వసూలు చేసేటప్పుడు మెతక వైఖరిని ప్రదర్శించరాదని మీకు మనవి చేస్తున్నాను.

లెక్కలను సరిగా నిర్వహించని సంస్థలు కూడా కొన్ని ఉన్నాయి. వాటి రికార్డులు అధ్వాన్నంగా ఉన్నాయి. లెక్కలను ఖరారు చేయడంలో జాప్యం క్షమార్హం కాదని గుర్తుంచుకోవాలి. అలాగే ఆడిటు కూడా ఒక ప్రధానమయిన అంశం ఇందులో మీరు స్వయంగా శ్రద్ధ తీసుకోవాలి. లెక్కలు ఖరారు చేయకుండా, ఆడిటు పూర్తి చేయకుండా, ప్రజలకు ఏమని సమాధానం చెప్పగలరు?

**అత్యుత్తమమైన సేవలు లభించనపుడు, ప్రమాణాలు దిగజారినపుడు వినియోగ దారులు, ప్రభుత్వరంగ సంస్థలపట్ల భ్రమలు తొలగి నిరాశకు గురవుతుంటారు. వినియోగదారుల సాధకబాధకాలను తెలుసుకోవడానికి, ప్రత్యేక సర్వేలు నిర్వహించాలి.**

ఇక వినియోగదారులను గురించి ఒక మాట చెప్పి నా ప్రసంగాన్ని ముగిస్తాను. అత్యుత్తమమైన సేవలు లభించనపుడు, లేదా వాటి ప్రమాణాలు మరింత దిగజారినపుడు వినియోగదారులు, ప్రభుత్వరంగ సంస్థలపట్ల భ్రమలు తొలగి తరచు నిరాశకు గురవుతుంటారు. వినియోగదారుల సాధకబాధకాలను తెలుసుకోవడానికి, ప్రత్యేక సర్వేలు నిర్వహించ వలసినదిగా ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ బోర్డును కోరాలి. అట్టి సర్వేల ఫలితాలను ఆయా సంస్థల దృష్టికి తీసుకురావాలి. అన్నిటికంటే ముందు వినియోగదారుల అవసరాలను తీర్చడానికి ప్రభుత్వరంగ సంస్థలు చర్యలు తీసుకోవాలి.

ఉపయోగకరమయిన ఎంతో సమాచారాన్ని, విశ్లేషణలను ఎజెండాలో పొందుపరిచారు ఈ ఒక్క రోజులో చర్చించవలసిన అంశాలు ఎన్నోవున్నాయి. సమయం గడచి పోతున్నది. మీ సహనాన్ని పరీక్షించడం భావ్యం కాదు. తీరుబడిగా చర్చించేంత సమయం లేదు. అత్యంత ప్రధాన సమస్యల మీద దృష్టి కేంద్రీకరించి, ఈ కార్యక్రమాన్ని మనమీరోజే పూర్తి చేయాలి. ఈ సదస్సులో పాల్గొంటున్న మీరందరు మీమీ అభిప్రాయాలను స్వేచ్ఛగాను, నిర్మొహమాటంగాను తెలియచేయవలసినదిగా కోరుతున్నాను.

ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణపై వారి అభిప్రాయాలను వ్యక్త పరచడానికి ఆ సంస్థల ఛైర్మన్లు, ఇప్పుడు ఇక్కడ సమావేశమయ్యారు. పథకాల అమలుకు సంబంధించిన సాధకబాధకాలను చర్చించడానికి చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా ఇక్కడ మన ముందు ఉన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థల మధ్య ఎదురయ్యే

సమస్యలను పాలనా వ్యవహార కార్యదర్శులు తెలియజేయవచ్చు. ప్రజలు ప్రభుత్వం మీద ఎలాంటి ఆశలు పెట్టుకున్నారో, ఎటువంటి తీయని కలలను తమ గుండెల నిండా నింపుకున్నారో మా మంత్రివర్గ సహచరులు మీకు తెలియజేస్తారు. వివిధ సాధకబాధకాలకు, సమస్యలకు పరిష్కారం కనుగొనడంలో ఎలాంటి మార్గాల ను అనుసరించాలో ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణ బోర్డు సభ్యులు తెలియచేస్తారు.

ఈ సమాలోచనల ద్వారా రాష్ట్రలో నేటి పరిస్థితులు పట్ల సదవగాహన, భవిష్యత్ కార్యక్రమాల అమలు పట్ల ఒక విధమయిన అంకితభావం మీరు ఏర్పరుచుకోగలరని ఆశిస్తున్నాను. నామటుకు నేను, చర్చల పర్యవసానం కోసం ఆతురతతో ఎదురుచూస్తున్నాను. ఈ వేదిక మీద వ్యక్తమయ్యే అభిప్రాయాలను అత్యంత గౌరవభావంతో పరిగణనలోనికి తీసుకోవడం జరుగుతుందని మీకు హామీ ఇస్తున్నాను. నేటి పేద ప్రజానీకం ఆశల్ని చిగురింపచేసి, రేపటి యువత భవితవ్యానికి బంగారు బాటలు ప్రభుత్వ సిద్ధాంతాలకు వాస్తవ రూపాన్నిచ్చేందుకు దోహదపడే అభిప్రాయాలను కార్యరూపంలో పెట్టడానికి సత్వర చర్యలు చేపట్టడం జరుగుతుందని మీకు సవినయంగా మనవి చేసుకొంటున్నాను.

**జై తెలుగునాడు. జైహింద్!**



# కొమర్రాజు చూపిన మార్గం మనకు ఆదర్శం

**(18-5-1988న తెలుగు విజ్ఞాన సర్వస్వం రెండవ సంపుటి ఆవిష్కరణ సందర్భంగా)**

“తెలుగు విజ్ఞాన సర్వస్వం” అన్న పేరుతో విశ్వకోశ నిర్మాణం చేయటానికి మహనీయులు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు గారు ఉపక్రమించినది 1913లో నేటికి 75 సంవత్సరాలకు పూర్వం. అంతటి దీర్ఘదర్శి కొమర్రాజు వారి నూట పదకొండవ జయంతికి మరొక రకమయిన ప్రాధాన్యం వచ్చింది. అది వారి కృషికి వజ్రోత్సవ సంవత్సరంలో రావటం. ఆ శుభ సందర్భంలో తెలుగు సంస్కృతిపై రెండవ సంపుటాన్ని విడుదల చేయటానికి ఆయత్తమైన తెలుగు విశ్వవిద్యాలయ విజ్ఞాన సర్వస్వ కేంద్రానికి, ఈ డెబ్బై అయిదు సంవత్సరాలలో విజ్ఞాన సర్వస్వ రచనకు అంకితమై కృషి చేసిన పెద్దలందరినీ అభినందిస్తున్నాను.

త్వరలో ముగియనున్న ఈ 20వ శతాబ్దం విశ్వమానవ చరిత్రలో బృహత్పరిణామాలను తెచ్చింది. ఏ మూలనో వున్నమానవులందరినీ ఒకటిగా దగ్గరకు తెచ్చి సంఘటిత మానవ జాతిని నిర్మించింది. వసుధైక కుటుంబం, వసుధైక రాజ్యం అన్న భావనలను అందించింది. మానవ విజ్ఞానపు పరిధులను విశ్వాంతరాళపు పైయంచుల దాకా విస్తరింపజేసింది. సాధారణ జీవిత ప్రమాణాలను, జీవిత శైలులను పూర్తిగా మార్చివేసింది. ఈ శతాబ్ది ఆరంభంలోనే మహాకవి గురజాడ అన్నట్లు “ఎల్ల లోకము లొక్కయిల్లై” మనవలసిన బాధ్యతను ఈ శతాబ్దం విధించింది.

ఇట్టి సందర్భంలో దూరదూర ప్రదేశాలలో నివసిస్తున్న యావత్ప్రజానీకం గూర్చి, వారి జీవన సరళులను గూర్చి, విజ్ఞాన శాస్త్ర, మానవీయ రంగాలలోను, లలిత కళాదులలోను వేర్వేరు దేశాలలోను సాధించిన ఘన విజయాలను గూర్చి ప్రతి ఒక్కరూ సాధారణ అవగాహన పెంపొందించుకోవలసిన అవసరం వున్నది. ఆ అవసరం తీర్చేదే విజ్ఞాన సర్వస్వ రచనా ప్రణాళికా భావన.

సుమారు మూడు సంవత్సరాలకు పూర్వం మా ప్రభుత్వం "తెలుగు విశ్వవిద్యాలయం" నెలకొల్పాలని నిర్ణయించినపుడు ఆ నూతన విశ్వవిద్యాలయం తెలుగు ప్రజల విజ్ఞాన వికాసానికి దోహదం చేసే విశిష్ట సంస్థ కావలెనని భావించడం జరిగింది. వివిధ రంగాలలో జరుగుతున్న వికాస కృషిని ఏకోన్ముఖం చేసి, లక్ష్య సాధన చేయవలెనని ఊహించటం జరిగింది.

కనుకనే దేశ స్వాతంత్ర్యం వచ్చిన వెనువెంటనే అధునిక విజ్ఞాన వాహినిగా తెలుగు భాషను తీర్చవలె నన్న సంకల్పంతో విజ్ఞాన సర్వస్వ రచన చేపట్టి, ఆ ప్రణాళికకే అంకితమై నాలుగు దశాబ్దాలు సేవ చేసిన తెలుగు భాషా సమితిని విశ్వవిద్యాలయంలో సంలీనం కావలసిందిగా కోరటం, సమితి విజయవంతంగా నడిపిస్తున్న పెద్దలు, పూజ్యులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారు, డాక్టర్ మోటూరి సత్యనారాయణ గారూ, వారి పూర్వ కార్యవర్గ సహచరులు మా ఆహ్వానాన్ని మన్నించటం జరిగింది.

తెలుగు సంస్కృతిపై వారు తెచ్చిన రెండు ప్రామాణిక సంపుటాలను కాలానుగుణ్యంగా పరిష్కరించి మూడు సంపుటాలుగా వెలువరించటానికి సంకల్పించి, సమితి వారు 1983లో మే 8న నా చేతనే మొదటి సంపుటం విడుదల చేయించారు. ఈ రెండవ సంపుటాన్ని విడుదల చేసి తెలుగు ప్రజలకు సమర్పించే అవకాశం కలిగి నందుకు నాకు ఆనందంగా వున్నది.

తెలుగు సంస్కృతి పై వచ్చిన ఈ సంపుటాలను మొదటి ముద్రణ సమయంలో సంపాదకత్వ బాధ్యత వహించి తీర్చిదిద్దిన ప్రముఖులు, పూజ్యులు మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు, నేలటూరి వెంకటరంగయ్య గారు, మోటూరి సత్యనారాయణ గారు అసాధారణ విజ్ఞాన ధనులు కావటం చేత కాదు, విద్యా విజ్ఞాన రంగాలకు తమ శక్తియుక్తులన్నిటినీ, తత్పరతతో అంకితం చేసిన మహానుభావులు. ప్రజాస్వామ్యానికి విజ్ఞాన విశేషాలు అందించి, వారి అవగాహన శక్తిని పెంపొందింపజేసి సమాజానికి సేవచేయాలన్న సంకల్పంగల విద్యావేత్తలు వీరిని ఈ సంపుటాలను తమ రచనలు అందించిన విద్వరేణ్యులను, వారి కృషిని సమన్వయ పరుస్తూ ఈ ముద్రణ వెలువరించిన అధికారులను నేను హార్దికంగా అభినందిస్తున్నాను.

సాధారణ విశ్వవిద్యాలయాలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులకు పరిశోధకులకు కావలసిన అవసరాలు మాత్రమే తీర్చగలవు. అయితే ఆ పరిధిలోకి రాని సాధారణ పాఠకుల మధ్యకు కూడ ఈ విజ్ఞానం చేరేటట్లు చూచే నైతిక బాధ్యత విశ్వవిద్యాలయాల పైన వున్నది. జటిలమైన పారిభాషిక పదాలను వీలయినంత వరకు పరిహరించి, క్లిష్టమయిన భావనలను సైతం సాధారణ విద్యావంతులకు అవగాహనలోకి తీసుకువచ్చే రచనలు ప్రచురించడానికి విశ్వవిద్యాలయాలు ప్రయత్నం చేయాలి. అందువల్లనే తెలుగు విశ్వవిద్యాలయానికి

రూపకల్పన చేసినపుడు అందులో ప్రచురణ విభాగం వుండాలని, విజ్ఞాన సర్వస్వ కేంద్రం వుండాలని నిశ్చయించడం జరిగింది. ఇందుకు తగిన వనరులు సమకూర్చుకుంటూ తెలుగు విశ్వవిద్యాలయం త్వరలో యిప్పటికంటే పెద్ద ఎత్తున ఈ పాత్ర నిర్వహించగలదని నేను ఆశిస్తున్నాను.

ఈ సభలో ఆసీనులయి వున్న మీరందరూ మీమీ రంగాలలో నిష్ణాతులు, నిరంతర కృషి చేస్తున్నారు. మీ విజ్ఞానం, మీ విద్వత్తు, వాటి ఫలితాలు ప్రజాసామాన్యానికి అందజేసి వారి సగటు విజ్ఞాన అవగాహన స్థాయిలను పైకి ఎత్తటానికి మీరు కృషి చేస్తేనే తప్ప, మీకు ఉన్నత విద్యా, పరిశోధన అవకాశాలు కలిగించిన అ సమాజం పట్ల మీ బాధ్యత, మీ ఋణము తీరవని ఈ సందర్భంగా నేను మనవి చేస్తున్నాను. ఈనాడు కొమర్రాజు వారిని సంస్మరించడానికి కారణం వారు తమకు తెలిసిన దానిని పది మందితో పంచుకుందామన్న తపన, అందుకై ఒక బృహత్ ప్రణాళిక వేసి ఒక మహత్ప్రయత్నం చేసిన విద్వాంసుడు కాబట్టి.

కనుక ఈ శుభ సందర్భంలో కొమర్రాజు వారికి అటువంటి ఇతర మహనీయులకు కృతజ్ఞతాంజలి ఘటించి వారు చూపిన బాటవెంట సాగిపోవలెనని విజ్ఞప్తి చేస్తున్నాను.

**జై తెలుగునాడు. జైహింద్!**



# సమాజమే దేవాలయం

**(14-8-1988న స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా గౌ.ముఖ్యమంత్రి రేడియో, టి.వి. ప్రసంగము)**

నేడు పర్వదినం. పరతంత్ర్య జాతి చిరకాలపు దోపిడీపై చరమగీతం పాడి-శతాబ్దాల బానిస బ్రతుకులపై తెరదించి సగర్వంగా జాతి జయకేతనాన్ని ఎగురవేసిన పండుగ తరతరాల దారిద్ర్యంపై, అంటరానితనంపై, అనారోగ్యంపై, అవిద్యపై యుగయుగాలుగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేకానేక రుగ్మతలపై మడమ తిప్పని, తిరుగులేని పోరాటం ప్రకటించిన చారిత్రాత్మక దినం తనకు తాను బంధ విముక్తునిగా, తన జీవితాన్ని తాను స్వేచ్ఛగా నిర్వహించుకోవాలన్నదే - ఆ సంవిధానం అలవడాలన్నదే స్వాతంత్ర్యానికి నిర్వచనం.

విహంగాలు యథేచ్ఛగా విహరిస్తున్నాయి. స్వచ్ఛమైన గాలి సర్వత్రా వీస్తున్నది. సేలయేళ్లు స్వేచ్ఛగా సాగిపోతున్నాయి. ఇటువంటి స్వేచ్ఛాస్వాతంత్ర్యమే-మానవ సమాజంలో లేకుండా ఒకరిమీద ఒకరు ఆధిపత్యం వహించడం, పెత్తందారీ తనంతో గుత్తాధికారం చెలాయించడం, కులమత వైషమ్యాలతో క్రుంగిపోవడం, ఎప్పటికప్పుడు మరొకరిని బానిసలుగా తమ స్వార్థానికి బలి చేయాలన్నదే ఈ సమాజంలో

ఏర్పడిన అధికార దుర్వినియోగ దుర్విధానం ఆ విధంగా మానవ స్వేచ్ఛను తుడిచిపెట్టే నిరంకుశత్వాన్ని ఎదిరించడమే మానవత్వ మనుగడకు మహోదయం.

ప్రపంచమంతా సుషుప్తావస్థలో వున్నప్పుడు యావద్భారత జాతి ఆనందంతో, కేరింతలతో, అశ్వాసించి మహోత్సవం జరుపుకున్నది ఆగష్టు 14 అర్థరాత్రి ఆనాడు బానిసత్వం నుండి, బ్రిటిష్ నియంతృత్వం నిరంకుశ విధానం నుండి చిరకాలదాస్యం నుండి బానిస శృంఖలాలను తెంచుకుంది. సగర్వంగా, సంతోషంగా – ఈ పండుగను ఏటేటా జరుపుకుంటున్నాం మనం.

ఎంతో ఉద్వేగంతో, ఉత్సాహంతో జాతికోసం జీవితాన్ని బలి చేసుకున్న విప్లవ మూర్తులను, త్యాగాలతో సాహస కార్యాలతో చరిత్ర సృష్టించిన స్వాతంత్ర్య యోధు ను, ఒకసారి స్మరించుకుని, వారిచ్చిన సందేశాన్ని మననం చేసుకుని కర్తవ్యాన్ని నిర్ణయించుకోవడం కోసం ఆగష్టు 15 ను ప్రతి ఏటా పర్వదినంగా జరుపుకుంటున్నాం.

**సాహస కార్యాలతో చరిత్ర సృష్టించిన స్వాతంత్ర్య యోధులను, ఒకసారి స్మరించుకుని, వారిచ్చిన సందేశాన్ని మననం చేసుకుని కర్తవ్యాన్ని నిర్ణయించుకోవడం కోసం ఆగష్టు 15 ను ప్రతి ఏటా పర్వదినంగా జరుపుకుంటున్నాం.**

ఈనాడు 42వ స్వాతంత్ర్యదినోత్సవ శుభ సందర్భంగా, నా మనస్సులో అనునిత్యం పల్లవించి నిత్య చైతన్య స్ఫూర్తిని నాలో రేకెత్తించి, నన్ను కర్తవ్యోన్ముఖంగా నడిపించే నా జాతికి, అడుగడుగునా నన్ను కదిలించి, జాలితో నన్ను కరిగించి, నా జీవితాన్ని సేవామయంగా తీర్చిదిద్దుతున్న నా అఖిలాంధ్ర ప్రజానీకానికి నా హృదయపూర్వక శుభాకాంక్షల్ని తెలియజేస్తున్నాను. మనల్ని మనం పరిపాలించుకునే ప్రజాస్వామ్య విధానంలో అప్పుడే నాలుగు దశాబ్దాలు గడచిపోయాయి.

ఈ నాలుగు దశాబ్దాలలో పంచవర్ష ప్రణాళికల సోపానాలపై అంచలంచెలుగా దేశం పురోగమిస్తున్న కొద్దీ సామాన్యుడు ఇంకా అడుక్కి దిగజారి పోతున్నాడు. దారిద్ర్య రేఖకు దిగువన పేదరికం ఊబిలో కూరుకుపోతున్నాడు. స్వాతంత్ర్యం పండించిన, ప్రగతి ఫలాలను పలుకుబడిగల ఘరానా పెద్దలు తన్నుకుపోతున్నారు. యీ మధ్య కాలంలో దళారి వర్గం అవతరించి అన్ని రంగాలకు విస్తరించి, వికృతంగా వికటాట్టహాసంతో విజృంభించడం మొదలెట్టింది. సంపన్నులు, మరీ సంపన్నులౌతున్నారు. పేదల మరీ నిరుపేదలుగా మిగిలిపోతున్నారు. అందుకే దేశంలో ఈనాడు ఇంత వైరుధ్యం.

ఇంత అసంతృప్తి. జాతిపిత బాపూజీ ఆశించారు, కులమత విద్వేషరహితమైనటువంటి, అంటరానితనానికి దూరంగా ఉన్నటువంటి సమాజం ఆవిర్భవించాలని సామ్యవాద సిద్ధాంతపరమైన స్వాతంత్ర్య ఫలాలు సర్వులకూ సమంగా అందజేయబడతాయని, హెచ్చుతగ్గులులేని సమాజం సృష్టించబడుతుందని, అందరూ ఈ సమాజంలో సరైన భోక్తలుగా, సరైన విజ్ఞాన స్ఫూర్తి కాగలిగిన భవిష్యత్ పౌర విధాతలుగా, భవిష్యత్ భాగ్య విధాతలుగా దేశాన్ని ఉద్ధరిస్తారని ఆశించడం జరిగింది. కానీ జరిగిందేమిటి? సమాజంలో ఎన్నో ఎగుడుదిగుడులు హెచ్చుతగ్గులు.

ఇన్నేళ్ల తరువాత కూడా ఎక్కడ చూసినా కులంపేరిట, మతం పేరిట, భాష పేరిట పెచ్చరిల్లుతున్న వైషమ్యాలు ఏమిటిది? అట్టడుగున వున్న బలహీన బడుగు వర్గాలవారు, గిరిజన, హరిజనులు వెనుకబడిన తరగతులవారు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని కోల్పోతున్నారంటే యింకా హక్కులకోసం నిలదీస్తున్నారంటే పేదరికంతో అలమటించి పోతున్నారంటే దీనికి బాధ్యులెవరు? లోపం ఎక్కడుంది? దీనికి స్వాతంత్ర్యాన్ని తప్పుపట్టడానికి వీల్లేదు. అష్టకష్టాలుపడి మనం తెచ్చుకున్న స్వాతంత్ర్యంలో ఏ లోపమూ లేదు ఉన్న లోపముల్లా మనలోనేవుంది.

అధికారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలు దత్తం చేస్తుంటే అందలం ఎక్కి అంతస్తులో వుండి ప్రజల మాట మరచిపోయే ప్రజాప్రతినిధులే, రాజకీయవేత్తలే, ఆ నాయకులే దీనికి బాధ్యులు. వారే ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకోవాలి. లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారు.

ఇది చరిత్ర నిరూపించిన సత్యం. పేదల కడుపుమంటలలోంచి, శ్రమజీవుల చెమటబిందువులలోంచి, ఆడవారి అశ్రుతర్పణలోంచి, విజ్ఞాన విహీనులుగా, దిక్కులేని వారిగా బ్రతుకుతున్న చిరంజీవుల చల్లని అమాయకపు చిరునవ్వులలోంచి ఆకృతిదాల్చి అఖండమైన, అద్వితీయమైన ప్రజాబలంతో అపూర్వంగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం సమాజమే దేవాలయంగా, నిరుపేదనే దేవుడిగా భావించి, ఆ దరిద్ర నారాయణుడి సేవకే తనను తాను అంకితం చేసుకుంది.

స్వాతంత్ర్యానికి నిర్వచనం ఇవ్వాలన్నదే తెలుగుదేశం ప్రభుత్వ ఆశయం. పూజ్య బాపూజీ కన్న కలలకు వాస్తవ రూపకల్పన చేయడమే తెలుగుదేశ ప్రభుత్వ విధానం గడచిన ఐదేళ్లుగా ఈ దిశగానే మా ప్రయాణం సాగుతోంది: తెలుగుదేశం ప్రభుత్వం అమలు జరుపుతున్న సంక్షేమ కార్యక్రమాలే ఇందుకు తార్కాణం. కూడు గుడ్డ నీడ నిరుపేద కుటుంబానికి అందించడమే మా ప్రభుత్వ విధానం, విధానమే కాదు కర్తవ్యం.

వీటిని పూర్తిగా అమలు జరపడానికి అవసరమైన నిధులుకాని, ప్రత్యేకమైన వసతులుకాని, వనరులుకాని, పూర్తి అధికారాలుకాని మా చేతుల్లో లేనప్పటికీ ఉన్నంతలో ఏ మాత్రం వెనుదీయకుండా, శక్తి లేకుండా విజయవంతంగా యావద్భారత దేశానికి ఆదర్శప్రాయంగా అమలు జరుపుతున్నాం. ఈ విధాన రూపకల్పనే రెండు రూపాయలకే కిలో బియ్యం, సగం ధరకే జనతా వస్త్రాలు, పల్లెల్లో పక్కా ఇళ్లు లక్షలాది మందికి అందజేయడం.

జవసత్వాలుడిగి నిరాధార నిస్సహాయులైన వృద్ధ వ్యవసాయ కార్మికులకు, అండదండలులేక బ్రతుకు భారంగా వెళ్లదీస్తున్న పేద వితంతువులకు నెలనెలా అందిస్తున్న పెన్షన్లు, గర్భిణులైన వ్యవసాయ కార్మిక మహిళలకు ఆర్థిక సహాయం, రెక్కలు ముక్కలు చేసుకునే రిక్షా శ్రామికులకు స్వంత రిక్షా ఏర్పాటు విధానం, ఉచితంగా దుస్తుల పంపిణీ, ఇవన్నీ నిరుపేద బ్రతుకులు బజారుపాలు కాకుండా చూడడానికే. నిరాధార జీవితాలకు ప్రభుత్వం అండగావుందని నిరూపించడానికే.

షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతులవారి బిడ్డలు సంస్కారాత్మకమైన విజ్ఞాన విధాతలుగా కావాలని వారికోసం స్కాలర్ షిప్పులు యివ్వడం, ఆశ్రమ పాఠశాలల్నీ, నివాసిత పాఠశాలల్నీ నెలకొల్పడం, వసతి గృహాల్ని నిర్మించడం పుస్తకాలు, బట్టలు సమకూర్చడం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమం ఎవరైతే సమాజం తమకు ద్రోహం చేసిందని భావిస్తున్నారో అటువంటి నా పేదవారికి, నా ఆత్మీయులకు, నా తమ్ముళ్లకు, నా ఆడబిడ్డలకు, మేలు చేయడమే కర్తవ్యంగా భావించి మండల, జిల్లా పరిషత్తులో కూడా రిజర్వేషన్లు అమలు పరచడం ఈ ప్రజల సామాజిక, రాజకీయ గౌరవ ప్రతిపత్తులను పెంచవలసిన అవసరాన్ని తెలుగుదేశ ప్రభుత్వం గుర్తించడం సమాజంలో ఎక్కడాలేని, చైతన్య విభావరితో కూడిన విప్లవాత్మక సంస్కరణలతో జనాభాలో సగభాగంగా వున్న ఆడపడచుల జీవితాలను పండించే తెలుగుదేశ ప్రభుత్వ విధానమే మగ బిడ్డతోపాటు ఆడ బిడ్డలకు కూడా తల్లిదండ్రుల ఆస్తిలో సమాన హక్కులు కలిగించే శాసన బద్ధమైన చర్య తీసుకోవడం.

ప్రత్యేకంగా పద్మావతి మహిళా విశ్వ విద్యాలయాన్ని ఏర్పరచి గౌరవించడం వారు చేయగలిగిన ఉద్యోగాలలో 30 శాతం వారికే సంక్రమించేటట్టు చేయడం.

తోడుపోయి, నీడలేక అయినవారి అండలేక, దిక్కులేని ఆడ బిడ్డలకు ఆధారంలేని చిరంజీవులకు సరైన వృత్తి విద్యా ప్రాప్తితో స్వతంత్ర్యమైన జీవనాన్ని ప్రసాదించడానికి ప్రతి జిల్లాలో బాల, మహిళా ప్రగతి ప్రాంగణాల్ని ఏర్పరచడం.

ఆత్మ విశ్వాసంతో ఆర్థిక పుష్టితో, స్వయం ప్రతిపత్తితో, స్వంత వ్యక్తిత్వంతో నా ఆడబడుచులు నిలవాలని, బ్రతుకులను పరిమళించుకోవాలని నా ఉద్దేశం.

తెలుగుదేశ ప్రభుత్వనికి రైతన్నల అభ్యుదయం ఎంతో ముఖ్యం దేశానికి వెన్నెముక రైతు సమాజానికి అన్నదాత రైతు.

అహర్నిశలు రెక్కలు ముక్కలు చేసుకుని దేశానికి ఇంత కూడుపెట్టే అన్నదాతలు దిక్కులేక, మొక్కులేక మూగబోయిన కంఠంతో పెగలని వాక్కుతో బాధపడుతూ, బిడ్డకు పెళ్లి చేసుకోలేని, కొడుక్కి చదువు చెప్పించుకోలేని అశక్తిలో కొట్టుమిట్టాడుతుంటే ఆ పరిస్థితి నుంచి వారిని రక్షించడానికి తెలుగుదేశ ప్రభుత్వం అమలు పరుస్తోంది అనేక సంక్షేమ కార్యక్రమాలు.

ఎక్కే గడప, దిగే గడపగా కాకుండా, వారి జీవితమంతా తాకట్ల బ్రతుకులో, తెల్లారి పోకుండా వారిని ఆదుకోవాలన్న సదుద్దేశంతో స్వల్పకాల ఋణాలుగాని, మధ్యకాల ఋణాలుగాని, దీర్ఘకాల ఋణాలుగాని ఎరువులు పురుగు మందులుగాని ఒకే స్థలంలో ఒకే చోట వారికి సంప్రాప్తించే ఏక గవాక్ష విధానాన్ని సహకార బ్యాంకింగ్ వ్యవస్థలో అమలు చేయటం.

సహకార బ్యాంకుల నుండి రుణాలు తీసుకున్న రైతు సోదరులకు దేశ మొత్తంలోనే అతి తక్కువైన 6 శాతం వడ్డీరేటుతో రుణ సౌకర్యం కలిగించడం ఇందుకోసం మన ప్రభుత్వం ఈ పథకం క్రింద 80 కోట్ల రూపాయల కేటాయింపు. పాసుబుక్కుతో ధనవంతులు బేంకుల్లో డబ్బు యిచ్చి పుచ్చుకునే పద్ధతి అవలంభిస్తున్న మాదిరిగా వీరికికూడా అదే గౌరవం సంప్రాప్తించాలని పాసు బుక్కు విధానాన్ని ఏర్పరచడం.

వరదలొచ్చినా, కరువొచ్చినా ఏమాత్రం యిబ్బంది వచ్చినప్పటికీ వారికి ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సగం ధరకే లభింపచేయడం. రెవిన్యూ శిస్తు, తీసివేయడం. సంవత్సరానికి యాభై రూపాయల నామమాత్రపు ధరకే విద్యుచ్ఛక్తిని సంక్రమింపజేయడం విద్యుచ్ఛక్తి ఉత్పత్తి, తగ్గినా దాని ప్రభావం వ్యవసాయంపై పడకూడదని విద్యుత్ కోత లేకుండా చూడడం మైలురాయిగా ఒక అపూర్వమైన కానుక రాష్ట్ర కర్షక పరిషత్తు.

రైతే రాజు కావాలని ఎందరో మహానుభావులు పలికారు. పూజ్య బాపూజీ ఆశించారు. కేవలం పలుకులు కాగితాల మీద రాసిన మాటలుగానే మిగిలిపోయాయిగాని, ఆచరణలోకి రానపుడు నోరు పెగలక బాధపడుతున్న రైతన్నలకు ప్రత్యేకమైన గౌరవం, ప్రత్యేకమైన గుర్తింపు, ప్రత్యేకమైన ఘనత కల్పించాలన్న భావంతో ప్రారంభించిన విప్లవాత్మక, ఆధునిక విధానం కర్షక పరిషత్తు.

**సహకార బ్యాంకుల నుండి రుణాలు తీసుకున్న రైతు సోదరులకు దేశ మొత్తంలోనే అతి తక్కువైన 6 శాతం వడ్డీరేటుతో రుణ సౌకర్యం కలిగించడం ఇందుకోసం మన ప్రభుత్వం ఈ పథకం క్రింద 80 కోట్ల రూపాయల కేటాయింపు.**

రైతులు పండించుకున్న పంటలకు వారే ధరను నిర్ణయించుకోవాలని ప్రత్యేకమైన మార్కెటింగ్ సౌకర్యాలకు వారే ఆధిపత్యం వహించాలని, అభివృద్ధి కార్యక్రమాలను వారే స్వయంగా చేపట్టాలని, ఆహారోత్పత్తిలో, ఉత్పత్తిదారులే ఆధ్వర్యం వహించే ఒక స్వచ్ఛంద, స్వతంత్ర్య ప్రతినిధులుగా వారు రూపొందాలని ప్రభుత్వ యోచన అందుకోసమే యీ కర్షక పరిషత్తు. గ్రామీణ వికాసంలో భాగంగా, గ్రామాలను చైతన్యమయంగా స్వయం సమృద్ధి, నిలయాలుగా తీర్చిదిద్దడం ప్రభుత్వ అభిమతం వివిధ ప్రభుత్వ సేవలన్నింటిని గ్రామీణులకు ఒకేచోట సాధ్యమైనంత సమీపంలో లభింపజేస్తూ, తీసుకున్న నిర్ణయమే 'మాండలిక రాజ్యాంగ విధానం'.

వలసపాలనకు అవశేషంగా మిగిలి నిరుపయోగంగా వున్న గ్రామాధికార్ల వ్యవస్థకు స్వస్తి పలకడం గ్రామ కళ్యాణానికి మార్గం. తెలుగు మాగాణి సమారాధన, సామాజిక అడవుల పెంపకం మంచినీటి సౌకర్యాల కల్పన, రోడ్లు, విద్యుద్దీపాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు గ్రామీణ జీవిత వికాసానికి, అక్కడ వెల్లివిరిసే చైతన్యానికి సంకేతం.

వ్యవసాయం, పరిశ్రమలు మన రాష్ట్రానికి రెండూ రెండు కళ్లు వాడ వాడలా చిన్న చిన్న కుటీర పరిశ్రమలు, గ్రామాల స్వయం సమృద్ధికి కారణాలు. భారీ, మధ్యతరహా పరిశ్రమలు, రాష్ట్ర పారిశ్రామీకరణకే కాదు. ఉపాధి అవకాశాల విస్తరణకు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదకారులు. సాంస్కృతిక, కళారంగాల

పునర్వికాసానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలనేకం. విద్యావ్యాప్తి కోసం యీ 5 ఏళ్లలో 4 విశ్వ విద్యాలయాల అవతరణ. అవే సార్వత్రిక విశ్వ విద్యాలయం, మహిళా విశ్వ విద్యాలయం, ఆరోగ్య వైద్య విశ్వ విద్యాలయం, తెలుగు విశ్వ విద్యాలయం. భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికమీద ఆంధ్ర రాష్ట్రాన్ని మనం సంక్రమింప చేసుకున్నప్పుడు ఇంతవరకు తెలుగు భాషకు సరైన గౌరవం లభించకపోవడం దురదృష్టంగా భావించింది అందుకే తెలుగుదేశం ప్రభుత్వం.


**తెలుగదేలయన్న దేశంబు తెలుగు**
**నేను తెలుగు వల్లభుండ తెలుగొకండ**
**ఎల్లనృపులు గొలువ ఎరుగవే బాసాడి**
**దేశ భాషలందు తెలుగు లెస్స**

అని ఆనాడు శ్రీకాకుళాంధ్ర మహా విష్ణువు నుడివిన తేనెవంటి తియ్యని తెలుగు భాషా వికాసం కోసం, తెలుగు స్ఫూర్తికి, విజ్ఞాన మహోదయానికి లతమానికంగా తెలుగు విశ్వ విద్యాలయం స్థాపనం ఇది తెలుగు జాతికే అంకితం, తెలుగు కళా స్రష్టలకే అంకితం, తెలుగు కళా వికాస విధానానికే అంకితం.

ఇవన్నీ తెలుగుదేశ, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కృషిలో, అభివృద్ధి కృషిలో భాగాలు అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాలుగా రాష్ట్ర రథాన్ని ప్రగతి పథంలో పురోగమింప చేస్తున్న సేవా విధానమిది.

ఈ కృషిలో అలసిపోనీయక, నిత్య నూతనోత్సాహాలను నాలో రేకిత్తిస్తూ, అడుగడుగునా మీరిచ్చిన స్పందనతో, మీరు చూపుతున్న ఆదరణతో ముందడుగు వేస్తున్న నన్ను 'అన్నా' అని ఆత్మీయతతో పలకరించడమే నాకు చాలు. యీ జీవితానికి అదే అండ. అదే నేను కోరేవరం, నా దేవుళ్లు నాకనుగ్రహించే పెన్నిధి, ప్రసాదం నా బొందిలో ప్రాణమున్నంతవరకు ప్రజా సేవలోనే ధన్యత చెందాలనే నా ధ్యేయం. విశ్వాసానికి అర్హుడనని నిరూపించుకోవడమే నా కర్తవ్యం, నా బాధ్యత.

**జై తెలుగునాడు. జైహింద్!**



# చైతన్యోద్దీపనకు కంకణం కడదాం

**(15-8-88న స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం)**

**ఇది నా స్వాతంత్ర్యదిన మహా సంకల్పం
ఇది నా ప్రజలకు నివాళి
స్వతంత్ర్య భారత పతాకానికిది నా అభివాదం
భవిష్యదుజ్జ్వల ధర్మయుగానికి ఆహ్వానం**

ఇది పండుగ రోజు.

ఒకటిన్నర శతాబ్దాల వలస పాలకుల దోపిడీకి చరమగీతం పాడిన పండుగ రోజు తరతరాలుగా పేరుకుపోయిన దారిద్ర్యంపై, అంటరాని తనంపై, అవిద్యపై, యుగయుగాలుగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేకానేక రుగ్మతలపై మడమ తిప్పని, తిరుగులేని పోరాటం విజయం సాధించిన చరిత్రాత్మకమైన రోజు. తన భవిష్యత్తును తాను తీర్చిదిద్దుకుని, తన జీవితాన్ని తాను స్వేచ్ఛగా నిర్వహించుకోవాలన్నదే ఆ సువిధానం అలవడాలన్నదే స్వాతంత్ర్యానికి నిర్వచనం.

యధేచ్ఛగా వినీలాకాశంలో విహరించే విహంగాలవలె, స్వచ్ఛంగా సర్వత్రా వీచే గాలులవలె, స్వేచ్ఛగా సాగిపోయే సెలయేళ్ల వలె మానవ సమాజంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పుష్పించి పరిమళించే రోజు–ఆ రోజే స్వాతంత్ర్యానికి నిజమైన అర్థం, పరమార్థం.

జాతి కోసం, భావితరాల వారికోసం తమ జీవితాల్ని బలి చేసుకున్న విప్లవమూర్తులను, అకళంక దేశభక్తితో, అసమాన త్యాగాలతో, అపూర్వ సాహస స్ఫూర్తితో దేశమాత పాదాలకు తమ గుండె నెత్తురుతో పారాణి దిద్దిన ఉత్తేజమూర్తులను, నిరుపమాన త్యాగదీప్తులను, అకళంక దేశభక్తులను చరిత్ర సృష్టించిన మహనీయులను, మాననీయులను ఒకసారి స్మరించుకొని ముందు కర్తవ్యాన్ని నిర్ణయించుకోవడం కోసం

ఆ భావాల అనుభవాల మధురిమలో ఏటా ఆగష్టు 15వ తేదీని స్వతంత్ర ఉత్సవం జాతి పర్వదినంగా జరుపుకుంటున్నాం – అటువంటి నేటి యీ శుభోదయాన ఈ 42వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుక వేళల్లో నా మనస్సులో అను నిత్యం పల్లవించి, నిత్యచైతన్య స్ఫూర్తిని నాలో రేకెత్తించి, నన్ను కర్తవ్యోన్ముఖంగా నడిపించే నా జాతికి, అడుగడుగునా నన్ను కదిలించి, జాలితో నన్ను కరిగించి నా జీవితాన్ని సేవామయంగా తీర్చిదిద్దుతున్న అఖిలాంధ్ర ప్రజానీకానికి, నాపై అపూర్వాభిమానాలను పరంపరంగా వర్షింపజేస్తున్న మీకందరకూ నా హృదయపూర్వక శుభాకాంక్షల్ని తెలియజేస్తున్నాను.

దేశ స్వాతంత్ర్య సాధనకు అహరహం పరితపించి పరిశ్రమించి, అహింసాయుతమైన ఒక నవీన మార్గాన్ని నిర్దేశించి జాతిని ఒక్క త్రాటిపై నడిపి విజయం సాధించిన పూజ్య బాపూజీ ఆశించారు – కుల మత విద్వేష రహితమైన స్నేహ సమాజాన్ని, అంటరానితనం అనే అంటురోగం అంటని ఐక్య సోదర సమాజాన్ని, సామ్యవాద సిద్ధాంత పరమైన స్వాతంత్ర్య ఫలాలు సర్వులకూ సమంగా పంపిణీ అవుతాయని, ఎగుడు దిగుడులు లేని సమ సమాజం ఆవిష్కరించబడుతుందనీ, ప్రజలంతా దీనిలో సమభోక్తలుగా విజ్ఞాన మూర్తులైన పౌరులుగా, భాగ్యవిధాతలుగా తీర్చిదిద్దబడతారని ఆశించడం జరిగింది కానీ ఒరిగిందేమిటి? సమాజం నిండా ఎన్నో ఎగుడు దిగుడులు, ఎత్తుపల్లాలు, హెచ్చుతగ్గులు. ఇన్నేళ్ల తర్వాత కూడా ఎక్కడ చూసినా కులం పేరిట, మతం పేరిట భాష పేరిట పెచ్చరిల్లుతున్న వైషమ్యాలు – కలహాలు – కార్పణ్యాలు.

ఈ పరిస్థితికి కారణం ఏమిటి? ఈ అనారోగ్య వాతావరణం నెలకొనడానికి కారకులెవరు?

అట్టడుగున వున్న బలహీన, బడుగు వర్గాల వారు, గిరిజన హరిజనులు, వెనుకబడిన తరగతుల వారు ఈ వ్యవస్థ విశ్వాసాన్ని కోల్పోతున్నారంటే, హక్కులకోసం నిలదీస్తున్నారంటే, యింకా పేదరికంలోనే అలమటించి పోతున్నారంటే లోపం ఎక్కడుంది? మనకొచ్చిన ఆ స్వాతంత్ర్యంలోనా? – స్వాతంత్ర్యానికి మనమిచ్చే నిర్వచనం లోనా? మనం అనుసరించే మార్గంలోనా? నిజానికి, అష్టకష్టాలు పడి మనం తెచ్చుకున్న స్వాతంత్ర్యంలో ఏ లోపమూ లేదు. ఉన్న లోపమల్లా మనలోనే వుంది. అధికారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలు దత్తం చేస్తుంటే అందలం ఎక్కి, అంతస్తులో వుండి ప్రజల మాట మరిచిపోయే ప్రజాప్రతినిధులే, రాజకీయవేత్తలే, ఆ నాయకులే దీనికి బాధ్యులు. వారే ప్రజలకు సంజాయిషీ యిచ్చుకోవాలి. లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం నేర్పే రోజొస్తుంది. ఇది చరిత్ర నిరూపించిన సత్యం.

మీకు తెలుసు పేదల ఆకలి మంటలోంచి, శ్రమజీవుల చెమట బిందువులోంచి, ఆడబిడ్డల బాధాతప్తమైన నుని వెచ్చని అశృతర్పణలోంచి, విజ్ఞాన విహీనులుగా దిక్కులేని వారిగా బ్రతుకుతున్న చిరంజీవులు ఎండిన అమాయకపు నవ్వులలోంచి ఆకృతి దాల్చి అఖండమైన, అద్వితీయమైన ప్రజాబలంతో అపూర్వంగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం.. సమాజమే దేవాలయంగా, నిరుపేదనే దేవుడిగా భావించి ఆ నిరుపేద దేవుళ్ళ సేవకే తనను తాను అంకితం చేసుకుంది. గడిచిన అయిదేళ్లుగా యీ సేవలతోనే ప్రయాణం. అమలు జరుపుతున్న ప్రగతి సంక్షేమ కార్యక్రమ విధానాలే ఇందుకు నిదర్శనం– వీటిని అమలు

జరపటానికి అవసరమైన నిధులు కాని, ప్రత్యేకమైన వసతులు గాని, వనరులు గాని, పూర్తి అధికారాలు కాని మా చేతుల్లో లేనప్పటికీ, ఉన్నంతలో ఏ మాత్రం వెనుదీయకుండా శక్తి వంచన భక్తి వంచన లేకుండా సేవాధర్మం, యావద్భారతానికి ఆదర్శప్రాయంగానే ప్రజలిచ్చిన బలంతో, వారుంచిన విశ్వాసంతో లోటుకు చోటు లేకుండా నిర్వహిస్తున్నాం.

ఈ విధాన రూపకల్పనతో కోటి కుటుంబాలకు పైగా రెండు రూపాయలకే కిలో బియ్యం, సుమారు 40 లక్షల మందికి సగం ధరకే జనతా వస్త్రాలు, పల్లెల్లో దాదాపు ఏడున్నర లక్షల పక్కా యిళ్లు – జవసత్వాలుడిగి నిరాధారులుగ నిస్సహాయులుగా జీవిస్తున్న 6 లక్షల వృద్ధ వ్యవసాయ కూలీలకు అండదండలు లేక బ్రతుకు భారంగా వెళ్లదీస్తున్న 55 వేల పేద వితంతువులకు, జీవన చరమ దశలో పేదరికపు ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడే 2 1/2 లక్షల నిరాధార పేద ముదుసలులకు పింఛన్లు – గర్భిణులైన వ్యవసాయ మహిళా కార్మికులకు ప్రసూతి సమయంలో మాసభృతిని అందించడం రెక్కలు ముక్కలు చేసుకునే రిక్షా శ్రామికులకు "స్వంత రిక్షా ఏర్పాటు విధానం".

**ఉన్నంతలో ఏ మాత్రం వెనుదీయకుండా శక్తి వంచన భక్తి వంచన లేకుండా సేవాధర్మం, యావద్భారతానికి ఆదర్శప్రాయంగానే ప్రజలిచ్చిన బలంతో, వారుంచిన విశ్వాసంతో లోటుకు చోటు లేకుండా నిర్వహిస్తున్నాం.**

ఉచితంగా దుస్తుల పంపిణీ – ఇవన్నీ నిరుపేద బతుకులు నిరాదరణ పాలు కాకుండా చూడటానికే యీ సంక్షేమాలు. సంకలను షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతులవారి బిడ్డలు సంస్కారాత్మకమైన విజ్ఞాన విధాతలుగా రూపందుకోవాలనే ఆదర భరితమైన స్కాలర్‌షిప్పుల సంక్రమణం, ప్రగతి బోధనా విధానానికే ఆశ్రమ పాఠశాలల, నివాసిత పాఠశాలల నిర్మితం – నిర్వహణం.

వసతి భవనాలలో, ఉచిత వస్త్రాలలో ఆ పేద ముద్దు బిడ్డలను తీర్చిదిద్దడం పధ్నాలుగు వేల మంది విద్యార్థులకు ప్రయోజనం పంచుతూ, 68 సాంఘిక సంక్షేమ నివాసిత పాఠశాలలు, రెండున్నర లక్షల మందికి ఆశ్రయం పెంచుతూ రెండువేల రెండొందలకు పైగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలు వెరశి రెండున్నర లక్షలకు పైగా షెడ్యూలు కులాల కుటుంబాలకు మేలు కూర్చే కార్యాచరణ క్రమ ప్రణాళికలు – ప్రభుత్వం వెనవడిన ప్రేమతో అట్టడుగున, వెనుకబడిన వ్యవస్థల చైతన్యోద్దీపనకు చేత బెడుతున్న సర్వశ్రేయో సుమర్చన సుమనం ఎవరైతే సమాజంచే, దగా చేయబడి బ్రతుకుతున్నారో అట్టి, నా పేద తమ్ముళ్లకు, ఆత్మీయులకు, ఆడబిడ్డలకు మేలు చేయడమే కర్తవ్యంగా భావించి, మండల జిల్లా పరిషత్తులో కూడా రిజర్వేషన్లు అమలు పరచడం, ప్రజల సామాజిక, రాజకీయ, గౌరవ ప్రతిపత్తుల ను పెంచడం జరిగింది.

అన్నా! "విజయీభవ" అని ఆశీర్వదించి, తెలుగు దేశానికి నిండుదనం, గండుదనంతో విజయశ్రీ వరణం సంప్రోక్షించిన నా చెల్లెళ్లకు నా ప్రాణమే పణం సమాదరణతో, చైతన్య విభావరితో కూడిన విప్లవాత్మక

సంస్కరణలతో జనాభాలో సగభాగమైన ఆడపడుచుల విధానమే – ఆదరువుకు, మగబిడ్డలతోపాటు ఆడబిడ్డలకు కూడా తల్లిదండ్రుల ఆస్తిలో సమాన హక్కులు కలిగించే శాసనబద్ధమైన చర్యా సంక్రమణం. వారి గుర్తింపునకు, గౌరవ ప్రగతికి – ప్రత్యేకంగా పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం. ఉద్యోగాలలో 30 శాతం వారికే సంక్రమింపచేయడం, తోడుబోయి నీడలేని ఆడబిడ్డలకు, చిరంజీవులకు సరైన వృత్తి విద్యా శిక్షణతో స్వేచ్ఛా, స్వతంత్ర్య జీవన సంప్రాప్తికే ప్రతి జిల్లాలో "బాల మహిళా ప్రగతి ప్రాంగణం" ఆత్మ విశ్వాసంతో, ఆర్థిక పుష్టితో, స్వయం ప్రతిపత్తితో, స్వంత వ్యక్తిత్వంతో నా అక్కచెల్లెళ్ల బ్రతుకులు పరిమళించాలనే యీ కాన్కల సమర్పణం. రైతే దేశానికి వెన్నెముక అన్నదాత. ఆ దాత కాడి పన్ని సాలు వేయని నాడు నోటికి ముద్దే అందదు.

**మగబిడ్డలతో పాటు ఆడబిడ్డలకు కూడా ఆస్తిలో సమాన హక్కులు కలిగించే శాసనబద్ధమైన చర్యా సంక్రమణం. వారి గురుతింపుకు, గౌరవ ప్రగతికి, ప్రత్యేకంగా పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం. ఉద్యోగాలలో 30% వారికే సంక్రమింపచేయడం.**

అందుకే ఆ కృషీవలుర సంక్షేమ సంరక్షణం నా ధర్మం, ప్రభుత్వ ధ్యేయం. ఆ ధార్మికులకు, శ్రమజీవనులకు ఎక్కే గడప దిగే గడపగా, వారి జీవితమంతా తాకట్లతోనే తెల్లవారి పోకుండా వారికి గౌరవ ప్రాప్తి కలిగించాలన్న సదుద్దేశంతో స్వల్పకాల, మధ్యకాల, దీర్ఘకాల రుణాలు గాని, ఎరువులు గాని, విత్తనాలు గాని ఒకే చోట సంప్రాప్తికే సహకార బ్యాంకింగ్ వ్యవస్థలో "ఏక గవాక్ష విధానం": ఋణం భారం కాగూడదనే సహకార బ్యాంకుల వడ్డీ, దేశం మొత్తంలోనే అతి తక్కువైన 6 శాతం రేటుతో చెల్లించే సౌలభ్యం కల్గించడం ఇందుకోసమే యీ పథకం క్రింద ప్రత్యేకంగా 80 కోట్ల రూపాయలు కేటాయించడం.

పాసుబుక్కుతో ధనవంతులు లావాదేవీలు జరుపుకున్నట్లుగా రైతుకూ, అ గౌరవమే ప్రాప్తి కావాలని, పాసుబుక్కు విధానాన్ని అమలు పరచడం --

వరదలొచ్చినా, కరువులొచ్చి ప్రకృతి ప్రకోపించినా, ఆ పాట్లకు గురి కాకుండా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సగం ధరకే కర్షక సోదరులకు అప్యాయతతో అందించడం, హక్కును అవరోధించే రెవిన్యూ శిస్తును పూర్తిగా తొలగించడం, సంవత్సరానికి ఒక ఆశ్విక శక్తికి 50 నామమాత్రపు ధరకే విద్యుచ్ఛక్తిని వ్యవసాయోత్పత్తులకు సంక్రమింప జేయడం, ఉత్పత్తి తగ్గినా ఆ ప్రభావం వ్యవసాయంపై పడకూడదని, విద్యుత్ కోత లేకుండా చూడటం, అన్నిటికంటే మిన్న– మకుటాయమానం కర్షక పరిషత్ స్థాపనం – రైతుకు గౌరవం, సేద్యానికి ప్రతిష్ఠ ఆకలి తీర్చే అన్నదాతకు గురితింపు ఈ సమాజంలో కల్పించే విప్లవాత్మక ఆధునిక విధాన సంప్రాప్తీకరణమే తెలుగుదేశం ప్రభుత్వం "కర్షక పరిషత్తు " వ్యవస్థాపనం.

–రెక్కలు ముక్కలుగా చేసుకుని పండించుకున్న పంటలకు సరైన గిట్టుబాటు ధరల నిర్ణయం, మార్కెటింగ్ సౌకర్య కల్పనం, వారే ఆధ్వర్యం, వారే ఆధిపత్యం. అభివృద్ధి కార్యక్రమాల స్వయం నిర్వహణం ఉత్పత్తిలో

ఆధ్వర్యం. ఇది రైతన్నలు ఈ వ్యవస్థ వల్ల ప్రాప్తింపచేసుకున్న పారితోషికం. ఆ ఫలమే యీ కర్షక పరిషత్తు ప్రజల భాగస్వామ్యమే ప్రజాస్వామ్య పరమార్థం అధికార వికేంద్రీకరణ ఆదర్శ నిదర్శనమే, పరాకాష్టే తెలుగు దేశం ప్రభుత్వం మేధస్సు పల్లవించిన మాండలిక రాజ్యాంగ విధానం"

వలసపాలనకు అవశేషంగా మిగిలిన గ్రామాధికార్ల వ్యవస్థకు స్వస్తి పలకడం, గ్రామ కళ్యాణానికి ప్రభుత్వం పరచిన పూల మార్గం తెలుగు మాగాణ సమారాధనం. సామాజిక అడవుల పెంపకం, సౌకర్యాల కల్పనం. అడవుల విద్యుద్దీపాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రాప్తం, గ్రామీణ జీవిత వికాసానికి, పెల్లుబుకి వెల్లి విరిసే నవ చైతన్యానికి సంకేతం – వ్యవసాయం, పరిశ్రమలు మన రాష్ట్రానికి రెండూ రెండు కళ్లు. వాడ వాడలా చిన్న చిన్న కుటీర పరిశ్రమలు గ్రామాల స్వయం సమృద్ధికి కారణాలు – భారీ, మధ్యతరహా పరిశ్రమలు, రాష్ట్ర పారిశ్రామికీకరణకే కాక ఉపాధి అవకాశాలు విస్తరణకు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రగతి దేవళాలు, పారిశ్రామిక ప్రగతికి తెలుగు దేశం ప్రభుత్వ అంకిత తర్పణం.

తెలుగు గంగ, శ్రీశైలం కుడి కాలువ, జూరాల, వంశధార, సింగూరు ప్రాజెక్టుల నిర్మాణం, పులిచింతల ప్రాజెక్టు సుస్వరూప సాక్షాత్కారం తెలుగు దేశ ప్రభుత్వం. బీడు వారిన ఎండు గడ్డలు పగల గొట్టి పచ్చని పైరులతో పుడమితల్లికి సస్యశ్యామల శోభాయమానమైన సింగారింపుల సౌభాగ్యం పుణకడం.

అల్ప సంఖ్యాక వర్గాల వికాస ప్రగతికి, సుహృద్భావ సౌభ్రాతృత్వ వాతావరణంలో, స్నేహభావం పండి చెట్టపట్టాలు వేసుకొని జీవించడానికి, ఉర్దూ భాషకు సముచిత స్థానం గౌరవాదరణలు కల్పించడం, అందుకే 3 ఉర్దూ ఆశ్రమ పాఠశాలల్ని నెలకొల్పడం, మైనారిటీల హక్కుల రక్షణ విషయంలో చూపుతున్న శ్రద్ధాసక్తులకిది సంకేతం – రాష్ట్రంలో సాంస్కృతిక కళారంగాల పునర్వికాసానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల శేషం–విద్యా వ్యాప్తికి ఈ 5 ఏళ్లలో 4 విశ్వ విద్యాలయాల అవతరణ, పాఠశాలల్లో దృశ్య శ్రవణ విద్యావిధానానికి శ్రీకారం – విద్యా రంగంలో వినూత్న విజ్ఞాన వికాస మార్గ నిర్దేశనం – భాషాప్రయుక్త, రాష్ట్ర విభజన ప్రాతిపదికమీద రాష్ట్రాన్ని మనం సాధించుకున్నప్పుడు, ఇంతవరకు తెలుగు భాషకు సరైన గౌరవం లభించకపోవడం దురదృష్టం.

**"తెలుగ దేలయన్న దేశంబు తెలుగు**
**నేను తెలుగు వల్లభుండ తెలుగొకండ**
**ఎల్ల నృపులు గొలువ ఎరుగవే బాసాడి**
**దేశభాషలందు తెలుగు లెస్స"**

– అని ఆనాడు శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు శ్రీకృష్ణదేవరాయలు కలలో సాక్షాత్కరించి నుడిపిన తేనెవంటి

తియ్యని తెలుగు భాషా రుచి వికాసానికి, తెలుగు స్ఫూర్తికి, తెలుగు విజ్ఞాన మహోదయానికి తెలుగుల కళామతల్లి పాదకింకిణి రంజిత రస రాగ శోభ రవళి దర్పణం తెలుగు విశ్వ విద్యాలయం అంకురార్పణం.

– ఇది తెలుగు జాతికే అంకితం – తెలుగు కళా సరస్వతికే సమర్పితం.

ఇవన్నీ తెలుగు దేశ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కృషిలో, అభివృద్ధి కృషిలో భాగాలు–ఏ యేటి కాయేడు వార్షిక పెట్టుబడులు గణనీయంగా పెంచుకుంటూ అభివృద్ధి, సంక్షేమం జోడుగుర్రాలుగా రాష్ట్ర రథాన్ని ప్రగతి పథంలో పురోగమింపజేస్తున్న సేవా విధానమిది. ఈ కృషిలో అలసి పోనీయక, నిత్య నూతనోత్సాహాలను నాలో రేకితిస్తూ అడుగడుగునా మీరిచ్చిన స్పందనతో మీరు చూపుతున్న ఆదరణతో ముందడుగు వేస్తున్న నన్ను 'అన్నా' అని ఆత్మీయతతో పలకరించడము నాకు చాలు -- యీ జీవితానికి –

అదే అండ. అదే నేను కోరే వరం –

నా దేవుడు నా కనుగ్రహించే పెన్నిధి! ప్రసాదం!

– నా బొందిలో ప్రాణమున్నంత వరకు ప్రజా సేవలోనే ధన్యత చెందాలనే నా ధ్యేయం

మీ విశ్వాసానికి అర్హుడనని నిరూపించుకోవడమే నా కర్తవ్యం, నా బాధ్యత –

**జై తెలుగునాడు. జైహింద్!**



# ఆర్థిక ప్రమాణాలను పెంపొందించాలి

**(31-10-88న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ సందర్భంగా రేడియో, టి.వి. ప్రసంగము)**

ఈ ప్రగతికి ఈ మహోదయ మహోజ్వల ప్రాభవ విభవ వారసత్వానికి ఆత్మార్పణ చేసిన జాతి భక్తులు, త్యాగశీలురు, ఎందరో మహానుభావులు, మహనీయులు, అందరి స్మృతికి శతకోటి సుమాంజలీ సమర్పణం.

జాతికి దివ్వెబట్టిన మహానుభావులు వారు.

నీకన్న ఒక్కచోటు నీకు ప్రసాదించిన దాతలు వారు. తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని వికసింపజేసిన ధన్యజీవులు వారు. తెలుగుకు ప్రాభవం వైభవం కలుగజేసిన అకుంఠిత దీక్షాదక్షులు వారు. చరిత్ర మరువని చిరస్మరణీయులు వారు. వారి సౌశీల్యమే మనకు ఆదర్శం. ఆ జాతినేతలు అభ్యుదయ భావ వికాస దీప్తిలో దేశాభ్యుదయమే ధ్యేయంగా, జాతీయ సమగ్ర సమైక్యతా, సమభావనా స్ఫూర్తితో సేవలందించడమే మా పరమార్థం.

ఆనాడు–శాలివాహనుల పాలనలో సకల వైభవశ్రీలతో వెలుగొంది, కాకతీయుల అవక్ర పరాక్రమ ప్రాభవంతో ఒక్కటై వెలిగిన జాతి మనది. చరిత్రకే మెరుగులు దిద్ది, ప్రపంచానికి వెలుగులు అద్ది, తెలుగు వారి కీర్తి కేతనాన్ని సమున్నతంగా గగనతలంలో రెపరెపలాడించిన జాతి – మన జాతి.

తెలుగుదేశం వెలుగు బావుటాను విశ్వవిహాయస వీధుల్లో విహరింపజేసిన గండు జాతి మనది. రాష్ట్ర పొలిమేరలను, దేశ సరిహద్దులను, మహాసాగరాలను దాటి, దిగంతాల వరకు తన విజ్ఞాన జ్యోతులను వెదజల్లినది మన తెలుగు జాతి.

అంతటి వైభవోజ్జ్వల చరిత్ర కలిగిన జాతి ,పరాయి పాలనలో ముక్కలు చెక్కలై, పూర్వౌన్నత్యాన్ని, అస్థిత్వాన్ని కోల్పోయి – నిర్వీర్యంగా, నిస్తేజంగా, నిర్గాణంగా బ్రతుకు వెళ్లదీయ వలసిన దయనీయ స్థితి ఏర్పడటం తెలుగు వారి దురదృష్టం.

స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా జాతీయోద్యమమూ, అందులో భాగంగా రాష్ట్రోద్యమమూ కొనసాగి – తమదైన ఒక రాష్ట్రాన్ని సిద్ధింప చేసుకోటానికి, తమ ప్రగతికి తామే బాటలు వేసుకోవటానికి, తమ భవిష్యత్తుకు తామే కర్తలుగా నిలవడానికి –తెలుగు ప్రజలు కొనసాగించిన ఉద్యమం – చివరకు పొట్టి శ్రీరాములు గారి ఆత్మాహుతితో గాని స్వయం ప్రతిపత్తిని సాధించుకోలేక పోయింది.

తెలుగు రాష్ట్రం అవతరించి భాషా ప్రయుక్త రాష్ట్రాల అవిర్భావానికి నాంది పలకడం – విశాలాంధ్ర ప్రాతిపదికగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడటం తెలుగు జాతి నోచుకున్న ఐక్యతా వ్రతం.

అలాగే అనుకున్నారు ఆనాడు ముక్కోటి తెలుగు ప్రజలూ స్వంత రాష్ట్రంలో తెలుగు జాతి సమగ్రంగా, సర్వతోముఖంగా వికసిస్తుందని భావించారు. ప్రతి ఒక్కరి జీవితం తెలుగుదనంతో తుష్టిగా, పుష్టిగా పరిపూర్ణతను సంతరించుకుంటుందని ఆశించారు. భవిష్యత్తును మహోన్నతంగా పండించుకుని కలలు గన్నారు. తెలుగునేల నిండుదనంతో, పండు ముత్తయిదువులా స్వచ్ఛంగా, పచ్చదనాల పరిమళంతో పరిఢవిల్లుతుందని ఆశించారు.

చివరకు జరిగిందేమిటో, మిగిలిందేమిటో మీకు తెలుసు. కలలు కల్లలైనాయనీ, కళ్లు కాయలు కాచాయనీ చెప్పడం నా వుద్దేశ్యం కాదు జీవితం వడ్డించిన విస్తరిగా లేని బడుగు ప్రజల బ్రతుకులు ఏ స్థితిలో వున్నాయో నేను చెప్పనవసరం లేదు.

ఏ మహోన్నత జాతి వారసత్వాన్ని భావి తరాలకు పదిలపరచాలని మహనీయులు కలలుగన్నారో, ఏ తెలుగు గడ్డ పురావైభవ ప్రాభవాలను పునరుజ్జీవింపజేయాలని తహ తహలాడారో.. తనువులర్పించారో.. ఆ జాతి, తెలుగు దేశం ప్రభుత్వం ఏర్పడేనాటికి ఏ స్థితిలో వున్నదో నేను పని గట్టుకు చెప్పనవసరం లేదు. పారిశ్రామిక, వ్యావసాయిక రంగాలు – రాజకీయాల చిక్కుముళ్లలో యిరుక్కుని దిక్కు తోచక ఎంతగా ఉక్కిరి బిక్కిరయ్యాయో మీకు తెలియంది కాదు.

ఢిల్లీ పుర వీధుల్లో తెలుగువాడు సగర్వంగా తలెత్తుకు తిరిగే పరిస్థితి ఎప్పుడొచ్చిందో, తెలుగువాడి ఆత్మగౌరవానికి సముచిత స్థానం ఎన్నడు లభించిందో, తెలుగువాడి వాడీ, వేడీ, వొడిమీ యావద్భారతానికి తెలియజెప్పిన ఆ చరిత్రాత్మక సంఘటనను నేను మళ్లీ గుర్తు చేయాలా?

**తెలుగువాణి వీణా నిక్వాణంలో**
**తెలుగు భాషా సమర్చనంలో**
**సుమధుర సుస్వర స్వనాలు**
**ఎలా మేళవింపబడ్డాయో**
**మీకు వినిపించాలా!!**

అశేష ప్రజా బలంతో–నా తెలుగు వారి శుభాశీః పరంపరతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వానికి సామాన్యుడే మాన్యుడు ... నిరాధార నిస్సహాయుడే మిత్రుడు.. దీన, హీన, హైన్య, దైన్య మానవుడే ఆప్తుడు.. నిరుపేదే దేవుడు.. ఈ సమాజమే పవిత్ర దేవాలయం.

పరగడుపులతో పస్తులుండే ఆ నిరుపేద దేవుడికింత ప్రసాదం నైవేద్యం పెట్టడమే మా ఆదర్శం.. నీడలేని బ్రతుక్కి కాస్తంత గూడు కట్టి యివ్వడమే మా ఆశయం. అతుకుల, చితుకుల బతుకులకింత వలువలు కప్పి ఆర్ద్రతతో ఆదరించడమే మా ప్రభుత్వ పరమార్థం.

అందుకే ఇన్ని సంక్షేమ పథకాలు. సామాన్యుని కోసం సేవా నీరాజనాలు.. ఇతరులకు మార్గదర్శకంగా ఎన్నో.. ఎన్నో.... యింకెన్నో... సంక్షేమ సేవా స్రవంతులు.

**పరగడుపులతో పస్తులుండే ఆ నిరుపేద దేవుడికింత ప్రసాదం నైవేద్యం పెట్టడమే మా ఆదర్శం.. నీడలేని బ్రతుక్కి కాస్తంత గూడు కట్టి యివ్వడమే మా ఆశయం. అతుకుల, చితుకుల బతుకులకింత వలువలు కప్పి ఆర్ద్రతతో ఆదరించడమే మా ప్రభుత్వ పరమార్థం.**

ఈ సంక్షేమ కృషిలోనే రాష్ట్ర ప్రగతి మూల బీజం నిక్షిప్తమై వుంది. సమాజం ఎగుడు దిగుడులుగా వుంటే ప్రగతి గమనం సాఫీగా సాగదన్నది నిబద్ధి.

తెలుగుదేశం ప్రభుత్వం సంక్షేమ కృషికి పెద్ద పీట వేస్తూనే అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా కొనసాగిస్తున్నది. పేదకు చౌకగా బియ్యం యిస్తున్న చేత్తోనే రైతుకు వ్యవసాయావసరాలను సమకూరుస్తోంది. నిలువ నీడలేని నిరుపేదకు పక్కా యిళ్లు కట్టిచ్చే చేత్తోనే పాఠశాల భవనాలు, ఆస్పత్రులు నిర్మిస్తోంది. తక్కువ ధరకు బట్టలందించే చేత్తోనే పేద వర్గాల పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫారాలు, ఉపకార వేతనాలు పంపిణీ చేస్తోంది. అశక్తులకు పింఛన్లు యిచ్చే చేత్తోనే పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తోంది.

రిక్షా కార్మికులకు స్వంత రిక్షా, వస్త్రాలు, ఆడపడుచులకు ఆస్తిలో హక్కు, రైతన్నలకు రాయితీలు, వృత్తి పని వారికి ఉపాధి సౌకర్యాలు, చిట్టి చిన్నారులకు ఆరోగ్య పథకాలు వంటివే గాక, వెనుకబడిన ప్రాంతాలకు

పారిశ్రామిక సమాహారం, బంజరు ప్రాంతాలకు సాగునీటి సలిల సంప్రోక్షణం గ్రామీణుల ముంగిటికి ప్రభుత్వ సేవా రంగవల్లుల వికాసాలు, వాడవాడలా విద్యుత్ తోరణాలు, ఊరూరా విద్యాలయాలు... యింకా వ్యవస్థాపరమైన మార్పులు, సాంస్కృతిక పునరుజ్జీవనా పథకాలు ఎన్నో రూపొందించబడ్డాయి.

తెలుగుదేశం ప్రభుత్వానికి వెనుకబడిన వర్గాల సముద్ధరణ ఎంత ముఖ్యమో వెనుకబడిన ప్రాంతాల సత్వరాభివృద్ధి కూడా అంతే ముఖ్యం. బీడు వారిన బంజరు భూములను పగల దున్ని సస్య శ్యామల జల శోభిత పరిమళ పారవశ్యంతో తెలుగు తల్లి చిరు పెదవులపై దరహాసదీప్తి చిందించడమే మా ధ్యేయం.

అందుకే–ఒక్క తెలుగు గంగ, ఒక గాలేరు–నగరి సుజల స్రవంతి. అందుకే – ఒక జూరాల, ఒక పవిత్ర శ్రీరాం సాగర్ ద్వితీయ మందాకినీ ద్వితీయ మజిలీ పయనం. అందుకే శ్రీశైలం మల్లికార్జున మూర్ధాభిషిక్త ఐన గంగా స్రవంతిని నల్లగొండ భూములపై చిరు అలలు శోభితం చేయడం –

**వెనుకబడిన వర్గాల సముద్ధరణ ఎంత ముఖ్యమో వెనుకబడిన ప్రాంతాల సత్వరాభివృద్ధి కూడా అంతే ముఖ్యం. బంజరు భూములను పగల దున్ని సస్య శ్యామల జల శోభిత పరిమళ పారవశ్యంతో తెలుగు తల్లి చిరు పెదవులపై దరహాసదీప్తి చిందించడమే మా ధ్యేయం.**

మరి అందుకే – తెలుగు గోదావరి సుజల సాగరం – ముద్దనూరులో ఒక వెలుగుల కేంద్రం వెలవబోతున్నా – మణుగూరులో మరొక సూపర్ థర్మల్ కేంద్ర కిరణాలతో వెలుగులు నింపనున్నా – వెనుకబడిన ప్రాంతాలలో పాతుకు పోయిన వెలికితనాన్ని పెకిలించి విసిరి వేయాలనే – పరిశ్రమలలో యంత్ర చక్రాల నిరంతర పరిభ్రమణ చైతన్యాన్ని రగిలించి రవళింప చేయాలనే–

అధికార వికేంద్రీకరణకు మాండలిక రాజ్యాంగ విధాన ప్రవేశం.

సామాన్యుని సౌకర్యం కోసం సహకార వ్యవస్థలో ఏక గవాక్ష విధాన ప్రధానం.

రైతే రాజన్న వాదానికి వాస్తవ రూపకల్పనకే కర్షక పరిషత్‌కు పట్టాభిషేకం.

కాలదోషం పట్టిన బానిస విద్యా విధానానికి స్వస్తి పలికి, శోభావంతమైన మేధా ప్రయోజనానికే ఎన్నో, మరెన్నో ప్రయోగాలు – ఆ బాటలోనే దృశ్య శ్రవణ బోధనా విధానం.

ఆ పద్ధతికే సహకార రంగంలో కళాశాలల ప్రారంభం.

ఆ మార్గంలోనే వృత్తి, విద్యాపరమైన బోధనా విధానం.

ఆ రీతిలోనే ఆంధ్రప్రదేశ్ వైద్య విజ్ఞాన పరిషత్, ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయం.

పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం.

ప్రతి జిల్లాలో బాల, మహిళా ప్రగతి ప్రాంగణం.

తెలుగు భాషా వికసిత ప్రాభవానికి పట్టుగొమ్మగా తెలుగు విశ్వవిద్యాలయం.

ఇలా ఎన్నో వ్యవస్థలకు శ్రీకారం....

మరెన్నో కార్యక్రమాలకు శుభారంభం... ఎన్నో ఆలోచనలకు ఆకారం. అంతా మీ ఆశీర్వచనం.

ప్రగతి కేవలం పట్టణవాసులకేగాదు పల్లీయులకు సైతం సంక్రమింపజేయడం తెలుగుదేశం నిబద్ధ విధానం. గుక్కెడు నీరందక పొడివారిన గొంతులకు, తరతరాలుగా కరువు ప్రాంతాలుగా శపించబడ్డ తడి ఆరిన ఎండుగడ్డలకు త్రాగునీరు, సాగునీరు అందించటానికి పాతాళ గంగను వెలికి తీసి పుడమితల్లిని సస్యశ్యామల శోభితం చేయడం.

ప్రత్యామ్నాయ ఇంధన వనరుల కోసం – వాతావరణ సమతుల్యం కోసం – సామాజిక అడవుల పెంపకం – దానికే తెలుగు వృక్ష సంక్షేమ పథకం.

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రైతు జన సంక్షేమ చర్యగా, వ్యవసాయావసరానికి వాడే విద్యుచ్ఛక్తికి ఒక ఆశ్విక శక్తికి కేవలం 50 రూపాయల నామమాత్రపు వార్షిక సుంకంతో సరఫరా చేయటం. భూమి మీద సర్వతంత్ర, స్వతంత్ర, స్వేచ్ఛా వారసత్వానికి వీలుగా రెవిన్యూ భూమిశిస్తు మాఫీ చేయడం.

కులమత జాతి వర్గ వర్ణ విచక్షణారహితంగా సమస్త ప్రజానీకానికి ప్రతినిధులమన్నదే మా రాజకీయ అవగాహన. అన్ని వర్గాలను సమదృష్టితో, సమభావంతో, సంక్షేమ ఫల విధానంతో సమాజాన్ని గౌరవించడమే తెలుగుదేశం విధానం.

శ్రామికులు, కార్మికులు, కష్ట జీవులు, సర్వులు సర్వతోముఖాభివృద్ధి వంతమైన సహజీవనంతో, సదవగాహనతో మెలగాలన్నదే మా వాంఛితం.

వృత్తివంతులు, విద్యావంతులు, ఉద్యోగులు, బేహారులు ఎవరికి చెందవలసిన ఆర్థిక ప్రమాణంతో వారు సంతుష్టాంతరంగులై జాతి వికసిత విధాన విధాతలుగా శోభిల్లటం మా ఆచరణం.

మన వారిని మనం నమ్మాలి. అనుమానించటం, అవమానించటం స్వాతంత్ర్య సమజీవన విధానానికి సంప్రదాయబద్ధమైన ఆదర్శం కాదనే మా వాదం.

ఈనాడు మన రాష్ట్రావతరణ మహా మహోత్సవ శుభ దినాన – ఆకట్టుకునే మాటలనడం నా అభిమతం కాదు. నా వారికి, నా ఆత్మీయులకు, నా ఆత్మ బంధువులకు, ఆరుకోట్ల అశేష తెలుగు ప్రజానీకానికీ వారి సముజ్వల భవిష్యత్ సమజీవన సోదర సౌభ్రాతృత్వ పరిపుష్టికి సంతుష్టినీయాలన్న పరమార్థమే 'తెలుగుదేశం' ప్రభుత్వాంకితమని విన్నవించడం నా ధర్మాచరణం.

కరువులతో, వరదలతో, కడగండ్ల నెదుర్కొని-ఏ యేటికాయేడు కుమిలిపోతున్న రైతన్నలకింత మేలు చేయాలన్నదే మా తపన. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతయిచ్చి ఆర్థిక ప్రమాణాల్ని పెంపొందించాలన్నదే మా ధ్యేయం.

తెలుగు ప్రజల సర్వతోముఖ వికాస వైభవశ్రీలకోసం, తెలుగుజాతి సంస్కృతీ సుసంపన్న సౌభాగ్య పరిరక్షణకోసం, భావి తరాల ఉజ్వలోద్దీపనా చైతన్య భవితవ్యం కోసం 'తెలుగు దేశం' సేవా సమర్చనం - సమర్పణం.

**ఏ దేశమేగినా**
**ఎందు కాలిడినా**
**పొగడరా నీ తల్లి**
**భూమి భారతిని' అన్న**
**రాయప్రోలు మాటల్లో నిక్షిప్తమైన,**
**జననీ జన్మ భూమిశ్చ**
**స్వర్గాదపి గరీయసీ**

ఈ తెలుగునాటి వెలుగుల అవతరణ దినోత్సవ పర్వదిన శుభ సందర్భంలో యావత్ భారతానికీ, అన్ని సోదర రాష్ట్రాలకు, ప్రజ్ఞా పాటవ విశేష శేముషీ దురంధరులకు, ఆరుకోట్ల మా రాష్ట్ర వాసులకు సహస్ర శుభాభినందన సంప్రోక్షణం.

**జై తెలుగునాడు. జైహింద్!**



# త్యాగమూర్తుల కలలు పండిద్దాం

**(1 నవంబర్, 1988న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ ప్రసంగం)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంప్రాప్తం మహోదయ, మనోజ్ఞ స్వేచ్ఛా వీచికా లహరిలో, పులకింతల ఉత్సాహ నవ వసంతంలో, ఆవేశ కెరటాల శీతల తుంపరలలో పునీతమైన అఖండ ప్రజావాహినీ పరంపరకు, ప్రాభవ విభవ శేముషి దురంధరులకు సాహితీ నృత్య నాట్య కళా విభవశ్రీ శోభితులైన తెలుగునాటి ఆరాధ్యదేవులకు, మాన్య మహోదయ మనీషా ప్రభావులకు, జాతి ప్రత్యేక పరిగణనకు తమ జీవితాలు పణంగా పెట్టి ప్రాణాలు వారవోసిన తెలుగు తల్లి గర్భ శుక్తి, మక్తాఫలాలైన పుణ్య పురుషులకు, ధన్యజీవులకు, ఉనికి ప్రదాతగా గౌరవ విధాతగా తెలుగు గుండెలలో చెరగని, చెదరని ప్రేమాభిమానములు పేరుతో పెనవేసుకున్న ఆంధ్ర రాష్ట్రావతరణకు అసువులు సమర్పించిన ధీశాలి, త్యాగి, అమరజీవి పొట్టి శ్రీరాములుగారి దివ్య స్మృతికి నా శతాభివందన ముకుళిత ఆర్ద్రా నివేదనం.

హృది మెదలిన మధురాను రాగ సంప్రోక్షణం, భక్తిపూరిత శ్రద్ధాంజలి సమర్పణం ఇది చారిత్రకం. చిరస్మరణీయం. ఎన్నో విధాలుగా, ఎన్నో ప్రాంతాలలో చిద్రూపాలుగా చెదరిన జాతిని ఒకనాట, ఒకచోట, ఒకగూట పొదిగిన పొంతనగా సంఘటితపరచిన మృదుమధుర మనోజ్ఞ పర్వదినం ఇది.

**నా జాతికి ఇది నిండుదనం.**
**మనందరికీ ఇది గండు దినం. పండుగ దినం.**

ఎన్నో ఆశలతో, ఆపేక్షలతో గతాన్ని మరవాలనుకుంటున్న సామాన్య మానవుడు నలభై రెండు సంవత్సరాల స్వాతంత్ర్యానంతర కాలగతిలో వమ్మయిన శుష్క వాగ్దానాల విఫలతను, తను దగాపడ్డ విధానాన్ని, గుండెల్లో అణచుకోలేక పోతున్నాడు.

దారిద్ర్యానికి మించిన అవమానం, సంఘం వెలితిచేసి వెలివేసిన తిరస్కార దుర్మదాంధత్వం, నిశ్శబ్దంగా సహించలేకపోతున్నాడు. మౌనంగా భరించలేకపోతున్నాడు. అరచేత చూపినవి ఎన్ని ఆశలు. బ్రిటిష్ బానిస రాజ్యాంగ విధానం పోవాలి. స్వాతంత్ర్యం రావాలి. కుల మత వర్ణ వర్గ భేదం నశించాలి. అంటరాని తనం అడుగంటి పోవాలి. సంకుచితత్వం సమసిపోవాలి. స్వార్థం నశించాలి. నిండుదనంతో పెల్లుబికిన వాత్సల్యపు వెలువలో సాదర సోదర సమాదరణలో తడిసిపోవాలనుకున్నాడు. తనిసి పోవాలనుకున్నాడు – తన యిల్లాలు భాగ్యలక్ష్మి సదృశగా కంటి ముందు కళకళలాడుతూ సాక్షాత్కరించ గలదనుకున్నాడు. తన వంశాంకురాలు సమాన అవకాశాలతో దేశాభిషేకానికి కుసుమాలు కాగలరనుకున్నాడు. తనూ తృప్తితో, ఆనందంతో స్వతంత్ర్య భారత పౌరుడుగా ఎద ఎత్తుకు తిరగ గలననుకున్నాడు.

దోపిడి దగా – అవినీతి, అక్రమం, లంచగొండితనం, స్వార్థం, సంకుచితత్వం, వర్గ భేదం, వర్ణ వ్యత్యాసం అన్నీ గుట్టు చప్పుడు కాకుండా గుటుక్కుమని మాయమౌతాయని కలలు కన్నాడు – దేశం ప్రగతిని సాధిస్తుందనీ, మానవతా విలువలను ప్రజాస్వామ్యం పెంచుతుందనీ, జాతీయ స్ఫూర్తి దేశంలో వికసిస్తుందనీ తలపండిన నాయకత్వం, నిస్వార్థ పూరితమైన సేవావిధానంలో సుమధుర పరిమళపూరిత మేధా వికసిత విప్లవ పరిజ్ఞానంలో భారతాన్ని పొంగిస్తుందనీ అంకిత భావం జాతికి రక్షగా ప్రతి భారతీయుడూ గౌరవ ప్రతిపత్తులతో కాలాన్ని దూసుకుపోతాడనీ, అందరూ ఊహించుకున్నారు.

జరిగిందేమిటని ప్రశ్నించుకోవలసిన అవసరం లేదు – సమాధానానికి వెతుక్కోవలసిన పనిలేదు. ఎదుట ఉన్న సమాజమే యిందుకు సాక్ష్యం. అద్దం పట్టిన వేళ కారణాలను వెతకవలసిన అవసరం లేదు. ఈ తీరుకు కారణం యింతవరకు స్వాతంత్ర్యానంతరం భూమి పాలన బాధ్యత వహించిన ఆ వ్యవస్థే సంజాయిషీ యివ్వాలి. అమాయకులే – నీ తీపి మాటలు నమ్మారే.

నువ్వు పగలబడ్డ గొప్పలు నమ్మి దగాపడ్డారే. వ్యాపారాత్మకమైన నీ నీచ రాజకీయ విధానాలకు బలైపోయారే. ఇంతకు మించిన ద్రోహం మరొకటుంటుందా?

**'జననీ జన్మ భూమిశ్చ
స్వర్గాదపి గరీయసీ'**

అన్న సూక్తిని వమ్ముచేసి ఈనాడు దేశద్రోహానికి కారకులయ్యారే. ఇది తగునా? ఆశా ప్రలోభాలలో పొరలు కమ్మిన కళ్లతో, కొరవడ్డ బుద్ధితో దేశాన్ని అమ్ముకున్నారే. తమస్వార్థానికి సమాజాన్ని తాకట్టు పెట్టారే, యీ తప్పుడుతనాన్ని జాతి ఏమని విస్మరిస్తుంది? దీన్ని ఆ అమరవీరులు ఏ విధంగా సహిస్తారు? క్షమిస్తారు? యీ దుర్వ్యాపారం ఎంత వరకు సాగుతుంది?

ఇది యీనాడు ప్రజలు తేల్చవలసిన – కాదు–కాదు – తమకు తాము ప్రతిజ్ఞాపూర్వకమైన నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఆవరించిన రోజు. ఇది మన రాష్ట్రం ఆవిష్కరించబడ్డ రోజు. అవతరణ చెందిన రోజు. భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన ప్రాతిపదికకు ప్రాతిపదిక వేసిన రోజు తమ కళా సాహితీ సంస్కృతిని, తమ భాషా సరస్వతిని భావ సంస్కరణను తాము నిండుగా గౌరవించుకున్న రోజు.

**ఇది మన రాష్ట్రం అవతరణ చెందిన రోజు. భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన ప్రాతిపదికకు ప్రాతిపదిక వేసిన రోజు తమ కళా సాహితీ సంస్కృతిని, తమ భాషా సరస్వతిని భావ సంస్కరణను తాము నిండుగా గౌరవించుకున్న రోజు.**

**"తెలుగదేల యన్న దేశంబు తెలుగు
ఏను తెలుగు వల్లభుండ తెలుగొకండ
ఎల్ల నృపులు గొలువ ఎరుగవే బాసాడి
దేశ భాషలందు తెలుగు లెస్స!"**

ఈ లెస్సలు, హై లెస్సలు మన జాతి ఆత్మ గౌరవ ప్రతిష్టా విధానం పండినప్పుడే మన కళ్ల కలలు యాదార్థాలైనప్పుడే. ఆదర్శాలు ఎంతని వల్లించుతాం? దిగులు బ్రతుకుతో సామాన్య మానవుడి జీవితానికి సాఫల్యం కలిగించమని ఎంతని అర్థిస్తాం. రైతే రాజు కావాలని బాపూజీ ప్రవచనం ఎన్నిసార్లు గుర్తు చేస్తాం.

దురభిమానం పెంచుకోవద్దని ఎన్నిసార్లు హెచ్చరిస్తాం. ప్రజాస్వామ్యానికి, ప్రజా భాగస్వామ్యమే పరమార్థమని ఎన్ని మారులు అర్థం చెబుతాం? శ్రమజీవుల ఉసురు పోసుకోవద్దని ఎన్నిసార్లు వేడికోలు చేస్తాం? పర పక్షం అయినంతమాత్రాన మా తెలుగుదేశం ప్రభుత్వాన్ని సవతి ప్రేమతో చూడవద్దని కూసంతయినా కొన వూపిరి పోయమని ఎన్నిసార్లు అభ్యర్థిస్తాం. ప్రజాస్వామ్యంలో కూడా ఇదే అనుభవమైతే యీ కేంద్ర పాలనా విధానంలో గుత్తాధికార ఆధిపత్యంలో తమ వారని, పరవారని వెలి చూపులు చూచే వెలితి వాతావరణంలో ఎంతని మాకుగా మేము పోరాడుతాం? బ్రతిమాలడానికి బాష్ప వాయువులు కురిపించారే, భారతీయులం అంటే – కాదు కాంగ్రెసేతరులన్నారే. ఎన్నాళ్ల నుంచో పెరిగి పేరుకు పోయిన మా ప్రభుత్వ వినతి పత్రాలను బుట్ట దాఖలు చేసారు గాని అయ్యో పాపమని ఒక్కటన్నా అనుమతించక పోయారే.

కరువుకు, వరదకు బలై, ఎండు గడ్డల బీడు వేడిలో నలిగి కుమిలిపోతున్న అన్నదాత చెయ్యి కొరి కారే. ఆర్తి తీర్చలేక పోయారే, ఆశ్రయం యివ్వక పోయారే. ఇందుకా-మనకు స్వాతంత్ర్యం? ఎందుకయ్యా మనకు స్వాతంత్ర్యం. ఎవరికయ్యా ఈ స్వాతంత్ర్యం అని అడుగుతున్నాడు యీనాడు చదువు రాని నిరుపేద మానవుడు. మూలుగుతూ ఈ భేద భావాల విష దావానలంలో సాధించదలచుకున్న సమైక్య సిద్ధాంతం ఏమిటి? రాజకీయ పరమార్థం ఏమిటి? భిన్నత్వంలో ఏకత్వం అని ఏకరువు పెట్టిన విధానానికి నిర్వచనం ఏమిటి?

**"సారే జహా సే అచ్చా**
**హిందూ సితా హమారా"**

**కరువుకు, వరదకు బలై, ఎండు గడ్డల బీడు వేడిలో నలిగి కుమిలిపోతున్న అన్నదాత చెయ్యి కొరికారే. ఆర్తి తీర్చలేక పోయారే, ఆశ్రయం యివ్వక పోయారే. ఇందుకా-మనకు స్వాతంత్ర్యం? ఎందుకయ్యా మనకు స్వాతంత్ర్యం.**

అని పాడిన పవిత్ర గేయానికి పరమార్థం ఏమిటి? జాతిని నిరక్షరాస్యతలో వుంచింది ఇందుకేనా? పేదరికంలో ముంచింది యిందుకేనా? అమాయకత్వంతో తెలియని తనంతో, మూగవోయిన గొంతుతో సామాజిక స్వార్థ రక్కసి కబళింపుకు ఆరగింపు కావడమేనా మన స్వాతంత్ర్య పరిజ్ఞాన పరిమార్థం?

ఇది యీనాడన్నా ఆలోచించాలి? మన ధ్యేయం నిర్ణయించాలి, గమ్యం గమనించాలి - ఈ నిర్ణయమే రానినాడు మన మనిషికి. ఉనికికి గుర్తింపు గాని, అర్హత గాని తెచ్చిచ్చిన వారమే కాము.

ఎటు చూచినా ఆక్రందనమే - ప్రజాస్వామ్యాన్ని పాతిపెట్టడమే. నోరున్న వాడిదే పెత్తనం. పలుకుబడి కలవాడిదే పాలనం. అధికారమే కొలబద్ద. అందలమే అంతస్తు. ఇదే యీనాడు సంఘంలో చలామణీ అవుతున్న అర్హతల రాజకీయం. మనసు చచ్చింది. ఆత్మ నశించింది. ఆవేశం చల్లబడింది. మోసం ముంచెత్తింది. మానవత్వం దగాచేసింది. మనిషే మనిషిని చంపుకునే దుర్దినం దాపురించింది.

ఈ కలత వారిన కడగండ్ల కడలి కన్నీటిలో ఊపిరి ఆడటం లేదు. మనం ఏ దారిని పోతున్నాం? జాతిని ఏ మార్గాన నడుపుతున్నాం? మన వారసులకు ఏమి గరుపుతున్నాం? అర్థానికి విలువనిచ్చి మానవత్వాన్ని మరుగుపరచుకుంటే జాతికి మనం మిగిల్చేదేమిటి? ఈ అమానుషానికి పరిహారం ఏమిటి?

ఈ వ్యత్యాసాల యిక్కట్ల కుంపట్లో మాడి మసైన సమాజానికి కారకులైన ఆ నీతి బాహ్యులు మిగుల్చు కున్నదేమిటి? కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డామన్న సిగ్గెగ్గులున్నాయా ఆ చచ్చు గుండెకు? మన గొప్పదనం మరచి పర భజనకు అలవాటు పడ్డ వంది మాగధ బృందగానం యింకా వినబడుతూనే వుందే. ఇచ్చే వాడుంటే చాలని తెచ్చే అప్పుకు లెక్క వేయకుండా 82 కోట్ల భారతీయుల్ని ముంచి అప్పుల బోనులోకి గుప్పున తోసామే.

ఇది ఏ ప్రజాస్వామ్యమైనా సహిస్తుందా? కాలం మరచి పోతుందా? అవకాశం క్షమిస్తుందా? ఇంత నీచమై పదుగురి నోళ్లపాలై పరిహాసానికి పరమ పదమైన, అవినీతికి సంప్రదాయమై, దుష్ట రాజకీయానికి పెట్టని పుటయ్యి దేశ ప్రగతిని కాటు వేసిన యీ విషసర్పం కోరలు ఊడగొట్టేదెప్పుడు? తలకెక్కిన విషం కక్కించేదెప్పుడు? ఇది ఇన్నాళ్లుగా తనకేదో ఒరుగుతుందని పొరబడ్డ పేదవాని మూగవోయిన గొంతుకలో ఉడుకుతున్న వేడి మూలుగు సర్వత్రా నుంచే-బాధాతప్త హృదయుల కన్నీటి నుంచే-క్షుధార్తుల పొడికేకల నుంచే-అన్నార్తుల ఆకలి మంటల నుంచే - శ్రమ జీవుల చెమట బిందువుల నుంచే - ఆడబడుచుల అసహాయ ఆక్రందనల నుంచే - చిరంజీవుల స్నిగ్ధ సుకుమార దరహాసం నుంచే నలిగిన రైతన్నల కొడిగట్టిన బ్రతుకుల నుంచే-ఆవిర్భవించింది తెలుగుదేశం. ఆనాటి సామాజిక అవసరంగా, చారిత్రాత్మక సత్యంగా ప్రజాబల సమాయత్త రాజకీయ శక్తిగా, తన్ను తాను తెలుసుకుని, హతాశులు, గతాశుల గుండెల్లో నుండి పొటకరించింది గనుకనే సమాజానికి కావలసిందేదో తెలుగుదేశానికి తెలుసు. కనుకనే తాను నిర్వహించవలసిన బాధ్యతాయుత కార్యక్రమం, నిబద్ధ ప్రయోజన ప్రాతిపదికగా కొనసాగుతున్నది.

తెలుగుదేశం ప్రభుత్వానికి సమాజమే దేవళం - సామాన్య మానవుడే దేవుడు. గతి లేక మతిపోయి పస్తులతో పరగడుపులుంటున్న ఆ విధి మాలిన విధాతకింత కూడు బెట్టడమే మానైష్ఠిక అనుదిన అనుష్ఠాన వ్రతం. ఇది అభివృద్ధి కాదంటున్నారు. కొందరు యోధులు. అభ్యుదయవాదులు. అనక ఎందుకుంటారు?.. పొట్టలు పెంచుకున్న పెద్దలు.. ప్రబుద్ధులు.. పదవిలో వుండీ పేద కింత గంజి వోయలేని పరమలబ్ధులు.

పదార్థాన్ని పరమాన్నంగా, తమ సొంత సొత్తుగా పరగడుపునే నంజుకుంటున్న ఆ కుక్షింభరులు, ఆ అవహేళనా చక్షువులకు అన్నదానమే అనర్థంగా కనిపించవచ్చు. అందుకే కాల ప్రవాహంలో కలిసి తిలోదకాలొదిలారు ఏనాడో వారికి ప్రజలు. అలనాటి రాయలసీమనాటి రతనాల సీమకు 'సుజలాం, సుఫలాం, మలయజ శీతలాం, సస్య శ్యామలాం' అన్న స్ఫూర్తిని కలిగించాలన్నదే మా తపస్సు. ఆ తలపుల పంటే - ఈనాడు "గాలేరు - నగరి" సుజల స్రవంతికి అంకురార్పణం. ఈ నెల 19వ తేదీన ఆ ప్రజాహిత వాహినిని ప్రజలకే శంఖుస్థాపనాంకితం చేస్తున్నాం.

దరిదాపు నాలుగు దశాబ్దాల ఏలుబడిలో ఆలనా పాలనా లేక ఎండి బీటలు వారిన బీడు భూములను సస్యశ్యామలం చేసే బృహత్తర ప్రజాహిత పథకమే 'తెలుగు గంగ'.

నాగేటి చాలున నల్లగొండ బీడు భూములను జలప్లావితం చేయటానికే శ్రీశైల మల్లికార్జున మూర్ధాభిషిక్త పవిత్ర గంగా స్రవంతిని ప్రవహింప చేయబూనడం.

రూపుమారని కరువు ప్రాంతంగా దిగులుపడ్డ పాలమూరు జిల్లా ఎండుగడ్డలపై పరవళ్లు తొక్కించడానికే 'ఒక జూరాల శీతల స్రోతస్వినీ' సుగమనం. అంతేగాదు.-'ఒక తెలుగు గోదావరీ సుజల సాగరం' ఒక పవిత్ర 'శ్రీరామ సాగర మందాకినీ ద్వితీయ పయనం.

ఇవన్నీ – అన్ని ప్రాంతాలనూ సమదృష్టితో చూడాలన్న పవిత్ర ఆశయ ఫలితం. ముద్దనూరులో ఓ విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పుతున్నా, మణుగూరులో సూపర్ థర్మల్ కేంద్రం కాంతిని క్రాంతికి ప్రసరింపజేయాలనుకున్నా – గనిలో పనిలో కార్ఖానాలో యంత్ర చక్రాల నిరంతర పరిభ్రమణ రొదలో కార్మిక లోక కళ్యాణానికి పచ్చని తోరణం కట్టినా, అన్నీ నా వారి కోసం–హక్కులుండి, అనుమతులకై నిరీక్షించడం మా అభిమతం కాదు. ఎన్ని అడ్డంకులెదురైనా నా ప్రజల కోసం మడమ తిప్పకుండా కృషి చెయ్యడం నా ధ్యేయం. అది మీరిచ్చిన బలం. మీ ఆశీర్వాద ఫలం. ఆ బలంతోనే యిన్ని సంక్షేమ పథకాలు.. సామాన్యుని కోసం ఎన్నో ఎన్నో.. ఇంకెన్నో.... సేవా నీరాజనాలు... –

1. అధికార వికేంద్రీకరణకు మాండలిక రాజ్యాంగ విధాన ప్రవేశం.
2. సామాన్యుని సౌకర్యం కోసం సహకార వ్యవస్థలో ఏక గవాక్ష విధాన ప్రదానం.
3. శోభావంతమైన మేధా ప్రయోజనానికి సహకార రంగంలో కళాశాలల ప్రారంభం
4. వృత్తి విద్యా పరమైన బోధనా విధానం. ఆంధ్రప్రదేశ్ వైద్య విజ్ఞాన పరిషత్–ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయం.
5. పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం.
6. ప్రతి జిల్లాలో బాల మహిళా ప్రాంగణ సౌరభం.
7. తెలుగు భాషా వికసిత ప్రాభవ విభవానికి పట్టుగొమ్మగా తెలుగు విశ్వవిద్యాలయం.
8. రైతే రాజన్న సూక్తికి వాస్తవ రూపకల్పనం 'రాష్ట్ర కర్షక పరిషత్' మకుటాభిషేకం.
9. సత్వర పారిశ్రామికీకరణకు తెలంగాణాలో సహకార నూలుమిల్లు, మూడు చక్కెర కర్మాగారాలు, ప్రొపెల్లెంట్ కర్మాగారం. నూతనంగా వృత్తి రంగంలో వ్యాప్తికి ఇంజనీరింగ్, వైద్య కళాశాలల ఏర్పాటు–గ్రామీణ విశ్వవిద్యాలయస్థాపనం.
10. రాయలసీమలో పట్టు పరిశ్రమాభివృద్ధి – ఆల్విన్ రిఫ్రిజిరేటర్ కర్మాగారం.

ఇవన్నీ రాష్ట్రాభ్యుదయ పథంలో కొన్ని మైలురాళ్లు మాత్రమే చేసిన దానితో తృప్తి పడి సరిపెట్టుకోవడం కాదు. తృప్తి రాలేదు. భవిష్యత్‌కు బాటలు వెయ్యాలన్నదే మా కృషీవలత్వం.

ఒక రైతులు కాదు. ఒక కార్మికులు కాదు. ఒక శ్రామికులు గాదు. ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ వృత్తి, జీవనోపాధులు అల్ప సంఖ్యాక వర్గాలు, షెడ్యూలు కులాలు, తెగలు బక్కచిక్కిన బడుగు వర్గాలు ఆదిగాగల అందరికీ సంక్షేమ సంప్రోక్షణం, సర్వతోముఖ వికాస క్షేమంకరీ సంసేవనం.

ప్రభుత్వ పాలక యంత్రాంగానికి ప్రజా ప్రతినిధులు ఒక ఎత్తయితే సిద్ధాంతాల నిర్వహణా దీక్షాదక్షులైన అధికారులు మరొక ఎత్తు. ఈ రెండు వ్యవస్థల సమన్వయమే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సాధనం – వీరి సహకారమే, సదవగాహనమే, సాంతనమే, సమన్వయమే, రాష్ట్ర ప్రగతికి సంపత్తి. కనుకనే అందరికీ తృప్తి కల్పించాలన్నదే అహరహం మా ఆలోచనా విధానం. యీ భావనా పర్యవసానమే నిండు హృదయంతో నా సోదరి సోదరులు నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు యీ శుభ సందర్భాన అనురాగంతో అందిస్తున్న మా చిరుకానుక "ఆర్జిత సెలవులను రొక్కంగా మార్చుకొనే అవకాశం పునరుద్ధరించడం' ఇది వారి సంక్షేమానికి అంకితం.

ఈనాడు సంపాదనకు పరిమితి లేదు–ఆదాయానికి హద్దులేదు–కాని ఎప్పుడో ఎన్నడో తాత ముత్తాతల వారసత్వంగా దక్కిన పిత్రార్జిత ఆస్తులను అవసరాలకు అమ్ముకునే హక్కుకు మాత్రం హద్దులు పెట్టడం ఎందుకో అర్థం కాదు. కనుక మాస్టరు ప్లానుననుసరించి ఏ మాత్రం మార్పులు లేకుండా తూ.చ. తప్పకుండా చిన్నకారు, సన్నకారు వారు రోడ్లు, పార్కులు, విద్యా వైద్యాలయాలు వంటి ప్రజావసర స్థలాలు మినహాయించి. ఐదెకరాలు నికర విస్తీర్ణం కలిగిన భూమిని ఏ అడ్డులు లేకుండా ప్రతి వ్యక్తి వారి వారి అవసరాలు తీర్చుకునేందుకు ఈనాటి నుంచి ఏ అడ్డూ లోకుండా స్వేచ్ఛగా అమ్ముకోటానికి అంగీకరించబడింది.

ఏ కొడుకు చదువుకో, ఆడబిడ్డ పెళ్లికో అవసరమై, కాలం కలిసి వచ్చి ధరలు పెరిగినా ఫలితం దక్కని పట్టణ ప్రాంతాల భూములున్న పేద రైతుల శుభ కళ్యాణానికి యిది తెలుగుదేశం ప్రభుత్వ సమార్చనం – సమర్పణం

**ప్రభుత్వ పాలక యంత్రాంగానికి ప్రజా ప్రతినిధులు ఒక ఎత్తయితే సిద్ధాంతాల నిర్వహణా దీక్షాదక్షులైన అధికారులు మరొక ఎత్తు. ఈ రెండు వ్యవస్థల సమన్వయమే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సాధనం.**

ఇదే విధంగా పట్టణ పరిసరాలలో వున్న వ్యవసాయ భూములు కుదవబెట్టి అవసరాలకు అప్పు తీసుకొనే సౌకర్యం కలిగించడం – వ్యవసాయ భూములు ఎంత విస్తీర్ణం వున్నా వాటిని అమ్ముకునే వీలు కల్పిచడం – ఆ కృషీవలుల కృషి పట్ల మాకున్న ప్రేమాదరణకు ప్రత్యక్ష నిదర్శనం.

అధ్యాపకులకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ వారి నిబంధనల ప్రకారం సరిక్రొత్త, జీతాలు పెంపుదలను వెంటనే అమలు పరచడం 'గురు బ్రహ్మ'ల పట్ల మాకున్న భక్తి ప్రపూరిత సాహితీ విధాలకు మా సుమాంజలి. సమర్పణం.

మనోవర్తి బ్రతుకు గడిపే సాంప్రదాయాన్ని చిరు మనసులు లేత హృదయాల నుండి తొలగించాలన్న భావంతో చదువుతూ సంపాదించే స్వయం పోషక విధానాన్ని విద్యార్థి దశలోనే కల్పించ బూనడం – మా విప్లవ భావోద్దీపిత ఉద్వేగ విద్యా విధానికి నిదర్శనం.

కళా సంస్కృతీ ప్రాభవాలను విభవ వంతం చేయడానికే మండల పరిధిలో నిర్మించబడే ప్రతి మార్కెటు యార్డులోను ఆరుబయలు రంగస్థలాన్ని నిర్మించాలన్న నిర్ణయం.

ఆ జాతీయ సంస్కృతి ప్రదర్శనంలో పాల్గొనే కళాకారులకు అనువైన సబ్సిడీ పారితోషికంతో ఉచిత ప్రదర్శనలకు అవకాశం కలిగించి ఆదరించడం, కళామతల్లికి మా కర్పూర నీరాజనం.

ప్రాథమిక పాఠశాలలు మొదలు ఉన్నత పాఠశాలల వరకు పర్యాటకోత్సాహులైన విద్యార్థినీ విద్యార్థులకు మన రాష్ట్ర ప్రగతి వీక్షణకు, విరామ వినోద విధానంతోపాటు వారి విజ్ఞాన వికసితకు రాష్ట్ర మోటారు రవాణా సంస్థ వాహనాలన్నింటిలోను నామమాత్రపు రేట్లతో ప్రయాణ వసతులు కల్పించ నిర్ణయించడం భావి పౌరులకు రాష్ట్ర దర్శన భాగ్య ప్రదానం.

**ప్రాథమిక పాఠశాలలు మొదలు ఉన్నత పాఠశాలల వరకు పర్యాటకోత్సాహులైన విద్యార్థినీ విద్యార్థులకు మన రాష్ట్ర ప్రగతి వీక్షణకు, విరామ వినోద విధానంతో పాటు వారి విజ్ఞాన వికసితకు రవాణా సంస్థ వాహనాల న్నింటిలోను నామమాత్రపు రేట్లతో ప్రయాణ వసతులు.**

నూటికి 50 శాతం పైగా ఆడబిడ్డల సంసేవనం, సంక్షేమ ప్రదానం మా నిరంతర నిర్విరామకృషీ సంకేతం.

ఇది వరకు కల్పించిన ఆస్తిలో పురుషులతో సమాన హక్కులు కాక పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం, బాల మహిళా ప్రాంగణం, 30 శాతం ఉద్యోగాలు వారికే సంక్రమింపజేసే నిర్ణయంతోపాటు యీనాడు 50 శాతానికి తక్కువ గాకుండా సోదరీమణులకు ఏ పరిశ్రమలో పని కల్పిస్తారో, ఆ పరిశ్రమల పెట్టుబడికి పది లక్షల రుపాయలు నామమాత్రపు వడ్డీకి యివ్వడానికి సంకల్పించడం.

పారిశ్రామికవాడలలో, ప్రాంగణాలలో అనుమతులలో భాగంగా చెట్లు నాటే కార్యక్రమం పచ్చదనాల పరిమళం శోభింప చేయడం.

కొత్త పరిశ్రమలు స్థాపించబోయేవేత్తలకు హైదరాబాదు, తిరుపతి, విశాఖ, కొత్త ఢిల్లీలో పారిశ్రామికాభివృద్ధి, కేంద్రాలు స్థాపించి ప్రతిదానిలో కనీసం కంప్యూటరు కాబడ్డ వెయ్యి పరిశ్రమలు ప్రగతి పరిశీలన లందించే సాంకేతిక, ఖనిజ వనరుల సమాచారం పొందుపరచి, రాష్ట్ర పారిశ్రామికీకరణం – శుభతరం సుఖతరం చేయడానికి.

వీటితోపాటు యిది వరకు వ్యాపారులకందించిన రాయితీలు మీ కందరికీ విదితమే.

అమ్మకం పరిమితి సాలుకు 50 వేల రూపాయల నుండి 2 లక్షల వరకు పెంచడం. ఇది వరకే జరిగింది. దానికి జతగా 10 లక్షల రూపాయల అమ్మకం పరిమితి వరకు ఎవరికి వారే ప్రభుత్వానికి స్వచ్ఛందంగా వెల్లడి చేసే స్వీయాధికారమిచ్చి గౌరవించడం జరిగింది.

కొందరు అధికారులు, బేహారులకు కల్పించే కడగండ్లను, దుందుడుకుతనాన్ని ఏ మాత్రం ప్రభుత్వం

హర్షించదనీ, సహించదని స్పష్టం చేయబడింది. అధికార మన్నది పెత్తనానికి కాదు. సాటి మానవులను యిబ్బంది పెట్టడానికి కాదు ఇక్కట్టు కల్పించడానికి కాదు. అన్న సూత్రాన్ని పవిత్ర సేవా భావంతో ముడిపెట్టి పరమార్థం సాధించాలన్నదే ఈ నూతన ప్రక్రియ పరమార్థం.

వివాదగ్రస్తమయిన పన్నుల వసూళ్లలో అపీలు చేసుకునే వారు 50 శాతం పన్ను మొత్తాన్ని చెల్లించి గాని అపీలుకు వెళ్లకూడదన్న లోగడ ప్రభుత్వ నిర్ణయాన్ని సాదరంగా సులభతరం చేయడానికి సమాలోచన చేయడం.

చిరునామాలు, ప్రాంగణాలు మారినప్పుడు, తిరిగి కొత్త లైసెన్సులు పొందాలన్న ఆంక్షలేకుండా ప్రభుత్వానుమతితో యీ మార్పు జరిగిన ఎడల కొత్త అనుమతులు తిరిగి పొందవలసిన అవసరం లేదని నిర్ణయించడం ఈనాటి నిర్ణయం.

ఆలస్యమైన బకాయీ పన్నులకు లోగడ గల సాలుకు 24 శాతం వడ్డీ కాకుండా బ్యాంకు రేటు ప్రకారమే చెల్లించుకోవాలని నిర్ణయించడం వ్యాపారుల పట్ల ప్రభుత్వ సుహృద్భావానికి నిదర్శనం.

వీటితోపాటు ఆధునిక వ్యవసాయక పరికరాల నిర్మాణానికి 'ఆల్విన్ ఎగ్రో అప్లయెన్సెస్' అన్న నూతన వ్యవస్థను ప్రారంభించ సంకల్పిచడం.

వ్యవసాయాభివృద్ధి కోసం ఆధునిక పద్ధతులను పరిచయం చేసే కొత్త కోర్సులను విద్యాలయాలలో ప్రవేశపెట్టడానికి సంకల్పించడం.

శాస్త్ర పరిజ్ఞాన మేధా పరిపక్వతా సంపత్తికి, నూతన ప్రయోగ విధానాలను అభివృద్ధి నిర్దేశికాలైన నూతన ఆలోచనా ప్రాభవ విభవాలను తిరుపతి విజయవాడ, వరంగల్ నగరాలలో పరిశోధనా కేంద్రాలను మంగళాశీః తోరణాలతో ప్రారంభించడం.

చిన్న తరహా నీటి పారుదలకు, ఎత్తి పోతల పథకాలకు, వ్యవసాయ ప్రక్రియలకు ఉపయోగించబడే గ్రామ పంచాయితీ కాసారాలను ఆ పంచాయితీ వారే నీటి తీరువాను వసూలు చేసుకుంటూ. ఆ ఆదాయాన్ని ఆ చెరువుల అభివృద్ధికీ మరమ్మత్తులకూ వినియోగించుకునే హక్కులు వారికి అప్పగించడం.

ప్రభుత్వ ఉద్యోగాల మొదలు కళాశాలల ప్రవేశాల వరకూ కుల, ఆదాయ, స్థానిక ధృవీకరణ పత్రాలను పొందటంలో యిది వరకున్న తికమకలను తీసి వేయడం, అప్రస్తుతమైన అంశాలను తొలగించడంతో ప్రభుత్వ విధి నిర్వహణను సూక్ష్మీకరించడం జరిగింది.

అలాగే ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టుకొనే నిరుద్యోగ యువతీ యువకులు వయో పరిమితి మొదలైన నిర్ధారక పత్రాలను ఎంతో కష్టపడి దరఖాస్తుతో పంపనవసరం లేకుండా సరైన అఫిడవిట్లను అర్జీతోపాటు పంపితే సరిపోతుంది. ఎంపిక అనంతరం అసలు పత్రాలు పంపే సౌకర్యం కలిగించబడింది. దీని వలన

ఉద్యోగ ప్రాప్తికి విద్యార్థులు నిర్వహించవలసిన విధులు సులభతరం చెయ్యబడ్డవి. తెలుగు ప్రజల సర్వతో ముఖ వికాస వైభవశ్రీలకోసం, తెలుగు జాతి సంస్కృతీ సుసంపన్న సౌభాగ్య పరిరక్షణ కోసం భావితరాల ఉజ్వలోద్దీపన చైతన్య భవితవ్యం కోసం "తెలుగుదేశం" సేవా సమర్చనం - సమర్పణం.

**"జననీ జన్మభూమిశ్చ
స్వర్గాదపి గరియసీ"**

ఈ తెలుగునాట వెలుగులు అవతరణ దినోత్సవ పర్వదిన శుభసందర్భంలో యావద్భారతానికీ అన్ని సోదర సాదర రాష్ట్రాలకు, ప్రజ్ఞా పాటవ విశేష శేముషీ దురంధరులకు - ఆరుకోట్ల మా రాష్ట్ర వాసులకు సహస్ర శుభాభివందన సంప్రోక్షణం.

**"ఏ దేశ మేగినా ఎందుకాలిడిన
ఏ గద్దెనెక్కినా ఎవ్వరెదురైనా
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలుపరా నీజాతి నిండు గౌరవము".**


**జై తెలుగునాడు. జైహింద్!**

# చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్ పథకాలు

- దేశంలో తొలిసారి రూ.2 కే కిలో బియ్యం. కోటి 20 లక్షల పేద కుటుంబాలకు పంపిణీ.
- దేశంలో తొలిసారి పేదలకు కాంక్రీటు శ్లాబుతో పక్కా ఇళ్ల నిర్మాణం.
- పేదలకు సగం ధరకే జనతా వస్త్రాల పంపిణీ – చేనేత కార్మికులకు చేయూత.
- దేశంలో తొలిసారి వృద్ధాప్య పింఛన్... నెలకు రూ.30.
- దేశంలో తొలిసారి స్థానిక సంస్థల ఎన్నికలలో బీసిలకు 20%, మహిళలకు 9% రిజర్వేషన్లు.
- ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు పెంపు... ఎస్సీ రిజర్వేషన్లు 14% నుంచి 15%కు, ఎస్టీ రిజర్వేషన్లు 4% నుంచి 6%కు పెంపు.
- తొలిసారి పేద విద్యార్థులకు గురుకుల, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటు.
- దేశంలో తొలిసారి కేపిటేషన్ ఫీజుల రద్దు–పేద విద్యార్థులకు అత్యున్నత విద్య అందుబాటు.
- తొలిసారి మెడికల్, ఇంజనీరింగ్ విద్యకు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎంసెట్) ప్రవేశపెట్టి సామాన్యులకు ఉన్నత విద్య చేరువ చేశారు.
- దేశంలో తొలిసారి మహిళలకు ఆస్తిహక్కు కల్పన.
- దేశంలో తొలిసారి మహిళలకు బహిరంగ ప్రదేశాలలో మరుగుదొడ్ల నిర్మాణం.
- దేశంలో తొలిసారి వ్యవసాయరంగంలో రూ.50 లకే హార్స్ పవర్ విద్యుత్.
- వ్యవసాయ రుణంపై దేశంలోనే మొదటిసారి 5.5% వడ్డీ రాయితీ అందజేత.
- దేశంలో తొలిసారి భూమిశిస్తు రద్దు.
- తొలిసారి రైతాంగానికి పట్టాదార్ పాసుపుస్తకాలిచ్చి యాజమాన్య హక్కు కల్పన.
- తొలిసారి ట్రాక్టర్లపై పన్ను తొలగింపు ద్వారా రైతాంగానికి వెసులుబాటు.
- నేషనల్ ఫ్రంట్ ద్వారా దేశవ్యాప్తంగా రైతులకు రూ.11 వేల కోట్ల రుణ మాఫీ.
- సహకార వ్యవస్థలో సింగిల్ విండో సిస్టమ్.. రైతుల అవసరాలన్నీ ఒకేచోట తీర్చేలా.
- తొలిసారి రాష్ట్రంలో మలేషియా నుండి పామాయిల్ మొక్కలను తెచ్చి సాగుకు శ్రీకారం.
- నాగార్జున సాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీటి తరలింపు.
- తొలిసారి దేశంలో నదుల అనుసంధానం – తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం.

- నిజాం సాగర్, శ్రీరాం సాగర్, శ్రీశైలం కుడి–ఎడమ కాలువ, కల్వకుర్తి, నెట్టంపాడు, ప్రియదర్శిని జూరాల, హంద్రీ–నీవా, గాలేరు–నగరి, సోమశిల, కందలేరు, పులిచింతల, మద్దువలస ప్రాజెక్టులతో తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధి.
- దేశంలో విప్లవాత్మక సామాజిక సంస్కరణ... పటేల్–పట్వారీ వ్యవస్థ రద్దు.
- మాండలిక వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలన... 330 తాలూకాలను 1,104 మండలాలుగా మార్పు.
- తెలుగు గ్రామీణ క్రాంతి పథం–గ్రామాల సర్వతో ముఖాభివృద్ధి.
- దేశంలో తొలి మహిళా యూనివర్సిటీగా... పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు.
- తొలిసారి తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు.
- దేశంలో తొలి ఆరోగ్య విశ్వవిద్యాలయం – ఎన్టీఆర్ మెడికల్ అండ్ హెల్త్ యూనివర్సిటీ ఏర్పాటు.
- రాష్ట్రంలోని ప్రతి మండలంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు.
- హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక వైద్య సంస్థ 'నిమ్స్' ఆధునీకీకరణ.
- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం.
- జోగిని, దేవదాసీల వ్యవస్థ రద్దు – సాంఘిక దురాచారాలకు అడ్డుకట్ట.
- దేశంలో తొలిసారి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఏర్పాటు.
- హైదరాబాద్ పాత నగర అభివృద్ధికి కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కుడా) ఏర్పాటు.
- తెలుగు లలిత కళాతోరణం ఏర్పాటు.. కళలకు, కళాకారులకు ప్రోత్సాహం.
- ట్యాంక్ బండ్‌పై తెలుగు మహనీయుల విగ్రహాలు – బుద్ధుడి విగ్రహం ఏర్పాటు.
- తొలిసారి 'నిత్య అన్నదాన పథకం' ద్వారా తిరుమల వచ్చిన భక్తులకు ఉచిత భోజనం ఏర్పాటు.
- రాష్ట్రవ్యాప్తంగా భారీ బస్ స్టాండ్‌ల నిర్మాణం.
- నేషనల్ ఫ్రంట్ ద్వారా దేశవ్యాప్తంగా మండల్ కమిషన్ సిఫారసుల అమలు.
- సర్కారియా కమిషన్ ఏర్పాటుకు కృషి – కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్నేహ, సౌహార్ధ సంబంధాల మెరుగుదల.
- నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ద్వారా డా।। బి.ఆర్.అంబేద్కర్‌కు మరణానంతరం భారతరత్న ప్రదానం.

* * *



ప్రజాస్వామ్య హననం - ఎన్టీఆర్ అక్రమ అరెస్ట్



రాజ్‌భవన్ వద్ద చైతన్య రథంపై ఎన్టీఆర్



చైతన్య రథంపై ప్రజల వద్దకు



ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్టీఆర్‌కు మద్దతు తెలిపిన వామపక్షాలు, బిజెపి



అన్నకు జరిగిన అన్యాయానికి చలించిపోయిన ఆడపడుచులు



అన్నకు హారతి



జనమే జనం – ఎన్టీఆర్‌కు నీరాజనం




వాజ్‌పేయి తదితర జాతీయ నాయకులతో విమానం నుంచి దిగుతున్న ఎన్టీఆర్



అన్నకు జరిగిన అన్యాయంపై మహిళ ఆక్రోశం, ఆగ్రహం



అన్నకు సంఘీభావంగా తరలి వచ్చిన వృద్ధులు, మహిళలు





ప్రజాప్రభుత్వాన్ని పడగొట్టిన కేంద్రం దుర్విధానాన్ని ఎదుర్కొంటా!



సోఫాలోనే కునుకు



ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూలగొట్టిన వైనంపై కవర్ స్టోరీ



తెలుగుకుటీరంలో నేతలతో ఎన్.టి.ఆర్. సమాలోచనలు



విజయవాడ మహానాడులో వాజ్‌పేయి, అజిత్‌సింగ్ తదితరులతో ఎన్.టి.ఆర్.

# నేషనల్ ఫ్రంట్ నేతలతో ఎన్.టి.ఆర్.



అటల్ బిహారీ వాజ్‌పేయ్, ఎల్.కె. అద్వానీ, దేవీలాల్‌తో ఎన్.టి.ఆర్.



వాజ్‌పేయ్, ఉపేంద్ర, దేవీలాల్, రామకృష్ణ హెగ్డే, అజిత్ సింగ్‌తో ఎన్.టి.ఆర్.



రామకృష్ణ హెగ్డే, వాజ్‌పేయ్, చంద్రశేఖర్, బహుగుణ, దేవీలాల్,
అద్వానీ, వి.పి.సింగ్‌తో ఎన్.టి.ఆర్.



బహుగుణ, వి.పి.సింగ్, దేవీలాల్, అజిత్‌సింగ్, ఎస్.ఆర్.బొమ్మై, రామ్‌విలాస్ పాశ్వాన్‌తో ఎన్టీఆర్




దేవీలాల్, వి.పి.సింగ్, కరుణానిధి, మహంతతో ఎన్.టి.ఆర్.




జ్యోతిబసు, వి.పి.సింగ్, కరుణానిధి, దేవీలాల్‌తో ఎన్.టి.ఆర్.



కమ్యూనిస్ట్ నేతలు చంద్రరాజేశ్వరరావు, కొరటాల సత్యనారాయణతో ఎన్.టి.ఆర్.




ఆగ్రాలో జరిగిన భారీ బహిరంగసభలో ప్రసంగిస్తున్న ఎన్టీఆర్



హర్యానా బహిరంగ సభలో ఎన్.టి.రామారావు



శరద్‌యాదవ్, సీతారామ్ ఏచూరి, వి.పి.సింగ్, రామ్ విలాస్ పాశ్వాన్, ఎస్.ఆర్.బొమ్మైతో ఎన్.టి.ఆర్.



హర్యానా పర్యటనలో ఎన్.టి.ఆర్.



దేశానికి వెన్నెముక రైతన్నతో 'అన్న'



రాజీవ్‌గాంధీ, జ్యోతిబసు, నాయనార్, బర్నాలాతో ఎన్టీఆర్



పి.వి. నరసింహారావు, కృష్ణకాంత్, రామోజీరావులతో ఎన్టీఆర్



చంద్రబాబు నాయుడు, వి.పి.సింగ్, ఎస్.ఆర్. బొమ్మై, రామకృష్ణ హెగ్డేతో ఎన్.టి.ఆర్.



అసదుద్దీన్ ఓవైసీ, సలాఉద్దీన్ ఓవైసీతో ఎన్.టి.ఆర్.




కలెక్టర్ల సమావేశంలో ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు



కంప్యూటర్లతో సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి శ్రీకారం

# రాష్ట్రపతులతో ఎన్.టి.ఆర్.



డా. సర్వేపల్లి రాధాకృష్ణన్‌తో ఎన్.టి.రామారావు



డా. జకీర్ హుస్సేన్‌తో ఎన్.టి.రామారావు



వి.వి.గిరితో ఎన్.టి.రామారావు



నీలం సంజీవరెడ్డితో ఎన్.టి.రామారావు



జ్ఞానీ జైల్ సింగ్‌తో ఎన్.టి.రామారావు



ఆర్. వెంకట్రామన్‌తో ఎన్.టి.రామారావు



డా. శంకర్ దయాళ్ శర్మతో ఎన్.టి.రామారావు



కె.ఆర్. నారాయణన్‌తో ఎన్.టి.రామారావు

# ఉపరాష్ట్రపతులతో ఎన్.టి.ఆర్.



జస్టిస్ మహమ్మద్ హిదయతుల్లాతో ఎన్.టి.రామారావు



వెంకయ్య నాయుడుతో ఎన్.టి.రామారావు

# ప్రధానమంత్రులతో ఎన్.టి.ఆర్.



లాల్ బహదూర్ శాస్త్రితో ఎన్.టి.రామారావు



శ్రీమతి ఇందిరాగాంధీతో ఎన్.టి.రామారావు



చౌధరి చరణ్ సింగ్‌తో ఎన్.టి. రామారావు




రాజీవ్ గాంధీతో ఎన్.టి.రామారావు



వి.పి.సింగ్‌తో ఎన్.టి.రామారావు



చంద్రశేఖర్‌తో ఎన్.టి.రామారావు



పి.వి. నరసింహారావుతో ఎన్.టి.రామారావు



అటల్ బిహారీ వాజ్‌పేయితో ఎన్.టి.రామారావు



హెచ్.డి. దేవేగౌడతో ఎన్.టి.రామారావు



డా. మన్మోహన్ సింగ్‌తో ఎన్.టి.రామారావు



దేవీలాల్‌కు ఆత్మీయ సత్కారం



మధుదండావతేతో ఎన్టీఆర్

# గవర్నర్‌లతో ఎన్.టి.ఆర్.



కె.సి.అబ్రహంతో ఎన్.టి.రామారావు



రామ్‌లాల్‌తో ఎన్.టి.రామారావు



కుముద్‌బెన్ జోషితో ఎన్.టి.రామారావు



కృష్ణకాంత్‌తో ఎన్.టి.రామారావు

# ముఖ్యమంత్రులతో ఎన్.టి.ఆర్.



ఒరిస్సా ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్‌తో ఎన్.టి.రామారావు



తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధితో ఎన్.టి.రామారావు



జలగం వెంగళరావుతో ఎన్.టి.ఆర్.



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు, కేరళ ముఖ్యమంత్రి ఇ.కె.నయనార్‌తో ఎన్.టి.ఆర్.




తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్.జి.ఆర్.తో ఎన్.టి.ఆర్.



మహారాష్ట్ర ముఖ్యమంత్రి శరద్‌పవార్‌తో ఎన్.టి.ఆర్.



కోట్ల విజయభాస్కర రెడ్డితో ఎన్.టి.రామారావు



జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాతో ఎన్.టి.రామారావు



కర్నాటక ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డేతో ఎన్.టి.రామారావు



పంజాబ్ ముఖ్యమంత్రి సుర్జీత్‌సింగ్ బర్నాలాతో ఎన్.టి.రామారావు



రాజస్థాన్ ముఖ్యమంత్రి హరదేవ్ జోషితో ఎన్.టి.ఆర్.



హర్యానా ముఖ్యమంత్రి చౌతాలతో ఎన్.టి.ఆర్.



మర్రి చెన్నారెడ్డితో ఎన్.టి.రామారావు



బీహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌తో ఎన్.టి.రామారావు



అస్సాం ముఖ్యమంత్రి ప్రఫుల్ల కుమార్ మహంతతో ఎన్.టి.రామారావు



తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితతో ఎన్.టి.రామారావు


# విదేశీ ప్రముఖులతో



బ్రిటిష్‌రాణి ఎలిజిబెత్, ప్రిన్స్ విలయమ్స్‌కు సాదర ఆహ్వానం



గయానా అధ్యక్షుడు ఎల్.ఎఫ్.ఎల్. బర్నహామ్‌తో చర్చలు




జాంబియా పార్లమెంటరీ ప్రతినిధివర్గం నాయకుడు ఆర్.ఎం.నాబుల్యాట్



అమెరికా వ్యోమగామి జెమ్స్ బి ఇర్విన్




పశ్చిమ జర్మనీ కౌన్సిల్ జనరల్ డా. క్రిస్టియన్ పరాబెనియాతో ఎన్టీఆర్




బల్గేరియా ఆర్థిక ప్రతినిధి వర్గం నాయకుడు బన్యన్ డొమెండోన్‌తో ఎన్టీఆర్



కేంద్రమంత్రి పీ.సీ. సేథీతో



కేంద్రమంత్రి బీష్మనారాయణ్ సింగ్‌తో



కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీతో




కేంద్ర మంత్రి వి.పి.సాథేతో



మహాత్మునికి నివాళి



రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్‌కు నివాళి



ఉక్కు మనిషి ప్రకాశం పంతులు గారికి పూలమాల




ట్యాంక్‌బండ్‌పై తను ప్రతిష్ఠించిన కొమరంభీమ్ విగ్రహానికి పూలమాల



శ్రీవెంకటేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పణ



ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేస్తున్న ఎన్.టి. రామారావు




ఫాస్టర్ ఆశీర్వచనం




సహపంక్తి భోజనం చేస్తున్న ఎన్.టి. రామారావు



గురుద్వార సందర్శన




బుద్ధ విగ్రహానికి ఉలితో నగిషీలు దిద్దుతూ...



హుస్సేన్ సాగర్‌లో ప్రతిష్ఠించే తథాగతుని విగ్రహానికి పూజలు





పరమాచార్య శ్రీ చంద్రశేఖర స్వామికి సాదర సత్కారం



రామకృష్ణ మఠం నిర్వాహకులు స్వామి రంగధానందతో



మదర్ థెరిస్సాతో



పలుగు చేతబట్టి శ్రమదానం



మొక్కలునాటే కార్యక్రమానికి శ్రీకారం



తిరుపతి వెంకన్న దర్శనం అనంతరం 'అన్న' సందర్శనం



అక్కినేనికి ఆత్మీయ ఆలింగనం



ఆత్మీయ కవి డా. సి.నారాయణ రెడ్డితో



ఆలిండియా స్టార్ అమితాబ్ బచన్‌తో విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు



సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు అభినందన



# తెలుగుదేశం సూపర్ హిట్!!

తెలుగుజాతి సింహంలా గర్జించింది. అభిమాన ధనులైన తెలుగుతల్లి ముద్దుబిడ్డలు వీరఖడ్గముల్లా విజృంభించారు. తెలుగువాడి ఓటుదాడిలో ఇందిరమ్మ కంచుకోట ముక్కలుముక్కలయింది. తెలుగువాళ్ళఆత్మ గౌరవానికి వెలగట్టగలమనుకున్న ఢిల్లీమారాజుల ఎత్తులు చిత్తైనాయి. ఎన్ని డబ్బుసంచులు, ఎన్ని సారాపీపాలు అడ్డం వేసినా ఉప్పొంగిన తెలుగు చైతన్యపు వెల్లువను అడ్డుకోలేకపోయాయి. అమ్మగారి పాదదాసులూ, ఢిల్లీదర్బారు భృత్యానుభృత్యులూ ఆ వెల్లువలో గడ్డిపరకల్లా కొట్టుకుపోయారు. నిన్నటిదాకా రాచఠీవి వెలిగించి, ప్రగల్భాలు పలికిన అమాత్యశేఖరులు నేడు అడ్రసులేకుండా పోయారు. విప్పిన ప్రతిబ్యాలెట్ పెట్టెనుంచీ ఇందిరాధిపత్య మందిర శిథిలాలే బయటపడ్డాయి. డ్రామాట్రూప్ అనీ, సినిమా వేషమనీ ఇం.కాం మహామహులు ఎద్దేవాచేసిన తెలుగుదేశమే విజయసారథి అయింది. ఇప్పటికి 150 స్థానాల్లో జయభేరి మోగించి తెలుగుజాతి కలలు పండించడానికి సన్నద్ధమౌతున్నది. నిఖిల ప్రపంచం ఉత్సుకతతో నిరీక్షించిన ఈ చరిత్రాత్మక ఎన్నికల్లో తెలుగుపరువు నిలిచింది. తెలుగుపౌరుషం తెలిసింది. తెలుగువాళ్ళకిది గర్వకారణం. తెలుగు జాతికి నేడే సంక్రాంతి.

## రేపు అన్న పదవీ ప్రమాణస్వీకారం

## త్రిపురలో ఫ్రంట్ ఆధిక్యత

## ఎన్టీఆర్

## మెడికల్ వ

## రాష్ట్రంలో నవ శకానికి నాంది

Eenadu 10-01-1983

## 14 మంది మంత్రులు ప్రమాణస్వీకారం

## హాయక నిధికి

# స్త్రీలకు ఆస్తిలో హక్కు బిల్లు ప్రతిపాదన

Eenadu 06-09-1985

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (న్యూస్‌టుడే): హిందూ స్త్రీకి ఆస్తిలో సమాన హక్కు కల్పించే హిందూ వారసత్వ [ఆంధ్రప్రదేశ్ సవరణ] బిల్లు 1985ను రాష్ట్ర న్యాయశాఖ మంత్రి శ్రీ రాజేశంగౌడ్ నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. వేరకట్ను సమస్యను రూపుమాపేందుకు, సంఘంలో స్త్రీకి గౌరవస్థానాన్ని కల్పించేందుకు ఈ బిల్లును ప్రతిపాదిస్తున్నట్లు న్యాయశాఖ మంత్రి శ్రీ జి. రాజేశంగౌడ్ నేడు ఈ బిల్లును రాష్ట్ర అసెంబ్లీలో...

## కారంచేడు మరో...

# రాష్ట్రంలో రెవెన్యూ మండలాలు

## కాలదోషం పట్టిన తాలూకాలు, ఫిర్కా...

### ముఖ్యమంత్రి



### పాలనా సంస్కరణలు పార్టీలో వ్యతిరేకత

31-5-1986

# తెలుగుగంగ పథకంవల్ల నలుగురికీ మేలు



Eenadu 29-04-1983

# అంబేద్కర్ సంస్మరణార్థమే చౌక ధర బియ్యం పథకం

Eenadu 15-04-1983

### మా అందాల అన్నకు మల్లెపూదండ

# రాష్ట్రమంతటా సబ్సిడీ బియ్యం సరఫరా

### విజయవాడలో


FOOT WEAR